
'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 80

మంగళవారం 5-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | DELHI | VIJAYAWADA | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పసిడి.. పరుగో పరుగు

అంతర్జాతీయంగా, దేశీయంగా ఆల్‌టైమ్ గరిష్టానికి బంగారం ధర - 13లో



సూచీలు రయ్

18 నెలల్లో ఇదే అతిపెద్ద లాభం.. కొత్త శిఖరాలపై సెన్సెక్స్, నిఫ్టీ - 13లో



సీఎంల ఎంపికపై బీజేపీ కసరత్తు!

రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో సీఎంల ఎంపికపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు నడ్డా చర్చలు జరిపారు.

వివరాలు 6లో ▸



దాడుల తీవ్రత పెంచిన ఇజ్రాయెల్

హమాస్ నాయకులు, కీలక టన్నెళ్లు, కమాండ్ సెంటర్లు, ఆయుధ డిపోలపై దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ తెలిపింది.

వివరాలు 6లో ▸



బద్దలైన అగ్నిపర్వతం

ఇండోనేసియాలో మరపీ అగ్నిపర్వతం బద్దలైన ఘటనలో 11 మంది పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



మిజోరంలో జెడ్‌పీఎం జయభేరి

మిజోరం శాసనసభ ఎన్నికల్లో జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ మొత్తం 40 అసెంబ్లీ స్థానాలకు గాను 27 స్థానాల్లో గెలిచింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

కూలిన ఐఏఎఫ్ శిక్షణ విమానం



తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా దుండిగల్‌లోని భారతీయ వాయుసేనకు చెందిన ఎయిర్‌ఫోర్స్ అకాడమీ శిక్షణ విమానం సాంకేతిక కారణాలతో మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధిలోని రాళ్లగుట్టలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలోని ఇద్దరు పైలట్లు సజీవదహనం అయ్యారు.

వివరాలు 2లో ▸

ఆ నైరాశ్యాన్ని సభలో వెళ్లగక్కొద్దు



పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ప్రజల సంక్షేమానికి, దేశ ఉజ్వల భవిష్యత్తుకు కట్టుబడి ఉన్న వారికి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఎన్నికల వైఫల్యాల నుంచి ప్రతిపక్షాలు గుణపాఠం నేర్చుకోవాలే తప్ప ఓటమి నైరాశ్యాన్ని సభలో వెళ్లగక్కరాదని సూచించారు.

వివరాలు 6లో ▸

తిరుపతి జిల్లా కలవకూరు చెక్‌డ్యామ్‌పై ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖినది



'మిచాంగ్' హోరు

తీవ్ర రూపం దాల్చిన తుపాను.. 4 జిల్లాల్లో కుండపోత వర్షాలు

తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ఎడతెరపి లేకుండా వాన

- పలు చోట్ల 15-20 సెంటీమీటర్ల కంటే అధికంగా వర్షం.. అత్యధికంగా బుచ్చినాయుడు కండ్రిగలో 28 సెంటీమీటర్లు
- కృష్ణపట్నం పోర్టులో 10వ నంబరు ప్రమాద హెచ్చరిక జారీ.. పొంగుతున్న వాగులు, వంకలు.. లోతట్టు ప్రాంతాలు జలమయం
- బాపట్ల, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లోనూ మొదలైన వానలు.. నేటి మధ్యాహ్నం చీరాల, బాపట్ల మధ్యలో తీరం దాటే అవకాశం
- ఉప్పాడ తీరంలో గ్రామాల్లోకి చొచ్చుకొచ్చిన సముద్రపు నీరు.. నేడు, రేపు కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- పలు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలకు అవకాశం

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను సోమవారం తీవ్ర రూపం దాల్చింది. గంటకు పది కిలోమీటర్ల వేగంతో దక్షిణ కోస్తాంధ్రకు సమాంతరంగా కదులుతుండడంతో తీరం వెంబడి ఉన్న జిల్లాల్లో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా, నెల్లూరు జిల్లాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలకు అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగలో 28.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తిరుపతి జిల్లా పెళ్లకూరులో 23.1, దొరవారిసత్రంలో 26.4, నాయుడుపేట 21, సూళ్లూరుపేట 20.3, నెల్లూరు 24.3, ఇందుకూరుపేటలో 20 సెంటీమీటర్ల

మిగతా 10వ పేజీలో ▶

రైళ్ల రాకపోకలపై తుపాను ఎఫెక్ట్

10లో

- హైదరాబాద్ నుంచి దక్షిణాదికి నిలిచిన రైళ్లు
- ఉత్తరాది నుంచి వచ్చే వాటికీ బ్రేక్
- ఇప్పటికే 150కి పైగా రైళ్లను రద్దు చేసిన దక్షిణమధ్య రైల్వే

తమిళనాడులోని తిరువళ్లూర్ జిల్లాలో వరదలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న సహాయక సిబ్బంది



చెన్నైలో జలప్రళయం

ముంచెత్తిన మిచాంగ్ తుపాను

- ఏకంగా 35 సెంటీమీటర్ల వాన
- పూర్తిగా స్తంభించిన జనజీవనం
- హైవేలు, సబ్‌వేల మూసివేత
- నీట మునిగిన విమానాశ్రయం
- 160 విమానాలు రద్దు
- నేడు మరింత వర్ష సూచన!

సాక్షి, చెన్నై: ఎక్కడ చూసినా నీరే. అంతటా వరద ప్రవాహమే. తమిళనాడు రాజధాని చెన్నై సముద్రాన్ని తలపించింది. బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం మిచాంగ్ తుపానుగా మారి తమిళనాడు రాజధానితో పాటు శివారు జిల్లాల్లో జల ప్రళయమే సృష్టించింది. ఆదివారం రాత్రి నుంచీ ఎడతెరిపి లేకుండా కుంభవృష్టి కొనసాగింది. సోమవారం మధ్యాహ్నానికే

మిగతా 10వ పేజీలో ▶



ఓవర్ టు ఢిల్లీ..!

- తెలంగాణ సీఎం ఎంపిక అధికారాన్ని ఏఐసీసీ అధ్యక్షుడికి కట్టబెడుతూ సీఎల్పీ ఏకవాక్య తీర్మానం
- డీకే శివకుమార్ పర్యవేక్షణలో హైదరాబాద్‌లో భేటీ.. హాజరైన 64 మంది కొత్త ఎమ్మెల్యేలు
- సీఎల్పీ భేటీ తర్వాత ఎమ్మెల్యేలతో విడివిడిగా మాట్లాడిన ఏఐసీసీ పరిశీలకులు
- సాయంత్రమే ప్రమాణ స్వీకారమంటూ ప్రచారం
- ఇంతలో ఢిల్లీకి రావాలంటూ డీకే టీమ్‌కు పిలుపు

10లో

యుద్ధ ప్రాతిపదికన సాయం

కలెక్టర్లు, ఎస్పీలు, ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

ఎలాంటి ప్రాణనష్టం లేకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదే: సీఎం జగన్

కోతకు వచ్చిన ఖరీఫ్ పంటను కాపాడుకోవడం చాలా ముఖ్యం

- వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- తేమ, రంగు లాంటి అంశాలను పట్టించుకోకుండా రైతులకు అండగా నిలవండి
- ఇప్పటికే అత్యవసర ఖర్చులకు ప్రతి జిల్లాకు రూ.2 కోట్లు చొప్పున ఇచ్చాం
- మనం ఎలాంటి సదుపాయాలు కోరుకుంటామో, సహాయక శిబిరాల్లో అలాంటివి ఉండాలి.. కాస్త డబ్బు ఖర్చైనా.. ఎలాంటి లోటూ రాకూడదు
- ప్రతీ బాధిత కుటుంబానికి రూ.500 పెంచి రూ.2,500 ఇవ్వాలి.. బాధిత వ్యక్తికి రూ.వెయ్యి ఇవ్వాలి
- క్యాంపులకు రాకుండా, ఇళ్లలోకి నీళ్లు చేరిన వారికి 25 కేజీల బియ్యం, కంది పప్పు, పామాయిల్, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు కిలో చొప్పున అందించాలి



2లో

- గుడిసెల్లాంటివి దెబ్బతింటే వారికి రూ.10వేలు అందించాలి.. వర్షాలు తగ్గిన వెంటనే నష్టాన్ని అంచనా వేయాలి
- తుపాను ప్రాంతాల్లో నేను తిరుగుతా.. మా కలెక్టర్ బాగా చేశారనే మాట వినిపించాలి
- 'మిచాంగ్' ప్రభావిత 8 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశానిర్దేశం

ఆరోగ్యం మీ హక్కు!

అందరికీ అవగాహన కల్పిస్తూ 18 నుంచి ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

జనవరి 1 నుంచి రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష

- దిశ మాదిరిగానే ప్రతి ఒక్కరి మొబైల్‌లో ఆరోగ్యశ్రీ యాప్
- జగనన్న ఆరోగ్య సురక్షలో గుర్తించిన రోగులకు సకాలంలో మందులు
- కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్ల ద్వారా నిర్వహణ
- ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులూ ఇందులో భాగస్వాములు
- వైద్యం కోసం పేదలు చేతి నుంచి డబ్బు ఖర్చుపెట్టకూడదన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశానిర్దేశం



సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్య రంగంగా భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఈ విషయంలో సంతృప్తికరంగా సేవలందించేలా అడుగులు వేస్తోంది. పేదలందరికీ ఆరోగ్యం అనేది హక్కుగా ఉండాలన్న లక్ష్యంతో ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్స్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా రోగులను చేయి పట్టుకుని నడిపిస్తూ వారికి నాణ్యమైన సేవలతోపాటు మందుల నుంచి చికిత్స వరకు అందించే బాధ్యతను భుజాన కెత్తుకుంది. గతంలో చికిత్స పొందిన వారి ఆరోగ్యంపట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూనే మందుల విషయంలో రాజీపడకుండా ఎంత ఖరీదైనవి అయినా సరే వారికి అందించాలన్న కృతనిశ్చయంతో ఉంది. ఇందులో భాగంగానే రాష్ట్రంలో

మిగతా 3వ పేజీలో ▶

మరింత సులభంగా జీఎస్టీ సేవలు



రాష్ట్రంలో పన్నుల చెల్లింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా.. సులభతరం చేస్తూ ప్రభుత్వం జీఎస్టీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా పన్ను చెల్లింపుల్లో అక్రమాలకు కూడా అడ్డుకట్ట పడనుంది. రిజిస్ట్రేషన్ విధానాన్ని కూడా సరళీకృతం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 12 సేవా కేంద్రాలను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రారంభించారు.

5లో



కాకినాడ జిల్లా కాట్రావులపల్లిలో రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి.. తరలిస్తున్న అధికారులు

అన్నదాతకు అండగా ప్రభుత్వం

- వరి కోతల సమయంలో విరుచుకుపడ్డ మిచాంగ్ తుపాను
- వర్షాలతో వణికిన రైతాంగం.. వెంటనే ప్రభుత్వ యంత్రాంగాన్ని రంగంలోకి దింపిన సీఎం జగన్
- ఎక్కడికక్కడ ధాన్యం కొనాలని ఆదేశాలు
- తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొంటున్న ప్రభుత్వం
- గత 48 గంటల్లో సుమారు 1.07లక్షల టన్నుల సేకరణ
- నిబంధనలు సడలించి ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు

14లో

సర్వత్రా అప్రమత్తం..

ముమ్మరంగా తుపాను సహాయక చర్యలు



పశ్చిమగోదావరి జిల్లా పెదమైనవానిలంకలోని పునరావాస కేంద్రంలో భోజనాలు పెడుతున్న దృశ్యం

14లో

- తక్షణమే స్పందించి ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం
- అత్యవసర సహాయక చర్యల కోసం రూ.11 కోట్లు విడుదల
- శిబిరాల నుంచి వెళ్లే బాధితులకు రూ.1000 నుంచి రూ.2,500 ఆర్థిక సాయం.. ఇళ్లు కూలినా, దెబ్బతిన్నా పరిహారం రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పెంపు
- 8 జిల్లాలకు ప్రత్యేక అధికారుల నియామకం

అనంతపురం జిల్లా రాప్తాడులో సామాజిక సాధికార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



సాధికార మహోత్సవం

ప్రజల ఆదరాభిమానాలతో రాప్తాడులో దిగ్విజయంగా సామాజిక సాధికార బస్సు యాత్ర

2లో

- వేలాదిగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన సభ
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో సామాజిక సాధికారత సాధించిన వైనాన్ని వివరించిన నేతలు

అనంతపురం జిల్లా రాప్తాడులో సామాజిక సాధికారత నినాదం మార్మోగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు వేలాదిగా తరలి వచ్చి.. విజయయాత్ర చేశారు. ఈ సందర్భంగా మంత్రులు, నేతలు మాట్లాడుతూ.. 'బడుగు, బలహీన వర్గాలను చంద్రబాబు అణిచివేస్తే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయి పట్టుకుని అభివృద్ధి పథం వైపు నడిపించారు. ఆయన తెచ్చిన నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటా వెలుగులు నిండాయి' అని చెప్పారు.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

రేకుల షెడ్డు నుంచి పక్కా భవనానికి...

నా భర్త షేక్ అబ్దుల్లా 40 ఏళ్లుగా ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. రోజులో పని బాగా జరిగితే రూ.500 వచ్చేది. అయితే అది ఇల్లు గడవడానికి, పిల్లల చదువులకు సరిపోయేది కాదు. మేము నంద్యాల పట్టణంలోని వీసీ కాలనీ 34వ వార్డులో 18 సంవత్సరాలుగా రేకుల షెడ్డులోనే నివాసం ఉంటున్నాం. మాకు నలుగురు సంతానం. ఇద్దరు అమ్మాయిలకు పెళ్లిళ్లు చేశాం. పెద్దబ్బాయి డిప్లొమా పూర్తి చేసి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. నేను ఇంటి దగ్గర గృహిణిగా ఉంటూనే అల్లికల పని చేస్తుంటాను. అయితే నా భర్త, నా ఆదాయం కలిపినా ఇల్లు నిర్మించుకునే స్తోమత లేదు. కొన్నిసార్లు మా ఆయనకు పనులు ఉండవు. అటువంటి సమయంలో ఇల్లు గడవడమే కష్టంగా ఉంటుంది. చిన్న ఇల్లు కావడంతో వర్షాలు పడితే మా కష్టాలు అన్నీఇన్నీ కావు. పురుగులు, కీటకాలు ఇంట్లోకి వస్తుంటాయి. చాలా భయంగా ఉండేది. ఈ తరుణంలో ప్రభుత్వ పథకాల గురించి తెలిసింది. వలంటీర్ మాకు ఇల్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఆధార్ కార్డు, ఇతర వివరాలతో కూడిన జిరాక్సు కాపీలతో దరఖాస్తు చేసుకున్నాము. ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలకు తోడు మేము కూడబెట్టిన కొద్దిపాటి సొమ్ము, పొదుపు సంఘం ద్వారా కొంత అప్పు తీసుకుని అందంగా ఇల్లు నిర్మించుకున్నాం.



– షేక్ రసూల్‌బీ, వీసీ కాలనీ, నంద్యాల
(పీపీ రంగారావు, విలేకరి, నంద్యాల సిటీ)

ప్రజల మనసెరిగిన ప్రభుత్వమిది

అమ్మా నాన్నలు ఆశాబీ, షఫీ రోడ్డుపై వట్టి చేపల వ్యాపారం చేసేవారు. మేము అనంతపురం జిల్లా రాయదుర్గం చౌడమ్మగుడి ప్రాంతంలో ఉంటాము. మాది నిరుపేద కుటుంబం. కొంత కాలం క్రితం నాన్న అనారోగ్యంతో చనిపోయాడు. అమ్మతో కలసి అదే వ్యాపారం కొనసాగించాం. వచ్చే కొద్దో గొప్పో సంపాదనతో ఇంటిని నెట్టుకొచ్చేవాళ్లం. సరిగ్గా ఏడాది క్రితం నాకు ఉన్నట్టుండి జ్వరం వచ్చింది. చికిత్స చేయించుకున్నా తగ్గలేదు. స్థానిక వైద్యుల సూచన మేరకు రక్త పరీక్షలు చేయించాం. చివరకు వారు హైదరాబాద్ రిఫర్ చేశారు. కిడ్నీలు ఫెయిలైనట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. డయాలసిస్ తప్పనిసరిగా చేయించుకోవాలని చెప్పారు. వారానికి రూ.10 వేల నుంచి రూ.15 వేలు ఖర్చు అవుతుంది. అసలే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. మా బాధను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి చెప్పుకున్నాం. ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా డయాలసిస్ చేయించుకునే ఏర్పాటు చేశారు. అనంతపురం సవేరా ఆస్పత్రిలో వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నా. ఆరోగ్యశ్రీ లేకుంటే ఈ పాటికి నా ప్రాణాలు గాల్లో కలిసేవి. దీనికి తోడు ప్రతి నెల రూ.10 వేలు డయాలసిస్ పింఛన్ వస్తోంది. వలంటీరు ఒకటో తేదీ ఉదయమే ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారు. ప్రజల మనసెరిగిన ప్రభుత్వమిది. కలకాలం ఉండాలి.



– నాగబోడి ఇమ్రాన్, రాయదుర్గం
(ఈ.రాధాకృష్ణ, విలేకరి, రాయదుర్గం)

50 అడుగుల్లోనే నీరు

ఈ ప్రభుత్వ కృషి కారణంగా భూగర్భ జలాల మట్టం అనూహ్యంగా పెరిగింది. బోరు వేస్తే ఇదివరకు 400–500 అడుగుల్లో నీరు పడేది. ఇప్పుడు హంద్రీ–నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉప కాలువకు కృష్ణా జలాలు వదలడంతో 50 అడుగుల్లోనే నీరు వస్తోంది. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం గుంతావారిపల్లె మీదుగా కాలువ సాగుతోంది. ఈ కాలువ వెంబడి పొలాల్లో బోర్లు వేసుకున్నాం. మాకున్న 12 ఎకరాల పొలంలో మూడు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. ఇప్పుడు 8 ఎకరాల్లో డ్రిప్ ద్వారా సాగుకు పొలాలు దుక్కులు దున్ని సిద్ధం చేశాం. హంద్రీ–నీవా కాలువ నీళ్లతో గ్రామంలోని రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. 50 అడుగుల్లోనే నీరు పడుతోందంటే భూగర్భ జల మట్టం ఏ విధంగా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. హంద్రీ–నీవా కాలువలో కృష్ణా జలాల ప్రవాహంతో మా గ్రామ పరిసరాల్లో నెల రోజులుగా బోరు నీటి అవసరం కలగలేదు. సమీపంలోని బోర్లు, ఎండిపోయిన బావులు, కుంటలు ఇప్పుడు నీళ్లతో కళకళలాడుతున్నాయి. నా పొలం పక్కనే ఉన్న ఎండిపోయిన మంచినీటి బావిలో నీరు ఉబికి వస్తూ నిండుగా ప్రవహిస్తోంది. ఈ నీళ్లు నేరుగా పొలంలోకి వెళ్తున్నాయి. దీనివల్ల బోరుబావి నీటి అవసరం తప్పింది.



– బి.చంద్రశేఖర్‌రెడ్డి, గుంతావారిపల్లి
(టి.షామీర్ బాషా, విలేకరి, బి.కొత్తకోట)

రాప్తాడు సాధికార మహోత్సవం అపూర్వం



రాప్తాడు సామాజిక సాధికార సభలో పాల్గొన్న అశేష జన వాహినిలో ఓ భాగం



చేతులు కలిపి సంఘీభావం ప్రకటిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలు

- ప్రజల ఆదరాభిమానాలతో దిగ్విజయంగా సామాజిక సాధికార బస్సు యాత్ర
- వేలాదిగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన సభా ప్రాంగణం
- సీఎం జగన్ సామాజిక సాధికారత సాధించిన వైనాన్ని వివరించిన నేతలు
- హర్షధ్వానాలు చేసిన ప్రజలు

సాక్షి,అమరావతి/రాప్తాడు రూరల్: ఫ్యాక్షన్‌ను తోసిరాజని అనంతపురం జిల్లా రాప్తాడులో సామాజిక సాధికారత నినాదం మార్మోగింది. రాయలసీమ ప్రాంతంలో కీలక నియోజకవర్గం అయిన రాప్తాడులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల ఆదరాభిమానాలతో సామాజిక సాధికార బస్సు యాత్ర సోమవారం అపూర్వ రీతిలో ఉత్సవంలా సాగింది. వేలాదిగా తరలి వచ్చిన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ ప్రజలు విజయయాత్ర చేశారు. ముఖ్యంగా మహిళలు కూడా పెద్దసంఖ్యలో తరలిరావడం విశేషం. సీఎం వైఎస్ జగన్ పాలనలో తమకు లభించిన ప్రాధాన్యతను, రాజ్యాధికారం పొందిన వైనాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం జరిగిన సభకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు పోటెత్తారు. సీఎం జగన్ నామస్మరణతో సభా ప్రాంగణం మార్మోగింది. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో సామాజిక సాధికారత సాధించిన వైనాన్ని మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు వివరించినప్పుడు ప్రజలు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు. 'జగనన్నే మా భవిష్యత్తు.. 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగనే గెలవాలి .. జగనే కావాలి' అంటూ ఒకే గొంతై నినదించారు.

దేశ చరిత్రలో ఒకే ఒక్కడు : కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్

దేశ చరిత్రలో సామాజిక న్యాయం చేసిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ చెప్పారు. సీఎం జగన్ అణగారిన వర్గాలకు అండగా నిలిచి, వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. ఆయన తీసుకొచ్చిన నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటా వెలుగులు నిండాయన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు ఎంత మేలు జరిగిందనేది ఇక్కడికి వచ్చిన జనాలే సాక్ష్యమన్నారు. మీ ఇంటికి మేలు జరిగిందంటేనే నాకు ఓటేయండి.. లేదంటే వద్దని ధైర్యంగా చెప్పిన నాయకుడు వైఎస్ జగన్ అని అన్నారు. **బడుగు, బలహీన వర్గాలను మరింతగా** అణచివేసిన నాయకుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. చంద్రబాబు పార్టీకే గ్యారంటీ లేదు కానీ ప్రజలకు ష్యూరిటీ ఇస్తాడట అని వ్యాఖ్యానించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉన్నతంగా బతుకుతున్నారు: మంత్రి మేరుగు

'మంత్రివర్గంలో అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే. అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్ పర్సన్ ఈ వర్గాల వారే. ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యుల్లోనూ ఈ వర్గాలకే ప్రాధాన్యం. నామినేటెడ్ పదవుల్లో ఈ **వర్గాలకే పెద్ద పీట. ఏ సంక్షేమ పథకం తీసుకున్నా** లబ్ధిదారుల్లో 80 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే. సీఎం వైఎస్ జగన్ పాలనలో ఈ వర్గాలు ఉన్నతంగా బతుకుతున్నాయి. ఇదే అసలైన సామాజిక సాధికారత' అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. చంద్రబాబు హయాంలో అవహేళనకు, హింసకు గురైన ఈ వర్గాలు ఇప్పుడు తలెత్తుకొని తిరుగుతున్నాయని వివరించారు. ఎస్సీ కులంలో ఎవరైనా పుట్టాలనుకుంటారా, బీసీల తోక కత్తిరిస్తా, బీసీలు జడ్జీలుగా పనికి రారంటూ రకరకాలుగా అవమానించిన వ్యక్తి చంద్రబాబు అని చెప్పారు. బాబు మనకు రావాల్సిన రాజ్యాంగబద్ధ హక్కులన్నీ కాల రాశారన్నారు. అన్ని వర్గాలను ఆదరించి, ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రాజ్యం: ఎంపీ నందిగం సురేష్

జగనన్న సీఎం అయ్యాక రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రాజ్యం నడుస్తోందని ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. ప్రతి కులానికీ దన్నుగా నిలిచారని తెలిపారు. నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థలు, పార్టీ పదవుల్లో 75 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే అవకాశం కల్పించారని, సీఎం వైఎస్ జగన్ దేవుడు పంపిన వ్యక్తి అని అన్నారు. మనల్ని ఆదుకున్న జగనన్నకు అండగా ఉందామని పిలుపునిచ్చారు.

నేడు రాయదుర్గంలో బస్సు యాత్ర

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలతో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు సాధించిన అభివృద్ధిని, సాధికారతను వివరించేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర రాష్ట్రంలో విజయవంతంగా సాగుతోంది. సోమవారం అనంతపురం జిల్లా రాప్తాడులో యాత్ర అద్భుత రీతిలో జరిగింది. మంగళవారం అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర జరగనుంది.



కడపలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు

జగన్ పాలనతోనే విద్యార్థులకు 'ఉన్నత' చదువులు

- వైఎస్సార్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య
- కడపలో విద్యార్థుల భారీ ర్యాలీ

కడప కార్పొరేషన్: విద్యా రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సంస్కరణలు, పథకాలతో విద్యార్థులకు 'ఉన్నతమైన' విద్య అందుబాటులోకి వచ్చిందని వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్(వైఎస్సార్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, జిల్లా అధ్యక్షుడు పి.సాయిదత్త అన్నారు. నాలుగున్నరేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం కడపలో వైఎస్సార్ఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. కోటిరెడ్డి సర్కిల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ.. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, సంధ్యా సర్కిల్ మీదుగా తిరిగి కోటిరెడ్డి సర్కిల్‌కు చేరింది. ఈ సందర్భంగా చైతన్య, సాయిదత్త మాట్లాడుతూ.. విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారని వివరించారు. 'నాడు–నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దారని చెప్పారు. అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, విద్యా కానుక, విద్యా దీవెన, ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ విద్యా బోధన, టోఫెల్ శిక్షణ తదితర కార్యక్రమాలను ప్రవేశపెట్టి పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను చేరువ చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ఎస్‌యూ నగర అధ్యక్షుడు సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఐఏఎఫ్ శిక్షణ విమానం

- ఇద్దరు పైలట్లు సజీవదహనం
- మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ సమీపంలో దుర్ఘటన

తూప్రాన్ : తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా దుండిగల్‌లోని భారతీయ వాయుసేన (ఐఏఎఫ్)కు చెందిన ఎయిర్‌ఫోర్స్ అకాడమీ శిక్షణ విమానం సోమవారం ఉదయం సాంకేతిక కారణాలతో మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధిలోని రాళ్ల గుట్టలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలోని ఇద్దరు పైలట్లు సజీవదహనం అయ్యారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం స్విట్జర్లాండ్‌కు చెందిన పిలాటస్ సంస్థ తయారు చేసిన పీసీ–7 ఎంకే–2 శిక్షణ విమానం రోజువారీ శిక్షణలో భాగంగా ఉదయం 8:30 గంటల సమయంలో తూప్రాన్ పట్టణ సమీపంలోని గగనతలం మీదుగా ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా అదుపుతప్పింది. గాల్లో గింగిరాలు తిరుగుతూ తూప్రాన్ సమీపంలోని టాటా కాఫీ పరిశ్రమ వెనుకాల గల రావెల్లి గ్రామ సమీపంలోని రాళ్ల గుట్టలో భారీ శబ్దంతో కూలిపోయింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి పైలట్లు సజీవదహనమయ్యారు. పొలాల్లో ఉన్న రైతులు, స్థానికులు ప్రమాద వార్తను వెంటనే పోలీసులకు తెలియజేయగా వారు ఘటనాస్థలికి చేరుకొని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అప్పటికే అప్రమత్తమైన ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అధికారులు మరో రెండు శిక్షణ విమానాలతో పాటు నాలుగు హెలికాప్టర్లతో గాలింపు చర్యలు చేపట్టి ప్రమాద స్థలాన్ని గుర్తించారు. ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అధికారులు సీ.ఎస్.సీ నాయర్ (బెంగళూరు), వింగ్ కమాండర్ శ్రీనివాసన్ (దుండిగల్) ప్రమాదం జరిగిన తీరును గమనించారు. అనంతరం రెండు అగ్నిమాపక వాహనాలతో మంటలను ఆర్పారు. మృతులను అభిమాన్య రాయ్, వియత్నాంకు చెందిన వ్రువాన్‌తాయ్‌గా గుర్తించారు. ఈ ప్రమాదంపై వాయుసేన విచారణకు ఆదేశించింది. ఘటనా స్థలంలో డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్సై శివానందం సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన విమానం

నా కళ్ల ముందే ప్రమాదం..



నేను టాటా కాఫీ పరిశ్రమ సమీపంలో వాకింగ్ చేస్తుండగా ఓ విమానం ఆకాశంలో ఎగురుతూ ఒక్కసారిగా కిందకు దూసుకొచ్చింది. అంతలోనే పైకి ఎగిరి ఆకాశంలో గింగిరాలు తిరుగుతూ గుట్టల్లో పడిపోయింది. దీంతో భారీ శబ్దంతోపాటు మంటలు చెలరేగాయి. నేను వెంటనే పోలీసులకు సమాచారం అందించా.

– సతీష్‌చారి (ప్రత్యక్ష సాక్షి), తూప్రాన్

యుద్ధ ప్రాతిపదికన సాయం

కలెక్టర్లు, ఎస్పీలు, ప్రభుత్వ యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలి ■ తుపాను ముందస్తు చర్యలపై సమీక్ష

సాక్షి, అమరావతి: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని.. కలెక్టర్లు, ఎస్పీలు, ప్రభుత్వ యంత్రాంగమంతా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఎలాంటి ప్రాణనష్టం లేకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందని, పశువులకూ ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కోతకు వచ్చిన ఖరీఫ్ పంటను కాపాడుకోవడం అన్నది చాలా ముఖ్యమైనదని, కోసిన ధాన్యాన్ని వెంటనే సేకరించడంపై అధికారులు దృష్టిపెట్టాలని, వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిందిగా ఆయన ఆదేశించారు. అత్యవసర ఖర్చుల కోసం ప్రతి జిల్లాకు రూ.2 కోట్లు నిధులు విడుదల చేశామని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే నష్టాన్ని అంచనా వేయాలన్నారు. తుపాను ప్రభావిత ఎనిమిది జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సహాయక చర్యలు, ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

అంతా అప్రమత్తంగా సీరియస్‌గా ఉండాలి..

తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ప్రభుత్వ యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలి. హుద్‌హుద్ లాంటి పెద్ద తుపానులను కూడా మన రాష్ట్రం చూసింది. 210 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే పరిస్థితిని ఎదుర్కొనే అనుభవం కూడా మన అధికారులకు ఉంది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకపోయినా..ఈ తుపాన్‌పట్ల అప్రమత్తంగా ఉంటూ, యంత్రాంగం సీరియస్‌గా ఉండాలి. బాపట్ల సమీపంలో మంగళవారం మధ్యాహ్నం తుపాను తీరం దాటే అవకాశముందని ఐఎండీ అధికారులు చెబుతున్నారు. అప్పుడు గంటకు 110 కిమీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, వర్షాలు కూడా కురుస్తాయంటున్నారు. ఇక 7వ తేదీ నాటికి పరిస్థితులు కుదుటపడే అవకాశాలున్నాయి.



తుపాన్ ముందస్తు చర్యలపై సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కలెక్టర్లు, ఎస్పీలు సవాల్‌గా తీసుకోవాలి

ప్రతి జిల్లాకు సీనియర్ ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించాం. వీరంతా కూడా జిల్లాల్లో యంత్రాంగంతో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తారు. కలెక్టర్లు, ఎస్పీలు తుపానును ఓ సవాలుగా తీసుకుని పనిచేయాలి. మనుషులతో పాటు పశువులకూ ఎలాంటి ప్రాణనష్టం రాకూడదు. ఇక తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లకు అవసరమైన నిధులు ఇప్పటికే మంజూరు చేశాం. అత్యవసర ఖర్చులు కోసం ప్రతి జిల్లాకు రూ.2 కోట్లు చొప్పున నిధులివ్వాలని ఆదేశాలిచ్చాం. తిరుపతికి రూ.2 కోట్లు, మిగిలిన జిల్లాల్లో రూ.1 కోటి చొప్పున ఇచ్చారు. మిగిలిన జిల్లాలకు కూడా మరో రూ.1 కోటి మంజూరు చేయాలని ఆదేశాలిచ్చాం. రూ.2 కోట్లు కంటే ఇంకా ఎక్కువ అవసరమైతే వెంటనే పంపించడానికి అన్ని రకాలుగా ఏర్పాట్లుచేశాం. సీఎస్, రెవెన్యూ ఉన్నతాధికారులతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులంతా అందుబాటులో ఉన్నారు. ఒక ఫోన్‌కాల్ దూరంలో మేం ఉంటాం. మీకు ఏం కావాలన్నా వెంటనే అడగండి.

పంటను కాపాడుకోవడం చాలా ముఖ్యం

మరోవైపు.. అధికారులు ఖరీఫ్ పంట సంరక్షణకూ చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ధాన్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. కోతకు వచ్చిన పంటను కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఇప్పటికే 97 వేల టన్నులు సేకరించాం. మరో 6.50 లక్షల టన్నుల ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాం. ముఖ్యమైన అంశం ఏమిటంటే.. ఎక్కడైతే ఇంకా పంట కోత కోయలేదో దాన్ని వాయిదా వేసేలా రైతులకు నచ్చజెప్పాలి. అదే సమయంలో కోసిన పంటను కచ్చితంగా సేకరించాలి. తేమ ఉన్న ధాన్యం అయినా, రంగు మారిన ధాన్యాన్నైనా సేకరించడంపై అధికారులు దృష్టిపెట్టాలి. ఇది యుద్ధప్రాతిపదికన జరగాలి. తుపాను దృష్ట్యా రైతులకు తోడుగా నిలవాల్సిన అవసరముంది. ఈ సమయంలో రైతు మనకు అత్యంత ప్రాధాన్యమున్న వ్యక్తి. అతనికెలాంటి నష్టం జరగకుండా ధాన్యం సేకరించాలి.

లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస శిబిరాలకు తరలించాలి

తుపాను ప్రభావం ఉన్న ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే ఈ ఎనిమిది జిల్లాల్లో 181 సహాయ పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొత్తంగా 308 శిబిరాల ఏర్పాటుకు గుర్తించామని అధికారులు చెప్పారు. లోతట్టు ప్రాంతాల వారిని వెంటనే అక్కడికి తరలించాలి. ఇప్పటికే ఐదు ఎన్డీఆర్ఎఫ్, మరో ఐదు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయ కార్యక్రమాలకు సిద్ధంగా ఉన్నాయి.

వలంటీర్ల వ్యవస్థను వినియోగించుకోండి

ఇతర రాష్ట్రాలకు లేని, మనకు మాత్రమే ఉన్న మరో బలం గ్రామ, వార్డు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ. అలాగే, ప్రతి గ్రామంలోనూ విలేజ్ క్లినిక్స్, రైతుభరోసా కేంద్రాలూ అందుబాటులో ఉన్నాయి. ప్రతి 50–70 ఇళ్లకు ఒక వలంటీర్ అందుబాటులో ఉన్న గొప్ప పరిస్థితి ఇతర రాష్ట్రాలకు లేదు. దీనిని ఎంత సమర్థవంతంగా వాడుకోగలిగితే.. అంత మంచి ఫలితాలొస్తాయి. ప్రజల ప్రాణాలను రక్షించడంలో, తుపానువల్ల, తీవ్రంగా దెబ్బతిన్న ఇళ్లు, రోడ్లు దెబ్బతినే అవకాశాలున్న ప్రాంతాల్లో వీరి సేవలను వినియోగించుకోవాలి.

మా కలెక్టర్ బాగా చేశారనే మాట వినిపించాలి..

తుపాను తీరం దాటి, వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టంపై వెంటనే ఎన్యూమరేషన్ పూర్తిచేయాలి. దీనికోసం మీకు తగిన టైం ఇచ్చిన తర్వాత నేను ప్రజల దగ్గరకు వెళ్లి.. కలెక్టర్లు బాగా చేశారా? లేదా? అని అడుగుతాను. మా కలెక్టర్ బాగా చేశారన్న మాట ప్రజల దగ్గర నుంచి వినడం కోసం. ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై అడిగి తెలుసుకుంటాను. నాకు సహాయం అందలేదని, బాగా చూసుకోలేదన్న మాట వినిపించకూడదు. సంతృప్తకర స్థాయిలో బాధితులకు సాయం అందాలి. ఈ సాయంత్రం నుంచి ప్రత్యేకాధికారులు కూడా జిల్లాల్లో పర్యవేక్షణ ప్రారంభిస్తారు.

శిబిరాలలో మంచి సౌకర్యాలు ఉండాలి

ఇక సహాయక శిబిరాల్లో మనం ఎలాంటి సౌకర్యాలు, వైద్య సదుపాయాలు, భోజనం, వసతి ఉండాలని కోరుకుంటామో.. అదే తరహాలో అక్కడ సౌకర్యాలు ఉండేలా చూడాలి. మందులు, తాగు నీరు, మంచి ఆహారం అందించాలి. కాస్త డబ్బు ఖర్చయినా ఫర్వాలేదు సదుపాయాల విషయంలో ఎలాంటి లోటు రాకూడదు. అలాగే, బాధితులపట్ల మానవతా దృక్పథంతో మెలగాలి. వారు క్యాంపు నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు చిరునవ్వుతో వెళ్లాలి. కుటుంబానికి అయితే గతంలో మాదిరిగా కాకుండా మరో రూ.500 పెంచి రూ.2,500 ఇవ్వాలి. బాధిత వ్యక్తికి అయితే రూ.1,000 ఇవ్వాలి. అంతేకాక.. క్యాంపులకు రాకుండా ఇళ్లల్లోకి నీళ్లు వచ్చిన వారికి, క్యాంపు నుంచి తిరిగి ఇళ్లకు వెళ్లేవారికైనా వారికి అందాల్సిన 25 కేజీల బియ్యం, కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు కిలో చొప్పున అందించాలి. ఈ రేషన్ వారికి సకాలంలో సక్రమంగా అందించాలి. మరోవైపు.. తుపాను ప్రభావంతో గాలులు, వర్షాలవల్ల దెబ్బతిన్న గుడిసెలు, ఇళ్లు ఉంటే వారికి తక్షణమే రూ.10 వేలిచ్చి ఆదుకోవాలి. తుపాను తగ్గుముఖం పట్టిన 48 గంటల్లో ఇవి చేయాలి. అప్పుడే వారికి సంతోషాన్ని ఇవ్వగలుగుతాం.

ఎమర్జెన్సీ సర్వీసులపై దృష్టి పెట్టండి

ఎమర్జెన్సీ సర్వీసుల నిర్వహణపైనా అధికారులు దృష్టిపెట్టాలి. తాగునీటి సౌకర్యాలు, జనరేటర్ల ఏర్పాటు, బాలింతలు, గర్భిణీలను ఆసుపత్రులకు తరలించడం వంటి కీలక అంశాలను చూడాలి. వర్షాలు తగ్గిన వెంటనే అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలి. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి. విద్యుత్, రవాణా సౌకర్యాలకు అంతరాయం ఏర్పడితే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి. సాధారణ పరిస్థితులను తీసుకురావడంపై ప్రత్యేకాధికారులు దృష్టిపెట్టాలి.

కదిలిన యంత్రాంగం

తొలుత.. తుపాను నేపథ్యంలో చేపడుతున్న సహాయ, పునరావాస కార్యక్రమాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీఎం ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన ప్రభుత్వ యంత్రాంగం కదిలిందని.. ఇప్పటివరకు సుమారు ఒక లక్ష టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని.. మరో 6.50 లక్షల టన్నుల ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించామని అధికారులు వివరించారు. ఈ సమీక్షలో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత, సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ రాజశేఖర్, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ విజయానంద్, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబు, వ్యవసాయం, పశుసంవర్థక శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, రవాణాశాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో ఘన విజయం సాధించి, అమర వీరులైన జవాన్లకు నేవీ డే సందర్భంగా తూర్పు నౌకాదళం అధికారులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. బీచ్ రోడ్డులోని అమర వీరుల స్మృతి చిహ్నం వద్దకు తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ పూలమాలలతో రాగా నేవీ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పాల్గొని అమరవీరులకు అంజలి ఘటించారు. కార్యక్రమంలో విశ్రాంతి నేవీ అధికారి అడ్మిరల్ టి.సుధాకర్ పాల్గొన్నారు.

14న ఏఎంవీఐ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలోని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్టు ఏపీపీఎస్సీ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న విజయవాడ ఎంజీ రోడ్డులోని సర్వీస్ కమిషన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల కాల్ లెటర్లను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డీ ఫార్మసీలో 531 సీట్లు భర్తీ

సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డీ ఫార్మసీ ప్రవేశాల్లో భాగంగా 531 సీట్లను భర్తీ చేసినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొమ్మిది ప్రభుత్వ కళాశాలల్లో 223, ప్రైవేట్ కళాశాలల్లో 308 సీట్లలో ప్రవేశాలు కల్పించామని పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు మంగళవారం నుంచి ఈ నెల 7వ తేదీలోగా వ్యక్తిగతంగా రిపోర్టు చేయాలని సూచించారు. తరగతులు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

2024లో కేంద్రంలో బీజేపీదే అధికారం

బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు



సాక్షి, న్యూఢిల్లీ: 2024లో మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, మూడు రాష్ట్రాల్లో పార్టీ విజయమే దానికి సంకేతమని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో గెలిచిన సందర్భంగా సోమవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో మూడు కేకులు కట్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 400లకు పైగా సీట్లు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఇకపై దక్షిణాది రాష్ట్రాలను గెలవడమే లక్ష్యంగా పార్టీ కార్యాచరణ ఉంటుందని చెప్పారు. తెలంగాణలో సీట్లు, ఓట్ల శాతాన్ని రెట్టింపు చేసుకున్నామన్నారు. స్వయంగా 'ఇండియా' కూటమిలోని పార్టీలే కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ఇకపై తెలంగాణ కాంగ్రెస్‌లో నాయకులు కొట్టుకునే చరిత్ర, ఢిల్లీ యాత్రల అధ్యాయం మొదలవుతుందని జీవీఎల్ స్పష్టం చేశారు.

నేడు జంతర్ మంతర్ వద్ద వాల్మీకి బోయల ధర్నా

- ఎస్టీల్లో చేర్చాలని వైఎస్ జగన్ ప్రభుత్వం తీర్మానం చేసింది
- ఆ తీర్మానాన్ని పార్లమెంటులో ఆమోదించి చట్టబద్ధం చేయాలి
- వీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మద్దూరు సుభాష్ చంద్రబోస్

సాక్షి, న్యూఢిల్లీ: వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేసిందని, ఆ తీర్మానాన్ని పార్లమెంటులో ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి (వీఆర్ పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మద్దూరు సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ డిమాండ్ల సాధనలో భాగంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మంగళవారం జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ కర్నూలులో జరిగిన బహిరంగ సభలో వాల్మీకిలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాల్మీకి బోయ లను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని బోస్ తెలిపారు. వీఆర్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఢిల్లీ రవీందర్ చౌదరి, ఢిల్లీ ఇన్‌చార్జ్ సుధీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామ్ భీమ్ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కప్పట్రాళ్ల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

డిస్టెన్స్, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌లో సంస్కృతం

జాతీయ సంస్కృత యూనివర్సిటీ వీసీ కృష్ణమూర్తి



అడ్వైజరీ బోర్డు సమావేశంలో పాల్గొన్న సభ్యులు

తిరుపతి సిటీ: దేశ, విదేశాలలోని ప్రజలకు సంస్కృతాన్ని అందించేందుకు డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌ను ప్రవేశపెట్టనున్నట్లు జాతీయ సంస్కృత యూనివర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం వర్సిటీలో ఆయన న్యూఢిల్లీ, సంస్కృత వర్సిటీ డిస్టెన్స్ డైరెక్టర్ రత్నమోహన్, హైదరాబాద్ డిస్టెన్స్ డైరెక్టర్ జిలానితో కలసి వర్సిటీ అడ్వైజరీ బోర్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంస్కృత భాషాభివృద్ధికి చేయవలసిన నూతన సంస్కరణలు, చేపట్టవలసిన పలు కీలక అంశాలపై చర్చించారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి వ్యక్తికి సంస్కృతాన్ని దగ్గర చేయాలనేది తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఇందుకోసం డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌ను ఆన్‌లైన్ ద్వారా అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రమాశ్రీ, డీన్ ప్రొఫెసర్ రాఘవాచార్యులు, ప్రొఫెసర్ లతా, ప్రొఫెసర్ రంగనాథన్, డాక్టర్ భరత్ భూషణ్, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలు దంబాడిదొంకలో ఐ.జాలమ్మకు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మెర్సీ



విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సోమునాయుడుకు పింఛన్ అందజేస్తున్న అనకాపల్లి జిల్లా మునగపాక మండలం ఒంపోలు వలంటీర్ జానకి



కాకినాడ జిల్లా కాట్రావులపల్లికి చెందిన వృద్ధురాలు అచ్చియ్యమ్మకు ఆసుపత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రవిరాజు



విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విజయనగరం 14వ డివిజన్‌కు చెందిన వాసపల్లి రాజుకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రజని

వర్షంలోనూ కొనసాగిన పింఛన్ల పంపిణీ

63.81 లక్షల మందికి రూ.1,758.85 కోట్లు అందజేత

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నప్పటికీ వలంటీర్లు వెనక్కి తగ్గకుండా సోమవారం లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ల డబ్బులు పంపిణీ చేశారు. డిసెంబర్ నెలకు సంబంధించి ఇప్పటివరకు 63,81,284 మంది లబ్ధిదారులకు రూ.1,758.85 కోట్ల పంపిణీ పూర్తయ్యిందని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే 97.67 శాతం మందికి పింఛన్ల సొమ్ము అందజేశామని.. మిగిలిన వారికోసం మంగళవారం కూడా వలంటీర్ల ఆధ్వర్యంలో పంపిణీ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

ఆరోగ్యం మీ హక్కు



వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ఏ పేదవాడు వైద్యం కోసం ఇబ్బంది పడకూడదని.. ఈ విషయంలో వాళ్లు అప్పులపాలు కాకుండా ఉండేందుకు వీలుగా ఆరోగ్యశ్రీని ప్రభుత్వం గతంలో ఎన్నడూలేని విధంగా బలోపేతం చేసింది. ఈ విషయంలో సీఎం వైఎస్ జగన్ మరో అడుగు ముందుకేస్తూ ప్రజలు నచ్చేలా.. ప్రభుత్వాన్ని మెచ్చేలా ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం, పథకం సేవలు ఎలా పొందాలన్న దానిపై ప్రతీ ఒక్కరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలని సంకల్పించారు. సేవలు వినియోగించడం గురించి తెలియని వ్యక్తి అంటూ రాష్ట్రంలో ఎవరూ ఉండకూడదని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం.. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్ల ద్వారా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయనున్నారు. మొత్తం 1,42,34,464 కొత్త కార్డులను ప్రింట్ చేయిస్తున్నారు. ఈనెల 18 నుంచి వీటిని అందజేస్తారు. మరోవైపు.. ఆరోగ్యశ్రీ యాప్ ప్రతి ఒక్కరి మొబైల్ ఫోన్‌లో అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇదే సమయంలో దిశ యాప్ కూడా డౌన్‌లోడ్ చేసుకునేలా కార్యక్రమం చేపడుతోంది. ప్రతి ఒక్కరి మొబైల్ ఫోన్‌లో ఈ రెండు యాప్‌లు ఉండేలా చర్యలు తీసుకుంటోంది.

ఆరోగ్య సురక్షపై నిరంతర సమీక్ష

రాష్ట్రవ్యాప్తంగా యజ్ఞంలా సాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గుర్తించిన రోగులకు చేయూతనందించే కార్యక్రమాన్ని నిరంతరం సమీక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో మూడు అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టనుంది.

- సురక్షలో గుర్తించిన రోగులకు మందులు అందించడం ఆరోగ్యంపై ఫాలోఅప్ చేయడం..
- గతంలో ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేసుకున్న వారికి అవసరమైన మందులు, చికిత్సపై ఫాలోఅప్ సేవలు అందించడం..
- దీర్ఘకాలిక వ్యాధులతోబాధపడుతున్న వారికి అందిస్తున్న మందులను కోర్సు ముగిసేలోపే వాటిని అందుబాటులో ఉంచడం. ఈ మూడు ప్రధాన అంశాలపై నిరంతరం సమీక్ష చేయనుంది.
- అలాగే, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండో దశను జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

మందులపై ప్రత్యేక శ్రద్ధ..

ఇక ఫ్యామిలీ డాక్టర్ ప్రతి గ్రామానికీ వెళ్తున్నందున అదే సమయంలో వారికి మందులు అందాయా? లేదా? అన్న దానిపైనా దృష్టి కేంద్రీకరించనుంది. ఈ ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని యోచిస్తోంది. అలాగే, సురక్షలో గుర్తించిన ఆస్పత్రుల్లో చికిత్స అవసరమున్న రోగులకు రవాణా ఖర్చుల కింద రూ.500 చొప్పున ఇవ్వడమే కాక.. సురక్ష క్యాంపుల నుంచి ఆస్పత్రులకు రిఫర్ చేసి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్లుగా చేరిన వారిని మరోసారి డాక్టర్ల బృందం పరిశీలించేలా.. శిబిరాల్లో ఇంకా వైద్యం అందాల్సిన వారికి వెంటనే నాణ్యమైన చికిత్స అందేలా చర్యలు తీసుకోనుంది.

చైనా వైరస్‌పైనా అప్రమత్తం

చైనాలో హెచ్9ఎన్2 వైరస్ విస్తరిస్తున్న దృష్ట్యా మన దగ్గర ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖను సీఎం జగన్ అప్రమత్తం చేశారు. ఆస్పత్రుల వారీగా ఉన్న మౌలిక సదుపాయాలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని.. మందులు, ఆక్సిజన్, పడకల విషయంలో అన్ని రకాలుగా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్పత్రుల్లో ఎక్కడా వైద్యులు, సిబ్బంది పోస్టుల ఖాళీలు లేకుండా చూడాలని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం వైద్య, ఆరోగ్య శాఖపై ముఖ్యమంత్రి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సూచించారు.

1.42 కోట్ల ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ..

వైద్యశాఖలో అమలుపరుస్తున్న పలు కార్యక్రమాల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రి జగన్‌కు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు నెలాఖరు వరకూ 12,42,118 మంది ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స చేయించుకున్నట్లు చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే 24.64 శాతం చికిత్సలు పెరిగాయన్నారు. అలాగే.. ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి మొబైల్ ఫోన్‌లో అందుబాటులో ఉంచేలా చూస్తున్నామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు, పురోగతిని కూడా వారు సీఎంకు వివరించారు.

- కంటి చికిత్సలు కాకుండా ఇతర వైద్య చికిత్సలు అవసరమైన వారు 86,690 మంది ఉన్నారని..
- ఇందులో 73,602 మందికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్సలు అందేలా చర్యలు తీసుకున్నామని..
- చాలామందికి పరీక్షలు చేసిన తర్వాత వైద్యులు మందులు ఇచ్చారని.. అనంతరం తదుపరి చికిత్స కోసం 16,128 మందిని ఆస్పత్రుల్లో అడ్మిట్ చేశామని చెప్పారు.
- వీరిలో 15,786 మందికి సర్జరీలు, ట్రీట్‌మెంట్లు పూర్తయ్యాయి.
- 78,292 మందికి కంటిచికిత్సలు అవసరమని జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా గుర్తించామని అధికారులు వివరించారు.
- ఇక కంటిచూపు సంబంధిత సమస్యలున్న 13,614 మందికి ఇప్పటికే కేటరాక్ట్ సర్జరీలు చేయించామన్నారు. 5,26,702 మందికి కంటి అద్దాలు అందిస్తున్నామన్నారు.
- క్యాంపుల్లో గుర్తించిన రోగులకు సకాలంలో మందులు అందేలా అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు.

జనవరి నుంచి రెండోదశ ఆరోగ్య సురక్ష..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండో దశను జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభిస్తామని సీఎంకు అధికారులు తెలిపారు. ప్రతి మండలంలో ప్రతీవారం ఒక ఆరోగ్య సురక్ష క్యాంపు ఏర్పాటుచేసేలా ప్రణాళిక రచించామన్నారు. క్యాంపుల్లో స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని.. మందులు, వైద్య పరీక్షలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ఇలా 110 మున్సిపాలిటీల్లోని పట్టణ, నగర ప్రాంతాలను కవర్ చేస్తూ వారంలో 162 క్యాంపులు ఉంటాయన్నారు. ఈ సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కార్యదర్శి డాక్టర్ మంజుల, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, సెకండరీ హెల్త్ డైరెక్టర్, ఆరోగ్యశ్రీ సీఈఓ డాక్టర్ వెంకటేశ్వర్, డీఎంఈ డాక్టర్ నరసింహం, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్.గుల్జార్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తుపాను సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు, సమన్వయకర్తలకు ఆ పార్టీ ఆదేశం

సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన తీసుకుంటున్న చర్యల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం సూచించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. జన జీవనానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, ప్రమాదం పొంచి ఉన్న చోట్ల ప్రాణనష్టం వాటిల్లకుండా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సీఎం జగన్ ఉన్నతాధికారులను పరిశీలకులుగా పంపించారని తెలిపింది.

291 మంచినీటి ట్యాంకర్లు, 175 జనరేటర్లు సిద్ధం

సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపాను ప్రభావిత గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఆర్‌వో ప్లాంట్ల నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు గ్రామీణ మంచినీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం 291 ట్యాంకర్లను సిద్ధం చేసింది. నీటి శుద్ధి కోసం తుపాను ప్రభావిత గ్రామాలకు సమీపంలో ఉండే 18 ఆర్‌వో ప్లాంట్లను కూడా తాత్కాలికంగా లీజుకు తీసుకునేలా అధికారులు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్ సమస్య కారణంగా మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తగా 175 డీజిల్ జనరేటర్లను తాత్కాలిక లీజు పద్ధతిన ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ గ్రామాల్లో అందుబాటులో ఉంచింది. అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేలా కృష్ణా, తిరుపతి జిల్లాల్లోని ఐదు ప్రాంతాల్లో 80 వేల మంచినీటి ప్యాకెట్లను సిద్ధం చేసింది. ఇళ్ల మధ్య వర్షం నీరు ఎక్కువ సమయం నిల్వ ఉండకుండా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో మురుగు నీటి కాల్వల పూడిక తీత పనులు చేపట్టేలా పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే ఆయా జిల్లాల జెడ్పీ సీఈవోలు, డీపీవోలకు ఆదివారం రాత్రి ఆదేశాలిచ్చింది.

వైద్య శాఖ అప్రమత్తం

వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో మందులు సిద్ధం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మిచాంగ్ తుపాను నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ప్రభావిత జిల్లాల డీఎంహెచ్‌వోలను, ఉన్నతాధికారులను అప్రమత్తం చేసి ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టింది. ముంపు ప్రభావిత, మారుమూల ప్రాంతాల్లో అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకుంది. ఆయా ప్రాంతాల్లోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకు సరిపడా మందుల్ని ముందుగానే నిల్వ చేసుకున్నారు. పాము కాట్లు చోటు చేసుకున్న సందర్భాల్లో బాధితులకు వెంటనే విరుగుడు మందులు అందించడం కోసం యాంటీ వీనం ఇంజెక్షన్‌లను పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచారు. సీజనల్ వ్యాధులు, డయేరియా కేసులు నమోదవ్వకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ వారంలో ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణులను ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత జాగ్రత్తలు పాటించకుంటే జ్వరాలు, శ్వాసకోశ, ఇతర సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

ప్రస్తుత శీతాకాల పరిస్థితులకు తోడు ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ఆస్తమా, సీవోపీడీ సమస్యలున్న వారు చాలా జాగ్రత్తగా ఉండాలి. చలి వాతావరణానికి దూరంగా ఉండాలి. వర్షంలో తడవకుండా ఉండాలి. చిన్న పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. స్ట్రీట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్ తీసుకోవడం పూర్తిగా మాని.. వేడిగా ఉన్న ఆహారాన్నే తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీరు తాగితే మంచిది. జలుబు, దగ్గు వంటి సమస్యల బారిన పడకుండా ఉండాలంటే తప్పనిసరిగా మాస్క్ ధరించాలి.

– డాక్టర్ ఎస్.రఘు, సూపరింటెండెంట్
ఛాతీ, సాంక్రమిక వ్యాధుల ఆస్పత్రి గుంటూరు

సైబర్ డాన్ ఫర్హాన్ అరెస్ట్

కశ్మీర్‌లో పట్టుకున్న అనంతపురం పోలీసులు



పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం: నిరుద్యోగ యువత, ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వివిధ యాప్‌ల ద్వారా రూ.350 కోట్లకు పైగా దోచుకుని.. క్రిప్టో కరెన్సీ రూపంలో దేశ సరిహద్దులు దాటిస్తున్న సైబర్ మాఫియా డాన్ అనయతుల్లా ఖాన్ అలియాస్ ఫర్హాన్‌ను అనంతపురం జిల్లా పోలీసులు కశ్మీర్‌లో అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సోమవారం వివరాలు వెల్లడించారు. వారం రోజుల క్రితం సైబర్ ముఠా గుట్టురట్టు చేసిన అనంత జిల్లా పోలీసులు ఐదుగురు నిందితులను కటకటాలకు పంపిన విషయం తెలిసిందే. సదరు ముఠా అధిపతి అయిన ఫర్హాన్‌ను అరెస్టు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించి..అదే రోజు సీఐ వలీ బాష ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు ఫరూక్ బాషా, యాసర్ అలీ, బాబా జాఫర్ సాదిక్‌తో కూడిన ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. ఈ బృందం కశ్మీర్‌కు వెళ్లి కుప్వారా జిల్లా మనిగావ్‌లో ఫర్హాన్‌ను అరెస్టు చేసింది. స్థానిక పోలీసుల సహకారంతో అతన్ని కుల్వారా మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచింది. అక్కడి న్యాయమూర్తి ఆదేశాల మేరకు ట్రాన్సిట్ వారంటుపై అనంతపురం జిల్లాకు తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు. కాగా, ఫర్హాన్ అరెస్టులో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

శ్రీశైలం నుంచి సాగర్‌కు తరలించిన 17 టీఎంసీలు మావే

- కృష్ణా బోర్డు చైర్మన్‌కు తేల్చిచెప్పిన ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి
- వాటిని సాగర్ కుడి, ఎడమ కాలువలకు పునఃపంపిణీ చేయాలని డిమాండ్
- తెలంగాణ ఈఎన్‌సీ గైర్హాజరుతో త్రిసభ్య కమిటీ భేటీ రద్దు
- కృష్ణా బోర్డు చైర్మన్, సభ్య కార్యదర్శితో చర్చించిన ఏపీ ఈఎన్‌సీ

సాక్షి, అమరావతి: తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం ప్రాజెక్టులో అక్టోబరు 9 నుంచి ఎడమ గట్టు కేంద్రం ద్వారా విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు తరలించిన 17 టీఎంసీలు ఏపీకి కేటాయించిన జలాలేనని కృష్ణా బోర్డు చైర్మన్‌కు రాష్ట్ర ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి తేల్చి చెప్పారు. వాటిని తాగునీటి అవసరాలకు సాగర్ కుడి, ఎడమ కాలువలకు పునఃపంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కృష్ణా బోర్డు సర్వ సభ్య సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బోర్డు చైర్మన్ శివ్‌నందన్ కుమార్ చెప్పారు. తాగునీటి కోసం సాగర్ కుడి కాలువకు 5 టీఎంసీలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనపై 4న త్రిసభ్య కమిటీ సమావేశంలో చర్చించాలని కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ శనివారం ఆదేశించారు. దాంతో సోమవారం త్రిసభ్య కమిటీ సమావేశాన్ని కృష్ణా బోర్డు ఏర్పాటు చేసింది. బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ హాజరు కాలేదు. ఆయనకు రాయ్‌పురే ఫోన్ చేయగా.. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక సమావేశాన్ని ఏర్పాటు చేస్తే హాజరవుతానని చెప్పారు. దాంతో త్రిసభ్య కమిటీ సమావేశాన్ని బోర్డు రద్దు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి నీటి అవసరాలపై బోర్డు చైర్మన్, సభ్య కార్యదర్శితో ఈఎన్‌సీ నారాయణరెడ్డి చర్చించారు. త్రిసభ్య కమిటీ అక్టోబర్ 6న చేసిన సిఫార్సుల మేరకు తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం నుంచి 30, సాగర్ నుంచి 15.. మొత్తం 45 టీఎంసీలు ఏపీకి, రెండు ప్రాజెక్టుల నుంచి 35 టీఎంసీలు తెలంగాణకు కేటాయిస్తూ అక్టోబర్ 9న బోర్డు ఉత్తర్వులు జారీ చేసిందని ఈఎన్‌సీ గుర్తు చేశారు. ఆ రోజు నుంచి తెలంగాణ అక్రమంగా ఎడమ గట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు నీటిని తరలించి, శ్రీశైలాన్ని ఖాళీ చేసిందన్నారు. ఈ విషయాన్ని అనేకసార్లు బోర్డు దృష్టికి తెచ్చినా తెలంగాణ ప్రభుత్వాన్ని నియంత్రించలేకపోయారని అన్నారు. దీనివల్ల శ్రీశైలంలో కేటాయించిన 30 టీఎంసీల్లో 13 టీఎంసీలు మాత్రమే మిగిలాయని, 17 టీఎంసీల వాటా జలాలు కోల్పోయామని చెప్పారు. సాగర్‌కు తెలంగాణ సర్కారు తరలించిన జలాల్లో 17 టీఎంసీలూ ఏపీ కోటాలోనివేనని స్పష్టం చేశారు. వాటిని ఇప్పుడు పునఃపంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.



ఏ వ్యక్తీ ఒకే నదిలో రెండుసార్లు అడుగుపెట్టలేడు.
ఎందుకంటే ఎప్పటికీ అది ఒకే నది కాదు, ఎప్పటికీ అతడు ఒకే మనిషి కాదు.
– హెరాక్లిటస్

సాక్షి

మంగళవారం, 5 డిసెంబర్ 2023

జయాపజయాలు

మినీ జనరల్ ఎన్నికలుగా భావించిన అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓటర్లు వెలువరించిన విస్పష్టమైన తీర్పు భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్న 'ఇండియా' కూటమి, దాని ప్రధాన భాగస్వామి అయిన కాంగ్రెస్ తలరాతలను తలకిందులు చేసింది. తెలంగాణలో దక్కిన బొటాబొటీ విజయం ఒక్కటే కాంగ్రెస్‌కు ఊరటనిచ్చింది. ప్రధాన రాష్ట్రాలైన రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లతోపాటు ఛత్తీస్‌గఢ్‌ను కూడా గెల్చుకుని మరో ఆర్నెల్లల్లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమే ముచ్చటగా మూడో సారి కూడా అధికారంలోకొస్తుందని బీజేపీ చాటింది. ఈ మూడుచోట్లనుంచీ 65 లోక్‌సభ స్థానాలున్నాయి. ఈశాన్య రాష్ట్రమైన మిజోరంలో 36 యేళ్లుగా అధికారంలో కొనసాగుతున్న మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్‌ఎఫ్)– కాంగ్రెస్ కూటమి కొత్తగా ఆవిర్భవించిన జోరమ్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జడ్‌పీఎం) చేతుల్లో మట్టికరిచింది. అక్కడ ముఖ్యమంత్రి – ఎంఎన్‌ఎఫ్ సారథి జోరంతంగాతో పాటు 11 మంది మంత్రులు చిత్తుగా ఓడిపోయారు. ఒకటి రెండు రోజుల్లో ఈ అయిదు రాష్ట్రాల్లోనూ కొత్త సారథులు కొలువుదీరబోతున్నారు. మూడు రాష్ట్రాలు గెలుచుకున్న బీజేపీ గానీ, తెలంగాణ గెల్చుకున్న కాంగ్రెస్ గానీ తమ సీఎం అభ్యర్థులను ప్రకటించాల్సివుంది. ఈలోగా ఊహాగానాలే షికారు చేస్తాయి. ఒక్క మిజోరంలో మాత్రం జడ్‌పీఎం చీఫ్ లాల్దుహోమా ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ ముందే ప్రకటించింది. ఎన్నికల ఫలితాలు వెలువడుతుండగానే 'ఇండియా' కూటమిలో రుసరుసలు వినిపించాయి. హిందీ బెల్ట్‌లో బీజేపీ ప్రభంజనానికి కాంగ్రెస్ చేతగానితనమే కారణమని తృణమూల్ కాంగ్రెస్ అనటం, తమ పార్టీ అధినేత మమతాబెనర్జీని, కూటమిలోని ఇతర నేతలనూ కలుపుకొని వెళ్లటంలో ఆ పార్టీ విఫలమైందని ఆరోపించటం... జేడీ(యూ), ఆర్జేడీలు సైతం అదే తరహాలో మాట్లాడటం త్వరలో జరగబోయే కూటమి సమావేశం ఎలా ఉంటుందో చెబుతున్నాయి. మొన్న మే నెలలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించినప్పటి నుంచీ ఊహలపల్లకీలో ఊరేగుతున్న కాంగ్రెస్‌ను తాజా ఫలితాలు కిందకు దించాయి. ఈ పంచతంత్రం గట్టెక్కటం ఎలాగోనని సంశయిస్తూ బరిలోకి దిగిన బీజేపీ... తమ నేతలంతా ఒక్కతాటిపై నిలిచారన్న అభిప్రాయాన్ని కలిగించటంలో విజయం సాధించింది.

రణరంగానికి తరలే శ్రేణులపై సైన్యాధిపతికి పట్టుండాలి. అతని ఆదేశాలకు అనుగుణంగా ముందుకురికేందుకు చతురంగ బలాలు సర్వసన్నద్ధంగా వుండాలి. విజయమో, వీరస్వర్గమో అన్నంతగా చెలరేగిపోవాలి. కాంగ్రెస్‌కు సంబంధించి జరిగిందంతా అందుకు విరుద్ధం. అధిష్ఠానం సూచనలు పాటించటానికి రాజస్తాన్‌లో గహ్లోత్, మధ్యప్రదేశ్‌లో కమలనాథ్ ససేమిరా అన్నారు. ఇక ఛత్తీస్‌గఢ్‌లో ఈడీ దాడులతో ఎజెండాలోకొచ్చిన మహదేవ్ యాప్ కొంపముంచింది. కనుకనే ఈ మూడుచోట్లా పార్టీ ఆశలు ఆడియాసలయ్యాయి. 'ఇండియా' కూటమిలో దాని స్థానాన్ని మరింత బలహీనపరిచాయి. అధికారంలో ఉన్నవారిని సాగనంపే సంప్రదాయం వున్న రాజస్తాన్‌పై కాంగ్రెస్‌కు ఎటూ పెద్దగా ఆశలు లేవు. అయినా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ గత ఏడాదిగా ప్రకటిస్తున్న జనాకర్షక పథకాలు ఈ సరళిని మారుస్తాయేమోనన్న భయం బీజేపీలో లేకపోలేదు. కానీ మధ్యప్రదేశ్‌లో అలా కాదు. అక్కడ కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నంతగా ప్రచారం జరిగింది. ఎందుకంటే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా అవతరించి అత్తెసరు మెజారిటీతో పాలన ప్రారంభించిన కాంగ్రెస్‌కు రెండేళ్లు తిరగకుండానే పొగబెట్టి బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకోగలిగింది. సగటు ఓటరుకు ఆ విషయంలో సానుభూతి ఉన్నదని అందరూ అంటూ వచ్చారు. సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ సంక్షేమ పథకాల జోరు కనబడుతున్నా బీజేపీ సంశయిస్తూనే అడుగులు వేసింది. జాగ్రత్తగా పావులు కదిపింది. సునాయాసంగా అధికారాన్ని చేజిక్కించుకుంది. ఇక కాంగ్రెసే మళ్లీ అధికారంలోకి రావటం ఖాయమని అందరూ అనుకున్న ఛత్తీస్‌గఢ్‌లో సైతం ఆ పార్టీకి పరాజయం తప్పలేదు.

రాజస్తాన్‌లో గహ్లోత్, యువ నాయకుడు సచిన్ పైలెట్‌ల మధ్య నాలుగేళ్లుగా హోరాహోరీ పోరు సాగుతోంది. వారిద్దరిలో ఎవరు నిష్క్రమిస్తే పార్టీకి ఎక్కువ నష్టమో అధిష్ఠానం తేల్చుకోలేక, ఇద్దరి మధ్యా సంధి కుదిర్చేందుకు తంటాలూ పడింది. ఈ అంతర్గత పోరు ఎంత నష్టపరిచిందంటే స్వతంత్రంగా ఉంటూ పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసుకునే గిగ్ వర్కర్స్ సంక్షేమానికి దేశంలోనే తొలిసారి చట్టం తెచ్చిన ఘనతను సైతం ప్రచారం చేసుకోలేకపోయింది. ఇతర సంక్షేమ పథకాలు సరేసరి. ఇక మధ్యప్రదేశ్‌లో దాదాపు 30 స్థానాల్లో అభ్యర్థులను మార్చాలని ఎందరు మొత్తుకున్నా కమలనాథ్ ససేమిరా అన్నారు. పైగా తాను ఓ వర్గానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతిని మరిచి 'జై జై కమలనాథ్' నినాదాన్ని రుద్దారు. ఛత్తీస్‌గఢ్‌లో మహదేవ్ యాప్ కుంభకోణం తర్వాత సీఎం బఘేల్‌తో వేదిక పంచుకోవటానికి రాహుల్, ప్రియాంక సిద్ధపడలేదు. సంక్షేమ పథకాలతో ఊదరగొడితే చాలదు... నాయకత్వ పటిమపై విశ్వసనీయత కలిగించాలి. ఆ విషయంలో వైఫల్యమే మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను ముంచింది. అటు బీజేపీలో మూడు రాష్ట్రాల్లోనూ స్థానిక నేతలనూ పక్కనబెట్టి అభ్యర్థుల నిర్ణయంలోనూ, ప్రచారవ్యూహంలోనూ అగ్ర నాయకత్వం తనదే పైచేయి అన్నట్టు వ్యవహరించింది. మోదీ సర్వం తానైనట్టు వ్యవహరించారు. అది విజయానికి దోహదపడింది. దాంతోపాటు కాంగ్రెస్ వైఫల్యాలు కూడా బీజేపీకి కలిసొచ్చాయి. జనం భావోద్వేగాలపైకాక సంక్షేమం, అభివృద్ధి అంశాలపై దృష్టి సారించటం కూడా ఆ పార్టీకి పనికొచ్చింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇదే తోడ్పడుతుందని భావిస్తే అది బీజేపీకే మేలు.

అస్తమించని మేధా సూర్యుడు

సందర్భం



డా॥ కత్తి పద్మారావు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావుల్లో అగ్రగణ్యులు. భారతదేశ పునర్నిర్మాణ దృష్టితో రాజ్యాంగాన్ని రూపొందించారు. ఆయన చెక్కిన రాజ్యాంగ శిల్పంలో ప్రపంచ మానవతా సూత్రాలన్నీ ఇమిడి ఉన్నాయి. లౌకిక భావన, ప్రజాస్వామ్య వ్యవస్థలలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను భారత ప్రజలకు లభించడానికి తీవ్రంగా కృషి చేశారు. ఆయన విశుద్ధంగా, వినిర్మలంగా, ద్వేష రహితంగా జీవించారు. అదే జీవన విధానం అందరికీ ఆచరణీయం. ఆయన సిద్ధాంతాలైన కుల నిర్మూలన, అస్పృశ్యతా నివారణ, ఆర్థిక సమత, మానవ హక్కులు, బహుజన సాధికారితలను సాధించడానికి మనందరం ముందుకెళ్ళాల్సిన చారిత్రక సందర్భమిది.

అంబేడ్కర్‌కి పూర్వం, అంబేడ్కర్ తర్వాత అని భారతదేశ చరిత్రను మనం లిఖించాల్సి ఉంటుంది. అంబేడ్కర్‌కి పూర్వం భారతదేశం మనుస్మృతి రాజ్యం, వర్ణ వ్యవస్థ రాజ్యం, బ్రాహ్మణాధిపత్య రాజ్యం, లౌకికేతర రాజ్యం, అప్రజాస్వామిక రాజ్యం, నియంతృత్వ రాజ్యం. అంబేడ్కర్ భారత దేశం రూపురేఖలను మార్చారు. లౌకిక ప్రజాస్వామిక దేశంగా చేశారు. ఆయన భారత రాజ్యాంగ శిల్పంలో ప్రపంచ మానవతా సూత్రాలన్నీ ఇమిడి ఉన్నాయి. లౌకిక భావన ప్రజాస్వామ్య వ్యవస్థలలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను భారత రాజ్యాంగం ద్వారా భారత ప్రజలకు లభించడానికి కారకులయ్యారు. కులాతీత, మతాతీత రాజ్యాంగాన్ని రూపొందించి భారతదేశానికి కానుకగా సమర్పించారు. భారత దేశ భవిష్యత్తుకు ఆ రాజ్యాంగమే దిక్సూచి.

అంబేడ్కర్ ప్రపంచంలోనే పేరెన్నిక గన్న మేధావి. తత్వవేత్త, దార్శనికుడు అని ఎవరిని అంటారు? ప్రపంచ గమన సూత్రాలను మార్చ గలిగిన వారినే అంటారు. అంబేడ్కర్‌కు ముందు ఒక బుద్ధుణ్ణి, ఒక మార్క్స్‌ను ప్రజలు తత్వవేత్తగా కొనియాడారు. ఆయన బుద్ధుని కంటే, మార్క్స్ కంటే కూడా విశిష్ట లక్షణాలు ఉన్న మేధావి. భారత దేశాన్ని పట్టి పీడిస్తున్న కుల సమస్యకు, అస్పృశ్యతా నిర్మూలనకు నిర్మాణాత్మకమైన సిద్ధాంతాలు, సూత్రాలు అందించారు.

అణగారిన ప్రజల హక్కుల సిద్ధాంతానికి కర్త అయ్యారు. అంతే కాక, దానికి చట్ట రూపాన్ని తీసుకొచ్చిన నిర్మాణ కర్త ఆయన. అంబేడ్కర్ పరినిర్వాణం 67వ ఏట అడుగు పెడుతున్నా ఆయన కీర్తి తరగ లేదు. ఆయన సిద్ధాంతాలు విశ్వవ్యాప్తమవ్వడానికి కారణం, ఆయన జీవితం అంతా అనంత పరిశోధన చేసి, కుల నిర్మూలన, అస్పృశ్యతా నిర్మూలనం, ఆర్థిక అసమానతల నిర్మూలనకు బాటలు వేయడమే. ఆయనలా విశుద్ధంగా, నిర్మలంగా, ద్వేష రహితంగా జీవించిన మేధావులు అరుదు. ఆయన భారత రాజ్యాంగ నిర్మాణాన్ని భారతదేశ పునర్నిర్మాణ దృష్టితో రూపొందించారు. అందుకు ఆయన తన ఆరోగ్యాన్ని పణంగా పెట్టారు.

ఆయన విద్యార్జన గమ్యం అస్పృశ్యుల ఉద్ధరణ. అదీ దళిత విద్యావంతులలో ఉండాల్సిన ఆదర్శం. దళిత విద్యార్థులు ఆ నిర్దేశకత్వం నుండి తప్పితే అంబేడ్కర్ మార్గాన్ని నిరోధించిన వారే అవుతారు. ఈ సత్యాన్ని ప్రతి అంబేడ్కర్‌వాది గుర్తుంచుకోవాలి. ఆయన లండన్‌లో ఉన్నప్పుడు కూడా తన మనస్సు మాత్రం భారతదేశ అస్పృశ్య సమాజం మీదే ఉండేది. భారతదేశంలో అస్పృశ్యుల కోసం పని చేస్తున్న సంఘాలు ఏమి చేస్తున్నాయా అని ఆయన ఎప్పటికప్పుడు తెలుసుకొంటూ ఉండేవారు.

అంబేడ్కర్ విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను సంతరించుకున్నారు. నాయకుడు కేవలం తన వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించడు. తన జాతి గురించే ఆలోచిస్తాడు. త్యాగపూరితంగా



పనిచేయడం ద్వారా తన జాతీయుల మనసులను చూరగొంటాడు. నాయకుడు తన భావజాలాన్ని జాతికి అందించడానికి వాహికను రూపొందించుకుంటాడు. అది ఉత్తరాల ద్వారా కావచ్చు, పత్రికల ద్వారా గావచ్చు, సభలు, సమావేశాల ద్వారా గావచ్చు. ఆయన చేసిందీ అదే! ఆయన అనేక పత్రికల్లో రాయడమే కాక స్వయంగా 'మూక్ నాయక్', 'బహిష్కృత్ భారత్', 'జనత', ప్రబుద్ధ భారత్' వంటి పత్రికలు స్థాపించి వాటి ద్వారా తాను చెప్పాలనుకున్నది నిర్భయంగా, కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఎన్నో సభల్లో ఉపన్యసించి అణగారిన వర్గాలను ఉత్తేజితులను చేశారు. నాటి ప్రభుత్వ పెద్దలకూ, రాజకీయ నాయకులకూ ఆయన రాసిన ఉత్తరాలు ఇప్పటికీ చారిత్రక ప్రాధాన్యం కలిగి ఉన్నాయి.

అంబేడ్కర్ నిశిత పరిశీలకుడు. ముఖ్యంగా ఆయన పోరాటానికి పునాది పూర్తి కుల త్యాగ నిరతి. అందుకే పూర్వీకుల వీరోచిత గాథలను వర్ణించారు. ఆయన క్రమశిక్షణతో కూడిన నిర్భయత్వాన్ని ప్రదర్శిస్తూ వీరోచితమైన సాహసాన్నీ, మొక్కవోని నిబ్బరాన్నీ, ధైర్యాన్నీ కొనియాడదగిన నిశ్చితత్వాన్నీ ప్రదర్శించిన మహర్ సైనికులకు శాశ్వతమైన గుర్తింపును తెచ్చారు. 'ఇద్దరిలో ఎవరి కీర్తి గొప్పదో చెప్పడం కష్టం. అది భారతీయ సైనికులదో లేక అంతటి విధేయతను, విశ్వాసాన్ని పొందేలా వ్యవహరించిన బ్రిటిష్ ఆఫీసర్లదా?' (భారతీయ సైనికులలో అధికులు మహర్లు) అంటూ మేజర్ జె.టి. గోర్మన్ తన 'హిస్టారికల్ రికార్డ్ ఆఫ్ ది సెకండ్ బెటాలియన్ ఫోర్త్ బాంబే గ్రెనెడీర్స్, 1796–1933'లో పేర్కొనడం ఈ సందర్భంగా గమనార్హం. అనతికాలంలోనే కోరెగాంవ్ చర్యకున్న ప్రాముఖ్యతను గుర్తించారు. కోరెగాంవ్‌లో మొదటి తూటా పేలిన స్థలంలో 65 అడుగుల ఎత్తు, 32 చదరపు అడుగుల వెడల్పు ఉన్న స్మృతి చిహ్నాన్ని నిర్మించాలని తలపెట్టారు. దీనికి 1821 మార్చి 26న పునాది రాయి వేశారు. ఈ దళం సాహసానికి స్మృతిగా ఈ స్తూపాన్ని నిర్మించారు. ఈ సాహసాన్ని కొనసాగించే ఉద్దేశంతో దీనిని నెలకొల్పారు.

అస్పృశ్యులు అనబడినవారు వీరోచితమైన జాతులు అని అంబేడ్కర్ తన అస్పృశ్యుల వాడలో నిరూపించారు. పల్నాటి యుద్ధంలో తెలుగు నేలలో దళితులే పాల్గొన్నారు. కృష్ణదేవరాయల సైన్యంలో ఏనుగులను, గుర్రాలను నడిపింది దళితులే. ముఖ్యంగా పల్నాటి వీర చరిత్రలో కన్నమదాసు సైన్యాధ్యక్షుడు. ఆయన ఉపయోగించిన కత్తి ఇప్పటికీ కారంపూడిలో ఉంది. డా॥ అంబేడ్కర్ కృషి వలన అస్పృశ్యత ఒక నేరంగా రాజ్యాంగం పరిగణిస్తూ ఉంది. కాని భారతదేశంలో లక్షలాది గ్రామాలలో ఇంకా అస్పృశ్యత వెన్నాడుతోంది. ఎన్నో హోటళ్ళలో గ్లాసులు అస్పృశ్యులకు వేరుగా ఉంచుతున్నారు. కొన్ని ప్రభుత్వాలు ఊరికి దూరంగా ఇళ్ళు కట్టిస్తున్న సందర్భాలూ ఉన్నాయి.

భారత రాజ్యాంగంలో 21వ ఆర్టికల్‌ను వివరిస్తూ డా॥ అంబేడ్కర్ 'ప్రభుత్వ సొమ్మును మత బోధకులకు, మత కార్యకలాపాలకు ఉపయోగించరాదు. మత బోధలకు సంబంధించి స్వయంగా లేక ప్రయివేటు సంస్థల ద్వారా ప్రభుత్వం ఖజానా డబ్బును ఖర్చు చేయడానికి వీలులేదు' అని స్పష్టం చేశారు. దీనికి పూర్తిగా, భిన్నంగా ఈనాడు జరుగుతూ ఉంది. ప్రభుత్వ ప్రచార సాధనాలయిన రేడియో, టీవీ వంటివాటిలో మత ప్రచారం చేయడం రాజ్యాంగ విరుద్ధం. ఆనాడు అంబేడ్కర్ వివరించిన దానికి పూర్తి భిన్నంగా జరుగుతూ ఉంది. సెక్యులరిజం అంటే 'మత ప్రమేయం లేని రాజ్యం' అని అర్థం. ఈనాడు ప్రభుత్వం పూర్తిగా మతపరంగా వ్యవహరిస్తూ వుంది. ఇది భారత రాజ్యాంగ శిల్పి అంబేడ్కర్‌కూ, ఆయన ఆలోచనలకూ పూర్తిగా వ్యతిరేకమయిన విషయం. అందుకే రానురానూ అంబేడ్కర్ అవసరం పెరిగింది.

ప్రపంచ వ్యాప్తంగా అంబేడ్కర్ మేధావిగా గుర్తింపు పొందారు. లండన్‌లోని 'ఇండియా హౌస్'లో ఆయన బంగారు విగ్రహం ఉంది. బ్రిటిష్ పార్లమెంట్ ఎదురుగా ఆయన నిలువెత్తు విగ్రహం ఉంది. ఇక భారత్‌లో సరేసరి. ఇండియన్ పార్లమెంట్ ఎదురుగా ఆయన సమున్నత విగ్రహం వుంది. ఇవాళ హైద్రాబాద్ నడిబొడ్డులో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం వెలుగులీనుతోంది. విజయవాడలో 125 అడుగుల విగ్రహం జనవరిలో ఆవిష్కరించబడుతుంది. ఆయన రాజ్యాంగ నిర్మాణ దక్షత, ప్రతిభా సామర్థ్యాలను గుర్తిస్తూ కశ్మీరు నుండి కన్యాకుమారి వరకు ఆయన విగ్రహాలు నిరంతరం వెలుస్తూనే ఉన్నాయి. ఈనాడు ఆయన భావజాల అవసరం చాలా ఉంది. మనమందరం ఆయన వర్ధంతికి నివాళిగా ఆయన సిద్ధాంతా లైన కుల నిర్మూలన, అస్పృశ్యతా నివారణ ఆర్థిక సమత, మానవ హక్కుల పోరాట దీక్షలతో బహుజన సాధికారిత రాజ్యాధికార భావనలతో ముందుకెళ్ళాల్సిన చారిత్రక సందర్భమిది.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

(రేపు డా॥ బి.ఆర్. అంబేడ్కర్ వర్ధంతి)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బతకనివ్వరా?!



బిహార్‌లో చాలామంది కేరళ టీచర్‌లు ఉన్నారు. వారు తమ కుటుంబాలను పోషించుకోడానికి అక్కడికి వెళ్లారు. బెంగాలీలు హైదరాబాద్‌లో టీచర్‌లుగా, పంజాబ్‌లో కూలీలుగా మనుగడ సాగిస్తున్నారు. పని చేయడానికి, సంపాదించడానికి దేశంలోని ఏ ప్రాంతానికైనా వెళ్లే హక్కు భారతీయులందరికీ ఉంది. విభజించడం, వేరుగా చూడటం ఆపండి.

– కనిష్క దధీచ్, జియో–పొలిటికల్ ఎనలిస్ట్

నరకప్రాయం



మిచుయాంగ్ తుపాన్ ఈ ఉదయం నా జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసింది. చెన్నైలోని మా అపార్ట్‌మెంట్ నుంచి నేను ఎయిర్‌పోర్ట్‌కి చేరుకునే లోపే ముంబై వెళ్లే ఫ్లయిట్ తప్పిపోయింది. ఉసూరుమంటూ అపార్ట్‌మెంట్‌కి తిరిగి వచ్చాక పవర్ కట్ కావడంతో అరగంట పాటు ఎలివేటర్‌లోనే ఇరుక్కుపోయాను. సొసైటీ వాళ్లు వచ్చి నన్ను కాపాడే వరకు లోపలే ఉండిపోవలసి వచ్చింది.

– సూర్యనారాయణ్ గణేశ్, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్

సాంస్కృతిక ఓటు



సంస్కృతి, ఆలయారాధన, యోగ, ఆయుర్వేదం, వేదాంతాల (శంకర, రామానుజ, మధ్వ) పరంగా అయితే దక్షిణాది రాష్ట్రాలను దేశంలోని హైందవ భూభాగంగా పరిగణించవచ్చు. దక్షిణ భారతీయులు ఆ సంస్కృతిని సమర్థించేవారికి ఓటు వేస్తారు తప్ప నాశనం చేసేవారికి కాదు. సనాతన ధర్మంలో ఉత్తరాది, దక్షిణాది అనే విభజన లేదు.

– డాక్టర్ డేవిడ్ ఫ్రాలీ, పద్మభూషణ్

ఇష్టారాజ్యం!



వి.ఐ.పి. కల్చర్‌ని అంతం చేస్తామని చెప్పినవారు ఇప్పుడు బస్టాండ్ మధ్యలో హెలికాప్టర్‌ని దింపుతున్నారు! పంజాబ్ ప్రజలకు క్రమంగా కేజ్రీవాల్, భగవంత్ మన్‌ల అసలు స్వరూపం కనిపిస్తోంది. వారిద్దరూ నటులు, దొంగలు తప్ప మరొకటి కారు. వారి ఏకైక ధ్యేయం పంజాబ్‌ను దోచుకోవడం, తమ ఖజానాను నింపుకోవడం మాత్రమే!

– మన్జీందర్ సింగ్ సిర్సా
బీజేపీ జాతీయ కార్యదర్శి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

మలుపు తిప్పిన ఘటన

చాలా ఏళ్ళ క్రితం ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదం తర్వాత కాలంలో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రగతి పరిణామాలపై ప్రభావాన్ని చూపింది. 1978 డిసెంబరు 5న యూనివర్సిటీ అసెంబ్లీ హాలు సమీపాన ఒక ప్రైవేటు బస్ ఇద్దరు యూనివర్సిటీ రీసెర్చి స్కాలర్ల దుర్మరణానికి కారణం అయ్యింది. విద్యార్థిలోకం నిరసనలు వ్యక్తం చేస్తూ పలు ప్రైవేటు బస్సులను ధ్వంసం చేయడమే కాక విశాఖ సిటీలో మరికొన్ని బస్సులను తగలబెట్టారు. ఆ ప్రమాదంలో మరణించిన కామర్స్ విభాగానికి చెందిన పి.ఎస్.ఎస్. ప్రసాద్, జువాలజీ విభాగానికి చెందిన ఎస్. అనురాధశ్రీల మృతదేహాలతో ధర్నాలు చేసి నగరంలోని రోడ్డులన్నింటినీ దిగ్బంధించారు. అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ విద్యార్థులు, పరిశోధకులు ధర్నాలు, నిరసనలతో సంఘీభావం తెలపడంతో ఏపీ అట్టుడికిపోయింది. దీంతో ప్రైవేటు బస్సు సర్వీసులను రద్దుచేసి ప్రభుత్వమే బస్సులను నడపా లనే నినాదం ఊపందుకొంది.

ఈ ఘటనకు 9 నెలల ముందే ఏర్పడిన డా॥ మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అయ్యింది. దశలవారీగా ప్రైవేటు బస్సు సర్వీసులను రద్దుచేస్తామని ప్రభుత్వం హామీ ఇస్తూ ఉద్యమ తీవ్రతను తగ్గించింది. చెన్నారెడ్డి తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆ దిశగా కొన్ని చర్యలు చేపట్టాయి. ముఖ్య పట్టణాల్లో ప్రైవేటు బస్సుల సర్వీసులను నిలుపుదల చేస్తూ వచ్చాయి. చివరికి ఎన్టీఆర్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు బస్సు సర్వీసులను రద్దుచేసి ప్రభుత్వం ద్వారా బస్సులను నడిపేందుకు నిర్ణయించింది. దీంతో 1958లో నైజామ్ సంస్థానం ద్వారా ఏపీ రాష్ట్రానికి బదలాయించబడిన ఆర్టీసీ తొలుత పాక్షికంగా, కార్పొరేషనుగా ఏర్పడిన తర్వాత పూర్తిగా ప్రభుత్వం అధీనంలోకి వచ్చింది.

– జి. లీలావరప్రసాద రావు, శ్రీకాకుళం

ఒక జ్ఞాపకం... ఒక సంస్మరణ!

నివాళి



లంకా పాపిరెడ్డి

విప్లవ రాజకీయాల్లో కీలక భూమిక పోషించిన ముక్కు సుబ్బారెడ్డి మరణంతో తొలితరం విప్లవ నాయకుల్లో మరో ముఖ్యుడు కాలగతిలో కలిసిపోయినట్లయింది. ఒకానొక క్లిష్ట దశలో ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీపుల్స్‌వార్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి ఉద్యమాన్ని బతికించారు. నాలాంటి వారికి ఆయన చేసిన పనులు సాహస గాథలుగా స్ఫూర్తినిచ్చాయి.

1960వ దశాబ్దం ప్రపంచంలోని చాలా భాగాలు ఆందోళనలతో అతలాకుతలం అవుతున్న కాలం. భారతదేశం కూడా ఉద్యమాలతో అట్టుడికిపోతున్న కాలం. కమ్యూనిస్టు ఉద్యమం చీలిపోయి నక్సలైట్ ఉద్యమం తలెత్తిన కాలం. సరిగ్గా ఈ కాలంలోనే మొన్న డిసెంబర్ 1న తుది శ్వాస విడిచిన ముక్కు సుబ్బారెడ్డి వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ–ఆర్‌ఈసీ (ఇప్పుడు నిట్)లో చదువుకుంటుండేవారు. నక్సలైట్ ఉద్యమ నాయకుడు కొండపల్లి సీతారామయ్య కొడుకు చందు పరిచయంతో సుబ్బారెడ్డి విప్లవ రాజకీయాల్లోకి ప్రవేశించారు.

ముక్కు సుబ్బారెడ్డిది ప్రకాశం జిల్లా కనిగిరి మండలం గణేశుని కండ్రిగ గ్రామం. చాలా పేదరికంలో పెరిగిన నేపథ్యం. వారాల అబ్బాయిగా కష్టపడి చదివి మెరిట్ సాధించి వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు సంపాదించారు. పేదరికం అనుభవించిన వాడిగా, అప్పటికే కమ్యూనిస్టు రాజకీయాల పరిచయం ఉన్నవాడిగా విప్లవ రాజకీయాలను చాలా త్వరగా సొంతం చేసుకున్నారు.

1976లో నాగ్‌పూర్‌లో కొండపల్లి సీతారామయ్య అరెస్టయ్యారు. అప్పటికే కేజీ సత్యమూర్తితో సహా అనేకమంది పార్టీ నాయకులు జైల్లో ఉన్నారు. అవి ఎమర్జెన్సీ రోజులు. కొద్దిమందే బయట ఉన్నారు. తర్వాత ఆ క్లిష్ట పరిస్థితులలో ముక్కు సుబ్బారెడ్డి పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి విజయవంతంగా పార్టీ కార్యకలాపాలు కొనసాగించారు. 1980 వరకు ఆంధ్రప్రదేశ్ కార్యదర్శిగా పని చేశారు. 1977లో సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమించుకుంటున్నట్లు పార్టీ తీర్మానం చేసింది. 'ఆగస్టు తీర్మానం'గా ప్రసిద్ధి చెందిన తీర్మానం అది. అప్పుడు పార్టీలో ఒక్కసారిగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. రవూఫ్ ఈ కారణంతోనే పార్టీ నుండి వెళ్ళిపోయారు. ముక్కు సుబ్బారెడ్డి రాష్ట్రమంతా తిరిగి క్యాడర్‌నంతా కన్విన్స్ చేయగలిగారు. 1978 మొదట్లో కావచ్చు. ర్యాడికల్ విద్యార్థి సంఘం మహాసభల సందర్భంగా వరంగల్‌కు వచ్చారు సుబ్బారెడ్డి. మేము నలుగురం. అంతా 18–19 సంవత్సరాల వయసు వాళ్ళం. చైనా గురించి ప్రశ్నల వర్షం కురిపించాము. 1976లో మావో చనిపోయిన తరువాత చైనా కమ్యూనిస్టు పార్టీ రివిజనిస్టు మార్గంలో పోతున్నది. అందుకు 'మన పార్టీ దానిని రివిజనిస్టు పార్టీగా ప్రకటించాల'ని మా



ముక్కు సుబ్బారెడ్డి

వాదన. దానికి ఆయన 'చూడండి ఆ లక్షణాలు కనిపిస్తున్నాయి నిజమే కానీ పూర్తిగా తేలకముందే ప్రకటించడం తప్పవుతుంది. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీలో రివిజనిస్టు లక్షణాలు 1956లో 20వ మహాసభలలోనే బయటపడినాయి. అయినా మిగతా దేశాల కమ్యూనిస్టులు తమ పార్టీల్లో అంతర్గత పోరాటం చేశారే కానీ వెంటనే రివిజనిస్టుగా ప్రకటించలేదు. 1967లో సోవియట్ యూనియన్ చెకోస్లోవేకియా మీద దాడి చేసిన తరువాతనే దానిని రివిజనిస్టు పార్టీగా ప్రకటించడం జరిగింది. మనం అలాగే వ్యవహరించాల'ని ఎంతో ఓపికగా చెప్పారు.

మేము జూనియర్‌లుగా 'రంగన్న' (ముక్కు సుబ్బారెడ్డి) జీవితం గురించి కథలుగా వినేవాళ్ళం. ఆయనను ఆదర్శంగా చూసేవాళ్ళం. 1973–74లో రాజమండ్రి జైలులో ఉన్న కేజీ సత్యమూర్తి లాంటి నాయకులను జైలు నుండి విడుదల చేయడానికి కొండపల్లి సీతారామయ్య ప్లాన్ రచించారు. దాన్ని సుబ్బారెడ్డి అమలు చేయడానికి తీవ్రమైన కృషి చేశారు. చివరిలో అనుకోకుండా అరెస్టయి ఆయనే జైలుపాలయ్యారు. తీవ్ర చిత్రహింసలకు గురయ్యారు. ఆయన ఎన్నో ప్రమాదాలను కూడా ఎదుర్కొన్నారు. భూస్వాముల దాడులను ఎదుర్కోవడానికి బాంబులు తయారు చేస్తూ ఉండగా ప్రమాదవశాత్తుగా అవి పేలిపోయి, ఆయన ఒళ్ళంతా కాలిపోయింది. జీవితమంతా ఆ కాలిపోయిన మచ్చలే ఉద్యమ జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. వరంగల్‌లో వాళ్ళ కాలేజీ దగ్గరలో ఉన్న బట్టుపల్లి, వడ్డేపల్లి లాంటి గ్రామాలకు కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తిలతో కలిసి సుబ్బారెడ్డి కూడా వెళ్తుండేవారు. ఈ క్రమంలో 1968లో ఒకసారి వడ్డేపల్లి వెళ్లి వస్తుండగా ఒక స్కూటర్ ఆయన్ని గుద్దేసింది. ఈ యాక్సిడెంట్‌లో సుబ్బారెడ్డి తలకు బలమైన గాయం తగిలి జ్ఞాపకశక్తి పోయింది. దానితో కొండపల్లి సీతారామయ్య సుబ్బారెడ్డిని ఇంటికి పంపించారు. కానీ త్వరలోనే కోలుకుని మళ్లీ వచ్చి సీతారామయ్యతో కలిసి పనిచేశారు. బహుశా ఈ యాక్సిడెంట్ ప్రభావం సుబ్బారెడ్డి వయసు పెరుగుతున్న కొలది ఆయన చురుకుదనాన్ని తగ్గించి ఉండవచ్చు. మానసిక స్థితిని కూడా దెబ్బతీసి ఉండవచ్చు అనిపిస్తుంది.

ముక్కు సుబ్బారెడ్డి 1989లో ఉద్యమంలో నుండి వెళ్లిపోవడానికి తీవ్రమైన సిద్ధాంత రాజకీయ విభేదాలు ఏమీ లేవు. కారణాలు ఏమైనా మొత్తానికి ఉద్యమం పట్ల ఆయనకు ఆసక్తి తగ్గింది. క్రమంగా ఇనాక్టివ్ అయ్యి వెళ్ళిపోయారు. ఉద్యమం నుండి బయటికి వచ్చిన తర్వాత కూడా సుబ్బారెడ్డి వ్యక్తిగత జీవితం ఒడుదొడుకులతోనే సాగింది. కొన్ని వ్యాపారాలు చేసినా నష్టపోయారంటారు. మతి స్థిమితం కోల్పోయిన జీవిత సహచరి ఎటో వెళ్ళిపోయింది.


తను కూడా అటువంటి పరిస్థితే ఎదుర్కొన్నారు. కొన్ని రోజులు మాత్రమే అమెరికాలో కొడుకు వద్ద ఉండి, అక్కడ ఇమడలేక తిరిగి వచ్చేశారు. చివరికి వృద్ధాశ్రమానికి చేరుకున్నారు. చివరి రోజుల్లోనూ ఉద్యమాన్నే పలవరిస్తూ వెళ్ళిపోయారు. సుబ్బారెడ్డికి జోహార్లు.

వ్యాసకర్త రాజకీయ విశ్లేషకులు

మనోరక్ష

'రక్షలు రక్షలు పాదరక్షలు... నాట్య శిక్షలో బాల శిక్షలు' అంటూ పాదరక్షల గొప్పతనాన్ని ప్రశంసించే పాత సినిమా పాట ఒకటున్నది. మాయా బజారుల్లో విహరించే వారు మాయా పాదరక్షలు తొడుక్కోగానే అవి 'తోధిమ్మి, తోధిమ్మి' అని నాట్యం చేయిస్తాయట. అడుగేయగానే, 'తైతక్క, తైతక్క ' అని గెంతులు వేయిస్తాయట.

మనం మామూలుగా వాడే పాదరక్షలకు అంతటి మహిమ ఉండకపోయినా, వాటి ఉపయోగం కూడా తక్కువేమీ కాదు. పాదరక్షలు లేక పోతే పాదాల శక్తి సగంలో సగమయినట్టే! అడవుల్లో, కొండల్లో, చేలల్లో, గుట్టల్లో పాదరక్షలు లేకుండా నడవడం ప్రమాదకరం. మన నగరాలలో మరింత ప్రమాదకరం.



భాగవత పురాణంలో పాదరక్షలను ప్రస్తావిస్తూ ఒక చక్కని నీతిని చెప్పే శ్లోకం కనిపిస్తుంది. సప్తమ స్కంధంలో నారదుడు యుధిష్ఠిరుడికి చేసే బోధలో భాగంగా వస్తుంది. 'సదా సంతుష్ట మనసః, / సర్వాః సుఖమయాః దిశః / శర్కరా కంటకాదిభ్యః / యథా ఉపానత్ పదః శివం' (భాగవతం 7– 15– 17). చెప్పులతో సురక్షితమైన పాదం రాళ్ళు రప్పలూ, ముళ్లూ వగైరా బెడదల వల్ల నష్టం లేకుండా ఎలాగయితే క్షేమంగా ఉంటుందో, అలాగే ఎప్పుడూ మనసులో సంతుష్టి కలిగి ఉన్నవాడికి, ఏ దిక్కుగా వెళ్ళినా అన్నీ సుఖమయమైన ప్రదేశాలుగానే ఉంటాయి. సంతుష్టిని మనోరక్షగా ఏర్పరచుకొన్న వాడికి తన చుట్టూ ఉన్న ప్రపంచంలో విషయాలు కామ, క్రోధ, లోభాది వికారాలను కలిగించలేవు. అలాంటివాడు ఎక్కడైనా ఆనందంగానే ఉంటాడు. పాదానికి చెప్పు రక్ష, మనసుకు సంతుష్టి రక్ష.

సంతృప్తి కలవాడి మనసును ఇంద్రియాలు వేధించలేవు. అతగాడు వట్టి నీళ్ళు తాగి కూడా తృప్తిగానే ఉంటాడు. తృప్తి లేని వాడు, 'ఔపస్థ్య, జైహ్వ్య కార్పణ్యాల వల్ల, గృహపాలం లాగా సంచరిస్తుంటాడు' (7–15–17). అంటే లైంగిక వాంఛలూ, తిండిరంధీ మొదలైన ఇంద్రియ చాపల్యాలవల్ల పశుప్రాయంగా ('గృహపాలం' అంటే కాపలి కుక్క) తిరుగుతుంటాడు అన్నారు వేద వ్యాసుడు.

పై శ్లోకంలో 'పాదరక్ష' అన్న మాట ఎక్కడుంది? 'ఉపానత్' అంటే చెప్పు. యథా, ఉపానత్–పదః శివం (ఎలాగయితే చెప్పు ఉన్న పాదం భద్రంగా ఉంటుందో) అన్నారు కదా!

– ఎం. మారుతిశాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.అష్టమి రా.10.40 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** పుబ్బ రా.2.36 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ఉ.8.51 నుండి 10.35 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.30 నుండి 9.18 వరకు తదుపరి రా.10.34 నుండి 11.22 వరకు, **అమృతఘడియలు:** రా.7.27 నుండి 9.15 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.19, **సూర్యాస్తమయం:** 5.20.

తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలపై ఆంక్షలు

- ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకే రాకపోకలకు అనుమతి
- తుపాను నేపథ్యంలో టీటీడీ అధికారుల నిర్ణయం



తిరుమల: తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనదారులపై టీటీడీ ఆంక్షలు విధించింది. తుపాను ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తిరుమల రెండు ఘాట్ రోడ్లలో పొగ మంచు దట్టంగా ఉంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ద్విచక్ర వాహనదారులు తమ ముందున్న వాహనాలు సరిగా కనపడక ఇబ్బందులకు గురవుతున్నారు. తద్వారా వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వర్షాలు తగ్గి సాధారణ స్థితి వచ్చేంతవరకు రెండు ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే అనుమతించనున్నట్టు టీటీడీ తెలియజేసింది. కాగా, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులతో కలిసి సోమవారం ఘాట్ రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్, ఫారెస్ట్, సెక్యూరిటీ తదితర విభాగాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉమ్మడి ఆస్తుల కేసులో విచారణ వాయిదా

వచ్చే ఏడాది మార్చి నెలకు వాయిదా వేసిన 'సుప్రీం' ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తుల విభజనపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ముందుకు సోమవారం విచారణకు రాగా.. వివిధ అంశాల నేపథ్యంలో పిటిషన్‌ను వచ్చే ఏడాది మార్చి నెలకు వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది.

ఢిల్లీ హైకోర్టుకు వెళ్లాలని నిమ్మగడ్డకు 'సుప్రీం' సూచన

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా గందరగోళం, ఎన్నికల విధుల నుంచి వలంటీర్లను తొలగించాలన్న అంశంపై ఢిల్లీ హైకోర్టుకు వెళ్లాలని సిటిజన్ ఫర్ డెమోక్రసీ ప్రతినిధి నిమ్మగడ్డ రమేష్‌కు సుప్రీంకోర్టు సూచించింది. నిమ్మగడ్డ రమేష్ దాఖలు చేసిన పిటిషన్ సోమవారం జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఢిల్లీ హైకోర్టులో ఇప్పటికే ఈ తరహా పిటిషన్ విచారణలో ఉండటం, ఈ తరహా పిటిషన్లు గతంలో ఢిల్లీ హైకోర్టుకు పంపిన నేపథ్యంలో నిమ్మగడ్డ రమేష్ కూడా అవే ఆదేశాలు పాటించాలని ధర్మాసనం సూచించింది. ఈ నేపథ్యంలో పిటిషన్ ఉపసంహరించుకుంటున్నట్టు పిటిషనర్ తరపు న్యాయవాది తెలపగా.. ధర్మాసనం అనుమతించింది.

తిరుమలంటే నాకు సెంటిమెంట్

మీడియాతో సినీ నటుడు నాని



తిరుపతి కల్చరల్: చిన్నతనం నుంచి తనకు తిరుమల అంటే చాలా సెంటిమెంట్ అని, స్వామివారిని దర్శించుకుంటే మనస్సు చాలా ప్రశాంతంగా ఉంటుందని సినీ నటుడు నాని తెలిపారు. ఈ నెల 7వ తేదీన విడుదల కానున్న హాయ్ నాన్న చిత్రాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసిన నాని తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో మీడియాతో సోమవారం మాట్లాడారు. కుటుంబ సమేతంగా కలిసి చూసి ఆనందించే రీతిలో హాయ్ నాన్న చిత్రాన్ని దర్శకుడు శౌర్యవ్ భాగా చిత్రీకరించారన్నారు. ఓ ప్రశ్నకు సమాధానంగా మంచి కథ దొరికితే మల్టీస్టారర్ సినిమాలో నటించడానికి తాను సిద్ధమేనన్నారు. శంకరాభరణం, సాగర సంగమం వంటి సినిమాలు చేసే అవకాశం వస్తే అంత కంటే అదృష్టం ఉండదన్నారు. సరిపోదా.. శనివారం అనే చిత్రంలో త్వరలో నటించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నానితో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు సందడి చేశారు.

ఐదు జిల్లాల్లో దుర్గమ్మ ప్రచార రథయాత్ర

ఈ నెల 6న ప్రారంభం..24న ముగింపు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో ఐదు జిల్లాల్లో ప్రచార రథయాత్ర నిర్వహించేందుకు దేవస్థానం నిర్ణయం తీసుకుంది. శోభకృత నామ సంవత్సర భవానీ దీక్షలను పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దుర్గమ్మ ప్రచార రథయాత్ర అనంతపురం జిల్లా, శ్రీసత్యసాయి జిల్లా, వైఎస్సార్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లా, శ్రీకాకుళం జిల్లాలో సాగనుంది. ఈ మేరకు రూట్‌మ్యాప్‌ను ఆలయ వైదిక కమిటీ నిర్ణయించి ఈవో కె.ఎస్.రామారావుకు అందజేసింది. ప్రచార రథయాత్రలో నిత్యం ఆది దంపతులకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆయా ప్రాంతాల్లో చండీ హోమం, కుంకుమార్చనతో పాటు శాంతి కల్యాణం నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రచార రథ యాత్రపై ఇప్పటికే ఆయా జిల్లాల్లోని గ్రామపెద్దలు, గురు భవానీలు, భక్త సమాజాలకు సమాచారం ఇచ్చారు. ఆయా గ్రామాల్లో గ్రామోత్సవంతో పాటు పలు వైదిక కార్యక్రమాలను నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది.

బస్సు దగ్ధం.. ప్రయాణికుడు సజీవ దహనం

- మృతుడు చీరాలకు చెందిన యువకుడిగా అనుమానం
- ప్రమాద సమయంలో బస్సులో 38 మంది ప్రయాణికులు
- నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై దుర్ఘటన

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణ శివారు నార్కట్‌పల్లి - అద్దంకి రహదారిపై ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం కావడంతో అందులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు సజీవ దహనమయ్యాడు. హైదరాబాద్ నుంచి 38 మంది ప్రయాణికులతో శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు ఆదివారం అర్ధరాత్రి ప్రకాశం జిల్లా చీరాలకు బయలుదేరింది. మార్గమధ్యలో 1:30 గంటలకు నల్లగొండ శివారుకు చేరుకోగానే బస్సులో నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు గమనించి డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో రోడ్డు పక్కన నిలిపాడు. వెంటనే ప్రయాణికులంతా కిందకు దిగారు. ఇంకెవరైనా ప్రయాణికులు బస్సులో నిద్రపోయారేమో గమనించేందుకు డ్రైవర్ అందులోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్న క్రమంలోనే మంటలు దట్టంగా వ్యాపించడంతో కిందకు దిగిపోయాడు. ప్రయాణికుల సమాచారంతో పెట్రోలింగ్ చేస్తున్న నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు ప్రమాద స్థలానికి చేరుకుని, అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చి సహాయక చర్యలు చేపట్టారు. అప్పటికే ప్రయాణికులంతా దాదాపుగా వారి బ్యాగులతో కిందకు దిగి బస్సుకు దూరంగా నిలుచున్నారు. అయితే, ప్రయాణికుల్లో ఓ యువకుడి ఆచూకీ లభించలేదు. బస్ టికెట్ బుక్ చేసుకున్న సమాచారం ఆధారంగా ప్రయాణికుల కుటుంబాలకు ఫోన్ చేసి గమ్యస్థానానికి చేరారా లేదా అన్నది నిర్ధారణ చేసుకున్నారు. అయితే చీరాలకు చెందిన ఒక ప్రయాణికుడు గమ్యస్థానానికి చేరిన విషయమై సమాచారం లేదు. దీంతో సజీవ దహనమైన యువకుడు చీరాలకు చెందిన వ్యక్తేనని అనుమానిస్తున్నారు. ట్రావెల్ బస్సు ఏసీ యూనిట్‌నుంచి పైపు ఊడిపోయి పొగలు రావడమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. ప్రమాదంలో 2 ల్యాప్‌ట్యాప్‌లు, 3 సెల్‌ఫోన్లు, ల్యాండ్ డాక్యుమెంట్లు, ప్రయాణికుల దుస్తుల బ్యాగ్‌లు, ఓ మహిళకు చెందిన కెనడా పాస్‌పోర్టు, కొంత నగదు కాలిపోయాయి.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉప్పలపాడులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ ప్రశాంతి



అన్నమయ్య జిల్లా మదనపల్లెలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ఏలూరు జిల్లా నూజివీడు పట్టణం 13వ వార్డులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



కృష్ణాజిల్లా గూడూరు మండలం కప్పలదొడ్డిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

మరింత సులభంగా జీఎస్టీ సేవలు

జీఎస్టీ సేవా కేంద్రాలతో పారదర్శకమైన సరళీకృత రిజిస్ట్రేషన్ విధానం



జీఎస్టీ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

- పన్ను చెల్లింపులో అక్రమాలకూ అడ్డుకట్ట
- 12 జీఎస్టీ సేవా కేంద్రాలను ప్రారంభించిన ఆర్థిక మంత్రి బుగ్గన
- వాణిజ్యపన్నుల శాఖలో సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయని వెల్లడి
- మంచి పనితీరు కనబర్చిన అధికారులకు పురస్కారాల ప్రదానం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పన్నుల చెల్లింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా సులభతరం చేస్తూ ప్రభుత్వం జీఎస్టీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా పన్ను చెల్లింపుల్లో అక్రమాలకు కూడా అడ్డుకట్ట పడనుంది. రిజిస్ట్రేషన్ విధానాన్ని కూడా సరళీకృతం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 12 సేవా కేంద్రాలను ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. జ్ఞాన క్షేత్రం, కమర్షియల్ టాక్స్ విజన్, మిషన్ వాల్యూస్, 'జీఎస్టీ మిత్ర' లోగోను ఆవిష్కరించారు. ఉత్తమ పనితీరు కనబర్చిన 195 మంది అధికారులు, సిబ్బందికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పన్ను చెల్లింపుదారులకు అనుకూల వాతావరణాన్ని కల్పించేలా రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ చేపడుతున్న సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. సేవా కేంద్రాల ద్వారా వ్యాపార, వాణిజ్య వర్గాలకు ఉత్తమ సేవలు అందుతాయని, జీఎస్టీ ఎగవేతలను అరికట్టవచ్చని చెప్పారు. కొందరు ఇన్‌పుట్ టాక్స్ ఎగవేతకు పాల్పడటం వల్ల రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లుతోందన్నారు. జీఎస్టీ సేవా కేంద్రాల ద్వారా సులువుగా పన్నులు చెల్లించేందుకు, రిజిస్ట్రేషన్లకు ఆస్కారం ఉందని తెలిపారు. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ నమోదు ప్రాజెక్టు ద్వారా నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లను అరికట్టగలుగుతామన్నారు. దేశంలో ఈ సేవా కేంద్రాల పద్ధతి మూడు రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. పన్ను చెల్లించే వారిని దోపిడీదారులుగా కాకుండా వారితో టాక్స్ ఎలా కట్టించాలో ఆలోచించాలన్నారు.

ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజేయ కల్లాం మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖలో పారదర్శకత, సరళతర విధానాలు మంచి ఫలితాలు ఇస్తాయని చెప్పారు. టాక్స్ పేయర్, వాణిజ్య పన్నుల శాఖ సమన్వయంతోనే పారదర్శకత సాధ్యమైందన్నారు. పన్ను చెల్లింపుదారులకు సులభంగా అర్థమయ్యేలా వెబ్‌సైట్ ను తీర్చిదిద్దారని తెలిపారు. పన్ను చెల్లింపుల వ్యవహారంలో ఇతర దేశాల్లో మాదిరి మన రాష్ట్రంలో వేధింపులకు తావు లేదన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ మల్లాది విష్ణు, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, విశాఖ కస్టమ్స్ అండ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్, జీఎస్టీఎన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ధీరజ్ రస్తోగి, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్.గుల్జర్, స్టేట్ టాక్సెస్ చీఫ్ కమిషనర్ ఎం.గిరిజా శంకర్, గుంటూరు సెంట్రల్ టాక్సెస్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ రాబడిలో మొదటి స్థానం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పూర్తి స్వేచ్ఛతో వాణిజ్య పన్నుల శాఖలో పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలందించేలా సంస్కరణలు చేపట్టామని చెప్పారు. నిజాయితీగా పన్నులు కట్టే వారిక సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పన్ను చెల్లింపుదారుల వివరాల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ విధానాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. నవంబర్ నెలలో జీఎస్టీ పన్నుల వసూళ్లలో 31 శాతం వృద్ధి రేటుతో తమిళనాడు (20%), కేరళ (20%), తెలంగాణ (18%), కర్ణాటక (17%), ఒడిశా (3%) కన్నా ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నవంబర్‌నాటికి రూ.21,180.57 కోట్ల జీఎస్టీ వసూలు ద్వారా 90 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. గత ఏడాదితో పోలిస్తే జీఎస్టీ వసూళ్లలో 17.14 శాతం వృద్ధిని నమోదు చేశామన్నారు.

పుణ్యస్నానాలకు వెళ్లి.. ఊబిలో కూరుకుపోయి..

ఇద్దరు మహిళల దుర్మరణం • అనకాపల్లి జిల్లాలో దుర్ఘటన



మంగ, లక్ష్మి మృతదేహాలు

కశింకోట (అనకాపల్లి జిల్లా): పుణ్యస్నానాలకు వెళ్లిన ఇద్దరు మహిళలు ఊబిలో కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయిన ఘటన అనకాపల్లి జిల్లా, కశింకోట మండలంలోని పేరంటాల పాలెం శివారు జోగారావుపేటలో సోమవారం చోటు చేసుకుంది. కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా జోగారావుపేట పక్కనే ఉన్న శారదానదిలో స్నానం ఆచరించడానికి గ్రామానికి చెందిన అరట్ల మంగ (37), మారపురెడ్డి లక్ష్మి (57) మరో ముగ్గురితో కలిసి వెళ్లారు. స్నానం అయ్యాక కార్తీక దీపాలు నదిలో విడిచిపెడుతున్నారు. ఇదే సమయంలో ముందుగా మంగ ఊబిలో పడిపోయి మునిగిపోసాగింది. ఆమెను రక్షించే ప్రయత్నం చేసిన లక్ష్మి కూడా ఊబిలో చిక్కుకుని మునిగిపోయింది. మిగిలిన వారు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి వెలికి తీయగా అప్పటికే ఇద్దరూ మృతి చెందారు. సీఐ ఎ.రవికుమార్ ఆధ్వర్యంలో అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటుకు రూ.కోట్లు కేసు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు రూ.కోట్లు కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కేసు నుంచి తప్పించాలంటూ తెలంగాణ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసిన పిటిషన్ సోమవారం జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. విచారణ వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం, పిటిషనర్ తరపు న్యాయవాదులు కోరడంతో వచ్చే ఏడాది జనవరికి వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం పేర్కొంది.

విద్యార్థిపై నారాయణ యాజమాన్యం దాడి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం కాలూరులోని నారాయణ విద్యా సంస్థలో 8వ తరగతి విద్యార్థిపై యాజమాన్యం విచక్షణా రహితంగా దాడికి పాల్పడింది. ఆ విద్యార్థి తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు నారాయణ విద్యాసంస్థల వార్డెన్, ఉపాధ్యాయులపై తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే....పుంగనూరుకు చెందిన విద్యార్థి కాలూరులోని నారాయణ విద్యా సంస్థలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల హాస్టల్‌లో నగదు కనిపించలేదు. దీంతో ఉపాధ్యాయుడు షబ్బీర్, కొందరు విద్యార్థులు పుంగనూరు విద్యార్థిపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో షబ్బీర్‌తో పాటు మరికొందరు కలిసి ఈ నెల 2న అనుమానిత విద్యార్థిపై దాడికి పాల్పడ్డారు. కర్రలతో విచక్షణారహితంగా కొట్టారు. దీంతో 3న హాస్టల్‌కు వచ్చిన బాధిత విద్యార్థి తండ్రి శేషాద్రిరెడ్డి గాయాలపాలైన కుమారుడిని తిరుపతిలోని రుయా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. తన కుమారుడిపై దాడికి పాల్పడిన ఉపాధ్యాయులు, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.

నేడు కోర్టు సమక్షంలోనే ఎత్తు, ఛాతి కొలతలు

- ఎస్ఐ అభ్యర్థుల నియామకం విషయంలో ఈ మేరకు హైకోర్టు ఉత్తర్వులు
- విచారణ నేటికి వాయిదా



సాక్షి, అమరావతి: కోర్టును ఆశ్రయించిన ఎస్ఐ అభ్యర్థుల ఎత్తు, ఛాతి కొలతలను మంగళవారం తమ సమక్షంలోనే తీసుకుంటామని హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు డిస్పెన్సరీలో పనిచేసే డాక్టర్‌కు ఈ మేరకు ఆదేశాలిచ్చింది. ఎత్తు విషయంలో పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుపై చేసిన ఆరోపణలు అవాస్తవం అని తేలితే కోర్టుకొచ్చిన ఒక్కో అభ్యర్థి ఖర్చుల కింద రూ.లక్ష చెల్లించాలంటూ తాము ఇచ్చిన ఆదేశాలకు అంగీకారం తెలుపుతూ అందరి సంతకాలతో మెమో దాఖలు చేయాలని, మెమో దాఖలు చేస్తేనే తదుపరి విచారణ జరుపుతామని పిటిషనర్ల తరఫు న్యాయవాదికి హైకోర్టు తేల్చి చెప్పింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేంద్ర, జస్టిస్ న్యాపతి విజయ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులిచ్చింది.

19 మంది సిద్ధంగా ఉన్నారు..

ఎస్ఐ నియామక ప్రక్రియలో భాగమైన దేహ దారుఢ్య పరీక్షలకు సంబంధించి ఎత్తు, ఛాతి చుట్టు కొలతను హైకోర్టు ఆదేశాల మేరకు మాన్యువల్ కొలిచిన అధికారులు.. అందులో తమను అనర్హులుగా ప్రకటించారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ ఆరుగొల్లు దుర్గాప్రసాద్ మరో 23 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2018 నోటిఫికేషన్‌లో అర్హులుగా ప్రకటించిన తమను ఎత్తు విషయంలో తాజా నోటిఫికేషన్‌లో అనర్హులుగా ప్రకటించారని పేర్కొన్నారు. వాదనలు విన్న సింగిల్ జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్.. ఎస్ఐ నియామకాల కోసం గత నెలలో నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలను తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు వెల్లడించొద్దంటూ ఇటీవల మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు నియామక బోర్డు.. ధర్మాసనం ముందు అప్పీల్ చేశాయి. ఈ అప్పీల్ సోమవారం విచారణకు రాకపోవడంతో, అభ్యర్థుల తరపు న్యాయవాది ధర్మాసనం ముందు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. ఇందుకు జస్టిస్ నరేంద్ర నేతృత్వంలోని ధర్మాసనం అంగీకరించి సోమవారం మధ్యాహ్నం భోజన విరామం తర్వాత విచారణ జరిపింది. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, హైకోర్టును ఆశ్రయించిన 24 మంది అభ్యర్థుల్లో 19 మంది రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎత్తు, ఛాతి కొలతలకు సంసిద్ధమై వచ్చారని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది(సర్వీసెస్-3) వాదనలు వినిపిస్తూ మధ్యాహ్నం విచారణ గురించి తమకు ఆలస్యంగా సమాచారం ఇచ్చారని కోర్టు దృష్టికి తెచ్చారు. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌తో పాటు ఆరుగురు కమిటీ సభ్యులు కోర్టు ముందు హాజరవుతారని.. విచారణను మంగళవారానికి వాయిదా వేయాలని కోరారు. దీనిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. అయితే ప్రభుత్వ న్యాయవాది విచారణను మంగళవారానికి వాయిదా వేయాలని పలుమార్లు అభ్యర్థించారు. చివరకు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. పిటిషనర్లు ఎత్తు విషయంలో అర్హత సాధించిన పక్షంలో వారికి రిక్రూట్‌మెంట్ బోర్డు నుంచి తగిన విధంగా పరిహారం ఇప్పిస్తూ ఆదేశాలిస్తామని ధర్మాసనం తెలిపింది.

బహుజనులను విస్మరించినందుకే బాబు అడ్రస్ గల్లంతు

1,163వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: ఏపీలో రాజ్యాంగబద్ధంగా బహుజనులకు రావాల్సిన హక్కులను అడ్డుకున్నందుకే గత ఎన్నికల్లో చంద్రబాబు పత్తాలేకుండా పోయాడని బహుజన పరిరక్షణ నాయకులు ధ్వజమెత్తారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 1,163వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అడ్డగోలు రాజకీయాలు చేసిన చంద్రబాబు 14 సంవత్సరాల్లో పేదలను నిరుపేదలుగా మార్చి రాష్ట్రాన్ని కార్పొరేట్ కనుసన్నల్లోకి తీసుకెళ్లాడని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటినుంచి పేదల అభ్యున్నతే లక్ష్యంగా పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారన్నారు. రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల్లో 35 లక్షల ఇళ్ల స్థలాలు, 25 లక్షల ఇళ్లు నిర్మించిన ఘనమైన చరిత్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని చెప్పారు. రాజధాని ప్రాంతంలో పేదలకు జానెడు జాగా ఇస్తుంటే సామాజిక అసమతుల్యత ఏర్పడుతుందంటూ తప్పుడు కేసులు వేయించిన ఘనత చంద్రబాబుదన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికె వరప్రసాద్, పులిదాసు, నూతక్కి జోషి పాల్గొన్నారు.

దంత వైద్య విద్యార్థిని హత్య కేసులో... నిందితుడికి జీవితకాలం కఠిన కారాగార శిక్ష

రూ.6వేలు జరిమానా.. ఏడాదిలోపే తీర్పు

నగరంపాలెం/పెదకాకాని: దంతవైద్య విద్యార్థిని హత్య కేసులో నిందితుడికి జీవితకాలం కఠిన కారాగార శిక్ష, రూ.6 వేలు జరిమానా విధిస్తూ సోమవారం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి తీర్పు వెలువరించినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు... కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన తపస్వి (21) చిన్న అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో బీడీఎస్ తృతీయ సంవత్సరం చదువుతోంది. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం మానికొండకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జ్ఞానేశ్వర్‌తో ఆమెకు ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైంది. తపస్విని ప్రేమ పేరుతో అతను వేధించడంతో విజయవాడలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. జ్ఞానేశ్వర్‌ను పోలీసులు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. అయినప్పటికీ అతను వేధింపులు ఆగలేదు. దీంతో తపస్వి అతని నుంచి తప్పించుకునేందుకు గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడులో తన సహచర విద్యార్థిని రూములో ఉంటోంది. ఈ విషయం తెలుసుకున్న జ్ఞానేశ్వర్ గత ఏడాది డిసెంబర్ ఐదో తేదీ రాత్రి తక్కెళ్లపాడులో తపస్వి ఉంటున్న రూము వద్దకు చేరుకుని సర్జికల్ బ్లేడ్‌తో ఆమె గొంతు కోశాడు. ఆమెను ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందింది. ఈ ఘటనపై పెదకాకాని పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 589/2022 యు/ఎస్ 452, 342, 302, ఐపీసీ (ఎస్సీ నంబర్ 375/ 2023) కింద సీఐ సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు జ్ఞానేశ్వర్‌పై అభియోగపత్రాలను కోర్టులో సమర్పించగా, నేరం రుజువుకావడంతో జీవితకాలం కఠిన కారాగార శిక్ష, రూ.6 వేలు జరిమానా విధించారు. ఏడాదిలోపే నిందితుడికి శిక్ష పడేలా దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ అభినందించారు.

ఆర్టీసీ బస్సు బోల్తా.. ఏడుగురికి గాయాలు



చిలకలూరిపేట టౌన్: ఆర్టీసీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన పల్నాడు జిల్లాలో సోమవారం జరిగింది. హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా బొప్పూడి పరిధిలోని జాతీయ రహదారిపై బొప్పూడి ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో విజయవాడ నుంచి ఒంగోలు వెళ్తున్న ఇంద్రా బస్‌లో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

తెలంగాణ

హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక...

- రైలు కింద పడి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

రామన్నపేట: హాస్టల్ లో ఉండడం ఇష్టంలేక ఓ ఇంటర్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని బోగారం గ్రామంలో ఈ ఘటన జరిగింది. బోగారం గ్రామానికి చెందిన చిల్లర నరసింహ చిన్న కుమారుడు వెంకటరమణ (17) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్‌లో ఉన్న శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే కళాశాల హాస్టల్‌లో ఉంటున్న వెంకటరమణ ఆరోగ్యం బాగోలేక వారం క్రితం ఇంటికి వచ్చాడు. ఆదివారం తిరిగి వెళ్లమని కుటుంబ సభ్యులు చెప్పారు. అయితే కాలేజీకి వెళ్లడం ఇష్టంలేని వెంకటరమణ సాయంత్రం బయటకు వెళ్లాడు. రాత్రి పొద్దుపోయినా అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో రామన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం రామన్నపేట శివారులో రైలు పట్టాల పక్కన బైక్‌ను గమనించి వెళ్లి చూడగా పట్టాలపై వెంకటరమణ మృతదేహం ఉంది. కాలేజీకి వెళ్లి హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక రైలు కింద పడి వెంకటరమణ బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. మృతుడి సోదరుడు మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెళ్లికి ఒప్పుకోలేదని... ప్రేమజంట ఆత్మహత్య

బొంరాస్‌పేట(వికారాబాద్): ప్రేమవివాహానికి కుటుంబసభ్యులు ఒప్పుకోకపోవడంతో ఓ ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా దుద్యాల మండ లం లగచర్లలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... లగచర్ల గ్రామా నికి చెందిన మీనాక్షి(14) తొమ్మిదోతరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మిస్కి న్(21), మీనాక్షి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న ఇరు కుటుంబాల సభ్యులు మందలించారు. మనస్తాపం చెందిన మీనాక్షి, మిస్కిన్ ఆదివారం అ ర్ధరాత్రి గ్రామసమీపంలోని ఓ పొలంలో చెట్టు కు ఉరేసుకొని చనిపోయారు.

గుండె పోటుతో జనగామ జెడ్పీ చైర్మన్ మృతి

జనగామ: జనగామ జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్ రెడ్డి (59) సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం చిల్పూరు మండలం రాజవరం గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డి.. హనుమకొండ జిల్లా కాజీపేట చైతన్యపురిలో నివాసముంటున్నారు. ఉదయం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఆయన, ఆ తర్వాత స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. అనంతరం హనుమకొండకు వెళ్లి పోయారు. ఇంట్లో టీ తాగుతున్న సమయంలో ఒక్కసారిగా కుప్ప కూలిపోగా కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక రోహిణి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ గంటన్నర పాటు వైద్యులు ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. ఆయన మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. సంపత్‌రెడ్డికి భార్య సుజాత, కూతురు సంజనారెడ్డి ఉన్నారు. కుమారుడు ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందాడు.

జూపార్కులో రైనోకు కంటి ఆపరేషన్


బహదూర్‌పురా(హైదరాబాద్): నెహ్రూ జూపార్కులో గత ఆరేళ్లుగా ఎడమ కంట్లో సమస్యతో బాధపడుతున్న 11 ఏళ్ల వయసున్న మగ ఒంటికొమ్ము ఖడ్గమృగానికి (సాయి విజయ్) ప్రభుత్వ వెటర్నరీ వైద్యులు సోమవారం విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ఆరేళ్ల వయసు నుంచి ఎడమ కనుగుడ్డులో సమస్య కారణంగా ఇబ్బంది పడుతున్న ఖడ్గమృగం ఆ నొప్పి తీవ్రం కావడంతో గత ఆరు నెలలుగా విలవిల్లాడుతోంది. దీంతో ఖడ్గమృగానికి శస్త్రచికిత్స చేసే ముందు కంటి నుంచి అన్ని జీవ నమూనాలను సేకరించి రోగ పరీక్షల నిర్ధారణ కోసం మెహిదీపట్నంలోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (వీబీఆర్ఐ)కు పంపారు. వాటి ఫలితాల ఆధారంగా జూపార్కులో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.శంభులింగం, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎం.ప్రవీణ్ కుమార్, సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.రాధాకృష్ణారావు, సిబ్బంది శస్త్రచికిత్స చేసి ఎడమ కనుగుడ్డును తొలగించారు.

మిజోరంలో జెడ్‌పీఎం

27 స్థానాలు కైవసం చేసుకున్న జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్

- అధికార మిజో నేషనల్ ఫ్రంట్‌కు 10 సీట్లు
- బీజేపీకి రెండు.. కాంగ్రెస్‌కు ఒక స్థానం
- ముఖ్యమంత్రి జోరామ్‌తాంగ పరాజయం
- నూతన ముఖ్యమంత్రిగా జెడ్‌పీఎం అధినేత లాలుహోమా త్వరలో ప్రమాణ స్వీకారం

ఐజ్వాల్: ఈశాన్య రాష్ట్రం మిజోరం శాసనసభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీ జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం) సంచలన విజయం సాధించింది. అధికార మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్‌ఎఫ్)ను మట్టికరిపించింది. మొత్తం 40 అసెంబ్లీ స్థానాలకు గాను 27 స్థానాల్లో గెలిచింది. మెజారిటీ మార్కును సులువుగా దాటేసింది. మిజోరం ఎన్నికల్లో సోమవారం ఓట్ల లెక్కింపు నిర్వహించారు. అధికార ఎంఎన్‌ఎఫ్ కేవలం 10 స్థానాల్లో నెగ్గింది. బీజేపీకి రెండు స్థానాలు లభించాయి. కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక్క స్థానంలో గట్టెక్కింది. ఈ ఎన్నికల్లో అధికార ఎంఎన్‌ఎఫ్‌కు దారుణ పరాభవం ఎదురైంది. ఎంఎన్‌ఎఫ్ అధినేత, ముఖ్యమంత్రి జోరామ్‌తాంగ ఓటమిపాలయ్యారు. ఐజ్వాల్ ఈస్ట్–1 స్థానంలో ఆయనపై జెడ్‌పీఎం అభ్యర్థి లాల్‌థాన్‌సాంగ 2,101 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. జెడ్‌పీఎం నేత, ముఖ్యమంత్రి అభ్యర్థి లాల్దుహోమా.. సెర్చిప్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎన్‌ఎఫ్ అభ్యర్థి జె.వాంచ్‌వాంగ్‌పై 2,982 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల్లో పోటీ చేసిన 11 మంది మంత్రుల్లో ఏకంగా 9 మంది పరాజయం పాలయ్యారు. ఉప ముఖ్యమంత్రి తాన్‌లూయాా, ఆరోగ్య శాఖ మంత్రి ఆర్.లాల్‌థాంగ్‌లియానా, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి లాలౌత్‌కిమా, విద్యుత్ శాఖ మంత్రి ఆర్.లాల్‌జిర్లియానా, వ్యవసాయం, నీటిపారుదల శాఖ మంత్రి సి.లాల్‌రిన్‌సంగా, ఆహారం, పౌర సరఫరాల శాఖ మంత్రి కె.లాల్‌రిన్‌లియానా, ఎక్సైజ్ శాఖ మంత్రి లాల్‌రినామా తదితరులు ఓడిపోయారు. పాఠశాల విద్యా శాఖ మంత్రి లాల్‌చాందామా రాల్టే, పర్యాటక శాఖ సహాయ మంత్రి రాబర్ట్ రొమావియా రాయ్‌టే విజయం సాధించారు. మిజోరం నూతన ముఖ్యమంత్రిగా జెడ్‌పీఎం అధ్యక్షుడు లాల్దుహోమా త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నవంబర్ 7వ తేదీన జరిగిన మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్‌ఎఫ్, జెడ్‌పీఎం, కాంగ్రెస్ పార్టీలు మొత్తం 40 స్థానాల్లో పోటీ చేశాయి. బీజేపీ 23 సీట్లలో తమ అభ్యర్థులను బరిలోకి దింపింది. రాష్ట్రంలో తొలిసారిగా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సైతం పోటీ చేసింది. నాలుగు స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు పోటీపడ్డారు. అలాగే 17 మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎన్నికల్లో 'ఆప్' ఖాతా తెరవలేకపోయింది. స్వతంత్రులెవరూ నెగ్గలేదు.



ఇందిరాగాంధీ అంగరక్షకుడు కాబోయే ముఖ్యమంత్రి



పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటుకు గురైన మొట్టమొదటి ఎంపీగా అప్రతిష్ట మూటగట్టుకున్న 73 ఏళ్ల లాల్దుహోమా మిజోరం ముఖ్యమంత్రి కాబోతున్నారు. ఆయన రాజకీయ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురయ్యాయి. అన్నింటినీ తట్టుకొని ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. లాల్దుహోమా ఐపీఎస్ అధికారిగా పనిచేశారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ భద్రతా సిబ్బందికి ఇన్‌చార్జిగా సేవలందించారు. ఆయన నాయకత్వంలో జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం) 2019లో రాజకీయ పార్టీగా ఎన్నికల సంఘం వద్ద నమోదైంది. కేవలం నాలుగేళ్లలో మిజోరం ఎన్నికల్లో అతిపెద్దగా పార్టీగా అవతరించి, అధికారం చేపడుతుండడం విశేషం. లాల్దుహోమా తొలిసారిగా 1984లో కాంగ్రెస్ టికెట్‌పై మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు. కేవలం 846 ఓట్ల తేడాతో పీపుల్స్ కాన్ఫరెన్స్ పార్టీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. అదే సంవత్సరం లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. తర్వాత మిజోరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1986లో ఆ పార్టీకి రాజీనామా చేశారు. అప్పటి ముఖ్యమంత్రి లాల్ థన్హాలాకు, కేబినెట్ మంత్రులకు వ్యతిరేకంగా కుట్ర పన్నినట్లు లాల్దుహోమాపై ఆరోపణలు వచ్చాయి. 1988లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు పడింది. అలాగే 2020లో ఎంఎన్‌ఎఫ్ ఎమ్మెల్యేగా ఉన్న లాల్దుహోమాపై మిజోరం అసెంబ్లీ స్పీకర్ లాల్‌రిన్‌లియానా సాయ్‌లో అనర్హత వేటు వేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడుతున్నారంటూ లాల్దుహోమాపై ఎంఎన్‌ఎఫ్ ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. మిజోరంలో ఈ చట్టం కింద అనర్హతకు గురైన మొదటి ఎమ్మెల్యే లాల్దుహోమా కావడం గమనార్హం. జెడ్ఎన్‌పీ అభ్యర్థిగా 2003లో, 2008లో, 2018లో, 2021లోఎమ్మెల్యేగా ఆయన విజయం దక్కించుకున్నారు.

రాజకీయ యోధుడిని ఓడించిన మూకదాడి బాధితుడు



రాయ్‌పూర్: మత ఘర్షణల్లో కుమారుడిని కోల్పోయి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆ తండ్రి చూపిన ధర్మాగ్రహం.. అక్కడి స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేను ఎన్నికల్లో మట్టికరిపించింది. ఆదివారం వెల్లడైన ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికలు ఈ ఘటనకు సాక్ష్యంగా నిలిచాయి. అసలేం జరిగిందనేది ఓ సారి గమనిస్తే.. బేమేతరా జిల్లా బిరాన్‌పూర్ గ్రామంలో ఈశ్వర్ సాహూ అనే కార్మికుడికి 23 ఏళ్ల భువనేశ్వర్ సాహూ అనే కుమారుడు ఉన్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆ గ్రామంలో జరిగిన మత ఘర్షణల్లో వేరే మతానికి చెందిన అల్లరిమూక భువనేశ్వర్ సాహూను హతమార్చింది. కొడుకును కోల్పోయిన తనకు న్యాయం చేయాలంటూ తమ సాజా నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి రవీంద్ర చౌబేను తండ్రి వేడుకున్నాడు. భూపేశ్ బఘేల్ సర్కార్ తనకు ఎలాంటి న్యాయం చేయలేదంటూ ఈశ్వర్ సాహూ కన్నీరుమున్నీరవడం, ఆయన ఆక్రందన నాడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. హత్య ఘటన తర్వాత హతుడి తల్లినీ అల్లరిమూక బెదిరించింది. హత్యకు నిరసనగా నాడు విశ్వహిందూ పరిషత్ రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. పట్టించుకోని ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలనే సంకల్పంతో ఇతనికి బీజేపీ టికెట్ ఇచ్చింది. ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి సాజా నియోజకవర్గంలో రాజకీయ యోధుడిగా పేరొందిన రవీంద్ర చౌబేకు పోటీగా బరిలో నిలిపింది. ఈశ్వర్ సాహూకు జరిగిన అన్యాయంపై ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహావేశాలు తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్ఫుటంగా కనిపించాయి. రవీంద్ర చౌబే కంటే ఎక్కువ ఓట్లు సాధించి ఈశ్వర్ ఘన విజయం సాధించారు. 'ఈశ్వర్ సాహూ ఒకప్పుడు కార్మికుడు. కానీ ఇప్పుడు ఎమ్మెల్యే. హంతకులకు మద్దతు పలికిన కాంగ్రెస్‌కు ఈశ్వర్ తగిన గుణపాఠం చెప్పారు' అని బీజేపీ ఐటీ విభాగ జాతీయ సమన్వయ కర్త అమిత్ మాలవీయ వ్యాఖ్యానించారు.

మూడు రాష్ట్రాల్లో సీఎంల ఎంపికపై బీజేపీ కసరత్తు!


న్యూఢిల్లీ: రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీజేపీ మూడు రాష్ట్రాల్లో నూతన ముఖ్యమంత్రుల ఎంపికపై దృష్టి పెట్టింది. పార్టీ సీనియర్ నేతలు సోమవారం సమాలోచనల్లో మునిగిపోయారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చర్చలు జరిపారు. ముఖ్యమంత్రుల ఎంపికపై అభిప్రాయాలు పంచుకున్నారు. మూడు రాష్ట్రాల్లో పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత బీజేపీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకోనుంది. ఇందుకోసం అతిత్వరలో మూడు రాష్ట్రాలకు పరిశీలకులను నియమించాలని బీజేపీ పెద్దలు నిర్ణయించినట్లు సమాచారం. కొత్త సీఎంలు ద ఇప్పటివరకైతే అధికారికంగా ఎవరూ నోరు విప్పలేదు. బీజేపీ అధిష్టానం గుంభనంగా వ్యవహరిస్తోంది. మూడు రాష్ట్రాల్లోనూ ఆశావహులు చాలామందే ఉన్నారు. సీఎం పదవే లక్ష్యంగా పార్టీ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో మరోసారి ముఖ్యమంత్రి పీఠం దక్కించుకోవాలని శివరాజ్ సింగ్ చౌహాన్ భావిస్తున్నారు. ఇక్కడ కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ పటేల్, జ్యోతిరాదిత్య సింధియా, నరేంద్రసింగ్ తోమర్‌తోపాటు సీనియర్ నేత విజయ్‌వర్గియా కూడా రేసులో ఉన్నారు. రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లో సీనియర్లను పక్కనపెట్టి అనూహ్యంగా కొత్త ముఖాలను తెరపైకి తీసుకొచ్చే అవకాశాలు లేకపోలేదని బీజేపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాజస్తాన్‌లో మాజీ సీఎం వసుంధర రాజే, ఛత్తీస్‌గఢ్‌లో మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ తమ ప్రయత్నాలు ఆపడం లేదు. రాజస్తాన్‌లో మహంత్ బాలక్‌నాథ్ యోగి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లో అరుణ్ కుమార్ సావో, ధర్మలాల్ కౌశిక్, మాజీ ఏఐఎస్ అధికారి ఓ.పి.చౌదరి సీఎం పోస్టు కోసం పోటీపడుతున్నారు. వీరంతా ఓబీసీ వర్గానికి చెందిన నాయకులే.

ఇందుగలదందులేదని...

- మధ్యప్రదేశ్‌లో బీజేపీ హవా
- అన్ని ప్రాంతాల్లోనూ ఆధిపత్యమే
- ఒక్కచోట కూడా సత్తా చాటని కాంగ్రెస్

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో అధికారాన్ని నిలబెట్టుకున్న బీజేపీ, ఆ క్రమంలో రాష్ట్రంలో దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించింది. మొత్తం ఏడు ప్రాంతాలకు గాను ఒక్క గ్వాలియర్–చంబల్‌లోనే కాంగ్రెస్ కాస్తో కూస్తో పోటీ ఇవ్వగలిగింది. ఆ ప్రాంతాన్ని రెండు పార్టీలు చెరో సగం అన్నట్టుగా పంచుకున్నాయి. మిగతా ప్రాంతాలంతటా కమల సునామీయే అన్నట్టుగా సాగింది. మూడింట రెండొంతుల మెజారిటీతో విజయఢంకా మోగించింది. దాంతో అధికారంపై కాంగ్రెస్ పెట్టుకున్న ఆశలన్నీ అడియాసలే అయ్యాయి.

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాంతాలవారీ ఫలితాలు



ప్రాంతం	స్థానాలు	బీజేపీ	కాంగ్రెస్
వింధ్య	30	24	6
బుందేల్ ఖండ్	26	20	6
గ్వాలియర్ -చంబల్	34	19	15
భోపాల్	20	17	3
మహాకోశల్	47	31	16
మాల్వా	55	40	14
నిమార్	18	12	6

8 శాతం పెరిగిన బీజేపీ ఓట్లు

2018ఎన్నికలతో పోలిస్తే బీజేపీకి పోలైన ఓట్లలో ఏకంగా 8 శాతం పెరుగుదల నమోదైంది! అప్పుడు పార్టీ 41.02 శాతం ఓట్లు సాధించగా ఈసారి దాన్ని 48.55కు పెంచుకుంది. దాంతో మూడింట రెండొంతుల విజయం సాధ్యపడింది. కాంగ్రెస్ ఓటు బ్యాంకులో పెద్దగా మార్పు లేదు. దానికి 2018లో 40.89 శాతం రాగా ఈసారి 40.4 శాతం పోలయ్యాయి. 2018లో కాంగ్రెస్‌కు బీజేపీ కంటే 0.8 శాతం ఓట్లు తక్కువే వచ్చాయి.అయినా బీజేపీకి 109 సీట్లు రాగా కాంగ్రెస్‌కు 114 దక్కాయి!

మాల్వా-నిమార్

ఈ ప్రాంతం 16 జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. మొత్తం 73 స్థానాలు అసెంబ్లీ స్థానాలున్నాయి. వీటిలో 2013 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 57 సీట్లు నెగ్గిన బీజేపీ 2018కి వచ్చేసరికి కేవలం 32 స్థానాలకు పరిమితమైంది. ఈసారి మాత్రం బాగా పుంజుకుని 20 సీట్లను పెంచుకుంది. ఏకంగా 52 స్థానాలను ఒడిసిపట్టింది. ఇక కాంగ్రెస్‌కు 2018లో ఈ ప్రాంతంలో 38 సీట్లొచ్చాయి. ఈసారి మాత్రం కమలం జోరు దెబ్బకు కాంగ్రెస్ 20 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ప్రాంతం నుంచి నెగ్గిన బీజేపీ ప్రముఖుల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి కైలాస్ విజయవర్గీయ తదితరులున్నారు.

గ్వాలియర్-చంబల్

34 అసెంబ్లీ స్థానాలున్న ఈ ప్రాంతంలో మాత్రం బీజేపీ జోరుకు కాంగ్రెస్ కాస్త కళ్లెం వేయగలిగింది. బీజేపీ 19 సీట్లు నెగ్గగా కాంగ్రెస్ కూడా 15 స్థానాలను కైవసం చేసుకుంది. 2018లోనైతే ఆ పార్టీ ఇక్కడ ఏకంగా 26 సీట్లు సాధించింది. ఆ ఎన్నికల్లో మొత్తమ్మీద 114 స్థానాలు సాధించి అధికారంలోకి రావడానికి మాల్వా–నిమార్‌తో పాటు ఈ ప్రాంతంలో అద్భుత ప్రదర్శన ప్రధాన కారణంగా నిలిచింది. ఈ ప్రాంతం కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చిన రాజ వంశీకుడు జ్యోతిరాదిత్య సింధియా కంచుకోట. ఈసారి బీజేపీ బాగా పుంజుకుని మెజారిటీ సీట్లు సొంతం చేసుకోవడానికి, కాంగ్రెస్ చతికిలపడటానికి ప్రధానంగా సింధియా కరిష్మాయే కారణమైంది. ఇక్కడి నుంచి పోటీ పడ్డ ప్రముఖుల్లో కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ విజయం సాధించగా రాష్ట్ర హోం మంత్రి నరోత్తం మిశ్రా మాత్రం ఓటమి చవిచూడటం విశేషం!

బుందేల్‌ఖండ్

26 సీట్లున్న ఈ ప్రాంతంలో బీజేపీ ఏకంగా 20 స్థానాలు కొల్లగట్టింది. గతంతో పోలిస్తే దానికి 6 సీట్లు పెరిగాయి. 2018లో 10 సీట్లు నెగ్గిన కాంగ్రెస్ ఈసారి ఆరింటితో సరిపెట్టుకుంది.

భోపాల్

రాష్ట్ర రాజధానితో కూడిన ఈ ప్రాంతంలో 20 స్థానాలున్నాయి. పరిసర ప్రాంతాలనూ కలుపుకుంటే 36 సీట్లుంటాయి. ఇక్కడ బీజేపీ ఈసారి 31 సీట్లు ఒడిసిపట్టింది. 2018లో ఇక్కడ 12 సీట్లు నెగ్గిన కాంగ్రెస్ ఈసారి ఐదింటితో సరిపెట్టుకుంది. ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నియోజకవర్గం బుధ్నీ ఈ ప్రాంతం కిందికే వస్తుంది. అక్కడినుంచి ఈసారి ఆయన ఏకంగా లక్షా నాలుగు వేల పై చిలుకు ఓట్ల మెజారిటీతో భారీ విజయం సాధించారు.

మహాకోశల్

47 స్థానాలున్న మహాకోశల్‌లో బీజేపీ ఈసారి 31 స్థానాలను ఒడిసిపట్టింది. 2018తో పోలిస్తే అదనంగా 14 సీట్లు నెగ్గింది. అప్పుడు 28 స్థానాలు నెగ్గిన కాంగ్రెస్ ఈసారి 12 సీట్లు పోగొట్టుకుని 16కు పరిమితమైంది. ఇక్కడి నుంచి నెగ్గిన ప్రముఖుల్లో పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ ఉన్నారు. తన కంచుకోట ఛింద్వారా నుంచి ఆయన మంచి మెజారిటీతో గెలుపొందారు. కేంద్ర మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే మాత్రం ఇక్కడి నివాస్ స్థానం నుంచి ఓటమి చవిచూడటం విశేషం. మరో కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ మాత్రం నర్సింగాపూర్ నుంచి విజయం సాధించారు.

వింధ్య

30 అసెంబ్లీ సీట్లున్న ఈ ప్రాంతంలో 2018 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే అచ్చు గుద్దినట్టు పునరావృతమయ్యాయి. బీజేపీ 24 స్థానాలు కైవసం చేసుకోగా కాంగ్రెస్‌కు కేవలం 6 సీట్లు దక్కాయి. ఇక్కడి సత్నా స్థానం నుంచి బీజేపీ ఎంపీ గణేశ్‌సింగ్ ఓటమి చవిచూశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్యం

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్య చికిత్స విధానాన్ని అందుబాటులోకి తేవాలని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ యోచిస్తోంది. ఈ విధానం వచ్చే మూడు, నాలుగు నెలల్లో దేశవ్యాప్తంగా అమలు కానుంది. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్ సోమవారం ఓ కార్యక్రమంలో ఈ విషయం తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక రోడ్డు ప్రమాదాలు మన దేశంలోనే జరుగుతున్నాయని చెప్పారు. మోటారు వాహన చట్టం–2019 ప్రకారం రోడ్డు ప్రమాద బాధితులకు సమీపంలోని ట్రామా కేర్ సెంటర్‌లో ఉచిత, నగదు రహిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు కూడా ఆదేశించిందని ఆయన వివరించారు.

అమెరికాలో కాల్పులు.. అయిదుగురు మృతి

ఆర్చర్డ్స్: అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రం ఆర్చర్డ్స్‌లోని ఓ ఇంట్లో చోటుచేసుకున్న కాల్పుల్లో అనుమానిత షూటర్ సహా అయిదుగురు చనిపోయారు. ఆదివారం మధ్యాహ్నం మృతుల కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి ఫోన్‌కు ఓ అపరిచితుడి నుంచి మెసేజీ అందింది. అతడి కుటుంబసభ్యులకు హాని తలపెట్టినట్లు దాని సారాంశం. దీంతో, ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కాల్పులు జరిగిన ఇంట్లో సాయుధులెవరైనా ఉండి ఉండొచ్చన్న అనుమానంతో పోలీసులు డ్రోన్‌ను పంపించి పరిశీలించగా అయిదు మృతదేహాలు కనిపించాయి. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఓ వ్యక్తి ఇంట్లోని నలుగురిని కాల్చి చంపి, అనంతరం కాల్చుకుని చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది.

గాజాపై దాడుల తీవ్రత పెంచిన ఇజ్రాయెల్

గాజాస్ట్రిప్: హమాస్‌తో కాల్పుల విరమణ గడువు ముగిసిన అనంతరం శుక్రవారం నుంచి దక్షిణ గాజాపై ఇజ్రాయెల్ ఆర్మీ దాడులు కొనసాగుతున్నాయి. హమాస్ నాయకులు, కీలక టన్నెళ్లు, కమాండ్ సెంటర్లు, ఆయుధ డిపోలు తదితర 200 నిర్దేశిత లక్ష్యాలపై దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఖాన్‌యూనిస్‌లోని మరో డజను వరకు ప్రాంతాల ప్రజలను వేరే ప్రాంతాలకు వెళ్లిపోవాలంటూ సోమవారం ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. ఖాన్ యూనిస్– డెయిర్ అల్ బలాహ్ హైవేపైకి రావొద్దని ప్రజలను కోరింది. అది యుద్ధక్షేత్రం మాదిరిగా, అత్యంత ప్రమాదకరంగా ఉందని పేర్కొంది.

శీతాకాలంలో రాజకీయ వేడి

ఎన్నికల నైరాశ్యం సభలో వెళ్లగక్కొద్దు: మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజల సంక్షేమానికి, దేశ ఉజ్వల భవిష్యత్తుకు కట్టుబడి ఉన్న వారికి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం పట్ల అంకితభావం, సుపరిపాలన అందిస్తున్నప్పుడు ప్రభుత్వ వ్యతిరేకత (యాంటీ ఇంకంబెన్సీ) అన్న పదానికి సంబంధం లేదన్నారు. ఎన్నికల వైఫల్యాల నుంచి ప్రతిపక్షాలు గుణపాఠం నేర్చుకోవాలే తప్ప ఓటమి నైరాశ్యాన్ని సభలో వెళ్లగక్కరాదని సూచించారు. ప్రతికూల భావాలను విడిచిపెట్టి ముందుకు సాగాలని, అది వారి పట్ల ప్రజల దృక్పథాన్ని మార్చవచ్చునని తెలిపారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు మోదీ మీడియాతో మాట్లాడారు. ''శీతాకాలం సమీపిస్తుంటే రాజకీయ ఉష్ణోగ్రతలు మాత్రం వేగంగా పెరుగుతున్నాయి. నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు చాలా ప్రోత్సాహకరంగా, ఉత్సాహకరంగా ఉన్నాయి'అని అన్నారు. ''ఫలితాలను చూసి విపక్షాలు ఆందోళన చెందొద్దు. సభలో సహకరించాలని కోరుతున్నా. ద్వేషం, ప్రతికూలతను పక్కనపెట్టి దేశానికి సానుకూల సందేశాన్నివ్వాలి. నిర్మాణాత్మకంగా పనిచేసేందుకు ఈ సమావేశాలు వాటికి సువర్ణావకాశం''అన్నారు.

సమావేశాల తొలి రోజే డిమాండ్లు

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మొదలైన తొలిరోజే విపక్ష సభ్యుల డిమాండ్లు మొదలయ్యాయి. తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరీపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ సభ్యుడు దానిష్ అలీ సోమవారం లోక్‌సభలో డిమాండ్‌చేశారు. సెషన్ మొదలవగానే ఇటీవల మృతిచెందిన సభ్యులకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నివాళులర్పించారు. వెంటనే దానిష్ అలీ మెడలో ' బిధూరీని శిక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అన్న ప్లకార్డు మెడలో వేసుకుని సభలో నినాదాలిచ్చారు. దీనిని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ తప్పుబట్టారు. సభలో ప్లకార్డులు ప్రదర్శించకూడదంటూ అలీ చర్యను తప్పుబట్టిన స్పీకర్ వెంటనే సభను మధ్యాహ్నానికి వాయిదావేశారు.

న్యాయ వృత్తిలో 'దళారి' వ్యవస్థకు చెక్

న్యాయవాదుల వద్దకు కేసులను తీసుకొచ్చి నగదు ప్రయోజనాలు పొందే దళారి(టౌట్) వ్యవస్థపై ఉక్కుపాదం మోపేందుకు ఉద్దేశించిన అడ్వకేట్స్(సవరణ)బిల్లు, 2023కు సోమవారం పార్లమెంట్ ఆమోదముద్ర వేసింది. దళారులకు ఈ చట్టం కింద ప్రతిపాదించిన శిక్షలు అత్యల్పంగా ఉన్నాయని, వాటిని కఠినతరం చేయాలని కొందరు సభ్యులు డిమాండ్ చేశారు.

వర్డ్ ఆఫ్ ది ఇయర్.. రిజ్



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఎక్కువగా పాపులర్ అయిన 'రిజ్(ఆర్‌ఐజెడ్‌జెడ్) పదాన్ని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్(ఓయూపీ) 2023 ఏడాదికి 'వర్డ్ ఆఫ్ ది ఇయర్'గా సోమవారం ప్రకటించింది. రిజ్ అనే పదానికి అనేక అర్థాలున్నాయి. స్టైల్, ఆకట్టుకునే గుణం, సరసం కోసం భాగస్వామిని ఆకట్టుకునే ఒడుపు, ఛాటింగ్ .. ఇలా అనేక అర్థాల్లో రిజ్ పదాన్ని వాడుతున్నారు. వాస్తవానికి ఛరిష్మా అనే పదం పొట్టిరూపమే రిజ్'' అని ఓయూపీ అభివర్ణించింది. ఛరిష్మా పదం ఉచ్చారణ 'ఛ,రిజ్,మా'లోని మధ్య పదం రిజ్‌ను తీసుకుని ప్రపంచవ్యాప్తంగా ప్రజలు దీనిని వారి మాటల్లో, రాతల్లో, భావాల్లో విరివిరిగా వాడుతున్నారు'' అని ఓయూపీ తెలిపింది. సిట్యుయేషన్‌షిప్, స్విఫ్టీ, బీగీ ఫ్లాగ్, డీ–ఇన్‌ఫ్లూయెన్సింగ్, పారాసోషియల్, హీట్‌డోమ్, ప్రాంప్ట్ అనే పదాలు.. 'ఈ ఏడాది పదం' కిరీటం కోసం పోటీపడ్డాయి. దాదాపు 1900 కోట్ల పదాల డేటాలో అత్యధికంగా ఈ ఏడాది వాడిన పదాలను షార్ట్‌లిస్ట్ చేసి చివరకు ఎనిమిది పదాలను ఓయూపీ నిపుణులు విశ్లేషించి ఈ పదానికి పట్టంకట్టారు.

వందల కోట్ల వ్యూస్

''రి'ఫ్రిజ్'రేటర్ నుంచి ఫ్రిజ్ పదాన్ని, ఇన్'ఫ్లూ'యెంజా పదం నుంచి ఫ్లూ పదాన్ని సృష్టించినట్లే రిజ్‌ను నూతన జెడ్ తరం సృష్టించి తరచూ వాడుతోంది. నవతరం తమ భావ వ్యక్తీకరణ కోసం భాషను, పదాలను తమకు అనుగుణంగా మార్చేస్తున్నారు. ముఖ్యంగా గేమింగ్, ఇంటర్నెట్ సంస్కృతిలో మునిగితేలే టీనేజర్లు ఇలా కొత్త కొత్త పదాలను కనిపెడుతున్నారు. తొలిసారిగా టిక్‌టాక్‌లో ఈ రిజ్ పదంతో హ్యాష్‌ట్యాగ్ మొదలైంది. వందల కోట్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. రిజ్‌ను ఈ తరం వారు కర్తగా, క్రియగా ఎలాగంటే అలా తమకు నచ్చినట్లు వాడుకుంటున్నారు'' అని ఆక్స్‌ఫర్డ్ లాంగ్వేజెస్ విభాగ అధ్యక్షుడు కాస్పర్ గ్రాథ్‌ఓల్ వ్యాఖ్యానించారు.

సాయుధ బలగాల్లోకి మహిళలు రావాలి



మల్వాన్(మహారాష్ట్ర): సాయుధ బలగాల్లో మహిళల సంఖ్యను పెంచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ చెప్పారు. భారత నేవీలోని అధికార హోదాలకు దేశ సంస్కృతిని ప్రతిబింబించేలా పేర్లు మారుస్తామని అన్నారు. అదేవిధంగా, నావికాదళ అధికారులు అలంకరించుకునే ఆప్లెట్లు ఇకపై ఛత్రపతి శివాజీ ప్రతిబింబం కలిగి ఉంటాయని చెప్పారు. మహారాష్ట్రలోని కోస్తా ప్రాంతంలో ఉన్న సింధుదుర్గ్ జిల్లా మల్వాన్‌లో సోమవారం నేవీ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఛత్రపతి శివాజీ మహరాజ్‌కు నివాళులర్పించారు. నావికా శక్తి ప్రాధాన్యతను 17వ శతాబ్దంలోనే గుర్తించిన శివాజీ దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆధునిక నావికా దళాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా బానిసత్వ భావనను విడనాడి, నేడు దేశం అన్ని రంగాల్లోనూ ముందుకు దూసుకెళుతోందని చెప్పారు. ప్రపంచం నేడు భారత్‌ను విశ్వ మిత్రుడిగా భావిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా తర్కలి బీచ్‌లో నేవీ షిప్పులు, సబ్‌మెరీన్లు, ఎయిర్‌క్రాఫ్ట్, ప్రత్యేక బలగాల 'కార్యాచరణ సన్నద్ధత'ను తిలకించారు. అంతకుముందు ఆయన సింధుదుర్గ్ జిల్లాలోనే ఉన్న రాజ్‌కోట్ కోటలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

ఎక్కువ మందిని కనండి: కిమ్



సియోల్: దేశాన్ని బలోపేతం చేయాలంటే జననాలను పెంచటం మహిళల విధి అని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ చెప్పారు. ఆదివారం జరిగిన నేషనల్ మదర్స్ సమావేశంలో కిమ్ ప్రసంగిస్తూ ఎక్కువ మంది పిల్లలను కనాలని మహిళలకు పిలుపునిచ్చారు. జననాల రేటు క్షీణతను అడ్డుకోవడం, చిన్నారుల సంరక్షణ, విద్య అనేవి తల్లుల వల్లే సాధ్యమవుతాయని చెప్పారు. దేశ జనాభా గణాంకాలను ఉత్తరకొరియా ప్రభుత్వం బహిర్గతం చేయడం లేదు. అయితే, అక్కడ గత పదేళ్లుగా జననాల రేటు తగ్గుతూ వస్తోందని పొరుగు దేశం దక్షిణ కొరియా అంటోంది. పిల్లల పెంపకం, చదువు చెప్పించడం వంటివి చాలా ఖరీదైన వ్యవహారంగా మారడంతో ఉత్తర కొరియాలోని చాలా కుటుంబాలు ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనేందుకు సిద్ధంగా లేరని పరిశీలకులు అంటున్నారు. దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు కార్మికుల సమీకరణపై ఆధారపడే ఆ దేశానికి ఈ పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.

ఎంపీ చద్దాపై సస్పెన్షన్ ఎత్తివేత



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఎంపీ రాఘవ్ చద్దా మీడియాకు తప్పుదోవ పట్టించే సమాచారం అందించారని రాజ్యసభ ప్రివిలేజెస్ కమిటీ ధ్రువీకరించింది. ప్రతిపాదిత ఎంపిక ప్యానెల్‌లో అనుమతి లేకుండా కొందరి సభ్యుల పేర్లను చేర్చడంపైనా ఆయన్ను దోషిగా తేల్చింది. రాఘవ్ చద్దాపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిన ప్రివిలేజెస్ కమిటీ నివేదికను సోమవారం కమిటీ సభ్యుడు ఎలమారం కరీం రాజ్యసభ ముందుంచారు. అనంతరం చద్దాపై సస్పెన్షన్‌ను ఎత్తివేసేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనను బీజేపీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సభలో ప్రవేశపెట్టారు. రాఘవ్ చద్దాపై మోపిన అభియోగాలకు ఇప్పటి వరకు ఆయనపై కొనసాగిన సస్పెన్షన్ శిక్ష సరిపోతుందని ఆయన పేర్కొన్నారు. ఈ తీర్మానం మూజువాణి ఓటుతో సభ ఆమోదం పొందింది. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ..గౌరవ సభ్యుడు రాఘవ్ చద్దా సభా ఇక కార్యకలాపాల్లో పాల్గొనవచ్చని చెప్పారు. పై రెండు అభియోగాలపై పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఎగువ సభ ఆగస్ట్ 11వ తేదీ నుంచి చద్దాపై సస్పెన్షన్ విధించింది.

ఇండోనేసియాలో బద్దలైన అగ్నిపర్వతం



పడాంగ్: ఇండోనేసియాలో మరపీ అగ్నిపర్వతం బద్దలైన ఘటనలో 11 మంది పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయారు. 12 మంది జాడ తెలియాల్సి ఉంది. ఆదివారం ఈ ఘటన జరిగింది. 'క్రియాశీలకంగా ఉన్న మౌంట్ మరపీ బిలం వైపుగా మూడు కిలోమీటర్ల సమీపంలోకి వెళ్లకూడదని పర్వతారోహకులు, గ్రామస్తులను గతంలోనే హెచ్చరించాం. అయినా సరే వినకుండా శనివారం దాదాపు 75 మంది పర్వతారోహకులు అటువైపుగా 'హద్దులు' దాటి పర్వతారోహణ మొదలెట్టారు. ఆచూకీ గల్లంతైన వారి జాడ కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాం'' అని వోల్కనాలజీ, జియోలాజికల్ కేంద్రం అధిపతి హెంద్రా గునవాన్ చెప్పారు. 2,900 మీటర్ల ఎత్తయిన మరపీ అగ్నిపర్వతం 2011 ఏడాది నుంచి క్రియాశీలకంగా ఉంది. నాలుగు తీవ్రస్థాయి హెచ్చరికల్లో మూడో లెవల్ ప్రమాద హెచ్చరికను అధికారులు గతంలోనే ప్రకటించారు. ఆదివారం అగ్నిపర్వతం బద్దలై భారీ స్థాయిలో లావా బయటికొచ్చి ధూళి 3,000 మీటర్ల ఎత్తుకు ఆకాశంలోకి ఎగసిపడింది. అదే సమయంలో పర్వతారోహకులు అటుగా వెళ్లడంతో ప్రమాదం బారిన పడ్డారు. వెంటనే హుటాహుటిన సహాయక బృందాలు గాలింపు చేపట్టి సోమవారం 11 మృతదేహాల జాడ కనిపెట్టాయి. మరో 12 మంది జాడ తెలియాల్సి ఉంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 5 డిసెంబర్ : 2023



వెలవెల
నిత్యం రద్దీగా ఉండే బెంగళూరు విధానసౌధ బోసిపోయిన దృశ్యం. అందరూ బెళగావి అసెంబ్లీకి వెళ్లడమే కారణం

బెళగావిలో అసెంబ్లీ షురూ

- తొలిరోజు దివంగత ప్రముఖులకు సంతాపం
- పలు అంశాలపై చర్చలు



అసెంబ్లీలో సీఎం సిద్దరామయ్య



సోమవారం బెళగావి అసెంబ్లీలో.. విధానసభలో చర్చ దృశ్యం

శివాజీనగర: శీతాకాల అసెంబ్లీ సమావేశాలు బెళగావి నగర శివార్లలోని సువర్ణసౌధ భవనంలో సోమవారం ప్రారంభమయ్యాయి. నెలరోజులుగా ఇక్కడ సమావేశాల కోసం ముమ్మర ఏర్పాట్లు జరిగాయి. ఉభయ సభాపతులు, సీఎం సిద్దరామయ్య, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అన్ని శాఖల ఉన్నతాధికారులతో పాలనా యంత్రాంగం సరిహద్దు నగరికి చేరుకొంది. మరాఠా సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు ముట్టడించకుండా అసెంబ్లీ పరిసరాల్లో వేలాది పోలీసులను మోహరించారు. ఉదయం సజావుగా అసెంబ్లీ ప్రారంభమైంది. ఇటీవల పరమపదించిన మాజీ ఎమ్మెల్యేలకు బెళగావి విధానసభలో శ్రద్ధాంజలి ఘటించారు. ఆరంభంలో స్పీకర్ యూటీ ఖాదర్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. శ్రీరంగదేవరాయులు, సీ.వెంకటేశప్ప, శ్రీకాంత్ శెట్టప్ప, పీబీ ఆచార్య తదితరుల సేవలను కొనియాడుతూ అంజలి ఘటించారు. డీబీ చంద్రేగౌడ చిక్కమగళూరు జిల్లా నుంచి వచ్చిన న్యాయవాది, రాజకీయ నేత, నటుడు అని కొనియాడారు. సీఎం సిద్దరామయ్య, మంత్రులు, బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ తదితరులు నిమిషం పాటు మౌనం పాటించారు. ఆపై పలు అంశాలపై స్వల్పకాల చర్చలు మొదలయ్యాయి.

మాతృభాష బిల్లుకు కేంద్రం తిరస్కృతి



రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో ఒకటి నుండి ఐదో తరగతి వరకు విద్యార్థులకు మాతృభాషను, రాష్ట్ర భాషను విద్యా మాధ్యమంగా తప్పనిసరి చేసే బిల్లును కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది, 2015లో రాష్ట్ర అసెంబ్లీలో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు మాతృభాష, లేదా రాష్ట్ర భాషను విద్యా మాధ్యమంగా తప్పనిసరి చేసి పంపించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. మాతృభాషను తప్పనిసరి చేయడమనేది విద్య మూలభూత హక్కుల ఉల్లంఘన అవుతుందని తిప్పిపంపిందని పాఠశాల విద్య, సాక్షరతా మంత్రి మధు బంగారప్ప తెలిపారు. సోమవారం విధాన పరిషత్‌లో ప్రశ్నోత్తరాల సమయంలో యూ.బీ.వెంకటేశ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన మంత్రి, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా రాష్ట్ర ఈ ముసాయిదాని మౌలిక హక్కుల ఉల్లంఘన అంటూ కేంద్ర విద్యాశాఖ తిరస్కరించిందని తెలిపారు.

భాషను కాపాడుకోకపోతే ఎలా?

1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న పాఠశాల పిల్లలకు కన్నడను ఒక భాషగా, లేదా మాతృభాషగా తప్పనిసరి చేయడం ఈ బిల్లు లక్ష్యమని వెంకటేశ్ అన్నారు, పిల్లలకు కన్నడ నేర్పేందుకు ప్రాధాన్యత ఇవ్వకపోతే ఎలా? రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాన్ని వెతుక్కోవాలని సలహానిచ్చారు. గత ఎనిమిది సంవత్సరాల నుండి ఈ ముసాయిదాకు అనుమతి లభించలేదు. రాష్ట్రంలోని ఎంపీలు, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. భాషను కాపాడుకోవటం చాలా ముఖ్యమని అన్నారు. బలవంతంగా హిందీని రుద్దితే ఆమోదించబోమని మంత్రి ఒక ప్రశ్నకు స్పష్టం చేశారు.

మంత్రుల గైర్హాజరుపై ఆగ్రహం

అసెంబ్లీ సమావేశాల్లో మొదటిరోజునే ఆరు మంత్రులు ముఖం చాటేశారు. దీంతో విధాన పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావించిన ఆయన, ఆరు మంత్రి మంత్రులు గైర్హాజరయ్యారు. ముందే నిర్ణయించిన కార్యక్రమాలు ఉన్నందున రావడానికి సాధ్యపడదని లేఖను కూడా పంపారు. ఇది మంచి పద్ధతి కాదు. సభా నాయకుడు బోసురాజు వివరణ ఇవ్వాలని సభాపతి ఆదేశించారు. ఈ సమయంలో ప్రతిపక్ష సభ్యులు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల కంటే ఇతర కార్యక్రమాలు ముఖ్యమా? మంత్రులు లేకపోతే ఆయా సమస్యలకు సమాధానం ఎవరిస్తారు? అన్నింటికీ సభా నాయకుడే స్పందించడం మంచిది కాదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

క.క.లో ఉద్యోగాల భర్తీకి హామీ

శివాజీనగర: కళ్యాణ కర్ణాటక ప్రాంతంలో విద్యాశాఖ లో ఉన్న ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేస్తామని పాఠశాల విద్యా, సాక్షరతా మంత్రి మధు బంగారప్ప బెళగావి విధానపరిషత్‌లో తెలిపారు. ఇక్కడి ప్రాథమిక పాఠశాలల్లో 45,535 ప్రాథమిక ఉపాధ్యాయులు, 11,724 ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, 1369 గ్రూప్ డీ ఉద్యోగాలు, 3,323 బోధకేతర సిబ్బందితో పాటుగా 61,891 మంది సిబ్బంది పని చేస్తున్నారు. 16 వేల మంది ఉపాధ్యాయులను పర్మినెంట్ చేశామన్నారు. సభ్యుడు శశిల్ నమోశి మాట్లాడుతూ మండ్య, మైసూరు భాగాల్లో ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారని, ఉత్తర కర్ణాటకలోనూ ఎక్కువమంది అవసరం కదా? అని ప్రశ్నించారు.

న్యూస్‌రీల్

భవాని ఉగ్రరూపం

- బైకిస్టుకు కొడుకు, భర్త క్షమాపణలు



బైకిస్టుతో వాదిస్తున్న భవాని

యశవంతపుర: మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ కోడలు భవాని రేవణ్ణ ప్రయాణిస్తున్న కారు బైకును ఢీకొంది. రౌద్రరూపం దాల్చిన భవాని బైకిస్టును దూషించారు. వివరాలు.. ఆదివారం మైసూరులో భవాని చాలా ఖరీదైన కారులో వెళ్తుండగా ఒక బైకిస్టును ఢీకొంది. కారు దెబ్బతింటే ఎవడు మరమ్మతులు చేయిస్తాడని ఆమె మండిపడ్డారు. ఆ వీడియో వైరల్ అయ్యింది. నెటిజన్లు భవాని తీరుపై మండిపడ్డారు.

మా అమ్మది తప్పే: సూరజ్

మా అమ్మ బైకిస్టును తిట్టడం తప్పేనని ఆమె కుమారుడు, ఎమ్మెల్సీ సూరజ్ స్పందించారు. బైకిస్టు మద్యం తాగి నడపడం వల్ల ప్రమాదం జరిగింది. మా అమ్మ అసభ్య పదాలతో తిట్టడం తప్పే. నేను క్షమాపణలు కోరుతున్నట్లు తెలిపారు. గాయాలైన బైకిస్టును ఆస్పత్రిలో చేర్పామన్నారు. భవాని భర్త రేవణ్ణ మాట్లాడుతూ తాము బాధపెట్టి ఉంటే క్షమించాలని కోరారు.

కాంగ్రెస్‌కు ఓటమి శోకం: అశోక్

శివాజీనగర: ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలనలో దేశం, మతం భద్రంగా ఉంటుంది. అభివృద్ధి పథంలో సాగుతామని బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ అన్నారు. సోమవారం బెళగావి సువర్ణసౌధలో మాట్లాడిన ఆయన, మూడు రాష్ట్రాల్లో ఓటమిపై కాంగ్రెస్‌వారు మాట్లాడటం లేదు. తెలంగాణలో గెలిచామని చెప్పుకుంటూ రిసార్టు రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దేశానికి మోదీ అనివార్యమని ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఈ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ శోకంలో ఉంది. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపు సాధించి మోదీ మరోసారి ప్రధాని అవుతారన్నారు.

కుమారపై లోకాయుక్తకు ఫిర్యాదు

యశవంతపుర: విధానసభ ఎన్నికల అఫిడవిట్‌లో సంపూర్ణ సమాచారం ఇవ్వలేదని జేడీఎస్ నేత, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామిపై లోకాయుక్తలో ఫిర్యాదు నమోదైంది. సామాజిక కార్యకర్త సీఎస్ సిద్దరాజు ఆయనపై ఫిర్యాదు చేశారు. 2004 విధానసభ ఎన్నికల అఫిడవిట్‌లో కేతనగానహళ్లిలోని 24 ఎకరాల భూమి ఉన్నట్లు చూపించారు. ఆ భూమిని పిన్నమ్మ దానంగా ఇచ్చినట్లు తెలిపారు, ఆమెకు అంత భూమి ఎలా వచ్చిందో తెలియజేయాలని సిద్దరాజు డిమాండ్ చేశారు. అలాగే బెంగళూరు జేపీనగరలో ఇంటిని కొనుగోలు చేసినట్లు అఫిడవిట్‌లో తెలిపారని, పార్టీ నేత కుపేంద్రరెడ్డి నుంచి రూ.9.50 కోట్లు అప్పు తీసుకున్నట్లు తెలిపారని, వీటన్నింటిపై అనుమానాలు ఉన్నాయన్నారు.

మరో నర్సు అరెస్టు



నర్సు ఉషారాణి

యశవంతపుర: రాష్ట్రంలో సంచలనం కలిగించిన భ్రూణ హత్యల కుంభకోణంలో మరో నర్సును బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. మైసూరులో ఉషారాణిని అరెస్ట్ చేయడంతో ఇప్పటివరకు అరెస్టయిన నిందితుల సంఖ్య 11కు చేరింది. మూడురోజుల క్రితం పట్టుబడిన నర్సు మంజుళ ఇచ్చిన సమాచారంతో ఉషారాణిని అదుపులోకి తీసుకున్నారు. తాము మైసూరులో ఆయుర్వేద ఆస్పత్రి ముసుగులో అబార్షన్ల దందా నిర్వహించేవారమని తెలిపారు.

రైతులకు మంచి వార్త రావాలి: విజయేంద్ర

శివాజీనగర: బెళగావి అసెంబ్లీ సమావేశాల్లో రైతులకు ప్రభుత్వం నుంచి తీపి వార్త వస్తుందని ఆశిస్తున్నట్లు బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర అన్నారు. రాష్ట్రంలో కరువు నెలకొంది, ప్రజలు కరువు కష్టాల్లో ఉన్నారు. అందుచేత రైతులు, ఉత్తర కర్ణాటక ప్రజలు అందరూ ప్రభుత్వం నుంచి సహాయం కోసం వేచి ఉన్నారన్నారు. కాంగ్రెస్ సర్కారు ఎంతో చేస్తుందని ప్రజలు నిరీక్షిస్తున్నారన్నారు. కరువు గురించి తాము అసెంబ్లీలో లేవనెత్తుతామన్నారు. ప్రభుత్వం సమాధానం ఇచ్చేలా చేస్తామన్నారు. కాగా, బెళగావిలో విజయేంద్రకు బీజేపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. క్రేన్ ద్వారా భారీ గజమాలను వేశారు. పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

తొలిరోజే నిరసనల వేడి

- బెళగావిలో ధర్నాల జోరు



సోమవారం బెళగావిలోని చెన్నమ్మ కూడలిలో రైతుల నిరసన

శివాజీనగర: బెళగావిలో ప్రశాంత వాతావరణంలో అసెంబ్లీ సమావేశాలను జరపాలని సభాపతులు గట్టి ప్రయత్నాలు చేయడం తెలిసిందే. అయితే తొలిరోజే రైతులు భారీఎత్తున ధర్నా నిర్వహించి చురుకు ముట్టించారు. కరువు నియంత్రణలో విఫలం, వ్యవసాయ చట్టం రద్దు, చెరుకు రైతుల డిమాండ్లు తదితరాలతో రాష్ట్ర రైతు సంఘం నేత కోడిహళ్లి చంద్రశేఖర్ నేతృత్వంలో పెద్దసంఖ్యలో రైతులు బెళగావికి వచ్చారు. రాణి చెన్నమ్మ సర్కిల్ నుంచి ర్యాలీ చేపట్టి సువర్ణసౌధను ముట్టడించాలని ర్యాలీగా బయల్దేరారు. అంతలోనే పోలీసులు వారిని అడ్డుకొన్నారు.

పలు సంఘాల ధర్నాలు

వివిధ సంఘాలు కూడా తమ కోర్కెలతో ధర్నాలు జరిపాయి. ముండ్రగి తాలూకా ప్రజా పోరాట వేదిక నేతలు గదగ- హరపనహళ్లి రైలు మార్గం మంజూరు, గదగ జిల్లాలో బగర్ హుకుం హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. సఫాయి కర్మచారి సమితి సభ్యులు తమ సమస్యలను పరిష్కరించాలని ఆందోళనకు దిగారు. దివ్యాంగుల పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సేవా భద్రత కల్పించాలని ధర్నాలు చేయడంతో అసెంబ్లీ వద్ద సందడి నెలకొంది.

కెప్టెన్ అర్జున వీరమరణం

- హాసన్ జిల్లాలో అడవి ఏనుగు దాడిలో మృతి
- 22 సార్లు మైసూరు దసరా వేడుకల్లో హాజరు
- 8 సార్లు బంగారు అంబారీ మోసిన గజం



దసరా ఉత్సవాలలో కెప్టెన్ అర్జున (ఫైల్)



ఘటనాస్థలిలో అర్జున కళేబరం

మైసూరు: ప్రపంచ ప్రసిద్ధి చెందిన మైసూరు దసరా వేడుకల్లో సుమారు 8 సార్లు చాముండేశ్వరి అమ్మవారి అంబారీని మోసి, జంబూసవారిని ముందుండి నడిపించిన కెప్టెన్ అర్జున అనే గజరాజు కథ విషాదాంతమైంది. సోమవారం అడవి ఏనుగు జరిపిన దాడిలో అర్జున తీవ్ర గాయాలతో వీరమరణం పొందింది. హాసన్ జిల్లాలోని సకలేశపుర తాలూకాలోని ఎసళూరు దగ్గర అడవి ఏనుగులు అల్లర్లకు పాల్పడుతున్నాయి. దీంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అటవీ సిబ్బంది వాటిని తరిమికొట్టే ప్రయత్నాల్లో ఉన్నారు. సోమవారం వాటిని నియంత్రించడానికి అర్జునను తీసుకెళ్లి గాలింపు జరుపుతుండగా ఓ అడవి ఏనుగు అర్జునపై దాడి చేసింది. పోరాటంలో తీవ్ర గాయాలైన అర్జున తుదిశ్వాస విడిచింది.

అర్జున ఘన చరిత

- సుమారు 64 సంవత్సరాల వయసు ఉన్న అర్జున మైసూరు జిల్లాలోని నాగరహొళె అరణ్యంలోని బళ్లె శిబిరంలో ఉంటుంది.
- సుమారు 22 సంవత్సరాల పాటు మైసూరు దసరా వేడుకల్లో పాల్గొన్న అర్జున ఏనుగు 8 సార్లు బంగారు అంబారీని మోసి ఉత్సవాల్లో ప్రముఖ పాత్ర పోషించింది.
- యుక్తవయసులో ఉన్నప్పుడు అర్జున అటవీ సిబ్బందికి పట్టుబడిన కట్టెపుర దగ్గర యసళూరులోనే కన్నుమూయడం విశేషం.
- ప్రస్తుతం అంబారి మోయకున్నా కూడా మైసురు దసరా వేడుకల్లో పాల్గొనేది. అనేక పులులు, అడవి ఏనుగులను పట్టుకోవడంతో శ్రమించింది. అర్జున మృతితో బళ్లె శిబిరంలోను, అటవీ సిబ్బందిలో ఆవేదన నెలకొంది. పోస్టుమార్టం అనంతరం లాంఛనాలతో ఖననం చేశారు.



మూడు యాక్సిడెంట్లలో..ముగ్గురు మృతి

బనశంకరి: బెంగళూరు నగరంలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

- ఎలక్ట్రానిక్‌సిటీ ఫస్ట్ స్టేజ్‌లో వెంకటేశ్ (29) అనే యువకుడు స్నేహితులతో కలిసి లగ్గెరెకు వేగంగా వెళుతుండగా డివైడర్‌కు ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడి చనిపోయాడు.
- తలఘట్టపుర ట్రాఫిక్ పీఎస్ పరిధిలో.. అంజనాపుర రోడ్డు వద్ద బసవరాజ్ బస్సు డ్రైవింగ్ చేస్తూ నియంత్రణ తప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతనిని రాజరాజేశ్వరినగర ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి నిమ్హాన్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో అభిషేక్ అనే యువకుడు మరణించాడు. ఇతడు ఓలా క్యాబ్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం కెంపేగౌడ విమానాశ్రయానికి బైకులో వెళుతున్న అభిషేక్‌ను బళ్లారి రోడ్డులో లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాధితుడు అక్కడే మృత్యువాత పడ్డాడు.

మాజీ ఎంపీపై సీబీఐ కేసు

యశవంతపుర: నకిలీ దాఖలాలు సృష్టించి రూ.12.48 కోట్ల రుణం తీసుకుని చెల్లించని కేసులో మాజీ ఎంపీ ఎల్ఆర్ శివరామేగౌడతో పాటు ఆయన కుటుంబానికి చెందిన ఏడుమందిపై సీబీఐ కేసు నమోదు చేసింది. బెంగళూరు ఎంజీ రోడ్డులోని పీఎన్‌బీ బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గౌడ, ఆయన భార్య, కొడుకు, కోడలు మరికొందరిపై కేసు నమోదైంది. నిందితులు నకిలీ పత్రాలు చూపి రుణం తీసుకోవడంతో పాటు, చెల్లించలేదని తెలిపారు.

మాజీ మంత్రి బావ హత్య

- మండ్యలో 1న అపహరణ



చామరాజనగర వద్ద లభ్యమైన కారు, (ఇన్‌సెట్‌లో) మహదేవయ్య (ఫైల్)

దొడ్డబళ్లాపురం: కిడ్నాప్‌కి గురైన మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ బావ మహదేవయ్య కారు చామరాజనగర జిల్లా హనూరు తాలూకా రామాపుర గ్రామం శివారులో లభించింది. కారులో రక్తం మరకలు ఉండడం అనుమానాలను కలిగిస్తోంది. కారు డిక్కీలో రక్తం మరకలు ఉండడంతో మహదేవయ్యను ఏమైనా చేశారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఈ నెల 1న మహదేవయ్య చెన్నపట్టణ తాలూకా చక్కెరె గ్రామంలోని తోటలోని ఇంట్లోంచి కారుతోపాటు కనిపించకుండా పోయాడు. ఆయన మొబైల్‌ఫోన్ లోకేషన్ చామరాజనగరలోని మలెమహదేశ్వర కొండ మీద చూపించింది. రామనగర ఎస్పీ కార్తీక్‌రెడ్డి నాలుగు ప్రత్యేక దర్యాప్తు బృందాలను గాలింపునకు పంపారు. మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ చేరుకుని కారును పరిశీలించి పోలీసులతో వివరాలు తెలుసుకున్నారు. తరువాత పోలీసులు ముమ్మరంగా గాలించగా సమీపంలోనే మహదేవయ్య మృతదేహం కనిపించింది. దుండగులు కిడ్నాప్ చేసి హత్య గావించి పడేసి వెళ్లినట్లు భావిస్తున్నారు. ఈ ఘటనతో చక్కెరె గ్రామంలో ఆయన కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామమంతటా విషాదం అలముకొంది. హంతకులు ఎవరు, ఎందుకోసం హత్య చేసి ఉంటారు అనేది మిస్టరీగా మారింది.

పలు రైళ్ల సర్వీసుల రద్దు

- ఫిబ్రవరి 8 వరకు అమలు



అనంతపురం సిటీ: అనంతపురం మీదుగా వెళ్లే వారాంతపు స్పెషల్, రోజూ తిరిగే పలు రైళ్లను ఫిబ్రవరి వరకు రద్దు చేశారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ప్రధానంగా కోయంబత్తూరు-నిజాముద్దీన్-కోయంబత్తూరు మధ్య తిరిగే కొంగు ఎక్స్‌ప్రెస్ (రైల్ నంబర్: 12647/12648) రైళ్లను రద్దు చేశారు. వీక్లీ స్పెషల్‌గా ప్రతి గురువారం బెంగళూరు, అనంతపురం, సికింద్రాబాద్, ఆగ్రా, ఢిల్లీ మీదుగా తిరిగే ఈ రైళ్లను ఫిబ్రవరి 7వ తేదీ వరకు రద్దు చేసినట్లు వివరించారు.

- యశ్వంతపుర-మచిలీపట్నం వయా అనంతపురం, నంద్యాల, విజయవాడ మీదుగా తిరిగే కొండవీడు ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్లు: 17212/17211) రైళ్లను కూడా రద్దు చేశారు. వారంలో మూడ్రోజుల పాటు (మంగళ, గురు, శనివారాల్లో తిరిగే వీక్లీ స్పెషల్ రైళ్లను కూడా) ఫిబ్రవరి 8 వరకు నిలిపివేశారు.
- యశ్వంతపుర-సికింద్రాబాద్-యశ్వంతపుర మధ్య తిరిగే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (రైళ్ల నంబర్: 12735/12736)ను రద్దు చేశారు.
- ఈ రైళ్లు ప్రతి సోమ, గురువారాల్లో అనంతపురం మీదుగా రాకపోకలు సాగించేవన్నారు. ఫిబ్రవరి 8 తరువాత పునరుద్ధరిస్తారు.
- యశ్వంతపుర-ఇండోర్ వయా అనంతపురం, సికింద్రాబాద్ మీదుగా నడిచే ఇండోర్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్: 19302) ఫిబ్రవరి 6 వరకు రద్దయింది.

మహిళా పీడీఓ కన్నుమూత

- సమావేశం తరువాత కుప్పకూలిన వైనం




మృతదేహానికి ఉద్యోగుల నివాళి (ఇన్‌సెట్) పీడీఓ భారతి (ఫైల్)

మండ్య: విధుల్లో ఉన్న మహిళా పీడీఓ విధుల్లోనే కన్నుమూశారు. మండ్య జిల్లాలోని పాండవపుర పట్టణంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. వివరాలు.. మైసూరుకు చెందిన భారతి (54) గుమ్మనహళ్లిలో పంచాయతీ కార్యదర్శిగా ఉంటూ ఇటీవలే పీడీఓగా పదోన్నతి పొంది పాండవపురకు వచ్చారు. రమేష్ అనే ఆర్‌టీఐ కార్యకర్త గుమ్మనహళ్లితో పాటు తాలూకాలోని పలు జీపీలలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దీనిపై చర్చించడానికి ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య, తాలూకా ఈఓ లోకేష్‌మూర్తి, పీడీఓ భారతి, ఆర్‌టీఐ కార్యకర్తను సోమవారం తన కార్యాలయానికి రప్పించి చర్చించారు. సమావేశం ముగిసిన తరువాత భారతి బయటకు వస్తూ ఎదనొప్పి అని కుప్పకూలిపోయింది. వెంటనే పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి, ఆపై మైసూరులోని ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించారు. ఆమెకు భర్త ప్రకాశ్, ఒక కుమార్తె ఉన్నారు. ప్రకాశ్ కూడా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఉద్యోగులు, ప్రజలు తరలివచ్చి నివాళులర్పించారు.

సిటీ బస్‌ను ఢీకొని కారు దగ్ధం




కాలిపోతున్న కారు దృశ్యాలు

- బెంగళూరులో దుర్ఘటన
- ముగ్గురికి స్వల్ప గాయాలు

బనశంకరి: బస్టాప్‌లో నిలిచి ఉన్న బీఎంటీసీ బస్సును వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టి మంటల్లో చిక్కుకుంది. ఈ ఘటన నగరంలో బ్యాటరాయనపుర ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంటల్లో కారు బుగ్గి కాగా, బస్సు వెనుక భాగం కూడా స్వల్పంగా దగ్ధమైంది. కారులో ఉన్న లోకేశ్, అతని భార్య, కుమార్తె స్వల్పగాయాలతో బయటపడ్డారు.

కాపాడిన స్థానికులు

వివరాలు.. సోమవారం ఉదయం 9 గంటకు యశవంతపుర నుంచి బీఎంటీసీ బస్సు నాయండహళ్లికి బయలుదేరింది. రింగ్‌రోడ్డులోని సువర్ణ లేఔట్, నాగరబావి జంక్షన్‌లో ప్రయాణికులను దింపడానికి బీఎంటీసీ బస్సును నిలిచింది. ఇంతలో వెనుకనుంచి వేగంగా వచ్చిన కారు బస్సు వెనుక భాగాన్ని ఢీకొట్టింది. ఆ ధాటికి కారు ఇంజిన్‌లో మంటలు లేచి కారును చుట్టుముట్టాయి. వెంటనే స్థానికులు కారులో ఉన్న దంపతులు, కుమార్తెను బయటికి తీసి కాపాడారు. ప్రజలు, బస్ కండక్టర్లు, డ్రైవరు మంటలను అదుపు చేసేందుకు యత్నించినా కారు మిగల్లేదు. ఒకవేళ ఆ మంటలు బస్సు ఇంజిన్ వరకు వ్యాపించి ఉంటే అది కూడా కాలిపోయేది. ప్రమాదం జరగగానే డ్రైవరు, కండక్టరు బస్సులో ఉన్న ప్రయాణికులను గబగబా కిందికి దింపేశారు. కొంతసేపటికి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేసేటప్పటికి కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో కొంతసేపు ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడింది. బ్యాటరాయనపుర పోలీసులు కేసు నమోదు చేశారు.



దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బెంగళూరులో వేడుకలు జరిగాయి. ఇందులో దివ్యాంగ బాలికల నాట్య సంభ్రమం

క్లుప్తంగా

నరేగపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించరూ..



వినతిపత్రాన్ని అందిస్తున్న కొట్రమ్మ తదితరులు

కంప్లి: నరేగ పథకంలో వివిధ డిమాండ్లపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ఒత్తిడి చేస్తూ సోమవారం ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్‌కు గ్రామీణ కూలీ కార్మిక సంఘం పదాధికారులు వినతిపత్రం అందించారు. అనంతరం తాలూకా సంచాలకురాలు ఎంబీ.కొట్రమ్మ మాట్లాడుతూ ఇప్పటికే కరువు తాలూకాగా ప్రకటించి ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా తలా 50 మానవ రోజుల చొప్పున ప్రతి ఏటా తప్పనిసరిగా పని దినాలను పెంచుతూ ఆదేశాలు జారీ చేయాలని ఒత్తిడి చేశారు.

ఒరిగిన స్తంభాలతో పొంచి ఉన్న ముప్పు



ఒరిగిన విద్యుత్ స్తంభం

కంప్లి: కుడితిని పట్టణంలో జాతీయ రహదారి, బళ్లారి బైపాస్ ద్విపథ రోడ్డు నిర్మాణ పనులకు రోడ్డు తొలగించే పనులు జరపడం వల్ల అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి నేలను తాకే ప్రమాదంలో ఉన్నాయని, తక్షణమే వాటిని సరిచేయాలని స్థానికులు ఒత్తిడి చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వాటిని తొలగించే పనులు సాగించాలని కోరుతున్నారు.

కరువు జిల్లాపై సవతి ప్రేమ తగదు



వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో నెలకొన్న కరువుపై సవతి తల్లి ప్రేమను ఒలకబోస్తున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లాధ్యక్షుడు వీరేష్ ఆరోపించారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర కరువు బృందం జిల్లాలో పర్యటించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. వానలు లేక రైతుల పంటలు ఎండిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రూ.17 వేల కోట్ల నష్టం అంచనా ప్రతిపాదనలపై కేంద్రం ఇంకా స్పందించలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి ఎన్నికైన లోక్‌సభ సభ్యులు కూడా ప్రధానమంత్రి వద్ద ఈ విషయంపై చర్చించక పోవడం సరికాదన్నారు. కరువు సహాయక పనులు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో కృష్ణ, ఇషాక్, షెక్షావలిలున్నారు.

సబ్సిడీతో విత్తనాలు



విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కంప్లి: ప్రతి ఒక్క రైతు పంట బీమా చేయించుకోవడంతో పాటు ఎఫ్ఐడీ తప్పనిసరిగా చేయించుకోవాలని, తద్వారా ప్రభుత్వ పరంగా లభించే సౌకర్యాలను పొందవచ్చని కురుగోడు వ్యవసాయ శాఖ అధికారి దేవరాజ్ తెలిపారు. ఆయన సోమవారం తాలూకా రైతు కేంద్రంలో సబ్సిడీ ధరతో రైతులకు శెనగ విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. విత్తన నాట్లకు ముందుగా ట్రైకోడర్మా పొడిని విత్తనాలతో కలిపి నాటాలన్నారు.

బింగానహళ్లిలో గ్రామసభ

చింతామణి: తాలూకాలోని ఉప్పారపేట గ్రామ పంచాయతీ పరిధిలోని బింగానహళ్లి గ్రామంలో గ్రామసభ పంచాయతీ అధ్యక్షుడు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ చేరాలని, ఇంకా ఎవరికైనా అందకపోతే ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అర్జీలను స్వీకరించి అనుకూలం చేయాలని తెలిపారు. అధికారులు సక్రమంగా పనిచేయాలని కోరారు.

మోదీనే దేశానికి గ్యారంటీ

- పోస్టర్లు అంటించిన బీజేపీ నాయకులు

యశవంతపుర: మధ్యప్రదేశ్, ఛత్తీస్ ఘడ్, రాజస్థాన్‌లో బీజేపీ అఖండ విజయాన్ని స్వాగతిస్తూ దేశానికీ నరేంద్రమోదీ గ్యారంటీ అంటూ బీజేపీ నాయకులు బెంగళూరులో పోస్టర్లను అంటించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అనవసరమైన హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని కర్ణాటక బీజేపీ ఆరోపించింది. బీజేపీ సామాజిక మాధ్యమాలలో మోదీ గ్యారంటీ అంటూ పోస్టర్లతో పోస్ట్ చేసింది. కర్ణాటక తరహాలో గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సభల్లో చెప్పినా ప్రజలు నమ్మలేదని, బీజేపీకే పట్టం కట్టారని నాయకులు పేర్కొన్నారు.

మల్బరీ సాగులో అసమాన సాధన



వెంకటరామయ్య పొలంలోని మల్బరీ పంటను పరిశీలిస్తున్న వివిధ ప్రాంతాల విద్యార్థులు(ఫైల్)



కరువు సమయంలో మొక్కలకు నీటిని సైకిల్‌పై బిందెల్లో తెస్తున్న రైతు వెంకటరామయ్య(ఫైల్)

- వినూత్నంగా చెట్టు పద్ధతి ఆవిష్కర్తకు ప్రోత్సాహం కరువు
- విశిష్ట రైతుకు ప్రభుత్వాల నుంచి లభించని తగిన గుర్తింపు

కోలారు: మల్బరీ వ్యవసాయంలో శాస్త్రవేత్తలను తలదన్నేలా కొత్త విషయాలను ఆవిష్కరించడంలో తాము ముందంజలో ఉన్నామని జిల్లా రైతులు నిరూపిస్తున్నారు. ఇందుకు తాలూకాలోని హొన్నేనహళ్లి రైతు వెంకటరామయ్యే చక్కటి నిదర్శనం. మల్బరీ వ్యవసాయంలో వినూత్న పద్ధతిని ఆవిష్కరించిన రైతుకు గత పదేళ్లలో ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం, గుర్తింపు లభించక తెరమరుగునే ఉండి పోవాల్సి వచ్చింది. రైతు వెంకటరామయ్య వినూత్నంగా ఆవిష్కరించిన మల్బరీ మొక్కల పెంపకంలో చెట్టు పద్ధతి దేశవిదేశాల దృష్టిని ఆకర్షించింది. శాస్త్రవేత్తల బృందం చేయాల్సిన పరిశోధనలు రైతు వెంకటరామయ్య చేసి చూపించడం విశేషం. వెంకటరామయ్య చేసిన సాధనకు చిక్కిన ప్రతిఫలం పట్టు పరిశ్రమ శాఖ నుంచి లభించిన రూ.10 వేల ప్రోత్సాహధనం మాత్రమే. వెంకటరామయ్య సాధనపై మైసూరు సీఎస్ఆర్‌టీఐ ప్రకటించిన పట్టు వ్యవసాయం విజయగాథల ఆంగ్ల లేఖనం ఎంతో మంది విదేశీయుల దృష్టిని కూడా ఆకర్షించింది.

అవసరమే అన్వేషణకు మూలం

వెంకటరామయ్య ఆవిష్కరణ వెనుక ఆయన అవసరం దాగి ఉంది. నీటి మూలాలు తక్కువగా ఉన్న కోలారు జిల్లాలో ఎంతోమంది రైతులు పట్టు వ్యవసాయానికి దూరమైనా పట్టు వ్యవసాయాన్నే కొనసాగించాలనే పట్టుదల పట్టులో చెట్టు పద్ధతి ఆవిష్కరణకు కారణమైంది. హొన్నేనహళ్లి వద్ద వెంకటరామయ్యకు 4 ఎకరాల పొలం ఉంది. బోరుబావిని తవ్వించి కూరగాయలు తదితర వాణిజ్య పంటలను పండించేవారు. 2011–12లో జిల్లాలో కరువు ఆవరించింది. ఆ సమయంలో రైతులు నీటికి తీవ్ర ఇబ్బంది పడ్డారు. పలువురు రైతులు పట్టు వ్యవసాయం చేయడాన్ని మానుకున్నారు. ఇలాంటి సమయంలో వెంకటరామయ్య మెదడులో పుట్టిన ఆలోచనే చెట్టు పద్ధతి ద్వారా మల్బరీ తోటను పెంచడం.

తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి

గతంలో మొక్కగా పెంచే మల్బరీని చెట్టులాగా పెంచాలని నిర్ణయించాడు. ఈ పద్ధతిలో మల్బరీ చెట్టుకు నీరు తక్కువ అవసరం ఉండేది. తన ఆలోచనను అమలు చేసి కరువు సమయంలో నీరు లేక సైకిల్‌పై బిందెలతో నీరు పోసి చెట్టు పద్ధతిలో మల్బరీ ఆకులను పెంచి సఫలమయ్యాడు. ఆరంభంలో కేవలం 10 గుంట్ల స్థలంలో 144 చెట్లను నాటి చెరువు నుంచి సైకిల్‌పై బిందెలతో నీరు తీసుకు వచ్చి పోసి పెంచాడు. చెట్టుకింద బాటిల్ ఉంచి అందులో పోసి డ్రిప్ ఇరిగేషన్ తరహాలో చేసి తక్కువ నీటితో చెట్టు పెరిగేలా చూశాడు. గతంలో కంటే మల్బరీ ఎక్కువ దిగుబడి రావడంతో వెంకటరామయ్య ఇక వెనుదిరిగి చూడలేదు,. ప్రస్తుతం 900 మల్బరీ చెట్లను పెంచి మల్బరీ ఆకులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు.

చెట్టు పద్ధతిలో ఉత్పత్తి పెంపు

సాధారణంగా మొక్క పద్దద్ధలో పెంచే మల్బరీ పంటతో 100 పట్టు గుడ్లకు 60 నుంచి 70 కిలోల పట్టు గూళ్ల ఉత్పత్తి అయ్యేవి. చెట్టు పద్ధతిలో ఉత్పత్తి చేయడం వల్ల 100 పట్టుగుడ్లకు 90 నుంచి 100 కిలోల వరకు ఉత్పత్తి అవుతోంది. చెట్టు పద్ధతిలో మల్బరీ సాగు వల్ల ఉత్పత్తి పెరుగుతోంది. పూర్తిగా సేంద్రీయ పద్ధతిలోనే పెరిగిన చెట్లు కావడం వల్ల పట్టు ఆకుల్లో ఉన్న తేమ , పోషకాంశాలే దిగుబడి పెరగడానికి కారణమని వెంకటరామయ్య అంటున్నారు. ఆరంభంలో 8–8 అడుగుల దూరంలో నాటుతున్న మల్బరీని తరువాత 10–10 అడుగుల దూరానికి పెంచాడు. దీని వల్ల ప్రయోజనం మధ్యలో అలసందలు, ఉలవలు, రాగులు పండించవచ్చని అంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ సంస్థలు, విశ్వవిద్యాలయాలు రైతులను ఏ విధంగా నిర్లక్ష్యం చేస్తున్నాయనేందుకు వెంకటరామయ్యే నిదర్శనం అని చెప్పవచ్చు.

దీపోత్సవం..భక్తిపారవశ్యం



విశేష అలంకరణలో శ్రీపర్వతమల్లికార్జునస్వామి



దీపోత్సవం నిర్వహించిన దృశ్యం



ప్రత్యేక అలంకరణలో బనశంకరీదేవి

బనశంకరి: కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా బనశంకరీదేవి సన్నిధిలోని శ్రీపర్వతమల్లికార్జునస్వామికి దీపోత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ బనశంకరీదేవికి అభిషేకం, అర్చనలు చేపట్టి ప్రత్యేక పూలతో విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం పర్వతమల్లికార్జునస్వామికి ప్రత్యేక అలంకరణ చేపట్టగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి



పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: గ్రామాల అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని రాష్ట్ర ఒక్కలిగుల సంఘం మాజీ డైరెక్టర్ వక్కలేరి రాము తెలిపారు, సోమవారం రక్షిత తాగునీటి యూనిట్, బస్ షెల్టర్ నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో పట్టుదలను పక్కన బెట్టి అందరూ ఒకటి కావాలని పిలుపు నిచ్చారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ చేతులు కలపాలన్నారు. అందరం కలిసి గ్రామాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఆదర్శ గ్రామంగా మార్చాలన్నారు. ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ విరాళంగా ఇచ్చిన రూ.2 లక్షల నిధులతో పాటు వివిధ నిధులను కలిపి రక్షిత తాగునీటి యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీ నిధులతో బస్ షెల్టర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సంధదగా వక్కలేరి జీపీ అధ్యక్షురాలు రాధికా మంజునాథ్, ఉపాధ్యక్షుడు ఎం ఆనందకుమార్, సభ్యులు జ్యోతి, కవితా, శ్రీపతి, శైలజా తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కుటుంబానికి దిక్సూచి

కంప్లి: మహిళలు స్వయం ఉపాధి సాధిస్తే కుటుంబ నిర్వహణ చేయవచ్చని జ్ఞాన వికాస్ కేంద్రం ఒక దిక్సూచి అని ధర్మశెట్టి సూచించారు. మరియమ్మనహళ్లిలోని శివాని జ్ఞాన వికాస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ప్రతి మహిళా ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వకీల్ మల్లికార్జున, జీపీ సభ్యులు సోమణ్ణ, నేత్రావతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అధికారుల బృందం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రం వద్ద అధికారుల బృందంతో సిబ్బంది

హొసపేటె: మేఘాలయ మహిళా శిశు అభివృద్ధి శాఖ, ప్రజా విద్యా, సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల బృందం సోమవారం హొసపేటె శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ పరిధిలోని గాదిగనూరులోని 4వ అంగన్‌వాడీ కేంద్రం, బైలువద్దిగేరిలోని 3వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేసింది. అంగన్‌వాడీలో పాఠాలు బోధించే గది, పిల్లల అనుబంధ అభ్యాస సామగ్రి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల కోసం సహాయకులు నిర్వహిస్తున్న కార్యకలాపాలను సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. తమ రాష్ట్రంలో పిల్లలకు ఇలాంటి విద్యావిధానం లేదన్నారు. కర్ణాటకలో 3 నుంచి 6 ఏళ్ల పిల్లలకు ప్రాథమిక విద్య చాలా బాగా అందిస్తున్నారన్నారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.శ్వేత, జిల్లా వ్యాఖ్యాత సుభద్రాదేవి, సీనియర్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డాక్టర్ చిట్కా లాంబ, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారిణి సింధు, సీనియర్ సూపర్‌వైజర్ అంబుజ, మండల పర్యవేక్షకులు లక్ష్మీదేవి, ఎల్‌డీ నదాఫ్, నసీమాబేగం, సుజాత, జిల్లా ప్రోగామ్ మేనేజర్ ఏవై కొట్రేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మేఘాలయకు చెందిన వివిధ శాఖల అధికారులు జిల్లాధికారి కార్యాలయాన్ని సందర్శించి జిల్లాలో చిన్నారులకు అందిస్తున్న ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలను అభినందించారు. జిల్లాలో అందిస్తున్న ప్రీ స్కూల్ విద్య దేశంలోనే అగ్రగామిగా నిలవడంపై జిల్లాధికారి దివాకర్ హర్షం వ్యక్తం చేశారు.

భక్తులతో శివాలయాలు కిటకిట



సోమేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

కోలారు: కార్తీక సోమవారం సందర్భంగా నగరంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చోళుల కాలపు ప్రసన్న సోమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచే భక్తులు తరలి వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. దేవాలయాలన్నింటినీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ప్రసన్న సోమేశ్వరస్వామి ముందు ఉన్న నంది విగ్రహం వద్ద దీపాలను వెలిగించారు. అర్చకులు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అంతరగంగ కాశీ విశ్వనాథస్వామి, బయలు బసవేశ్వర స్వామి, కాళికాంబ కమటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

కరువు పరిహారం అందించండి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాకు కరువు పరిహార నిధులు అందించాలని డిమాండ్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జిల్లా అధ్యక్షుడు ఎం.రవిశంకర్ జిల్లాధికారి అక్రంపాషాకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సారి ముంగారు వానలు జిల్లాలో సక్రమంగా కురవక పోవడం వల్ల కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీనిని గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు పరిహార నిధులను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. భవిష్యత్‌లో తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతుందని, సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే కరువు నివారణ చర్యలు చేపట్టాలని ఒత్తిడి చేశారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అభివృద్ధి కార్యక్రమాలపై నిర్లక్ష్యంతో ఉండటమేగాక అంతర్గత సమస్యలతో సతమతమవుతూ పాలనను పక్కన బెట్టిందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ పాలన కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదన్నారు. ఆప్ రాష్ట్ర కార్యదర్శి సురేష్, రాష్ట్ర నాయకుడు వి.గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రమేష్ పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

పార్టీ అభ్యర్థినే గెలిపించాలి



మాట్లాడుతున్న మంత్రి బైరతి సురేష్

కోలారు: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో హైకమాండ్ సూచించిన అభ్యర్థిని అందరూ కలిసి భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బైరతి సురేష్ సూచించారు. సోమవారం తాలూకాలోని రామసంద్ర వద్ద ఉన్న ప్రైవేటు హోటల్‌లో కోలారు లోక్‌సభ అభ్యర్థి ఎంపిక విషయంపై ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోలారులో సమర్థుడైన అభ్యర్థిని ఎంచుకుని హైకమాండ్ సిఫార్సుకు పంపించామన్నారు. ఇందుకు పలువురు అభ్యంతరం తెలిపారు. అభ్యర్థి ఎంపిక విషయంలో ఎవరూ గందరగోళం సృష్టించవద్దన్నారు. హైకమాండ్ సూచించిన అభ్యర్థి విజయం కోసం అందరూ కలిసి పని చేయాలన్నారు. ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ మాట్లాడుతూ హైకమాండ్ సూచించిన వ్యక్తికి మద్దతు తెలపాలని సూచిస్తే ఇక ఈ సమావేశాన్ని ఎందుకు ఏర్పాటు చేశారు? అందరి అభిప్రాయాలు సేకరించాల్సిన అవసరం ఏముంది? అని ప్రశ్నించారు. మంజునాథ్ అభిప్రాయంతో కొందరు ఏకీభవించారు. సమావేశంలో మంత్రి రామలింగారెడ్డి, కెహెచ్ మునియప్ప, ఎమ్మెల్యేలు ఎస్ ఎన్ నారాయణస్వామి, కె వై నంజేగౌడ, మంత్రి సుధాకర్, ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో భూతాపానికి చెక్



విద్యార్థులకు మొక్కలను అందించిన దృశ్యం

కోలారు: భూతాపాన్ని నివారించడానికి మొక్కలను విరివిగా నాటాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ కెఆర్ సురేష్ తెలిపారు. సోమవారం స్కౌట్స్ భవనంలో రోటరీ నందిని ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేసి మాట్లాడారు. భూమి కలుషితమైతే అందుకు మానవుడే నేరుగా కారణం అవుతారన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా జాయింట్ కార్యదర్శి ఉమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఇకపై తమ పుట్టినరోజు సందర్భంగా మొక్కలను అందించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. తద్వారా అందరిలో మొక్కల పెంపకంపై అవగాహన కలిగించాలన్నారు. జిల్లా సహ కారదర్శి స్కౌట్స్ బాబు, విఠల్ రావ్, నిరంజన్, రవికుమార్ పాల్గొన్నారు.

రిజర్వేషన్‌పై లోక్‌సభలో చర్చకు వినతి



ఎంపీకి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: దశాబ్దాల కాలంగా ఎస్టీ రిజర్వేషన్లలో కురుబ సమాజానికి జరిగిన అన్యాయాన్ని సరి చేసి న్యాయం చేయాలని, దీనిపై లోక్‌సభ సమావేశాల్లో చర్చించి రాష్ట్రం సిఫార్సు చేసిన ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కోరుతూ ఎంపీ ఎస్.మునిస్వామికి సోమవారం హాలుమత మహాసభ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. హాలుమత మహాసభ అధ్యక్షుడు ఎన్‌కె గోవిందరాజు మాట్లాడుతూ రాష్ట్ర కురుబ సమాజ ప్రముఖులు ఢిల్లీ వెళ్లినప్పుడు లోక్‌సభ సభ్యుడు మునిస్వామి తమకు ఎంతో సహకారం అందించారన్నారు. ఎంపీ తమకు న్యాయం చేస్తారనే విశ్వాసం ఉందన్నారు. రాష్ట్ర కురుబ సంఘం పరంగా లోక్‌సభలో చర్చించి కర్ణాటకలో ఎస్టీ రిజర్వేషన్‌ను విస్తరించడంలో తమకు న్యాయం చేయాలని కోరారు. హాలుమత మహాసభ రాష్ట్ర సమన్వయ కార్యదర్శి హావళ్లి శ్రీనివాస్, కురుబ సముదాయ ప్రముఖుడు మునియప్ప, కృష్ణ, నాగభూషణ్ పాల్గొన్నారు.

కేపీఎస్‌సీ వద్ద నిరుద్యోగి నిరసన



పేపర్లు చించి నిరసన వ్యక్తం చేస్తున్న కాంతకుమార్

యశవంతపుర: పరీక్ష రాసి రెండేళ్లు అవుతున్నా ఫలితాలు విడుదల చేయలేదని అభ్యర్థి ఒకరు కర్ణాటక పబ్లిక్ సర్వీసు కమిషన్ (కేపీఎస్‌సీ) ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పేపర్లు చించివేసి తన ఆవేదనను వ్యక్తం చేశాడు. వివిధ శాఖల్లో పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించగా ఇంతవరకు ఫలితాలు రాలేదన్నారు. ఫలితాలు విడుదల చేయాలని ఆరు నెలలుగా కోరుతున్నా ఫలితం లేదని అఖిల కర్ణాటక విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు కాంతకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

వీనుల విందుగా వేణు వాద్య సంగీతం



వేణువును వాయిస్తున్న దృశ్యం

చింతామణి: తాలూకాలోని శ్రీ క్షేత్ర యోగినారేయణ మఠం ఆవరణలో నాదసుధారస సాంస్కృతిక వేదిక నాదసుధారస వేదికపై విద్వాన్ పతంజలి బృందం కొళవు వాద్య సంగీతం వీనులవిందుగా సాగింది. విశ్వనాథన్, గోవర్ధన్, ప్రశాంత్ సహకరించారు.

లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు

తుమకూరు: రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ ఘడ్ ఫలితాలు లోక్‌సభ ఎన్నికల్లోనూ పునరావృతం అవుతాయని మాజీ మంత్రి ఎం.పీ.రేణుకాచార్య అన్నారు. సోమవారం తమకూరు నగరానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో భారీ మెజార్టీతో ఘనవిజయం సాధించిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి ప్రధాని మోదీ హ్యాట్రిక్ సాధిస్తారన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైలు



రైలుకు స్వాగతం పలుకుతున్న అయ్యప్ప స్వాములు

హుబ్లీ: హుబ్లీ నుంచి శబరిమలకు ప్రత్యేక రైలు సౌకర్యాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యం శనివారం అయ్యప్పస్వామి మాలధారులు హుబ్లీ స్టేషన్‌లో హుబ్లీ–కొట్టాయం–హుబ్లీ రైలు (07305/07306)కు ప్రత్యేక పూజలు చేశారు. బోగీలను అరటి గెలలు, పూలతో అలంకరించారు.

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపాలని ఇన్‌చార్జ్ బీఈఓ ఉమా పిలుపు నిచ్చారు. సోమవారం బీఈఓ కార్యాలయంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో శ్రవణ దోష విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో దాత ధర్మేష్ అందించిన శ్రవణ పరికరాలను అందించి మాట్లాడారు. దివ్యాంగ పిల్లలను సమాజ ప్రధాన వాహినిలోకి తేవడానికి ప్రయత్నించాలన్నారు. దివ్యాంగ విద్యార్థులకు విద్యా శాఖ నుంచి యేటా ఉచిత ఆరోగ్య పరీక్షలు, వివిధ సౌకర్యాలను అందిస్తున్నట్లు తెలిపారు. క్షేత్ర సమన్వయ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ దివ్యాం విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో దాత ధర్మేష్, ఆర్పీ శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక కార్యక్రమాలతో శాంతి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న స్వామీజీ

మాలూరు: ప్రాచీన ఆలయాలను జీర్ణోద్ధరణ చేయాలని, నిత్యం ఆలయాల్లో పూజలు నిర్వహించాలని శివనాపురం ఆదిశక్తి మహా సంస్థాన మఠం పీఠాధ్యక్షుడు పరమ పూజ్య ప్రణవానందపురి మహాస్వామి తెలిపారు. సోమవారం తాలూకాలోని తొర్నహళ్లిలో నూతనంగా నిర్మించిన ధర్మరాయ స్వామి ఆలయంలో నూతన విమాన గోపుర ప్రతిష్ఠాపన, కుంభాభిషేక మహోత్సవం, పంచలోహ విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో శాంతి సౌహార్ధతలు నెలకొనడానికి విరివిగా ధార్మిక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

91వ రోజుకు కావేరి నిరసనలు


ధర్నాలో పాల్గొన్న దళిత సంఘర్ష సమితి నాయకులు

మండ్య: కావేరి నీటిని తమిళనాడుకు విడుదల చేయొద్దని డిమాండ్ చేస్తూ మండ్య జిల్లా రైతు హితరక్షణ సమితి నగరంలో చేపట్టిన ధర్నా సోమవారం 91వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కర్ణాటక దళిత సంఘర్ష సమితి సభ్యులు ధర్నా శిబిరం వద్దకు చేరుకొని ఆందోళనకారులకు మద్దతు పలికారు. అనంతరం సభ్యులు శివరాజ మరళిగ, శ్రీనివాస్, శంకర, దేవరాజు, అప్పాజి, మాదేవిలు ధర్నాలో పాల్గొన్నారు.

న్యాయవాదుల ధర్నా


జేసీ సర్కిల్‌లో ధర్నా నిర్వహిస్తున్న న్యాయవాదులు

మండ్య: చిక్కమగళూరులో న్యాయవాది ప్రీతంపై పోలీసులు అకారణంగా దాడి చేశారని ఆరోపిస్తూ మండ్యలో న్యాయవాదులు ఉద్యమించారు. సోమవారం స్థానిక న్యాయవాద సంఘం కార్యాలయం వద్దకు చేరుకొని అనంతరం ర్యాలీగా వెళ్లి బెంగళూరు మైసూరు జాతీయ రహదారిలో రాస్తారోకో నిర్వహించారు. తర్వాత జేసీ సర్కిల్ వద్దకు చేరుకొని ధర్నా నిర్వహిచారు. ఈ సందర్భంగా పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేవలం హెల్మెట్ పెట్టుకోలేదని న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడం దారుణమన్నారు. పోలీసులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పౌర కార్మికుల సేవలు వెలకట్టలేనివి


కార్మికులకు రగ్గులు అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర శుభ్రతతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణ కోసం నిరంతరం శ్రమించే పౌర కార్మికుల సేవలకు వెలకట్టలేమని బీబీఎంపీ మాజీ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మురళి అన్నారు. ఆరికెరె వార్డులో ఉన్న శాంతినికేతన్ లేఔట్ శ్రీవాసవి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో పౌర కార్మికులకు సోమవారం ఆమె రగ్గులు అందజేశారు. ఎండ, వాన, చలి అన్న తేడా లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టే కార్మికులు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. బీజేపీ నాయకుడు మురళిధర్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

కారుతో ఢీకొట్టి డ్రైవర్‌పై దాడి

యశవంతపుర: డ్రైవర్‌పై కొందరు వ్యక్తులు కారుతో ఢీకొట్టి దాడి చేసిన ఘటన బెంగళూరులో జరిగింది. ఇందుకు సంబంధించి ఓ వ్యక్తి బెంగలూరు ట్రాఫిక్ పోలీసులకు ఎక్స్‌లో పోస్టు చేశారు. నవంబర్ 29న ఉదయం 8:30 గంటలకు ఈ ఘటన జరిగింది. హెబ్బాళ పై వంతెనపై ఓ డ్రైవర్ కారును నిలిపి అక్కడే నిలబడ్డాడు. ఇదే మార్గంలో వచ్చిన ఇన్నోవా కారు అతన్ని ఢీకొంది. అనంతరం ఆదేకారునుంచి కొందరు కిందకు దిగి డ్రైవర్‌పై దాడి చేశారు. ఈ దృశ్యాలు కారు డ్యాష్ కేమరాలో రికార్డ్ అయ్యాయి.

పనులు కల్పించలేదని ధర్నా


ధర్నాలో పాల్గొన్న నల్లగుట్టపల్లి గ్రామస్తులు

చింతామణి: తాలుకాలోని చిన్నసంద్ర పంచాయతీ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించలేదని ఆరోపిస్తూ ఆ పంచాయతీ పరిధిలోని నల్లగుట్లపల్లి గ్రామస్తులు సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు ఆందోళనకారులు మాట్లాడుతూ సరేగా పనులు కల్పించకుండా పీడీఓ గీత, సిబ్బంది నిర్లక్ష్యంగా వహిస్తున్నారని ఆరోపించారు. కాగా విషయం తెలుసుకున్న ఈఓ ఆనంద గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో చర్చించారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

రెండు రోజుల పాటు వానలు

యశవంతపుర: మిచాంగ్ తుపాన్‌తో వచ్చే రెండు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వానలు పడే అవకాశం ఉన్నట్లు వాతావారణశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. రాజధాని బెంగళూరులో చలి పెరిగింది. ఆంధ్ర, తమిళనాడులో భారీ వానలు కురుస్తున్న కారణంగా కర్ణాటకలో హై అలర్ట్‌ను ప్రకటించారు. చలిగాలులు వేగంతో వీస్తున్నాయి.

దివంగతుల సేవలను స్మరించుకోవాలి

- సభాపతి బసవరాజ హొరట్టి
- ప్రముఖులకు విధానపరిషత్‌లో నివాళులు

శివాజీనగర: రాష్ట్రానికి విశేష సేవలు అందించి పరమపదించిన వారిని స్మరించుకోవాలని విధానపరిషత్ సభాపతి హొరట్టి అన్నారు. ఇటీవల మృతి చెందిన ప్రముఖులకు బెళగావిలోని సువర్ణసౌధలో సోమవారం ప్రారంభమైన శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో సభ్యులు నివాళులర్పించారు. మాజీ మంత్రి డీ.బీ.చంద్రేగౌడ, సహకార రంగం భీష్మ బీ.ఎస్.విశ్వనాథ్, హసిరుక్రాంతి హరికార స్వామినాథన్, సీనియర్ శాస్త్రవేత్త ప్రొ.ఎం.ఆర్.సత్యనారాయణరావుతోపాటు మరికొందరు ప్రముఖులకు సంతాపం తెలిపేందుకు విధానపరిషత్‌లో సంతీప తీర్మానం ప్రవేశపెట్టారు. సభాధ్యక్షుడు హొరట్టి మాట్లాడుతూ మాజీ మంత్రి డీ.బీ.చంద్రేగౌడ విధానసభ, విధానపరిషత్, లోక్‌సభ, రాజ్యసభలో సభ్యుడిగా ఉంటూ విశేష సేవలను అందించారని కొనియాడారు. అత్యుత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారన్నారు. సహకార రంగంలో భీష్మాగా పేరు గడించిన మాజీ విధానపరిషత్ సభ్యుడు బీ.ఎస్.విశ్వనాథ్, సీనియర్ శాస్త్రవేత్త ప్రొ.ఎం.ఆర్.సత్యనారాయణరావు, భారతీయ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ అరుణాచలం, సీనియర్ గణిత పండితుడు, ప్రఖ్యాత సంఖ్యాశాస్త్రవేత్త డాక్టర్ కల్యంపుడి రాధాకృష్ణరావు, సీనియర్ వ్యవసాయ విజ్ఞాని, హసిరుక్రాంతి హరికార స్వామినాథన్, సినీ నటి మమతా గురురా,


ఉత్సాహంగా సభకు వస్తున్న బాలికలు

పరిశోధకురాలు, సీనియర్ రచయిత డాక్టర్ కమల హెమ్మిగె, సీనియర్ పాత్రికేయుడు రంగనాథరావు, గంగుబాయి హానగల్, విశ్వవిద్యాలయ విశ్రాంత వైస్ చాన్సలర్ హనుమణ్ణ నాయక దొరెల మృతికి సభ్యులు సంతాపం ప్రకటించారు. సభ్యులు లేచి నిలువబడి ఒక్క నిమిషం మౌనం పాటించారు. అధికార పార్టీ నాయకుడు బోసురాజు మాట్లాడుతూ ఇటీవల పరమపదించిన ఈ 10 మంది వివిధ రంగాల్లో తమదైన సేవలు అందించారన్నారు. అనంతరం ప్రతిపక్ష బీజేపీ తరఫున కోటా శ్రీనివాస్ పూజారి మాట్లాడారు. డీ.బీ.చంద్రేగౌడను నేటి రాజకీయ నేతలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మృతులకు సంతాపం తెలిపిన అనంతరం సభను పది నిమిషాల పాటు వాయిదా వేశారు.

హైకమాండ్‌పై మరోసారి యత్నాల్ అసంతృప్తి

శివాజీనగర: శాసనసభ ప్రతిపక్ష నాయకుడి స్థానం ఉత్తర కర్ణాటక ప్రాంతంవారికి ఇవ్వకుండా హైకమాండ్ అన్యాయం చేసిందని బీజేపీ తిరుగుబాటు నేత బసనగౌడ పాటిల్ యత్నాళ్ మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. బెళగావిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్తర కర్ణాటక భాగానికి న్యాయం లభించేవరకు తన పోరాటం కొనసాగుతుందన్నారు. ఉత్తర కర్ణాటక భాగానికి చెందిన అనేక సమస్యలపై అసెంబ్లీలో చర్చించాల్సి ఉందన్నారు. ఇందుకు అవకాశం కల్పించాలని సభాధ్యక్షుడికి విన్నవించి, తానే చర్చను ముందుగా ఆరంభిస్తానని తెలిపారు.


అసెంబ్లీలో దివంగత ప్రముఖులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం

విపక్షాల ప్రశ్నలకు బదులిస్తాం

- సీఎం సిద్దరామయ్య

శివాజీనగర: శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తే అంశాలపై తగిన సమాధానం ఇవ్వటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బెళగావి విమానాశ్రయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడచినా ప్రతిపక్షనేతను ఎంపిక చేయడంలో జాప్యం చేసిన బీజేపీకి ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక లేదన్నారు. జేడీఎస్, బీజేపీ జాయింట్ పోరాటం చేపట్టినా తగిన సమాధానం ఇస్తామన్నారు. పంచ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై స్పందించిన ఆయన తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల్లో గెలుపు సాధించేందుకు గ్యారెంటీ పథకాలను ప్రకటించటం లేదని, పేదలకు ఆర్థికంగా, సామాజికంగా శక్తినిచ్చే పారదర్శకతతో గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు.

కన్నడ సంస్కృతిని పరిరక్షించాలి

మండ్య: కన్నడ భాష, నేల, నీరు, సంస్కృతిని కాపాడుకోవాలని ఎమ్మెల్యే పి. రవికుమార్ అన్నారు. మండ్య నగరంలోని నెహ్రూ నగరలో ఉన్న పౌర కార్మికుల కాలనీలో సోమవారం నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవం, కనకదాస జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కన్నడ రాజ్యోత్సవాలను ఏడాది పొడవునా నిర్వహించాలన్నారు.

బొమ్మనహళ్లి : అరికెరె వార్డు హులిమావు గ్రామంలో శ్రీ కొదండరామ స్వామి ఆలయం సర్కిల్ వద్ద సోమవారం దళిత సంఘర్ష సమితి ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి పాల్గొని కన్నడ పతాకాన్ని ఆవిష్కరించి భువనేశ్వరి దేవికి పూజలు చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అంతకుముందు హులిమావులో కన్నడ రాజ్యోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మురళి, మురళీధర్, డీఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి

ముంబై సైబర్ పోలీసుల పేరుతో వంచన

- రూ.3.46 లక్షలు పోగొట్టుకున్న మహిళా టెక్కీ

బనశంకరి: ముంబై సైబర్ పోలీసులమంటూ మహిళా టెక్కీని వంచించిన ఘటన వైట్‌ఫీల్డ్ పోలీస్‌స్టేషన పరిధిలో జరిగింది. వైట్‌ఫీల్డ్ బీఈఎంఎల్ లేఔట్ నివాసి మేఘనాదుబే(25) అనే మహిళ నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. గత నెల 28న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ముంబై పోలీసులమంటూ పరిచయం చేసుకున్నాడు. మీపేరుతో ముంబై నుంచి తైవాన్‌కు ఎండీఎంఏ డ్రగ్స్ డెలివరీ వచ్చిందని, ముంబై పెడెక్స్ కొరియర్ ఏజెన్సీలో ముంబై కస్టమ్స్ అధికారులు బ్లాక్‌చేశారని తెలిపారు. అయితే పార్శిల్‌తో తనకు సంబంధం లేదని ఆమె చెప్పింది. దీంతో స్కైప్ యాప్ ద్వారా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించాడు. స్కైప్‌యాప్ ఇన్‌స్టాల్ చేసుకోగా ఆర్‌బీఐ వెరిఫికేషన్‌కు డబ్బు ఇవ్వాలని, పరిశీలన అనంతరం మీ ఖాతాకు తిరిగి జమ చేస్తామని నమ్మబలికాడు. దీంతో దశలవారీగా రూ.3.46 లక్షలు జమ చేసింది. అనంతరం దుండగుడు తన సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేశాడు. మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అడవిలో దారి తప్పిన విద్యార్థులు

- గాలించి సురక్షితంగా ఇంటికి చేర్చిన పోలీసులు

చిక్కబళ్లాపురం: ఇద్దరు విద్యార్థులు ట్రెక్కింగ్‌కు వెళ్లి అడవిలో చిక్కుకుపోయారు. పోలీసులు గాలించి వారిని సురక్షితంగా ఇళ్లకు చేర్చారు. వివరాలు.. బెంగళూరు జీఎస్‌సీఎస్ఆర్ కళాశాలకు చెందిన కృష్ణతివారి, శంభం అనే పరిశోధన విద్యార్థులు ఎలాంటి అనుమతి లేకుండా దండిగానహళ్లి జలాశయం అరణ్య ప్రదేశాల్లో ఆదివారం ట్రెక్కింగ్‌కు వెళ్లారు. సాయంత్రం దారి తప్పారు మొబైల్ ఫోన్లు పనిచేయలేదు. రాత్రంతా అరణ్యంలోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు రాత్రంతా గాలించారు. సోమవారం వేకువజామున ఇద్దరు విద్యార్థులు కనిపించడంతో సురక్షితంగా తీసుకొచ్చారు.


ట్రెక్కింగ్‌కు వెళ్లిన విద్యార్థులు

తల్లీకుమార్తెల అనుమానాస్పద మృతి

యశవంతపుర: ఓ తల్లి, ఆమె ఇద్దరు కుమార్తెలు అనుమానాస్పద స్థితిలో పొలంలో శవాలై తేలారు. ఈఘటన కొడగు శ్రీమంగల పోలీసుస్టేషన్ పరిధిలోని హైసొడ్లూరు గ్రామంలో జరిగింది. మృతులను కోటియాల అశ్వని(48), నిఖిత(21), నవ్య(18)లుగా గుర్తించారు. అశ్వని కొడగు జిల్లా గ్రామీణాభివృద్ధి సేవా సంస్థలో సేవాప్రతినిధిగా పని చేస్తూ కుమార్తెలిద్దరితో కలిసి కొడగు హుదికెరెలో నివాసం ఉంటోంది. వీరందరూ ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. సాయంత్రం వీరి మృతదేహాలు సమీపంలో పొలంలో కనిపించాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వచ్చి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. వీరు ప్రమాదవశాత్తూ మృతి చెందారా? ఆత్మహత్య చేసుకున్నారా ? హత్యకు గురయ్యారా అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.


తల్లీ కుమార్తె (ఫైల్)

కరెంటు తీగ తెగి గొర్రెల మృత్యువాత

చింతామణి: కరెంటు తీగ తెగిపడి గొర్రెలు మృతి చెందిన ఘటన తాలుకాలోని కురుబూరు గ్రామ శివార్లలో సోమవారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన వెంకటేశప్ప, మునియమ్మ దంపతులు గొర్రెలను పోషిస్తూ జీవిస్తున్నారు. రోజుమాదిరిగానే సోమవారం కూడా గొర్రెలను మేతకు గ్రామ శివార్లలోకి తీసుకెళ్లారు. అక్కడ శివణ్ణ పొలం వద్ద మేస్తుండగా తోటకు వేసిన ఇనుప ఫెన్సింగ్‌పై కరెంటు వైరు తెగిపడింది. ఫెన్సింగ్ పక్కనే ఉన్న గొర్రెలు విద్యుదాఘాతానికి గురయ్యాయి. 15 గొర్రెలు మృతి చెందినట్లు కాపరులు తెలిపారు. కరెంటు తీగ తెగిపడిన విషయం తెలిసి అధికారులు సరఫరాను నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.


మృతి చెందిన గొర్రెలు

బైక్‌ను ఈడ్చుకెళ్లిన లారీ

- నవ దంపతులు దుర్మరణం


ఘటన స్థలంలో శ్రీరంగప్ప మృతదేహం


శ్రీరంగప్ప, సుమ దంపతులు (ఫైల్)

తుమకూరు: తుమకూరు జిల్లా మధుగిరి తాలుకా దాసరహళ్లి గ్రామ సమీపాన ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీరంగప్ప (35), భార్య సుమ (26) అనే నవదంపతులు దుర్మణం చెందారు. వివరాల్లోకి వెళితే గుడిబండ మండలం మోరుబాగల్ సచివాలయంలో విలేజ్ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీరంగప్ప, భార్యతో కలిసి ఆదివారం సెలవు రోజు కావడంతో తన అత్తవారి ఇంటికి స్వగ్రామైన కల్లురొప్పం నుంచి బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలోని దాసరహళ్లి సమీపానికి వెళ్లగానే ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొని సుమారు 300 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. భర్త శ్రీరంగప్ప అక్కడికక్కడే మృతి చెందగా భార్య తుమకూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది.

3 నెలల కిందటే మూడుముళ్లు

మూడు నెలల క్రితమే శ్రీరంగప్పకు పెళ్లి జరిగింది. నవదంపతుల మృతితో కల్లురొప్పంలో విషాదం అలుముకొంది. సోమవారం కల్లురొప్పంలో ఇరువురికీ అంత్యక్రియలు జరిగాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సచివాలయం సిబ్బంది నివాళులు అర్పించారు.

నెలమంగల వరకూ మెట్రో విస్తరణకు కసరత్తు

దొడ్డబళ్లాపురం: బెంగళూరు నుంచి నెలమంగల వరకూ భవిష్యత్‌లో మెట్రో సేవలు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. నెలమంగల పట్టణంలో భీరేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన భీరేశ్వర యూనిటీ భవనం, ప్రార్థనా మందిరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ నెలమంగలకు తాగునీటికి సమస్య ఉందన్నారు. నెలమంగల చుట్టుపక్కల చెరువులను నింపేందుకు వృషభావతి పథకాన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. నెలమంగల పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సదుపాయాన్ని నిర్మిస్తామన్నారు. బెంగళూరు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య నివారణకు త్వరలో ఎత్తినహొళె పథకం పనులను పూర్తి చేస్తామన్నారు. కుల, మత బేధాలు లేకుండా తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు.

హోసూరు వార్తలు..

ఘంటసాలకు ఘననివాళి

హోసూరు: అమర గాయకుడు ఘంటసాల మిత్ర బృందంచే సోమవారం హోసూరు మూకొండపల్లిలో మిత్రబృందం గౌరవాధ్యక్షుడు శ్యాంసింగ్ అధ్యక్షతన ఘంటసాల 101వ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చంద్రశేఖర్, వేణు, ఎం.ఎస్.నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రేవణ్ణ, శేఖర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సమస్యలపై మొర

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ శరయుకు ప్రజలు పెద్ద ఎత్తున వినతిపత్రాలను అందజేశారు. తాగునీరు, రోడ్ల వసతి, వృద్ధాప్య పెన్షన్, ఉచిత కుట్టుయంత్రాలు, చలువపెట్టెలు, ఇళ్ల పట్టాలు, విద్యుత్ కనెక్షన్లు కోరుతూ 337 మంది ఫిర్యాదులను అందజేశారు. పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికార్లకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో సాధనకురల్, అధికార్లు పుష్ప, పద్మలత, మురుగేషన్, పన్నీర్ సెల్వం, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

8న ఆలయ ఉత్సవం

హోసూరు: హోసూరు పారిశ్రామికవాడ జూజువాడి నంజప్ప సర్కిల్ వద్ద కొత్తగా నిర్మించిన శ్రీ అంగాళప రమేశ్వరి, శ్రీ నారాయణిదేవి ఆలయ కుంభాభిషేకోత్సవం 8వ తేదీ శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

- క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగరాజ్ 51వ జన్మదినం సందర్భంగా హోసూరులో పార్టీ నాయకుడు మల్లేష్‌రెడ్డి అధ్యక్షతన కేక్ కట్ చేసి పలు కార్యక్రమాలను నిర్వహించారు.

పొలంలో మృతదేహం

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని ఉళివీరనపల్లి గ్రామానికి చెందిన రైతు రాగి పొలంలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో చనిపోయి ఉన్నాడు. వివరాలు...ఉళివీరనపల్లి గ్రామానికి చెందిన రైతు మనోహరన్ సోమవారం ఉదయం తన రాగి పొలం వద్దకెళ్లాడు. ఈ సమయంలో వ్యక్తి శవం కనిపించడంతో తళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి శవాన్ని స్వాధీనపరుచుకొని ఆస్పత్రికి తరలించారు. ఎవరైనా హత్య చేసి పడేశారా, లేక ఏనుగుల దాడిలో మరణించిందా.. అనేది విచారణ చేపట్టారు. మృతునికి 35 ఏళ్ల వయసు ఉంటుందని ఆయన తెలిపారు.

ఊరికి వెళ్లొచ్చేలోగా ఇంట్లో చోరీ

క్రిష్ణగిరి: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు తాళాలు పగులగొట్టి నగదు, నగలను దోచుకెళ్లిన ఘటన కందికుప్పం పరిధిలో జరిగింది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా కందికుప్పం సమీపంలోని బీఆర్‌జీ మాదేపల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు రాజప్ప (68) గత రెండు రోజుల క్రితం కుటుంబంతో కలిసి తీర్థయాత్ర కోసం కాంచీపురం వెళ్లారు. ఆదివారం సాయంత్రం ఇంటికొచ్చిన వీరికి ఇంటి తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోనికెళ్లి చూడగా బీరువాలో ఉన్న 20 పౌన్ల బంగారు నగలు, రూ. 3 లక్షల నగదును దోచుకెళ్లినట్లు తెలిసింది. బాధితుని ఫిర్యాదు మేరకు కందికుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ కింద పడి మహిళ మృతి


ఘటనాస్థలిలో పుష్ప మృతదేహం

- భర్తే చంపాడని ఆరోపణలు

క్రిష్ణగిరి: పొలం దున్నుతుండగా ట్రాక్టర్ రోటోవేటర్ కిందకు చిక్కుకొన్న మహిళ ఘటనా స్థలంలోనే మృతి చెందిన ఘటన సూళగిరి వద్ద జరిగింది. ఈ దుర్ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల మేరకు సూళగిరి సమీపంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు గజేంద్రన్ భార్య పుష్ప (35). ఆదివారం సాయంత్రం గజేంద్రన్ ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి చేస్తుండగా పుష్ప సమీపంలో గడ్డికోస్తోంది. ఈ సమయంలో ఆకస్మాత్తుగా ట్రాక్టర్ కిందకు చిక్కుకొన్న పుష్ప తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది.


బాధితురాలి బంధువులతో చర్చిస్తున్న డీఎస్పీ బాబుప్రశాంత్

భర్తే హత్య చేశాడు

విషయం తెలుసుకొన్న బంధువులు సూళగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హోసూరు డీఎస్పీ బాబుప్రశాంత్, సూళగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనపరుచుకొని శవపరీక్ష కోసం ఆస్పత్రికి తరలించారు. భార్యాభర్తల మధ్య కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయని, కావాలనే గజేంద్రన్ పుష్పపై ట్రాక్టర్ ఎక్కించి హత్య చేశాడని, పోలీసులు అతనిపై చర్యలు చేపట్టాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేశారు.

బకాయిలు రాక బెస్కాం విలవిల

- బీబీఎంపీ నుంచే రూ.6,374 కోట్ల పెండింగ్

యశవంతపుర: రాష్ట్రాన్ని వెలుగుబాటలో నడిపించే బెస్కాంను చీకట్లు ఆవరించాయి. బకాయిలు సరిగా వసూలు కాక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతోంది. బృహత్ బెంగళూరు మహానగర పాలికె పరిధిలో అనేక ప్రభుత్వరంగ సంస్థలు కోట్ల రూపాయల బాకీ పడ్డాయి. ప్రజలపై భారం మోపి పన్నులు ముక్కుపిండి వసూలు చేసే బీబీఎంపీనే బెస్కాంకు రూ.6,374 కోట్లు చెల్లించాల్సి ఉందని సమాచారం. దీనికితోడు రాష్ట ప్రభుత్వం గృహజ్యోతి యోజనతో బెస్కాం అనేక సమస్యల్లో పడింది. 200 యూనిట్ల మేర ఉచితం కావడంతో బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. దీంతో బెస్కాం ఆర్థిక ఇబ్బందుల్లో పడిందని తెలిసింది.

లోక్‌సభ ఎన్నికలకు దిక్సూచి కాదు

యశవంతపుర: ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చే లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం చూపవని మంత్రి రామలింగారెడ్డి అన్నారు. ఆయన సోమవారం బెళగావిలో విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ ఎక్కువ హామీలు ఇచ్చిందన్నారు. అయినా బీఆర్ఎస్ గెలవలేదన్నారు. తెలంగాణలో కేసీఆర్‌పై వ్యతిరేకత ఉందని, ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. బీజేపీ వద్ద సంపన్మూలాలు ఎక్కువగా ఉన్న కారణంగా మూడు రాష్ట్రాల్లో గెలుపొందిందన్నారు.

భర్తతో గొడవలు.. మహిళ ఆత్మహత్య

క్రిష్ణగిరి: భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవల్లో జీవితంపై విరక్తి చెందిన మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన కందికుప్పం వద్ద చోటుచేసుకొంది. వివరాల మేరకు కందికుప్పం సమీపంలోని తెన్నెయ్యన్‌కొటాయ్ గ్రామానికి చెందిన కూలి కార్మికుడు రాసానియో భార్య అనిత (26). వీరికి గత ఐదేళ్ల క్రితం పెళ్లి జరిగి నాలుగేళ్ల బాలుడున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ పోట్లాటలు జరిగేవి. ఆదివారం రాత్రి ఏర్పడిన గొడవల్లో జీవితంపై విరక్తి చెందిన అనిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. కందికుప్పం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

అన్నదాతలకు శిక్షణ

కెలమంగలం: సంయుక్త వ్యవసాయం వల్ల రైతులకు అందే లాభాలపై సోమవారం కెలమంగలం వ్యవసాయశాఖ ద్వారా ఒక్క రోజు శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. తిమిజేపల్లి పంచాయతీ పరిధిలోని 11 గ్రామాలకు చెందిన రైతులు ఈ శిబిరంలో పాల్గొని శిక్షణ పొందారు. వ్యవసాయ శాఖ ఉపడైరెక్టర్ శ్రీనివాసన్ అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో సంయుక్త వ్యవసాయం చేయడం ద్వారా గ్రామీణ ప్రాంత రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని సూచించారు. డ్రిప్, సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల పంట దిగుబడితదితర అంశాలపై రైతులకు శిక్షణ అందజేశారు.

రోగులకు పండ్లు పంపిణీ

కృష్ణరాజపురం: హొసకోటె ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ పుట్టిన రోజు సందర్భంగా హొసకోటె తాలూకాలో ఉన్న అన్ని అస్పత్రుల్లో టీమ్ శరత్ బచ్చేగౌడ సభ్యుల బృందం రోగులకు పండ్లు, పాలు, బిస్కెట్లు పంపిణీ చేసింది. వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేసింది.

మిచాంగ్ హోరు

మొదటి పేజీ తరువాయి

వర్షపాతం నమోదైంది. ఆయా ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా నీరు చేరింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తీరప్రాంతం అతలాకుతలమైంది. విపరీతమైన ఈదురుగాలులతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల నెల్లూరు నగరం తడిసి ముద్దయింది. పలు ప్రాంతాలు జలదిగ్బంధం అయ్యాయి. ప్రధాన వీధుల్లో రాకపోకలు స్తంభించాయి. రోడ్లపై భారీగా నీరు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారుల్లో మోకాళ్ల లోతు నీళ్లు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అండర్ బ్రిడ్జిలు జలమయం కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. శివారు కాలనీలు నీట మునిగాయి. కృష్ణపట్నం పోర్టులో 10వ నంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. సోమవారం ఉదయం నుంచి బాపట్ల, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఈ మూడు జిల్లాల్లో వర్షాలు, గాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. బాపట్ల, అవనిగడ్డ, మచిలీపట్నం, రేపల్లె తదితర ప్రాంతాల్లో సముద్రపు నీరు లోతట్టు ప్రాంతాల్లోకి చొచ్చుకుని వచ్చే అవకాశం ఉంది. తీరాన్ని దాటే సమయంలో మంగళవారం కోస్తా తీరమంతా తీవ్రమైన గాలులు వీస్తూ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

60 గ్రామాలకు రాకపోకలు బంద్

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో తుపాను బీభత్సం సృష్టిస్తోంది. సుమారు 60 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా, పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రధాన రహదారులలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులను నిలిపివేశారు. గూడూరు నియోజకవర్గంలోని చిట్టమూరు మండలంలో పిట్టవారిపల్లె వద్ద రొయ్యల చెరువులో ఐదుగురు కూలీలు చిక్కుకున్నారు. వెంటనే స్పందించిన పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది సమన్వయంతో వారిని రక్షించారు. చిల్లకూరు మండలంలోని తిప్పగుంట పాళెం వద్ద ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహించడంతో ఆ ప్రాంతంలోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సత్యవేడు నియోజకవర్గంలోనూ 40కి పైగా గ్రామాల్లో రాకపోకలు నిలిచి పోయాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు పదుల సంఖ్యలో నేలకొరిగాయి. విద్యుత్‌ను పునరుద్ధరించడానికి అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. తిరుపతి జిల్లాలో పొలాల్లోని వరి పంట నీట మునిగింది. కాళంగి, మల్లెమడుగు, కళ్యాణీడ్యామ్‌లు, స్వర్ణముఖి, సదాశివకోన, అరణియార్ ప్రాజెక్టులు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోగా ప్రమాదం జరగకుండా ముందు జాగ్రత్తగా గేట్లు ఎత్తివేశారు. స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కరకట్ట దెబ్బతినకుండా జేసీబీల సహాయంతో అధికారులు ఎప్పటికప్పుడు మరమతులు చేస్తున్నారు. ఏర్పేడు మండలం చిందేపల్లి ఎస్టీకాలనీలో ఆదివారం గోడ కూలి యశ్వంత్ అనే బాలుడు మృతి చెందగా తక్షణమే స్పందించిన రెవెన్యూ అధికారులు రూ.4 లక్షలు ఆర్థిక సాయం అందించారు. చలి గాలులకు తట్టుకోలేక సోమవారం వాకాడు మండలం గొల్లపాళెం గ్రామానికి చెందిన బందిల పొందమ్మ (63) అనే వృద్ధ మహిళ మృతి చెందింది. నాగలాపురం మండలం కొట్టకాడు గ్రామంలో సంధ్య అనే మహిళకు సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు పురిటినొప్పులు వచ్చాయి. అయితే తీవ్ర వర్షాల వల్ల ఎక్కడికక్కడ దారులు మూసుకుపోయాయి. దీంతో గ్రామస్తులు, కుటుంబీకులు ఆమెను చేతులతో మోసుకొని వాగు దాటించారు. నగరి నియోజకవర్గ పరిధిలోని కుశస్థలి ఉధృతంగా ప్రవహిస్తోంది. కార్వేటి నగరం మండలంలోని క్రిష్ణాపురం జలాశయంకు అధికంగా వరద నీరు చేరుతోంది. పెనుమూరు మండలంలోని ఎన్టీఆర్ జలాశయం గేటు ఎత్తివేసి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా సోమవారం ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిశాయి. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. అలల ధాటికి పాకల సముద్ర తీరం కోతకు గురైంది. పడవలు, వలలు ఇతర సామాగ్రి సైతం జాగ్రత్త చేసుకునేలా మత్స్యకారులకు అవగాహన కల్పించారు. బాపట్ల జిల్లాలో తుపాన్ కారణంగా సముద్రంలో అలజడి రేగింది. అలలు ఉవ్వెత్తున ఎగిసి తీరంవైపు చొచ్చుకువచ్చాయి. చీరాల, బాపట్ల, నిజాంపట్నం తీరంలో సముద్రం కొంతమేర ముందుకు వచ్చింది. ఈదురు గాలులు పెరిగాయి. చీరాల, బాపట్ల, రేపల్లె ప్రాంతాల్లో సోమవారం సాయంత్రానికి వర్షం పెరిగింది.



విశాఖ తీరంలో ఎగసిపడుతున్న అలలు

పలు జిల్లాల్లో చెదురుమదురుగా వర్షాలు

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని కొన్ని మండలాల్లో అక్కడక్కడ సోమవారం చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రైల్వేకోడూరులో మాత్రం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. రేణిగుంట ప్రధాన రహదారిలో శేషాచల అడవుల నుంచి భారీగా వచ్చిన వరద నీరు రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించింది. మామిడి, అరటి, బొప్పాయి తోటల్లో వర్షపు నీరు నిలిచింది. పల్నాడు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. విజయనగరం జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. పూసపాటిరేగ మండలం చింతపల్లి రేవులో రెడ్ అలర్ట్ ప్రకటించారు. దీంతో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లలేదు. బోట్లను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఆదివారం రాత్రి నుంచి గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

దెబ్బతిన్న కాకినాడ-ఉప్పాడ బీచ్‌రోడ్డు

కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్ర కెరటాలు ఎగిసిపడుతున్నాయి. కాకినాడ-ఉప్పాడ బీచ్‌రోడ్డు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర పూర్తిగా దెబ్బతింది. కెరటాలు బీచ్‌రోడ్డుపైకి దూసుకు వస్తుండడంతో రక్షణగా వేసిన బండరాళ్లు సైతం పక్కకు కదిలిపోతున్నాయి. సోమవారం ఉదయం నుంచి రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ట్రాఫిక్‌ను ఉప్పాడ నుంచి పిఠాపురం మీదుగా మళ్లించారు. సోమవారం ఉదయం సముద్రం ఉగ్రరూపం దాల్చి గ్రామాలపైకి విరుచుకుపడింది. ఈదురు గాలుల ప్రభావం వల్ల పొన్నాడ శివారు కోనపాపపేట తీవ్ర కోతకు గురవ్వగా పలువురు మత్స్యకారుల గృహాలు ధ్వంసమయ్యాయి. సముద్రతీరంలో లంగరు వేసిన బోట్లు ధ్వంసమవుతుండడంతో మత్స్యకారులు తమ బోట్లను, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉప్పాడ తీరం వెంబడి వేసిన జియోట్యూబ్ రక్షణగోడ సైతం కెరటాల ఉధృతిని ఆపలేక ధ్వంసమైంది. పలుచోట్ల అండలు జారడంతో సముద్రపునీరు గ్రామాల్లోకి చొచ్చుకు వస్తోంది. కెరటాలతోపాటు రాళ్లు ఎగిరి పడుతుండడంతోపాటు బీచ్ రోడ్డు కోతకు గురైంది. తీరంలో కెరటాలు సుమారు 8 మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడుతున్నాయి. తీరం వెంబడి పోలీసు, రెవిన్యూ సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశారు.

నేడు, రేపు భారీ వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను తీవ్రరూపం దాలుస్తూ కోస్తాంధ్ర వైపు దూసుకొస్తోంది. గుంటూరు జిల్లా రేపల్లె, ప్రకాశం జిల్లా చీరాల, ఒంగోలు, కృష్ణా జిల్లా మచిలీపట్నం, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటల్లో సముద్రం 120 నుంచి 250 మీటర్ల వరకు ముందుకు చొచ్చుకు వచ్చే అవకాశం ఉందని, ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లేదా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ఐఎండీ సూచించింది. తుపాను ప్రభావం వల్ల మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల అత్యంత భారీ వర్షాలు.. కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, వైఎస్సార్, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు.. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, ఎఎస్సార్, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలకు ఆస్కారం ఉంది. ఫలితంగా తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, యానాం, చిత్తూరు, కర్నూలు, కడప జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తెలంగాణలోని ఖమ్మం, నాగర్ కర్నూలు, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వరదకు అవకాశం ఉందని పేర్కొంది.

చీరాల, బాపట్ల మధ్య తీరం దాటే అవకాశం

మిచాంగ్ తుపాను గత ఆరు గంటలుగా గంటకు 10 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ప్రస్తుతం ఇది నెల్లూరుకు ఆగ్నేయంగా 80 కిలోమీటర్ల దూరంలో, బాపట్లకు ఆగ్నేయ దిశలో 210 కిలోమీటర్లు, మచిలీపట్నానికి దక్షిణంగా 250 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర దిశగా దక్షిణ ఏపీ తీర ప్రాంతాలైన నెల్లూరు, మచిలీపట్నానికి సమాంతరంగా ప్రయాణిస్తూ మంగళవారం మధ్యాహ్నం చీరాల, బాపట్ల మధ్య సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి వంద కిలోమీటర్ల వేగంతో, గరిష్టంగా గంటకు 110 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని ప్రకటించింది. అందుకనుగుణంగా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, ఏపీఎస్‌డీపీఎస్ (ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ అండ్ ప్లానింగ్ సొసైటీ) అధికారులు జిల్లాలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ అప్రమత్తం చేస్తున్నారు. కాగా, తుపాను ప్రభావంతో మంగళవారం రాత్రి వరకు దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. పలుచోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.



తిరుమలలో ఎస్ఎంసీ వద్ద రోడ్డుపై విరిగిన వృక్షం



నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో జలమయమైన రైల్వే అండర్ బ్రిడ్జి

తెలంగాణ

ఓవర్ టు ఢిల్లీ!

తెలంగాణ సీఎం ఎంపిక అధికారాన్ని ఏఐసీసీ అధ్యక్షుడికి కట్టబెడుతూ సీఎల్పీ ఏకవాక్య తీర్మానం

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీ సాధించినా.. ముఖ్యమంత్రి ఎంపిక అంశం కొలిక్కి రాలేదు. సోమవారమంతా భేటీలు, సమావేశాలు, చర్చలు, ఇంకాసేపట్లోనే ప్రమాణ స్వీకారమనే ప్రచారాల మధ్య చివరకు ఈ వ్యవహారం ఢిల్లీకి చేరింది. పార్టీ శాసనసభా పక్షం(సీఎల్పీ) నాయకుడిని నిర్ణయించేందుకు సమావేశమైన కొత్త ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాన్ని వెల్లడించేందుకు మాత్రమే పరిమితమయ్యారు. వారి అభిప్రాయాలను ఢిల్లీకి పంపి.. అధిష్టానం స్పందన కోసం ఎదురుచూసిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని పరిశీలకుల బృందం ఎలాంటి తుది నిర్ణయం ప్రకటించకుండానే హస్తిన బాట పట్టింది. మంగళవారం పార్టీ పెద్దలతో డీకే బృందం భేటీ కానుంది. అనంతరం సీఎం, మంత్రి పదవులు, ఇతర కీలక అంశాలపై తుది నిర్ణయం వెలువడనుందని టీపీసీసీ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. తుది నిర్ణయాన్ని వెలువరించే ముందు అధిష్టానం పెద్దలు మరోసారి టీపీసీసీ ముఖ్యులతో సంప్రదింపులు జరిపే అవకాశం ఉందంటున్నారు. ఈప్రక్రియ ముగిసేందుకు రెండు రోజుల సమయం పడుతుందని చెబుతున్నారు. సీఎంతోపాటు డిప్యూటీ సీఎంలు, మంత్రివర్గ బెర్తులు ఖరారైన తర్వాతే ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించాలన్న అభిప్రాయాల నేపథ్యంలో.. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు ఎప్పుడైనా కొత్త ప్రభుత్వం కొలువు దీరనుందనే చర్చ నడుస్తోంది.

ఏకవాక్య తీర్మానానికి ఆమోదం

సోమవారం ఉదయం 11.30 గంటలకు ఎల్లా హోటల్ వేదికగా కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) సమావేశమైంది. కాంగ్రెస్ నుంచి తాజాగా గెలిచిన 64 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. డీకే శివకుమార్ పర్యవేక్షణలో ఏఐసీసీ పరిశీలకులు కేజే జార్జి, దీపాదాస్‌మున్షీ, అజయ్‌కుమార్, ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శులు కూడా పాల్గొన్నారు. తొలుత పార్టీ ఎమ్మెల్యేలను ఉద్దేశించి డీకే శివకుమార్ మాట్లాడారు. తర్వాత సీఎం అభ్యర్థి ఎంపిక అధికారాన్ని ఏఐసీసీ అధ్యక్షుడికి కట్టబెడుతూ టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఏకవాక్య తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సీఎల్పీ నేత భట్టి దీనిని సమర్థించగా.. మిగతా ఎమ్మెల్యేలంతా ఆమోదించారు.

సీఎం ఎవరైతే బాగుంటుంది!

ఏఐసీసీ పరిశీలకులు సీఎల్పీ సమావేశం తర్వాత ఎమ్మెల్యేలందరితో విడివిడిగా సమావేశమై.. సీఎం ఎవరైతే బాగుంటుందన్న అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ క్రమంలో కొందరు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ పేరు చెప్పగా, మరికొందరు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్లు చెప్పారని, ఇంకొందరు మాత్రం ఏఐసీసీ ఎవరిని ఎంపిక చేసినా తమకు సమ్మతమేనని చెప్పినట్టు సమాచారం. డీకే బృందం ఈ అభిప్రాయాలను వెంటనే ఢిల్లీకి చేరవేసింది. వాటిని హైకమాండ్ పరిశీలించి ఏం చెప్తుందోనని సాయంత్రం వరకు ఎదురుచూసింది. కానీ.. డీకే బృందాన్ని ఢిల్లీ రావాల్సిందిగా అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. దీంతో డీకే శివకుమార్, ఏఐసీసీ పరిశీలకులు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు. సీఎం క్యాండిడేట్‌పై స్పష్టతకు వచ్చాక రాష్ట్రంలోని ముఖ్య నేతలతో చర్చించి, అవసరమైతే వారిని ఢిల్లీకి పిలిపించి మాట్లాడనున్నట్టు సమాచారం. తర్వాత సీల్డ్ కవర్‌లో సీఎం అభ్యర్థి పేరును హైదరాబాద్‌కు పంపి, సీఎల్పీ సమావేశంలో సదరు నేతను ఎన్నుకుంటారని తెలిసింది.

జనంలో ఉందాం!

- ప్రజలకు సంబంధించిన అంశాలపై పోరాడుదాం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నేతలతో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'ప్రజలు వేరే పార్టీకి అవకాశం ఇచ్చినా మనకు గౌరవ ప్రదమైన స్థానాలు కట్టబెట్టారు. ప్రజలు మనకు ఇచ్చిన ప్రతిపక్ష పార్టీ బాధ్యతను విజయవంతంగా నిర్వహిద్దాం. ఓటమితో అధైర్య పడకుండా జనంలో ఉంటూ ప్రజలకు సంబంధించిన అంశాలపై పోరాడుదాం..'అని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు చేరుకున్న కేటీఆర్, బీఆర్‌ఎస్ తరపున ఎన్నికైన ఎమ్మెల్యేలు, పార్టీ అభ్యర్థులు, సీనియర్ నేతలతో భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ కవిత కూడా నిజామాబాద్ జిల్లాకు చెందిన పార్టీ అభ్యర్థులు, ఇతర నేతలతో తెలంగాణ భవన్‌కు వచ్చారు. 'ఎన్నికల తర్వాత ప్రజల నుంచి మన పార్టీ నాయకత్వం విషయంలో సానుకూల స్పందన వస్తోంది. బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోతుందని అనుకోలేదంటూ అన్ని వర్గాల నుంచి వందలాది మెసేజ్‌లు వస్తున్నాయి. తెలంగాణ బాగు కోరుకున్న వారు భావోద్వేగానికి గురవుతూ సందేశాలు పెడుతున్నారు. ఓటమితో నిరాశ చెందకుండా భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుదాం. 'అని కేటీఆర్ అన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు, నేతలు భావోద్వేగానికి గురయ్యారు. సుమారు రెండు దశాబ్దాలకు పైగా పార్టీ అడుగుజాడల్లో నడిచిన తాము ఓటమిని జీర్ణించుకోలేక పోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్త సర్కారుకు శ్రీకారం!

- తెలంగాణలో నూతన ప్రభుత్వ ఏర్పాటు కోసం ప్రారంభమైన ప్రక్రియ
- తాజాగా ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాతో గెజిట్ ప్రకటన
- రెండో శాసనసభను రద్దుచేస్తూ గవర్నర్ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో నూతన ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. రాష్ట్ర మూడో శాసనసభ ఏర్పాటు ప్రక్రియలో భాగంగా.. తాజా ఎన్నికల్లో గెలిచినవారి జాబితాతో కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాశ్ కుమార్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ సోమవారం గెజిట్ జారీ చేశారు. ఆ వెంటనే సీఈఓ వికాస్‌రాజ్ రాజ్‌భవన్‌కు చేరుకుని గవర్నర్ తమిళిసైకు గెజిట్ నోటిఫికేషన్ ప్రతిని అందజేశారు.

తెలంగాణ రెండో శాసనసభ రద్దు

కేసీఆర్ నేతృత్వంలోని మంత్రివర్గం సిఫార్సు మేరకు తెలంగాణ రాష్ట్ర రెండో శాసనసభను రద్దు చేస్తూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రద్దు ఉత్తర్వులు ఆదివారం (డిసెంబర్ 3) మధ్యాహ్నం నుంచే వర్తిస్తాయని పేర్కొన్నారు.

ప్రజాతీర్పును గౌరవిద్దాం

- కొత్త సర్కారుకు సహకరిద్దాం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కేసీఆర్
- త్వరలో పార్టీ శాసనసభా పక్ష నేత ఎన్నిక

సాక్షి, హైదరాబాద్:'రాష్ట్రంలో రాజ్యాంగబద్ధంగా జనవరి 16వ తేదీ వరకు మన ప్రభుత్వం కొనసాగే అవకాశమున్నా ప్రజల తీర్పును గౌరవిస్తూ హుందాగా తప్పుకున్నాం. ప్రజల తీర్పును గౌరవిస్తూ కొత్త ప్రభుత్వానికి సహకరిద్దాం. రాష్ట్ర రాజకీయాలు, పాలనలో భవిష్యత్తులో ఏం జరుగుతుందో వేచి చూద్దాం..' అంటూ భారత్ రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కొత్తగా ఎన్నికై న ఎమ్మెల్యేలు, పలువురు నేతలు కేసీఆర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ అధినేత ఆశీర్వాదం తీసుకున్నారు. 'త్వరలో తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ఫలితాలపై సమీక్ష చేసుకుందాం. ఎన్నికల క్షేత్రంలో గెలుపోటములు అత్యంత సహజం. నిరాశ చెందకుండా ప్రజలతో మమేకమై వారి విశ్వాసాన్ని తిరిగి చూరగొనాల్సిన బాధ్యత నాయకులపైనే ఉంటుంది. అందువల్ల నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉండాలి. త్వరలో పార్టీ శాసనసభ పక్ష నాయకుడిని కూడా ఎన్నుకునేందుకు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకుందాం ..'అని కేసీఆర్ ఈ సందర్భంగా చెప్పారు.

ప్రగతిభవన్ నుంచి ఫామ్‌హౌస్‌కు..

కేసీఆర్ దంపతులు ఆదివారం రాత్రి ప్రగతిభవన్ నుంచి ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కూడా ఒకటి రెండు రోజుల్లో బంజారాహిల్స్ నందినగర్‌లోని తన నివాసానికి మారనున్నారు. వ్యక్తిగత సామానును తరలించే పని జరుగుతున్నట్లు ప్రగతిభవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే కేటీఆర్ జనవాడలోని ఫామ్‌హౌస్ నుంచి రాకపోకలు సాగించే అవకాశమున్నట్లు తెలిసింది.

చెన్నైలో జలప్రళయం

మొదటి పేజీ తరువాయి

చెన్నై, శివారు జిల్లాల్లో 35 సెంటీమీటర్ల వర్షం నమోదైంది. దాంతో వీధులన్నీ వాగులుగా మారాయి. నగరంలో ఎటు చూసినా వరద పోటెత్తింది. ఇళ్లు, పార్కింగ్ ప్రదేశాల్లో ఉన్న వందలాది కార్లు, వాహనాలు వరదల్లో కొట్టుకుపోయాయి! నడుం లోతుకు పైగా నీరు చేరడంతో నగరంలోని అన్ని హైవేలను, సబ్‌వేలను మూసేశారు. రన్ వేపైకి నీరు చేరడంతో చెన్నై విమానాశ్రయాన్ని కూడా మంగళవారం ఉదయం దాకా మూసేస్తున్నట్టు ప్రకటించారు. 160 విమాన సేవలు రద్దయ్యాయి. వండలూరు జూలోకి వరదనీరు పోటెత్తడంతో పెద్ద సంఖ్యలో మొసళ్లు తప్పించుకున్నాయి. దివంగత సీఎం జయలలిత నివాసం, సూపర్‌స్టార్ రజనీకాంత్ వంటి ప్రముఖులుండే పోయెస్ గార్డెన్ హైవే 7 అడుగుల మేర కుంగింది! అక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు, వాహనాలు అందులో పడిపోయాయి. వాన బీభత్సం కొనసాగుతుండటంతో సహాయక చర్యలూ చేపట్టలేని పరిస్థితి ఉంది. ప్రజలంతా ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటున్నారు. మంగళవారం కూడా వర్షాలు కొనసాగుతాయన్న హెచ్చరికలు గుబులు పుట్టిస్తున్నాయి. చెన్నై శివారులోని జాతీయ రహదారి వరద నీటిలో మునగడంతో రాకపోకలు స్తంభించాయి. నగరం, శివార్లలోని చెరువులు, రిజర్వాయర్లు నిండడంతో అడయార్, కూవం నదులు, బకింగ్ హాం కాలువల ద్వారా చెన్నై వైపుగా వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నగరాన్ని చుట్టుముడుతున్న వరదను తొలగించేందుకు ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తోంది. చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు జిల్లాల్లో మంగళవారం కార్యాలయాలు, పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తమిళనాడు సీఎం స్టాలిన్‌తో ఫోన్లో సహాయక చర్యలకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. వేలాది మంది నిర్వాసితులై చెన్నై, శివార్లలో వందలాది శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. వర్షాలకు చెన్నైలో ఐదుగురు మృతి చెందారు. వందలాది రైళ్లు రద్దయ్యాయి.



చెన్నై విమానాశ్రయం రన్‌వేపై భారీగా వర్షపునీరు

47 ఏళ్లలో అతి భారీ వర్షం

తాజా వర్ష బీభత్సం చెన్నై నగరంలో గత 47 ఏళ్లలో అత్యంత భారీ వర్షంగా నమోదైంది. 2015 నాటి కుంభవృష్టిని కూడా మించిపోయింది. మంగళవారం భారీగా వర్షపాతం నమోదు కావచ్చని వాతావరణ కేంద్రం పేర్కొంది.

ఒక్క రైతూ నష్టపోకుండా చర్యలు


- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి కారుమూరి

అత్తిలి/ఇరగవరం: తుపాను వల్ల కురుస్తున్న వర్షాల కారణంగా ఒక్క రైతు కూడా నష్టపోకుండా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. రైతాంగం అధైర్య పడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఆయన సోమవారం పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం, అత్తిలి మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. రోడ్డు పక్కన ఉన్న ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు గత రెండు రోజుల్లో రోడ్డు మీద ఉన్న ధాన్యం మొత్తాన్ని మిల్లులకు తరలించామని తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో మిల్లర్లు కూడా ప్రభుత్వానికి సహకరించాలని చెప్పారు. మిలర్లు వచ్చిన లోడును వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలన్నారు. తేమ శాతం ఎక్కువ ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటుందని వివరించారు. రైతులు ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని, ఇందుకు అధికారులు సహకరించాలని చెప్పారు. వర్షాన్ని సాకుగా చూపించి రైతులను ఇబ్బందిపెడితే రైస్ మిల్లులపై చర్యలు తీసుకుంటామన్నారు.

భయపడొద్దు... అందరినీ ఆదుకుంటాం

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ప్రభుత్వం ప్రతి ఒక్కరినీ ఆదుకుంటుందని, ఎవరూ భయాందోళనలకు గురికావొద్దని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. తీర ప్రాంతాల ప్రజలందరినీ పునరావాస కేంద్రాలకు తరలిరావాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రసాదరాజు సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలోని సముద్ర తీర ప్రాంతమైన చిన మైనవానిలంక, వేములదీవి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి ప్రజలకు తుపాన్‌లను ఎదుర్కోవడం కొత్త కాకపోయినప్పటికీ, అధికారులు అందరినీ అప్రమత్తం చేసినట్టు తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచూ జిల్లా యంత్రాంగంతో సమీక్షిస్తున్నారని ఆయన తెలిపారు. అధిక వర్షాల కారణంగా ఏ ఒక్క రైతూ నష్టపోకూడదన్న ఉద్దేశంతో ధాన్యం సేకరణలో ప్రభుత్వం పలు సడలింపులు ఇచ్చిందన్నారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ రైతులు తమ ధాన్యాన్ని భద్రపరచుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఏ రైస్ మిల్లర్లయినా ఇబ్బంది పెడితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ప్రసాదరాజు

విమాన సర్వీసుల రద్దు

గోపాలపట్నం(విశాఖపశ్చిమ)/ విమానాశ్రయం(గన్నవరం) /రేణిగుంట(తిరుపతి జిల్లా): మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల విశాఖపట్నం, విజయవాడ తిరుపతి విమానాశ్రయాల నుంచి సోమవారం పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. విశాఖ నుంచి చెన్నై, హైదరాబాద్ వెళ్లే ఇండిగో సర్వీసులు, తిరుపతి నుంచి విజయవాడ మీదుగా విశాఖ వచ్చే ఇండిగో విమానం, విశాఖ నుంచి విజయవాడ మీదుగా తిరుపతి వెళ్లే విమాన సర్వీసులను రద్దు చేశారు. ఉదయం ఎనిమిది గంటలలోపు ఢిల్లీ నుంచి రెండు, బెంగళూరు నుంచి ఒక విమానం మాత్రమే విశాఖ విమానాశ్రయానికి వచ్చాయి. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి మంగళవారం బయలుదేరే అన్ని ఇండిగో విమాన సర్వీసులు నిలిపివేశారు. కాగా, విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి ఉదయం పది గంటల వరకు విశాఖ, చెన్నై సర్వీస్‌లు మినహా హైదరాబాద్, బెంగళూరు, న్యూఢిల్లీ సర్వీస్‌లు యథావిధిగా నడిచాయి. అనంతరం ఈదురుగాలులతో కూడిన వర్షం తీవ్రత పెరగడంతో విమాన సర్వీస్‌లను నిలిపివేశారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, షిర్డీ, కడప, తిరుపతి, న్యూఢిల్లీ నుంచి వచ్చి, వెళ్లే 20కి పైగా విమాన సర్వీస్‌లు రద్దయ్యాయి. విమాన సర్వీస్‌లు రద్దు చేసిన విషయాన్ని ప్రయాణికులకు ముందుగానే సమాచారం ఇచ్చినట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు. తుపాను ప్రభావం ఇదేవిధంగా కొనసాగితే మంగళవారం కూడా పలు విమాన సర్వీస్‌లు రద్దయ్యే అవకాశం ఉందని విజయవాడ ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. మరోవైపు తిరుపతి (రేణిగుంట) విమానాశ్రయం రన్ వేపై నీళ్లు చేరడం, వాతావరణం అనుకూలించకపోవడంతో అక్కడికి వచ్చి వెళ్లే 18 విమాన సర్వీసులు రద్దయ్యాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే మంగళవారం కూడా విమానాలు రద్దవుతాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

రైళ్ల రాకపోకలపై తుపాను ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైల్వేశాఖ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. ఉత్తరాది నుంచి దక్షిణాది రాష్ట్రాల మధ్య రైళ్ల రాకపోకలపై ప్రభావం పడింది. దక్షిణ మధ్య రైల్వే నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే సుమారు 150 రైళ్లను అధికారులు ఇప్పటికే రద్దు చేశారు. ముంబై నుంచి హైదరాబాద్ మీదుగా చెన్నై వెళ్లే రైళ్లకు కూడా బ్రేక్ పడింది. కాచిగూడ-చెంగల్పట్టు, హైదరాబాద్-తాంబరం, సికింద్రాబాద్-కొల్లాం, సికింద్రాబాద్-తిరుపతి, లింగంపల్లి-తిరుపతి, సికింద్రాబాద్-రేపల్లె, కాచిగూడ-రేపల్లె, చెన్నై-హైదరాబాద్, సికింద్రాబాద్-గూడూరు, సికింద్రాబాద్-త్రివేండ్రం తదితర ప్రాంతాల మధ్య నడిచే రైళ్లను రద్దు చేశారు. అటు చెన్నై నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లను నిలిపివేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య రైళ్ల రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది. రెండు, మూడు రోజులపాటు పరిస్థితి ఇలాగే కొనసాగనుందని అధికారులు తెలిపారు.

రిపోర్ట్



అయినా భర్త మారలేదు

ఎన్ని కథలు రాసినా
ఎన్ని సినిమాలు తీసినా
ఎన్ని చట్టాలు చేసినా
హింస వల్ల భార్యాభర్తల బంధానికి
ఎంత గట్టి దెబ్బ తగులుతుందో
వార్తల ద్వారా నిత్యం చదువుతున్నా
భర్త మాత్రం మారడం లేదు.
'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో'
(ఎన్.సి.ఆర్.బి.)
డిసెంబర్ 3న విడుదల చేసిన
తాజా నివేదికలో
భార్యల మీద భర్తల హింస
2021తో పోలిస్తే 2022లో
ఇంకా పెరిగిందని తెలిపింది.
ఐదు రాష్ట్రాల ఫలితాలు వెలువడే
రోజున వచ్చిన ఈ నివేదిక
ఎన్ని ప్రభుత్వాలు మారినా మగాణ్ణి
మార్చలేకపోతున్నాయన్న
కఠోర సత్యాన్ని ముందుకు తెచ్చింది.

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న డిసెంబర్ 3వ తేదీన 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' (ఎన్.సి.ఆర్.బి.) ఏటా దేశంలో జరిగే నేరాలపై ఇచ్చే వార్షిక నివేదికను 2022 సంవత్సరానికి విడుదల చేసింది. 2022లో జరిగిన అన్ని నేరాల్లో భార్యలపై భర్తలు నెరపిన హింసాత్మక చర్యల కేసులే ప్రథమ స్థానంలో నిలిచాయని ఈ నివేదిక చెప్పింది. అంటే పెద్ద చదువులు, భారీ జీతాల ఉద్యోగాలు, చట్టాలు, సంఘపరమైన మర్యాదలు... ఏవీ మగాణ్ణి మార్చలేకపోతున్నాయని అతడు రోజురోజుకూ మరింత తీసికట్టుగా తయారవుతున్నాడని ఈ నివేదిక వల్ల అర్థమవుతోంది. తానే సర్వాధికారి అన్నట్టుగా ఇంటి యజమాని స్థానంలో ఉంటూ భార్యతో హింసాత్మకంగానే వ్యవహరిస్తున్నాడు. 'ఇది మగ సమాజం' అని మగవాడు భావించడమే ఇందుకు కారణం. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఎంత మంది స్త్రీలకు సీట్లు దక్కాయో, ఎంతమంది స్త్రీలు గెలిచారో గమనిస్తే అవును.. ఇది మగసమాజం అనుకోకుండా ఉండగలరా ఎవరైనా? కాబట్టి ఎన్నికల ఫలితాల రోజే ఈ నివేదిక వెలువడటం యాదృచ్ఛికం కాదు.

> **4,45,256 కేసులు**
>
> 2022లో స్త్రీలకు జరిగిన హానిపై దేశ వ్యాప్తంగా 4,45,256 కేసులు నమోదయ్యాయి. 2021 కంటే 2022లో ఈ నేరాలు 4 శాతం పెరిగాయి. అయితే ఈ మొత్తం నాలుగున్నర లక్షల కేసుల్లో ప్రథమ స్థానం వహించినవి భార్య మీద భర్త, అతని సంబంధీకులు చేసిన హింసకు సంబంధించినవే కావడం గమనార్హం. రెండవ స్థానం వహించిన కేసులు స్త్రీల కిడ్నాప్. మూడవ స్థానంలో నిలిచిన కేసులు స్త్రీ గౌరవానికి భంగం కలిగించే చర్యలు. నాల్గవ స్థానంలో నిలిచినవి అత్యాచారాలు. అంటే భర్త, కుటుంబ సభ్యుల సంస్కార స్థాయి మెరుగ్గా ఉండి స్త్రీని గౌరవించే విధంగా ఉంటే దాదాపు నగం కేసులు ఉండేవే కావు.

పిల్లలూ బాధితులే

ఈ నివేదికలో మరో బాధాకరమైన వాస్తవం ఏమిటంటే దేశంలో 2022లో స్త్రీల తర్వాత అత్యధికమైన కేసులు నమోదైనవి బాలలకు జరిగిన హానిపై నమోదైనవే. 2022లో పిల్లలపై హింసకు సంబంధించి 1,62,449 కేసులు నమోదయ్యాయి. వీటిలో సగానికి సగం కిడ్నాపులు. మిగిలినవి పోక్సో కేసులు. వీటిలో పిల్లలపై జరిగిన లైంగిక అసభ్యతతో పాటు అత్యాచారాలు కూడా ఉన్నాయి. గమనించాల్సిన సంగతి ఏమిటంటే భార్యాభర్తల మధ్య హింస చోటు చేసుకుంటున్నప్పుడు పిల్లలపై శ్రద్ధ పెట్టే అవకాశం తక్కువ. లేదా తల్లిదండ్రుల తగాదాలను చూసి ఇల్లు వీడే పిల్లలు, ఇంట్లో ఉండలేక వేరే చోట ఆడుకోవడానికి వెళ్లి లైంగిక దాడులకు గురయ్యే పిల్లలు అధికంగా ఉంటారు. అంటే గృహహింస వల్ల కేవలం స్త్రీలే కాక పిల్లలు కూడా బాధితులవుతున్నారని తెలుసుకోవాలి. 2022లో స్త్రీలపై, పిల్లలపై జరిగిన నేరాల తర్వాత 60 ఏళ్లు దాటిన వృద్ధులపై ఎక్కువ నేరాలు జరిగాయి. అంటే మన దేశంలో స్త్రీలు, పిల్లలు, వృద్ధులు ఎక్కువగా హింసను ఎదుర్కొంటున్నారు.

భర్తలూ మారాలి

వివాహం అంటే స్త్రీ పురుషులు కలిసి నడవాల్సిన సమాన వేదిక అనే భావన ఇంకా పురుషుడికి ఏర్పడకపోవడమే స్త్రీలపై నేరాలకు ప్రధాన కారణం. పెళ్లి ద్వారా తనకు భార్య అనే బానిస లేదా సేవకురాలు లేదా తాను అదుపు చేయదగ్గ మనిషి అందుబాటులోకి రాబోతున్నదని పురుషుడు భావిస్తూనే ఉన్నాడు. పైగా 'ఇదంతా మామూలే. తాతలు తండ్రులు చేసిందే నేనూ చేస్తున్నాను' అని తాను నమ్మడమే కాక 'మీ నాన్న మీ తాత చేస్తున్నదే నేనూ చేస్తున్నాను' అని భార్యతో అంటున్నాడు. ఇందుకు భార్య అభ్యంతరం పెడితే, తన నిర్ణయాలను వ్యతిరేకిస్తే, మరొక అభిప్రాయం కలిగి ఉంటే ఆమెపై హింస జరుగుతున్నది. భర్త హింస చేయకపోతే అతని సంబంధీకులు ఇందుకు తెగబడుతున్నారు. గాయపరచడం నుంచి హత్య చేయడం వరకు ఈ దాడులు ఉంటున్నాయి.

నమోదైనవి మాత్రమే

ఎన్.సి.ఆర్.బి. ఈ నివేదికను నమోదైన కేసుల ఆధారంగానే ఇస్తుంది. మన దేశంలో ఎంతమంది భార్యలు కేసుల వరకూ వెళతారో ఊహించవచ్చు. పది శాతం స్టేషన్ దాకా వెళితే 90 శాతం ఇంట్లోనే ఉంటూ ఈ హింసను అనుభవిస్తుంటారు. పురుషులను మార్చడానికి సాహిత్యం, సినిమా, సామాజిక చైతన్యం ఎంతో ప్రయత్నం చేస్తున్నాయి. అయినా సరే పురుషుడు మారకపోతే ఎలా? కాఫీ చల్లారిందని, కూర బాగలేదని, కట్నం పేరుతోనో, ఉద్యోగం చేయవద్దనో, మగ పిల్లాణ్ణి కనలేదనో, పుట్టింటికి తరచూ వెళుతోందని, అత్తింటి వారిని అసలు పట్టించుకోవడం లేదనో ఏదో ఒక నెపం వెతికి హింసకు తెగబడితే ఎలా? భర్తలూ ఆలోచించండి.

మల్టీ టాలెంట్



● కవితా శుక్లా

● చిన్నప్పుడు అమ్మమ్మ ఇంట్లో కవితా శుక్లా

అమ్మమ్మ ఇంట్లో వచ్చిన ఐడియా

జీవితాన్నే మార్చేసింది!

సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి వెళితే ఏం దొరుకుతుంది?
అంతులేని ఆనందం. అయితే అమెరికా నుంచి ఇండియాలో ఉన్న అమ్మమ్మ ఇంటికి వచ్చిన కవితా శుక్లాకు ఆనందంతో పాటు 'ఐడియా' కూడా దొరికింది. ఆ ఐడియా ఆమెను ఇన్వెంటర్‌ని చేసింది. ఆ తరువాత ఎంటర్‌ప్రెన్యూర్‌ను చేసింది.
ఇన్వెంటర్, ఎంటర్‌ప్రెన్యూర్, మోటివేషనల్ స్పీకర్, డిజైనర్‌గా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచింది కవితా శుక్లా...

చిన్నప్పటి నుంచి సైన్స్, కళలు అంటే కవితకు ఆసక్తి. సైన్స్‌లో రకరకాల ప్రయోగాలు చేసేది. తాను ఇన్నోవేటర్ కావడానికి ఆ ప్రయోగాలు పునాదిగా ఉపయోగపడ్డాయి. పదిహేడు సంవత్సరాల వయసులోనే ఎన్నో పేటెంట్లు తీసుకుంది.

'ఫ్రెష్‌పేపర్' రూపంలో ఆహార వ్యర్థాలను తగ్గించే సాంకేతిక ఆవిష్కరణ కవితకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరు తెచ్చింది. ఈ ఫ్రెష్ పేపర్ ఆహారం, కూరగాయలలో బ్యాక్టీరియా, ఫంగస్ పెరుగుదలను నిరోధించి వాటిని ఎక్కువసేపు తాజాగా ఉంచుతుంది. బోస్టన్‌లోని స్థానిక రైతు మార్కెట్‌లో ఫ్రెష్ పేపర్ లాంచ్ చేశారు. మౌత్‌టాక్‌తోనే ఈ పేపర్ పాపులర్ అయింది.

ప్రస్తుతం ఈ ఫ్రెష్‌పేపర్ 180 దేశాల్లో అందుబాటులో ఉంది. 'యూఎస్‌లో ఆహార వృథా అనేది ఇంత పెద్ద సమస్య అని తెలియదు. ఫ్రెష్ పేపర్‌కు వచ్చిన స్పందన నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. పండ్లు, కూరగాయలు, ఆహారాన్ని తాజాగా ఉంచడానికి తద్వారా ఆరోగ్యంగా ఉండడానికి ఇది ఉపయోగపడుతుంది. లోకల్‌ఫుడ్ బ్యాంకులకు వీటిని విరాళంగా ఇచ్చాం' అంటుంది కవిత.

ఫుడ్ ప్రిజర్వేషన్‌కు సంబంధించిన ఆసక్తి కవితలో పదమూడు సంవత్సరాల వయసు నుంచే మొదలైంది. సెలవులు వచ్చినప్పుడు ఇండియాలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది కవిత. ఒకరోజు పొరపాటున కలుషితమైన నీరు తాగింది. ఆందోళన పడిన అమ్మమ్మ వెంటనే కవితతో ఏదో కషాయం తాగించింది. దీంతో కవితకు ఏమీ కాలేదు. అమెరికాకు తిరిగిన వచ్చిన తరువాత కషాయంలో అమ్మమ్మ ఉపయోగించిన పదార్థాల గురించి వివరంగా తెలుసుకోవడం మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే ఆహారపదార్థాలు, కూరగాయలు చెడిపోకుండా సంరక్షించడానికి సంబంధించిన పరిశోధనలు మొదలుపెట్టింది.

జర్మనీలో పుట్టిన కవిత ఇలియట్ సిటీ (యూఎస్)లో పెరిగింది. హార్వర్డ్ యూనివర్శిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ పట్టా పుచ్చుకుంది.

'సింపుల్ ఐడియాలకు మార్పు తెచ్చే శక్తి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఉపయోగించవచ్చు' అంటుంది కవిత.

ఆహార భద్రత, సంరక్షణకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా కృషి చేస్తున్న విశిష్ట వ్యక్తులలో ఒకరిగా పేరు తెచ్చుకున్న కవిత మోటివేషనల్ స్పీకర్ కూడా. ఎన్నో కాలేజీలలో, సమావేశాలలో యువతను ఉద్దేశించి ఉత్తేజకరమైన ప్రసంగాలు చేసింది. ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డ్‌లు అందుకుంది. ఫోర్బ్స్ '30 అండర్ 30: సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్స్' టైమ్ మ్యాగజైన్ '5 మోస్ట్ ఇన్నోవేటివ్ ఉమెన్ ఇన్ ఫుడ్' న్యూస్‌వీక్ '125 ఉమెన్ ఆఫ్ ఇంపాక్ట్' జాబితాలలో చోటు సంపాదించింది.

రెండు సంవత్సరాల క్రితం వర్జీనియాలో జరిగిన వ్యాపారులు, చిన్న వ్యాపారులు, ఇండిపెంటెంట్ ఇన్వెంటర్‌లు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ప్రొఫెషనల్స్ సమావేశంలో కీలక ఉపన్యాసం ఇచ్చింది.

ఇన్వెంటర్ అయిన కవిత 'ఫ్రెష్ గ్లో' కంపెనీతో ఎంటర్‌ప్రెన్యూర్‌గా అద్భుత విజయం సాధించింది.

'మీకు ఏదైనా ఆసక్తిగా అనిపిస్తే దాని గురించి లోతుగా ఆలోచించండి. ఆ తరువాత పరిశోధించండి. ఫలితాలు చేతికి అందేవరకు ప్రయోగాలు చేయండి' అంటుంది కవిత.



> **ఆలోచించండి... అద్భుతాలు చేయండి**
>
> కష్టాల దారిలో ప్రయాణించి విజయాలు సాధించిన ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల గురించి తెలుసుకోవడం అంటే ఇష్టం. వారి గురించి సమావేశాల్లో చెబుతుంటాను. వారి విజయగాథలు ఎంతో మందికి స్ఫూర్తిని ఇస్తాయి. ఆలోచిస్తే ఐడియాలు వస్తాయి. ఆ ఐడియాలతో ఎన్ని గొప్ప పనులైనా చేయవచ్చు. మన ఐడియాను మొదట ఇతరులతో పంచుకోవడానికి భయంగా అనిపిస్తుంది. ఆ భయాన్ని వదులుకొని ఆత్మవిశ్వాసంతో చెప్పండి. ఆత్మవిశ్వాసం ఉన్న చోటుకి విజయం త్వరగా వస్తుంది.
>
> **- కవితా శుక్లా,**
> ఫ్రెష్ గ్లో కంపెనీ ఫౌండర్, సీయీవో

నేడు
ప్రపంచ నేలల దినోత్సవం



వాతావరణ మార్పు వల్ల కరువు, వరదలు, అధిక ఉష్ణోగ్రతలు విరుచుకుపడుతున్న నేపథ్యం ఇది. పంటల సాగు, పశుపోషణ, ఆక్వా సాగులో రైతులు అనేక కష్టనష్టాలకు గురవుతున్న కలికాలం. మనతో పాటు సకల జీవరాశి మనుగడకు నేల, నీరే మూలాధారాలు. నేలను, నీటిని ప్రాణప్రదంగా పరిరక్షించుకుంటూనే సేద్యాన్ని కొనసాగించేలా ఐక్యరాజ్యసమితికి చెందిన వ్యవసాయ ఆహార సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) ప్రజలు, రైతులను చైతన్యవంతం చేస్తూ పాలకులకు దిశానిర్దేశం చేస్తూ ఉంటుంది. రసాయనాల్లేకుండా, లోతుగా దుక్కి దున్నకుండా, ఒకటికి నాలుగు పంటలు కలిపి వేసుకోవటం ద్వారా పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను అనుసరించటం ద్వారా నేలను, నీటిని సంరక్షించుకోవటం సాధ్యమవుతుందని సమాజంలో ప్రతి ఒక్కరం గుర్తించాల్సిన తరుణం ఇది. మానవాళికి 95% ఆహారాన్ని అందిస్తున్న నేలలను పరిరక్షించుకోవాలన్న స్ఫూర్తిని కలిగించడానికి ప్రతి ఏటా డిసెంబర్ 5వ తేదీన ప్రపంచ నేలల లేదా భూముల దినోత్సవాన్ని ఎఫ్.ఎ.ఓ. నిర్వహిస్తోంది. ఈ ఏడాది నినాదం: 'నేల, నీరే జీవరాశి అంతటికీ జీవనాధారం'! ఎఫ్.ఎ.ఓ. ఇంకా ఏం చెబుతోందో చదవండి..





మనకు 95 శాతం ఆహారాన్ని నేలలే అందిస్తున్నాయి. జల శక్తికి జేజేలు.

అతిగా దుక్కి చేస్తూ ఉంటే.. పంటలతో గానీ/ గడ్డీ గాదంతో గానీ ఆచ్ఛాదన కల్పించకపోతే నేల త్వరగా పొడిబారుతుంది. నీటిని పట్టి ఉంచే సామర్థ్యాన్ని 40% మేరకు కోల్పోతుంది.

తేమను నిలుపుకునే సామర్థ్యం కోల్పోయిన నేల పొడిబారుతుంది. వానకు, గాలికి ఎక్కువగా కొట్టుకుపోతుంది. ఇసుక/ దుమ్ము తుపాను గాలులకు అతిగా కోతకు గురవుతుంది. నిస్సారమవుతుంది.



నేల నీరే జీవనాధారం!



infographics courtesy: UNFAO

నేలను, నీటిని వాడుకునే సామర్థ్యాన్ని మనం చాలా మెరుగు పరచుకోవాల్సి ఉంది.









ఆరోగ్యవంతమైన నేల వాన నీటిని అధికంగా పీల్చుకుంటుంది. వడపోసి, శుద్ధి చేసి మరీ భూగర్భంలో నిల్వచేస్తుంది.





8-10 తేదీల్లో విశాఖ ఆర్గానిక్ మేళా

గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, ఏపీ ప్రభుత్వ రైతు సాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 8,9,10 తేదీల్లో విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో సేంద్రియ/ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం మేళా జరగనుంది. విశాఖలో జరుగుతున్న నాలుగో వార్షిక ఆర్గానిక్ మేళా ఇది. 8న ఉ. 10 గంటలకు రైతుల సమ్మేళనం, 9న గ్రాడ్యుయేట్ రైతుల సదస్సు, 10న ఇంటిపంటలపై సదస్సు, 11న సేంద్రియ ఉత్పత్తుల వ్యాపారుల చర్చాగోష్ఠి జరుగుతుందని నిర్వాహకులు కుమారస్వామి తెలిపారు. వివరాలకు.. 78934 56163, 86862 24466.

9, 10 తేదీల్లో సుందర రామన్ శిక్షణ

తమిళనాడుకు చెందిన ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణులు ఎస్.ఆర్. సుందర రామన్ డిసెంబర్ 9,10 తేదీల్లో సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని కామ్యవనంలో రైతులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. రసాయనాలతో సాగుచేస్తున్న భూమిని ప్రకృతి వ్యవసాయంలోకి ఎలా మార్చాలి? నేలలో సేంద్రియ కర్బనం ఎలా పెంచాలి? ఉద్యాన పంటలకు పిచికారీ లేకుండా సమగ్ర పోషకాలు ఎలా అందించాలి? వంటి అనేక ప్రకృతి సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ముందస్తు రిజిస్ట్రేషన్ల వివరాలకు.. 94495 96039, 99490 94730.

11న ప్రకృతి సేద్య కార్యకర్తల సమావేశం

ప్రముఖ ప్రకృతి సేద్య నిపుణులు పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాశ్ పాలేకర్ డిసెంబర్ 11న ఉ.10 నుంచి. మ.1 గం. వరకు హైదరాబాద్ దోమల్‌గూడలోని రామచంద్రమిషన్‌లో ప్రకృతి వ్యవసాయ వ్యాప్తికి కృషి చేసే కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో ముచ్చటిస్తారు. పర్యావరణ సంక్షోభం నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయాన్ని స్వతంత్ర ఉద్యమంగా గ్రామస్థాయిలో రైతుల్లో విస్తరింపజేయటంపై చర్చిస్తారు. వివరాలకు.. సేవ్ స్వచ్ఛంద సంస్థ: 63091 11427.

14 నుంచి పల్లెసృజన శోధాయాత్ర

ప్రకృతితో మమేకమై జీవించే గ్రామీణులు ముఖ్యంగా రైతులు, వృత్తిదారులు, కళాకారుల విజ్ఞానాన్ని తెలుసుకోవటం.. అజ్ఞాతంగా మిగిలిపోయిన గ్రామీణ ఆవిష్కరణలను వెలికితీవటమే లక్ష్యంగా పల్లెసృజన స్వచ్ఛంద సంస్థ శోధాయాత్రలు నిర్వహిస్తోంది. 47వ చిన్న శోధాయాత్ర అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి వెంకట రాజంపేట వరకు డిసెంబర్ 14 నుంచి 17 వరకు జరుగుతుంది. వలంటీర్లు కాలినడకన పయనిస్తూ ప్రజలతో ముచ్చటిస్తారు. ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్ చేసుకొని యాత్రలో పాల్గొనవచ్చు. వివరాలకు.. బ్రిగేడియర్ పి.గణేశం – 98660 01678, 99666 46276, 99859 19342.

15న పాలేకర్ ఫైవ్ లేయర్ క్షేత్ర సందర్శన

వికారాబాద్ జిల్లా ధారూరు మండలం బూరుగడ్డ గ్రామంలో సేవ్ స్వచ్ఛంద సంస్థ సంస్థ వ్యవస్థాపకులు విజయరామ్ సుభాశ్ పాలేకర్ కృషి (ఎస్.పి.కె.) పద్ధతిలో అభివృద్ధి చేసిన ఐదు అంతస్థుల ఉద్యాన పంటల నమూనా క్షేత్రాన్ని డిసెంబర్ 15 (శుక్రవారం)న ఉ. 10.–సా.5 వరకు పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాశ్ పాలేకర్ సందర్శిస్తారు. ప్రతి అంశం వెనుక గల శాస్త్రీయతను పాలేకర్ వివరిస్తారు. 4 రాష్ట్రాల రైతులు పాల్గొంటున్నారు. ప్రసంగం తెలుగు అనువాదం ఉంటుందని విజయరామ్ తెలిపారు. 3 కి.మీ. నడవగలిగిన వారే రావాలి. భోజన ఏర్పాట్లు ఉన్నాయి. నేరుగా వచ్చే వారికి ప్రవేశ రుసుం రూ. 100. హైదరాబాద్ రామకృష్ణమిషన్ దగ్గర గల సేవ్ కార్యాలయం నుంచి బస్సులో వెళ్లే వారికి రూ. 500. ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరి. వివరాలకు.. 63091 11427.




గుకేశ్‌కు రెండో విజయం

లండన్ చెస్ క్లాసిక్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ రెండో విజయం సాధించాడు. ఆండ్రీ వొలోకితిన్ (ఉక్రెయిన్)తో జరిగిన మూడో రౌండ్ గేమ్‌లో తమిళనాడుకు చెందిన గుకేశ్ 28 ఎత్తుల్లో గెలుపొందాడు. అంతకుముందు తొలి గేమ్‌లో గుకేశ్ 41 ఎత్తుల్లో మాటెజ్ బార్టెల్ (పోలాండ్)పై నెగ్గి, విటిగోవ్ (ఇంగ్లండ్)తో జరిగిన రెండో గేమ్‌ను 78 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. పదిమంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు జరుగుతున్న ఈ టోర్నీలో విజేతకు 15 వేల పౌండ్లు (రూ. 15 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి.

భారత బాక్సర్లకు మూడు రజతాలు

ప్రపంచ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు హార్దిక్ (80 కేజీలు), అమిశా (54 కేజీలు), ప్రాచీ (80 ప్లస్ కేజీలు) రజత పతకాలు నెగ్గారు. ఆర్మేనియాలో జరుగుతున్న ఈ పోటీల్లో ఫైనల్స్‌లో హార్దిక్ 2–3తో అశురోవ్ (రష్యా) చేతిలో, అమిశా 0–5తో అయాజాన్ (కజకిస్తాన్) చేతిలో, ప్రాచి 0–5తో షఖోబిద్దినొవా (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయారు. మరో తొమ్మిది విభాగాల్లో భారత బాక్సర్లు ఫైనల్లో పోటీపడనున్నారు.





పుణేరి పల్టన్ బోణీ

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో గత సీజన్ రన్నరప్ పుణేరి పల్టన్ సంచలనంతో బోణీ కొట్టింది. డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌తో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 37–33 పాయింట్ల తేడాతో గెలిచింది. తద్వారా గత సీజన్ ఫైనల్లో జైపూర్ చేతిలో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకుంది. పుణేరి పల్టన్ జట్టు తరఫున కెప్టెన్ అస్లమ్ ముస్తఫా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పది పాయింట్లు సాధించాడు. రెయిడర్ మోహిత్ గోయట్ ఎనిమిది పాయింట్లతో... మొహమ్మద్ రెజా ఐదు పాయింట్లతో రాణించారు. జైపూర్ జట్టు తరఫున అర్జున్ దేశ్వాల్ 17 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచినా తన జట్టును గెలిపించలేకపోయాడు. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 32–30తో బెంగళూరు బుల్స్ జట్టును ఓడించింది. బెంగాల్ తరఫున రెయిడర్లు భరత్ (6 పాయింట్లు), నీరజ్ నర్వాల్ (5 పాయింట్లు), విశాల్ (4 పాయింట్లు) ఆకట్టుకున్నారు. బెంగళూరు జట్టు కెప్టెన్ మణీందర్ సింగ్ 11 పాయింట్లతో మెరిసినా ఫలితం లేకపోయింది.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
గుజరాత్ జెయింట్స్	2	2	0	0	10
తమిళ్ తలైవాస్	1	1	0	0	5
పుణేరి పల్టన్	1	1	0	0	5
యు ముంబా	1	1	0	0	5
బెంగాల్ వారియర్స్	1	1	0	0	5
బెంగళూరు బుల్స్	2	0	2	0	2
యూపీ యోధాస్	1	0	1	0	1
జైపూర్ పింక్ పాంథర్స్	1	0	1	0	1
తెలుగు టైటాన్స్	1	0	1	0	1
దబంగ్ ఢిల్లీ	1	0	1	0	0

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

టైటిల్ లక్ష్యంగా బరిలోకి...

- నేటి నుంచి జూనియర్ పురుషుల హాకీ ప్రపంచకప్ టోర్నీ
- తొలి మ్యాచ్‌లో కొరియాతో భారత్ 'ఢీ'



కౌలాలంపూర్: మూడోసారి విశ్వవిజేతగా నిలవాలనే లక్ష్యంతో... నేటి నుంచి మొదలయ్యే జూనియర్ పురుషుల అండర్–21 హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టు బరిలోకి దిగనుంది. పూల్ 'సి'లో భాగంగా నేడు జరిగే తొలి లీగ్ మ్యాచ్‌లో దక్షిణ కొరియాతో ఉత్తమ్ సింగ్ నాయకత్వంలోని టీమిండియా తలపడనుంది. ఈ మ్యాచ్ తర్వాత భారత జట్టు గురువారం స్పెయిన్‌తో రెండో మ్యాచ్‌ను... శనివారం కెనడాతో మూడో మ్యాచ్‌ను ఆడుతుంది. ఈనెల 16 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు పోటీపడుతున్నాయి. జట్లను నాలుగు పూల్స్‌గా విభజించారు. పూల్ 'ఎ'లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా, ఆస్ట్రేలియా, చిలీ, మలేసియా... పూల్ 'బి'లో ఈజిప్ట్, ఫ్రాన్స్, జర్మనీ, దక్షిణాఫ్రికా... పూల్ 'డి'లో బెల్జియం, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్తాన్ జట్లున్నాయి. ఈనెల 9న లీగ్ మ్యాచ్‌లు ముగిశాక ఆయా పూల్స్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. క్వార్టర్ ఫైనల్స్ 12న, సెమీఫైనల్స్ 14న, ఫైనల్ 16న జరుగుతాయి. ఈ టోర్నీ మ్యాచ్‌లను స్పోర్ట్స్ 18 చానెల్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. 44 ఏళ్ల చరిత్ర కలిగిన జూనియర్ ప్రపంచకప్‌లో భారత జట్టు రెండుసార్లు (2001, 2016) టైటిల్స్ సాధించి, ఒకసారి రన్నరప్‌గా (1997) నిలిచింది.

భారత జట్టు: ఉత్తమ్ సింగ్ (కెప్టెన్), అరైజిత్ సింగ్ (వైస్ కెప్టెన్), ఆదిత్య, సౌరభ్, సుదీప్, బాబీ సింగ్, మోహిత్, రణ్‌విజయ్, శార్దానంద్, అమన్‌దీప్ లాక్రా, రోహిత్, సునీల్, అమీర్ అలీ, విష్ణుకాంత్, పూవణ్ణ, రాజిందర్ సింగ్, అమన్‌దీప్, ఆదిత్య సింగ్.

వన్డే కెప్టెన్‌గా మార్క్‌రమ్

భారత్‌తో సిరీస్‌కు దక్షిణాఫ్రికా జట్ల ప్రకటన



జొహన్నెస్‌బర్గ్: భారత్‌తో సొంతగడ్డపై మూడు ఫార్మాట్‌లలో జరిగే సిరీస్‌ల కోసం దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు తమ జట్లను ప్రకటించింది. వన్డే ప్రపంచకప్‌లో సఫారీ టీమ్‌కు సారథిగా వ్యవహరించిన తెంబా బవుమా, పేసర్ కగిసో రబాడలకు వన్డే, టి20 సిరీస్‌ల నుంచి విశ్రాంతి కల్పించింది. దాంతో ప్రస్తుతం టి20 టీమ్ కెప్టెన్‌గా ఉన్న ఎయిడెన్ మార్క్‌రమ్ వన్డే జట్టుకు కూడా నాయకత్వం వహిస్తాడు. తొలి రెండు టి20లకు మాత్రమే అందుబాటులో ఉండే కొయెట్జీ, జాన్సెన్, ఎన్‌గిడిలతో పాటు బవుమా, రబాడ టెస్టు సిరీస్ కోసం సన్నద్ధమయ్యేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సఫారీ బోర్డు వెల్లడించింది. డేవిడ్ బెడింగమ్, ట్రిస్టన్ స్టబ్స్, నాంద్ర్ బర్గర్‌కు తొలిసారి టెస్టు జట్టులో స్థానం లభించగా... కీపర్ కైల్ వెరీన్, పేసర్ ఎన్‌గిడి టెస్టుల్లో పునరాగమనం చేశారు. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో దక్షిణాఫ్రికాకు ఇదే మొదటి సిరీస్ కానుంది. ఈ పర్యటనలో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా మధ్య 3 టి20లు, 3 వన్డేలు, 2 టెస్టులు జరుగుతాయి.

దక్షిణాఫ్రికా జట్లు: టి20: మార్క్‌రమ్ (కెప్టెన్), హెన్‌డ్రిక్స్, బ్రీజ్‌కే, స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, ఫెరీరా, బర్గర్, జాన్సెన్, కొయెట్జీ, ఫెలుక్‌వాయో, కేశవ్ మహరాజ్, షమ్సీ, విలియమ్స్, బార్త్‌మన్, ఎన్‌గిడి.

వన్డే: మార్క్‌రమ్ (కెప్టెన్), జోర్జి, హెన్‌డ్రిక్స్, వాన్‌డర్ డసెన్, వెరీన్, క్లాసెన్, మిల్లర్, బర్గర్, ముల్డర్, ఎంపొంగ్వానా, ఫెలుక్‌వాయో, కేశవ్ మహరాజ్, షమ్సీ, విలియమ్స్, బార్త్‌మన్.

టెస్టు: బవుమా (కెప్టెన్), బెడింగమ్, బర్గర్, కొయెట్జీ, జోర్జి, ఎల్గర్, జాన్సెన్, కేశవ్ మహరాజ్, మార్క్‌రమ్, ముల్డర్, ఎన్‌గిడి, పీటర్సన్, రబాడ, స్టబ్స్, వెరీన్.

బాబోయ్... భరించలేం!

2026 కామన్వెల్త్ గేమ్స్‌ను నిర్వహించలేమన్న ఆస్ట్రేలియా



గోల్డ్‌కోస్ట్ (ఆస్ట్రేలియా): బ్రిటిష్ రాజ్యమేలిన దేశాల మధ్య ప్రతి నాలుగేళ్లకోసారి అంగరంగ వైభవంగా జరిగే కామన్వెల్త్ క్రీడలు ఆతిథ్య నగరాలకు గుదిబండగా మారాయి. ఆస్ట్రేలియాలాంటి అభివృద్ధి చెందిన దేశాలే నిర్వహణ పెనుభారంగా భావిస్తున్నాయి. మాకొద్దంటే మాకొద్దని ఘనమైన ఆతిథ్యానికి దూరం జరుగుతున్నాయి. తాజాగా 2026 కామన్వెల్త్ క్రీడలను నిర్వహించలేమని ఆస్ట్రేలియాకు చెందిన మరో నగరం గోల్డ్‌కోస్ట్ కూడా వైదొలిగింది. రెండేళ్లలో జరిగే ఈ క్రీడల హక్కుల్ని తొలుత ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రం దక్కించుకుంది. అయితే క్రీడాగ్రామం నిర్మాణం, మౌలిక వసతుల ఏర్పాటు, రవాణా, ఇతరత్రా ఆధునిక సదుపాయాల కల్పన తదితర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని నిర్ధారించుకున్నాక విక్టోరియా ఆతిథ్యం నుంచి తప్పుకుంటున్నట్లు ఈ జూలైలోనే వెల్లడించింది. దీంతో 2018లో ఈ క్రీడల్ని విజయవంతంగా నిర్వహించిన గోల్డ్‌కోస్ట్ మరోసారి ఆతిథ్యమిచ్చేందుకు ముందుకొచ్చింది. అయితే 700 కోట్ల డాలర్లకు పైగా వ్యయమయ్యే ఈ క్రీడల ఆతిథ్యాన్ని మరోసారి భరించడం కష్టమని వివరిస్తూ గోల్డ్‌కోస్ట్ కూడా ఈ క్రీడల నిర్వహణ బాధ్యతల నుంచి వైదొలిగింది. ఇతర ప్రత్యామ్నాయాలు చూసుకోవాల్సిందిగా కామన్వెల్త్ క్రీడల సమాఖ్య (సీజీఎఫ్)కు గోల్డ్‌కోస్ట్ నగర మేయర్ టామ్ టేట్ సూచించారు. ఆస్ట్రేలియా కాకుండా మరో మూడు దేశాలు కామన్వెల్త్ క్రీడల కోసం ఆసక్తి చూపిస్తున్నాయని చెబుతున్నప్పటికీ అనుకున్నట్లుగా 2026లో కామన్వెల్త్ గేమ్స్ జరిగే అవకాశాలు లేవు. ఒకవేళ జరిగితే మాత్రం మరుసటి ఏడాది (2027) జరగొచ్చు.

కృతిక శుభారంభం

జాతీయ అండర్–13 చెస్ టోర్నీ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్–13 చెస్ చాంపియన్‌షిప్‌లో బాలికల విభాగంలో తెలంగాణ అమ్మాయి బి.కృతిక శుభారంభం చేసింది. తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగిన తొలి రౌండ్‌లో కృతిక 80 ఎత్తుల్లో బోరెలి సిసిక (తమిళనాడు)పై గెలిచింది. మరో గేమ్‌లో నీనా గోర్లి (ఆంధ్రప్రదేశ్) 36 ఎత్తుల్లో శ్రీథనియా (తమిళనాడు)ను ఓడించింది. దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ (ఎస్‌సీఆర్‌ఎస్‌ఏ) చెస్ సెక్రటరీ ప్రియా అగర్వాల్, అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) అధ్యక్షుడు సంజయ్ కపూర్ ఈ టోర్నీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 'డబుల్ ఒలింపియన్', ఎస్‌సీఆర్‌ఎస్‌ఏ స్పోర్ట్స్ ఆఫీసర్ జేజే శోభ, ఏఐసీఎఫ్ కోశాధికారి నరేశ్ శర్మ, టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

వెస్టిండీస్ సంచలన విజయం

- షై హోప్ అజేయ సెంచరీ
- ఇంగ్లండ్‌తో తొలి వన్డే



షై హోప్

నార్త్ సౌండ్ (ఆంటిగ్వా): వెస్టిండీస్ వన్డే కెప్టెన్ షై హోప్ (83 బంతుల్లో 109 నాటౌట్; 4 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో తమ జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. సర్ వివియన్ రిచర్డ్స్ స్టేడియంలో జరిగిన తొలి వన్డేలో విండీస్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 325 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (72 బంతుల్లో 71; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా...జాక్ క్రాలీ (48), ఫిల్ సాల్ట్ (45), స్యామ్ కరన్ (38) రాణించారు. మోతీ, ఒషాన్, షెఫర్డ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం వెస్టిండీస్ 48.5 ఓవర్లలో 6 వికెట్లకు 326 పరుగులు చేసి విజయాన్నందుకుంది. వన్డేల్లో విండీస్‌కు ఇది రెండో అతి పెద్ద లక్ష్యఛేదన కావడం విశేషం. 39 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 214/5 వద్ద విండీస్‌కు విజయావకాశాలు తక్కువగా కనిపించాయి. అయితే రొమారియో షెఫర్డ్ (28 బంతుల్లో 48; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడైన బ్యాటింగ్ పరిస్థితి మార్చింది. హోప్, షెఫర్డ్ ఆరో వికెట్‌కు 51 బంతుల్లోనే 89 పరుగులు జోడించారు. చివరి 2 ఓవర్లలో 19 పరుగులు చేయాల్సిన దశలో స్యామ్ కరన్ వేసిన ఓవర్లో హోప్ 3 సిక్సర్లు బాది ఆట ముగించాడు. ఈ క్రమంలో వన్డేల్లో హోప్ 16వ సెంచరీ పూర్తయింది. చివరి 9.5 ఓవర్లలో విండీస్ 112 పరుగులు సాధించింది. మరోవైపు స్యామ్ కరన్ వన్డేల్లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక పరుగులు (98) ఇచ్చిన బౌలర్‌గా నిలిచాడు.

'బైజూస్'కు నోటీసులు

బీసీసీఐకి రూ. 158 కోట్లు బాకీ

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి బాకీ పడిన రూ. 158 కోట్లకు సంబంధించి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) 'బైజూస్' సంస్థకు నోటీసులు జారీ చేసింది. భారత క్రికెట్ బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌కు స్పందిస్తూ ఎన్‌సీఎల్‌టీ ఈ నోటీసులు ఇచ్చింది. 'దీనిపై స్పందించేందుకు బైజూస్‌కు రెండు వారాల గడువు ఇచ్చాం. ఆపై మరో వారం రోజుల్లో బీసీసీఐ తమ అభ్యంతరాలను దాఖలు చేయాలి' అని ఆదేశించిన ఎన్‌సీఎల్‌టీ... ఈ కేసును డిసెంబర్ 22కు వాయిదా వేసింది. 2019లో భారత క్రికెట్ జట్టు ప్రధాన స్పాన్సర్‌గా వచ్చిన బైజూస్ సంస్థ తర్వాతి రోజుల్లో దివాళా తీయడంతో బీసీసీఐకి రూ. 158 కోట్లు బాకీ పడింది.

సినిమా



నాగార్జున

లవ్.. యాక్షన్.. రొమాన్స్

హీరో నాగార్జున, తమిళ దర్శకుడు అనిల్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనుందనే టాక్ కొన్ని రోజులుగా ఫిల్మ్‌నగర్ వర్గాల్లో వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి 'లవ్.. యాక్షన్.. రొమాన్స్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని, తమిళ నిర్మాత జ్ఞానవేల్ రాజా ఈ సినిమాను నిర్మిస్తారనే ప్రచారం జరుగుతోంది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా తెరకెక్కనుందట. ఇక ప్రస్తుతం 'నా సామిరంగ' చిత్రంతో బిజీగా ఉన్నారు నాగార్జున.

నాన్నగారి ప్యాషన్ మమ్మల్ని నిలబెట్టింది

\- అల్లు అరవింద్



శరత్ మరార్, రాజీవ్ చిలక, అల్లు అరవింద్, శ్రీనివాస్ చిలక

''మా నాన్నగారు (అల్లు రామలింగయ్య) సినిమా ఇండస్ట్రీలో పని చేయాలనే లక్ష్యంతో పెట్టె సర్దుకుని అమ్మని ఊళ్లోనే వదిలేసి చెన్నై వెళ్లారు. ఆ ప్యాషనే ఈరోజు మమ్మల్ని ఇక్కడ నిలబెట్టింది. దాన్ని ప్యాషన్ అనో, పిచ్చి అనో అనుకున్నా పర్లేదు. అలాంటి పిచ్చి ఉన్న రాజీవ్ అంటే నాకు తెలియని ప్రేమ, అభిమానం. ఆయన చిత్ర పరిశ్రమలోకి రావడం సంతోషంగా ఉంది'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. యానిమేషన్ రంగంలో గుర్తింపు సంపాదించుకున్న గ్రీన్ గోల్డ్ గ్రూప్ అధినేతలు రాజీవ్ చిలక, శ్రీనివాస్ చిలక 'చిలక ప్రొడక్షన్' బ్యానర్ పేరుతో చిత్ర నిర్మాణ రంగంలోకి ఎంట్రీ ఇచ్చారు. ఈ బ్యానర్ లోగోను నిర్మాతలు అల్లు అరవింద్, శరత్ మరార్ విడుదల చేశారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''రాజీవ్ చేసిన 'చోటా భీమ్'ని నేను తెలుగులో రిలీజ్ చేశాను. రాజమౌళి దగ్గరున్న ప్యాషన్‌ని రాజీవ్‌లో చూశాను'' అన్నారు. ''సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్న శ్రీనివాస్, రాజీవ్‌లకు అభినందనలు'' అన్నారు శరత్ మరార్. రాజీవ్ చిలక మాట్లాడుతూ– ''లయన్ కింగ్' సినిమా చూసి ఇలాంటి సినిమాను ఇండియాలో ఎందుకు తీయకూడదు? అనిపించింది. అలాంటి యానిమేషన్ సినిమా చేయాలనే లక్ష్యంతోనే 'గ్రీన్ గోల్డ్ సంస్థ'ని ప్రారంభించాం. మా చిలక ప్రొడక్షన్‌లో ప్రస్తుతానికి రెండు తెలుగు సినిమాలు, హిందీలో ఓ చిన్న పిల్లల సినిమా నిర్మిస్తున్నాం'' అన్నారు. ''2004లో కృష్ణ యానిమేషన్ సిరీస్‌ను ఆరంభించాం. 2008లో ఆరంభించిన 'చోటా భీమ్' ఇప్పటికీ సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ ప్రయాణంలో భాగంగా సినిమాలు నిర్మించడానికి చిలక ప్రొడక్షన్స్‌ని స్టార్ట్ చేశాం'' అని శ్రీనివాస్ చిలక అన్నారు.

అమ్మాడి.. నాకో పెద్ద సవాల్!

\- మృణాల్ ఠాకూర్



''హాయ్ నాన్న' చిత్రం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందింది. భావోద్వేగాలూ ఉంటాయి. దర్శకుడు శౌర్యువ్‌కి ఇది తొలి సినిమా అయినా ఎక్కడా కొత్త దర్శకుడితో పని చేస్తున్నామనే ఫీలింగ్ రాలేదు. తన విజన్, అప్రోచ్ చాలా క్లారిటీగా ఉన్నాయి. శౌర్యువ్ సృష్టించిన మ్యాజిక్‌ని ఈ గురువారం ప్రేక్షకులు చూస్తారు'' అని హీరోయిన్ మృణాల్ ఠాకూర్ అన్నారు. శౌర్యువ్ దర్శకత్వంలో నాని, మృణాల్ ఠాకూర్ జంటగా శ్రుతీహాసన్, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా మృణాల్ ఠాకూర్ పంచుకున్న విశేషాలు.

- 'సీతారామం' సినిమా తర్వాత నన్ను మరిన్ని వైవిధ్యమైన పాత్రల్లో చూడాలని ప్రేక్షకులు అనుకుంటున్నారు. వారిని అలరించేందుకు నా మనసుకు దగ్గరైన పాత్రలు, సినిమాలు చేయడంపై దృష్టి పెట్టాను. 'సీతారామం' హిట్ తర్వాత నేను చేసిన 'హాయ్ నాన్న'పై అంచనాలుంటాయి. వాటికి తగ్గట్టు చాలా అద్భుతమైన కథ ఇది. ఇందులో నేను యష్ణ, నానీగారు విరాజ్ పాత్రల్లో నటించాం. తెరపై విరాజ్, యష్ణ ప్రయాణాన్ని చూసిన ప్రేక్షకులు తప్పకుండా వారితో ప్రేమలో పడిపోతారు.
- కథని, పాత్రలని బలంగా నమ్మి యూనిట్ అంతా నిజాయితీతో చేసిన సినిమా ఇది. ఇందులో నా పాత్ర న్యూ ఏజ్ అమ్మాయిగా ఉంటుంది. ఈ మూవీలోని మానవీయ బంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులకు నచ్చుతాయి. ఈ సినిమాలో పాట పాడటం సవాల్‌గా అనిపించింది. ఇందులో 'అమ్మాడి..' పాటలో ప్రతి పదాన్ని ట్యూన్‌కి తగ్గట్టు లిప్ సింక్ చేయాలి. అది నాకు చాలా సవాల్‌గా అనిపించింది. ఈ పాటకి అనంత శ్రీరామ్‌గారు మంచి సాహిత్యం అందించారు.
- నానీగారు చాలా సపోర్టివ్. షూటింగ్‌లో నాకు ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు. మోహన్, విజయేందర్ రెడ్డి గార్లు ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్. రాజీపడకుండా సినిమాకి కావాల్సిన ప్రతిదీ సమకూర్చారు. ఈ మూవీలో రాక్ స్టార్ ఎవరంటే బేబీ కియారానే. తన పాత్ర ప్రేక్షకుల మనసుని హత్తుకుంటుంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం, నేపథ్య సంగీతం అద్భుతం. సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు సంగీతాన్ని చాలా ఎంజాయ్ చేస్తారు.
- మా నాన్న నా బిగ్గెస్ట్ ఇన్‌స్పిరేషన్. ఈ రోజు నేనీ స్థాయిలో ఉండటానికి కారణం ఆయనే. ఎన్ని సమస్యలున్నా హాయిగా నవ్వుతూ జీవితాన్ని గడపాలని నేర్పించారు. మంచి విషయాలు జరగడానికి సమయం పడుతుందని, జీవితంలో ఓర్పుతో ఉండాలని చెబుతుంటారు. నాన్నే నా జీవితానికి మూలస్తంభం. ఇండస్ట్రీలో నేను ఇంకా ఎంతో ఎత్తుకు ఎదగాలి. ఇంకా మంచి మంచి సినిమాలు, పాత్రలు చేయాలి. ప్రేక్షకులకు నా పేరు గుర్తు ఉండకపోయినా పర్లేదు కానీ, సీత.. యష్ణ.. ఇలా చేసిన పాత్రలతో నేను గుర్తుండిపోవాలి. దాని కోసం నిజాయితీగా కష్టపడి పని చేస్తాను. ప్రస్తుతం తెలుగులో 'ఫ్యామిలీ స్టార్', హిందీలో పలు సినిమాల్లో నటిస్తున్నాను.



గొర్రెల సుబ్రహ్మణ్యం, సుమంత్ జి. నాయుడు, సుధీర్‌బాబు, జ్ఞానసాగర్

నా కెరీర్‌లో గేమ్ చేంజర్ అయ్యే చిత్రమిది

\- సుధీర్ బాబు

''హరోం హర' సినిమా కోసం యూనిట్ అంతా చాలా కష్టపడ్డాం. ఒక్కో రోజు సెట్స్‌లో వెయ్యిమంది ఉండేవారు. మంచి ఎమోషన్స్, హై కమర్షియల్ కంటెంట్ ఉన్న చిత్రమిది. ఇందులో చాలా బలమైన పాత్ర చేశాను. ఈ సినిమా నా కెరీర్‌లో గేమ్ చేంజర్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు సుధీర్ బాబు. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుధీర్ బాబు హీరోగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ జి. నాయుడు నిర్మించిన పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. మాళవికా శర్మ హీరోయిన్. హైదరాబాద్‌లో యూనిట్ నిర్వహించిన ఈ చిత్రం టీజర్ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో సుధీర్ బాబు మాట్లాడుతూ– ''సుమంత్ జి. నాయుడు వంటి నిర్మాతలు చిత్ర పరిశ్రమకు రావాలి. మైత్రీ, సితార, వైజయంతి.. లాంటి బ్యానర్స్‌లానే కథని నమ్మి ఎంతైనా ఖర్చు పెట్టే నిర్మాణ సంస్థగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పరిశ్రమలోకి వచ్చినట్లేనని నమ్ముతున్నాను. నా కోసమే ఈ చిత్రకథ రాసుకొచ్చిన సాగర్‌కి థ్యాంక్స్'' అన్నారు. ''నా రెండో చిత్రానికి ఇంత హై బడ్జెట్ ఇస్తారని ఊహించలేదు. మంచి సినిమా చేశాం'' అన్నారు జ్ఞానసాగర్. ''నిర్మాతగా ఇది నా తొలి చిత్రం. టీజర్‌కి వస్తున్న స్పందన చూస్తుంటే ఓ మంచి సినిమా చేశాననే నమ్మకం వచ్చింది'' అన్నారు సుమంత్ జి. నాయుడు. ఈ వేడుకలో కెమెరామేన్ అరవింద్, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

పట్టు కోల్పోవడం వల్లే ప్రమాదం



రితికా సింగ్

'గురు' ఫేమ్ రితికా సింగ్ ఓ యాక్షన్ సీన్‌లో గాయపడ్డారు. హీరో రజనీకాంత్ నటిస్తున్న 170వ సినిమాకి టీజీ జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో రితికా సింగ్ నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో తాను గాయపడ్డట్లు ఆమె పేర్కొని, చేతులపై అక్కడక్కడా గీసుకుపోయి రక్తం వస్తున్న ఫొటోను పోస్ట్ చేశారు. ''తలైవర్ 170' సెట్‌లో అనుకోని ఘటన జరిగింది. క్షణాల్లో జరిగిపోయేవాటిని మనం ఆపలేం. నేను పట్టు కోల్పోవడం వల్లే ఇలా జరిగింది. షూటింగ్ స్పాట్‌లో ఉన్న ఒక గాజు అద్దం ఈ ప్రమాదానికి కారణమైంది. చిత్రీకరణ సమయంలో ఒక్కోసారి ఇలాంటివి జరుగుతూ ఉంటాయి. ఈ గాయం వల్ల షూటింగ్‌కి బ్రేక్ ఇచ్చాను. కోలుకున్న తర్వాతే చిత్రీకరణలో పాల్గొంటాను'' అన్నారు రితికా సింగ్.

కాన్సెప్ట్ కొత్తగా ఉంది

\- దర్శకుడు విక్రమ్ కె. కుమార్



వెంకట్, విక్రమ్ కె. కుమార్

''తికమక తాండ' ట్రైలర్ చాలా ఆసక్తిగా ఉంది. వెంకట్ ఎంచుకున్న కాన్సెప్ట్ కొత్తగా అనిపించింది. తనకు పెద్ద విజయం చేకూరాలి. అలాగే ఆరిస్టులు హరికృష్ణ, రామకృష్ణ, యాని, రేఖా నిరోషాలకు మంచి పేరు రావాలి'' అని దర్శకుడు విక్రమ్ కె. కుమార్ అన్నారు. హరికృష్ణ, రామకృష్ణ, యాని, రేఖా నిరోషా హీరో హీరోయిన్లుగా వెంకట్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'తికమక తాండ'. తిరుపతి సత్యం సమర్పణలో తిరుపతి శ్రీనివాసరావు నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ని విక్రమ్ కె. కుమార్ రిలీజ్ చేశారు. ''ఇప్పటికే విడుదల చేసిన పాటలు, టీజర్‌కి మంచి స్పందన లభించింది. ఈ నెల 15న సినిమాని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, కెమెరా: హరికృష్ణన్.

ప్రేమలో వరలక్ష్మి



ఆషిక

కలర్‌ఫుల్ లంగా, ఓణీ, పసందైన ఆభరణాలు, చేతికి మట్టి గాజులు.. ఇలా సంప్రదాయబద్ధంగా ముస్తాబైంది వరలక్ష్మి. ఇంత అందంగా కనిపిస్తున్న వరలక్ష్మి వైపు కొంటెగా చూస్తూ.. బీడీ కాలుస్తుంటాడా అబ్బాయి. కట్ చేస్తే.. అద్దంలో చూసుకుంటూ అతనిలా బీడీ కాలుస్తున్నట్లు ఖాళీ చేతులతో అనుకరిస్తుంది వరలక్ష్మి. ఈసారి ఈ బ్యూటీ నలుపు రంగు చీరలో ఆ అబ్బాయికి దర్శనమిస్తుంది. అదే కొంటె చూపు విసురుతాడు. వరలక్ష్మి సిగ్గు పడిపోతుంది. ఇద్దరి మధ్య ప్రేమ మొదలైంది అనడానికి ఇంతకన్నా ఏం కావాలి? నాగార్జున హీరోగా ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటిస్తున్న 'నా సామి రంగ' చిత్రం నుంచి రిలీజైన గ్లింప్స్‌లో పైన పేర్కొన్న దృశ్యాలు కనిపించాయి. మాస్ లుక్‌లో నాగార్జున, ట్రెడిషనల్ లుక్‌లో ఆషికా రంగనాథ్ కనిపించారు. ఈ చిత్రంలో ఆషికా పాత్ర పేరు వరలక్ష్మి అని పేర్కొని, ఆమె లుక్, గ్లింప్స్‌ని రిలీజ్ చేశారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నిని దర్శకునిగా పరిచయం చేస్తూ శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. సంక్రాంతికి రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. కీరవాణి, సమర్పణ: పవన్ కుమార్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,384	68,865
నిఫ్టీ ▲	419	20,687

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	14,161	▼ 144
డోజోన్స్	36,128	▼ 116
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,521	▼ 9
డాక్స్	16,439	▲ 41
షాంఘై	3,023	▼ 9
నికాయ్	33,231	▲ 200

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	63,281
బంగారం (99.5 స్వచ్ఛత)	63,028
వెండి (కేజీ)	76,430

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.52	84.19
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.73	107.11
€	యూరో	ఎస్‌బీఐ	89.20	92.30
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.99	57.71
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.38	56.75
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	54.31	56.29
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.27	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.80	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.56	12.63

బీజేపీకి జై.. సూచీలు రయ్..!

కొత్త శిఖరాలపై సెన్సెక్స్, నిఫ్టీ

18 నెలల్లో ఒక రోజు అతిపెద్ద లాభం

ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త రికార్డులు



ముంబై: అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఓటర్లు మూడు రాష్ట్రాల్లో బీజేపీకి 'జై' కొట్టడంతో సోమవారం స్టాక్ సూచీలు ఏకంగా రెండు శాతం ర్యాలీ చేశాయి. ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాల నమోదు ఉత్సాహాన్నిచ్చాయి. ద్రవ్యోల్బణం దిగిరావడంతో అంతర్జాతీయంగా వడ్డీ రేట్ల పెంపు భయాలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర 80 డాలర్లకు దిగువకు చేరుకుంది. ఫలితంగా సూచీలు 18 నెలల్లో (మే 20, 2022 తర్వాత) అతిపెద్ద ఒక రోజు లాభాన్ని ఆర్జించాయి. సెన్సెక్స్ 1,384 పాయింట్లు పెరిగి 68,865 ముగిసింది. నిఫ్టీ 419 పాయింట్లు బలపడి 20,687 వద్ద స్థిరపడింది. ఇరు సూచీలకు ఇది జీవితకాల గరిష్ట ముగింపు.

ట్రేడింగ్‌లోనూ జీవితకాల గరిష్టాల నమోదు

జాతీయ, అంతర్జాతీయ సానుకూల పరిణామాల నేపథ్యంలో ఉదయం సూచీలు భారీ లాభంతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 945 పాయింట్లు పెరిగి 68,435 వద్ద, నిఫ్టీ 334 పాయింట్ల లాభంతో 20,602 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. మీడియా తప్ప అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు స్థిరమైన లాభాలతో ట్రేడయ్యాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇంధన షేర్లు రాణించడం ఓ దశలో సెన్సెక్స్ 1,437 పాయింట్లు దూసుకెళ్లి 53 ట్రేడింగ్ సెషన్ల తర్వాత 68,918 వద్ద కొత్త జీవితకాల గరిష్ట స్థాయిని నమోదు చేసింది. నిఫ్టీ 435 పాయింట్లు ఎగసి 20,703 వద్ద రెండో రోజూ రికార్డు ర్యాలీ చేసింది.

ఆల్‌టైం హైకి ఇన్వెస్టర్ల సంపద

సెన్సెక్స్ రెండుశాతం ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.5.81 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి రూ. 343.48 లక్షల కోట్లకు చేరింది. కాగా అయిదు రోజుల ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.14.76 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.

- సూచీల రికార్డు ర్యాలీని అందిపుచ్చుకున్న అదానీ షేర్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 9%, అంబుజా సిమెంట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 7%, అదానీ పోర్ట్స్, ఏసీసీ 6%, అదానీ పవర్, అదానీ ఎనర్జీ 5%, అదానీ టోటల్ గ్యాస్ 4%, ఎన్‌డీటీవీ 3%, అదానీ విల్మార్ 2% చొప్పున లాభపడ్డాయి. మొత్తం పది కంపెనీల షేర్లూ రాణించడంతో ఇంట్రాడేలో గ్రూప్ సంయుక్త మార్కెట్ క్యాపిటలైజేషన్ జనవరి 31 తర్వాత తొలిసారి రూ.12 లక్షల కోట్లను తాకింది. చివరికి రూ.11.95 లక్షల కోట్ల వద్ద ముగిసింది.
- ప్రభుత్వ, ప్రైవేట్ రంగ షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. ఐసీఐసీఐ బ్యాంక్ 5%, ఎస్‌బీఐ 4%, కోటక్ బ్యాంక్, పీఎన్‌బీ, ఇండస్ ఇండ్, బంధన్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు 3% లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, ఏయూ బ్యాంక్‌లు 2%, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లు ఒకశాతం పెరిగాయి. ఫలితంగా ఎన్‌ఎస్‌ఈలో బ్యాంక్ నిఫ్టీ 91 ట్రేడింగ్ సెషన్ల తర్వాత 46,484 వద్ద కొత్త ఆల్‌టైం హైని నమోదు చేసింది.



అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయంతో వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడుతుందని మార్కెట్ వర్గాలు విశ్వసించాయి. ద్రవ్యోల్బణం తగ్గడం, స్థూల ఆర్థిక అంశాలు మెప్పించడంతో రానున్న రోజుల్లో ఎఫ్‌ఐఐల కొనుగోళ్లు కొనసాగొచ్చు. రికార్డు ర్యాలీ నేపథ్యంలో స్థిరీకరణ జరిగితే నిఫ్టీకి 20,400 వద్ద తక్షణ మద్దతు లభిస్తుంది.

– వినోద్ నాయర్, జియోజిత్ ఫైనాన్స్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్

పసిడి.. పరుగో పరుగు!

- అంతర్జాతీయంగా, దేశీయంగా ఆల్‌టైమ్ గరిష్టానికి...
- ఢిల్లీలో 10 గ్రాములు రూ. 64,300కు అప్

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా బంగారం ధరల రికార్డు పరుగు ప్రభావం భారత్ బులియన్ మార్కెట్‌లో కనబడింది. దేశ రాజధానిలో పసిడి 10 గ్రాముల ధర సోమవారం అంతక్రితం ముగింపుతో పోల్చితే రూ.450 పెరిగి రూ.64,300 రికార్డు స్థాయికి చేరినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ పేర్కొంది. ఇక ముంబైలో ధర సోమవారం క్రితం (శుక్రవారం ముగింపు)తో పోల్చితే 99.9 స్వచ్ఛత 10 గ్రాముల ధర రూ.553 పెరిగి రూ.63,281కి ఎగసింది. 99.5 స్వచ్ఛత ధర రూ.551 ఎగసి రూ.63,028ని చూసింది. ఇక వెండి విషయానికి వస్తే, రెండు నగరాల్లో దాదాపు స్థిరంగా ఉన్నాయి. ఢిల్లీలో వెండి కేజీ ధర రూ.80,200 పలికితే, ముంబైలో ఈ విలువ రూ.76,430గా ఉంది.

విజయవాడ మార్కెట్లో తీరిది...

గడిచిన రెండు రోజుల్లో విజయవాడ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,250 పెరిగి రూ.64,200కు చేరింది. డిసెంబర్1న రూ.62,950 గా ఉన్న బంగారం ధర ఒకేరోజు రూ.810 పెరిగి రూ.63,760కు చేరగా, తాజాగా సోమవారం మరో రూ.440 పెరిగి రూ.64,200కు చేరింది. ఇదే సమయంలో 22 క్యారట్ల ఆభరణాల పది గ్రాముల బంగారం ధర రూ.1,150 పెరిగి రూ.57,700 నుంచి రూ.58,850కు పెరిగింది.



అంతర్జాతీయ ప్రభావం...

అంతర్జాతీయ కమోడిటీ ఫ్యూచర్స్ మార్కెట్లో ఫిబ్రవరికి సంబంధించి క్రియాశీలంగా ట్రేడ్ అవుతున్న పసిడి ఔన్స్ (31.1 గ్రాములు) ధర తాజాగా రికార్డు స్థాయిలో 2,151 డాలర్లను తాకింది. అయితే లాభాల స్వీకరణ నేపథ్యంలో ఈ వార్త రాసే రాత్రి 11 గంటల సమయానికి 2.3 శాతం క్షీణించి 2,040 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇక ఆసియన్ ట్రేడింగ్‌లో కూడా ఇంట్రాడేలో ధర ఆల్‌టైమ్ కొత్త రికార్డు స్థాయి 2,135 డాలర్లను చూసింది. అమెరికాలో వడ్డీరేట్లు తగ్గుతాయన్న అంచనాలు, డాలర్ బలహీనత, పశ్చిమాసియా సంక్షోభ పరిస్థితులు పసిడి పరుగుకు కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) ఇటీవలి సర్వే విడుదలచేస్తూ, ప్రపంచవ్యాప్తంగా 24 శాతం సెంట్రల్ బ్యాంక్‌లు రాబోయే 12 నెలల్లో తమ బంగారం నిల్వలను పెంచుకోవాలని భావిస్తున్నాయని వెల్లడించింది. రిజర్వ్ అసెట్‌గా డాలర్ కంటే బంగారమే సరైనదన్న అభిప్రాయం దీనికి కారణమని పేర్కొంది. ఈ అంశం కూడా తాజా బంగారం ధర జోరుకు కారణమన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏఏఏఐ డైరెక్టరుగా 'శ్లోకా' శ్రీనివాస్ ఎన్నిక



శ్రీనివాస్



ప్రశాంత్ కుమార్

హైదరాబాద్: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఏఐ) డైరెక్టరుగా శ్లోకా అడ్వర్టైజింగ్ ఎండీ, సీఈవో కె. శ్రీనివాస్ తిరిగి ఎన్నికయ్యారు. డైరెక్టర్ల బోర్డుకు తెలుగు రాష్ట్రాల నుంచి వరుసగా రెండోసారి ఎవరైనా ఎన్నికవడం ఇదే ప్రథమం. అడ్వర్టైజింగ్, మార్కెటింగ్‌లో శ్రీనివాస్‌కు 30 ఏళ్ల పైగా అనుభవం ఉంది. డైరెక్టర్ల బోర్డుకు మరోసారి ఎన్నికవడంపై శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ వ్యాపార విధానాలు అమలయ్యేలా చూసేందుకు బోర్డు సభ్యులతో కలిసి పని చేస్తానని తెలిపారు. ఏఏఏఐ ప్రెసిడెంట్‌గా గ్రూప్ ఎం మీడియా సీఈవో (దక్షిణాసియా) ప్రశాంత్ కుమార్ మరోసారి ఎన్నికయ్యారు. అలాగే, హవాస్ మీడియాకు చెందిన రాణా బారువా ఏకగ్రీవంగా వైస్–ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎఫ్‌డీ రేట్ల పెంపు

ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచింది. రూ. 2 కోట్ల నుంచి రూ. 10 కోట్ల వరకు ఉండే ఎఫ్‌డీలకు సంబంధించి వివిధ కాల వ్యవధులకు రేటును 5.25%–7.25% వరకు సవరించింది. ఇవి డిసెంబర్ 1 నుంచి వర్తిస్తాయి. అటు రూ. 2 కోట్ల కంటే తక్కువ ఉండే ఎఫ్‌డీలపై 2 ఏళ్ల కాల వ్యవధికి 7.25%–7.90% వరకు బ్యాంక్ ఇటీవలే పెంచింది.

కీలక వడ్డీ రేటు యథాతథమే..!

రేపటి నుంచి ఆర్‌బీఐ పాలసీ సమీక్ష

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి కమిటీ (ఎంపీసీ) సమీక్షా సమావేశం డిసెంబర్ 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. పాలసీ వివరాలను 8వ తేదీన గవర్నర్ వెల్లడిస్తారు. గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీ ఎకానమీ వృద్ధే లక్ష్యంగా ప్రస్తుత యథాతథ రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6.5 శాతం)నే కొనసాగిస్తుందన్న అంచనాలు వెలువడుతున్నాయి. యథాతథ రేటు కొనసాగిస్తే ఈ తరహా నిర్ణయం ఇది వరుసగా ఐదవసారి అవుతుంది. ద్రవ్యోల్బణం అదుపులోనికి వచ్చినట్లు కనబడుతున్నప్పటికీ, దీని కట్టడికి కఠిన రేటు విధానాన్నే అవలంభించాలని ఆర్‌బీఐ కమిటీ భావిస్తున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, క్రూడ్ ఆయిల్ ధరల తీవ్రత, అంతర్జాతీయంగా పెరిగిన క్రూడ్ ధరలు, దీనితో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో ఈ సవాలును అధిగమించడానికి ఆర్‌బీఐ 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి నాటికి రెపో రేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. అయితే ద్రవ్యోల్బణం కొద్దిగా అదుపులోనికి వస్తుందన్న సంకేతాల నేపథ్యంలో గత నాలుగు సమావేశాల్లో యథాతథ రేటు కొనసాగింపునకే ఆర్‌బీఐ పెద్దపీట వేసింది.



స్పైస్‌జెట్‌పై దివాలా పిటిషన్‌కు ఎన్‌సీఎల్‌టీ తిరస్కరణ



న్యూఢిల్లీ: లీజుదార్ల నుంచి దివాలా పిటిషన్లు ఎదుర్కొంటున్న విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో (ఎన్‌సీఎల్‌టీ) కాస్త ఊరట లభించింది. బకాయిలను రాబట్టుకునేందుకు కంపెనీపై విల్లిస్ లీజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ దాఖలు చేసిన దివాలా పిటిషన్‌ను ఎన్‌సీఎల్‌టీ తోసిపుచ్చింది. 2023లో విల్లిస్ ఇదే వివాదంపై దాఖలైన దరఖాస్తును వెనక్కి తీసుకుందని, కొత్తగా మళ్లీ మరొకటి వేయడం సరికాదన్న స్పైస్‌జెట్ వాదనలతో ఏకీభవించింది. విల్లిస్‌తో పాటు విమానాలు లీజుకిచ్చిన మరో మూడు లీజుదార్లు కూడా స్పైస్‌జెట్‌పై దివాలా పిటిషన్లు వేశాయి.

లోకేశ్.. నోరు అదుపులో పెట్టుకో

- కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఆగ్రహం



కాకినాడ: 'లోకేశ్ నోరు అదుపులో పెట్టుకో. టీడీపీ నేత పయ్యావుల కేశవ్ బంధువైన సైరస్ కంపెనీ శ్రీనివాస్ బియ్యం ఎగుమతుల్లో అగ్రస్థానంలో ఉన్నారు. వాస్తవాలేమిటో ఆయన్ని అడిగితే చెబుతారు. తప్పుడు విమర్శలు చేస్తే సహించను' అని టీడీపీ నేత నారా లోకేశ్‌పై కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన కాకినాడలో మీడియాతో మాట్లాడారు. 'కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవని లోకేశ్‌కు ప్రజాక్షేత్రంలో రెండుసార్లు శాసనసభ్యుడినైన నన్ను విమర్శించే అర్హత లేదు. కొవ్వు కరిగించుకోవడానికి ఆయన పాదయాత్ర చేస్తున్నారు. ప్రజల్లోకి వచ్చినప్పుడు టీడీపీ విధివిధానాలు, చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించుకోండి. అంతేగానీ తప్పుడు ఆరోపణలు సరికాదు. నన్ను అవినీతి శేఖర్ అంటూ లోకేశ్ అంటున్నాడు. లోకేశ్‌కు ఇంతకన్నా దారుణమైన పేరు నేను పెట్టలేనా? ఆ పేరు ప్రకటించానంటే చంద్రబాబు, లోకేశ్ మరోసారి గుక్కపెట్టి ఏడుస్తారు. ఆ పరిస్థితి తెచ్చుకోవద్దు. తప్పుడు విమర్శలు చేస్తే నాలుక చీరివేస్తా. నేను ఎవ్వరి జోలికి వెళ్లను. నా జోలికొస్తే ఘాటుగానే స్పందిస్తా' అని ద్వారంపూడి హెచ్చరించారు. ఎన్టీఆర్ పెట్టిన పార్టీ జెండాను పక్కన పెట్టేసి.. టీడీపీ, జనసేన విలీనమైపోతే మంచిదని హితవు పలికారు. చంద్రబాబు జైలులోకి వెళ్లినప్పటి నుంచి టీడీపీని కైవసం చేసుకునేందుకు బాలకృష్ణ, లోకేశ్ అనేక ప్రయత్నాలు చేశారని చెప్పారు. తెలంగాణలో పవన్‌కళ్యాణ్‌కు డిపాజిట్లు కూడా దక్కలేదని, ఏపీలో కూడా అదే పునరావృతం కానుందన్నారు. జనసేన నాయకుడు పంతం నానాజీ స్థాయిని మరిచి విమర్శలు చేశారని ఎమ్మెల్యే ద్వారంపూడి మండిపడ్డారు. విదేశీ పెట్టుబడుల పేరుతో ఓ ట్రస్ట్‌ను అడ్డుపెట్టుకుని నానాజీ చేస్తున్న అక్రమాలను త్వరలోనే బయటపెడతానని చెప్పారు.

పవన్ బలమెంతో తెలంగాణలోనూ రుజువైంది

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

సాక్షి, అమరావతి: పవన్‌కళ్యాణ్‌కు రాజకీయాల్లో అంత సినిమా లేదని తెలంగాణ ఎన్నికల్లోనూ రుజువైందని ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి అన్నారు. ఇప్పటికైనా వాస్తవ పరిస్థితిని గ్రహించి నడుచుకోవాలని పవన్‌కు హితవు పలికారు. తాడేపల్లిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'పవన్ బలమెంతో తెలంగాణలోనూ రుజువైంది. ఏపీలో చంద్రబాబుతో జతకట్టినా కూడా.. తెలంగాణలోని కూకట్‌పల్లిలో జనసేనకు కమ్మవాళ్లు ఓట్లేయ్యలేదు. సినిమా నటుడుగా పవన్‌ను చూసేందుకు జనం వస్తారు తప్ప.. ఓట్లు వేయరనే విషయం జనసేనకు లభించిన ఓట్లను చూస్తే అర్థమవుతోంది. చంద్రబాబు చెప్పిందల్లా చేస్తా ఉంటే జనం ఓటెయ్యరు' అని విమర్శించారు.



సోమవారం ఢిల్లీలో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

పోస్టల్ సేవల్ని డిజిటలైజ్ చేయాలి

కేంద్రానికి ఎంపీ విజయసాయిరెడ్డి సూచన


సాక్షి, న్యూఢిల్లీ: ఇప్పటికీ సంప్రదాయ పద్ధతుల్లోనే కొనసాగుతున్న పోస్టల్ సేవల్ని డిజిటలైజ్ చేయాలని వైఎస్సార్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వి.విజయసాయిరెడ్డి సూచించారు. మనీ ఆర్డర్లకు బదులు మొబైల్ పేమెంట్స్ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. చిన్నమొత్తాల పొదుపు కార్యక్రమాలను పేమెంట్స్ బ్యాంకులకు బదలాయించాలని సూచించారు. రాజ్యసభలో పోస్టాఫీసు బిల్లుపై సోమవారం ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడారు. దేశంలోని అన్ని పోస్టాఫీసులను కంప్యూటరైజ్ చేసి పోస్టల్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, రైల్వే టికెట్ల రిజర్వేషన్, ఆధార్ నమోదు, అప్‌డేట్ సేవలను అందుబాటులోకి తెచ్చేలా సెంట్రలైజ్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలన్నారు. పోస్టల్ సేవల విషయంలో పేదల కోసం ఉద్దేశించిన సబ్సిడీలు సంపన్న వర్గాలు అనుభవించకుండా నిరోధించేందుకు పోస్టల్ రేట్లను హేతుబద్ధం చేయాలన్నారు. అన్ని ప్రాంతాలకు ఒకే తరహా చార్జీలు, ధరలకు బదులుగా గ్రామీణ ప్రాంతాలు, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల్లోని పోస్టాఫీసులకు మాత్రమే సబ్సిడీని పరిమితం చేసేలా విభిన్న ధరల విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఏర్పాటు ఈ దిశగా ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయమన్నారు. పోస్టాఫీసులను ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చరల్ మార్కెట్ (ఈ–నామ్)లో అనుసంధానించడం ద్వారా అవి రైతులకు నేరుగా ఉపయోగపడేలా కృషి చేయొచ్చని పేర్కొన్నారు. పోస్టాఫీసు బిల్లుపై ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ.. కొన్ని సేవలకు సంబంధించిన సమస్యలకు ఈ బిల్లు పరిష్కారం చూపలేకపోయిందన్నారు.

రాజ్యసభ

ఏపీ ఇన్ పార్లమెంట్

రూ.667 కోట్లతో డ్యామ్‌ల పునరుద్ధరణ

వైఎస్సార్‌సీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఆనకట్టల పునరుద్ధరణ, అభివృద్ధి ప్రాజెక్ట్ (డ్రిప్) కింద ఏపీలో రూ.667 కోట్లతో 31 డ్యామ్‌ల పునరుద్ధరణకు ఆమోదం తెలిపినట్టు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు సోమవారం కేంద్ర సహాయ మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. డ్రిప్ రెండో దశ కింద శ్రీశైలం, కాటన్ బ్యారేజీ, రావాడ రిజర్వాయర్, ఎర్రకాలువ, ఏలేరు రిజర్వాయర్, పంపా రిజర్వాయర్, గుండ్లకమ్మ రిజర్వాయర్, రాళ్లపాడు ప్రాజెక్టు, సోమశిల రిజర్వాయర్, తమ్మిలేరు ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామన్నారు. మూడో దశలో గొట్టా బ్యారేజీ, తాడిపూడి రిజర్వాయర్, కోనాం రిజర్వాయర్, ఆంధ్ర రిజర్వాయర్, పెద్దేరు రిజర్వాయర్, కొవ్వాడ కాలువ ప్రాజెక్టు, జీఎంటీ జల్లేరు రిజర్వాయర్, అవుకు రిజర్వాయర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, భైరవానితిప్ప ప్రాజెక్టు, వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, గాజులదిన్నె సంజీవయ్య సాగర్ ప్రాజెక్ట్, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, కోట్ల విజయభాస్కర రెడ్డి సుంకేసుల ప్రాజెక్టు, బ్రాహ్మణ సాగర్, వెలిగల్లు ప్రాజెక్టు, మైలవరం రిజర్వాయర్, చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్టు, మిడ్ పెన్నార్ స్టేజ్–1, పెన్నా అహోబిలం ప్రాజెక్టుల పునరుద్ధరణ, అభివృద్ధికి కేంద్రం ఆమోదం తెలిపిందని వివరించారు. 2021 నవంబర్‌లో వచ్చిన తుపాను కారణంగా రాయల చెరువు డ్యామ్‌కు లీకేజీ ఏర్పడి, బండరాళ్లు జారిపడినట్టు ఏపీ ప్రభుత్వం కేంద్రానికి సమాచారం అందించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పునర్నిర్మాణ పనులు చేపట్టి లీకేజీలను అరికట్టి తదుపరి నష్టాన్ని నివారించిందన్నారు. ఈ డ్యామ్‌కు శాశ్వత పునర్నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ రూ.25.20 కోట్ల బడ్జెట్‌తో ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఏపీ ప్రభుత్వం తెలిపిందని పేర్కొన్నారు.

1.30 కోట్ల మంది విమానమెక్కారు

ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగ్రిక్) యోజన కింద ఇప్పటి వరకు 1.30 కోట్ల మంది విమాన ప్రయాణం చేశారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు విజయసాయి రెడ్డి అనుబంధ ప్రశ్నకు రాజ్యసభలో సమాధానమిస్తూ.. భారతదేశ చరిత్రలో పౌర విమానయాన మ్యాప్‌లో కనిపించని 76 ఎయిర్‌పోర్టులు ఉడాన్ యోజన కారణంగా ఆ మ్యాప్‌లో ప్రత్యక్షమయ్యాయని తెలిపారు.

గ్యాస్ సబ్సిడీని రూ.300కు పెంచాం

ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం (పీఎంయూవై) కింద ఏపీలో ఈ ఏడాది అక్టోబర్ నాటికి 5.57 లక్షల ఎల్‌పీజీ కనెక్షన్లు ఉన్నాయని పెట్రోలియం సహాయక మంత్రి రామేశ్వరం తేలి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఏడాదికి 12 సిలిండర్లు వినియోగించే వారికి సబ్సిడీని అక్టోబర్ నుంచి రూ.300కు పెంచామన్నారు.

1,950 చెరువుల గుర్తింపు

నీటిని సంరక్షించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన 'మిషన్ అమృత్ సరోవర్ పథకం'లో భాగంగా ఏపీలో 1,950 చెరువులను గుర్తించినట్టు జలశక్తి సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు పరిమళ్ నత్వానీ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ప్రస్తుతం చెరువుల అభివృద్ధి, పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 5,100 స్థలాలను గుర్తించామని, 3,911 పనులు జరుగుతుండగా.. 2,196 పనులు పనులు పూర్తయినట్టు పేర్కొన్నారు.

లోక్‌సభ


'వైఎస్సార్ లా నేస్తం' దేశవ్యాప్తంగా అమలు చేయాలి

కేంద్రాన్ని కోరిన ఎంపీ రెడ్డెప్ప



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఆదరణ పొందిన 'వైఎస్సార్ లా నేస్తం' పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జూనియర్ న్యాయవాదులు వృత్తి ప్రారంభంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదనే లక్ష్యంతో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని 2019 డిసెంబర్‌లో తీసుకొచ్చారని తెలిపారు. పథకంలో భాగంగా నెలా నెలా యువ న్యాయవాదులకు రూ.5 వేలు ఇస్తున్నట్టు తెలిపారు. సోమవారం లోక్‌సభలో 'ద అడ్వొకేట్స్ (సవరణ) బిల్లు–2023'పై చర్చలో ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ.. ఈ బిల్లు స్వాగతించదగినదని, వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తోందని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు ఈ బిల్లు పరిష్కారం చూపుతుందన్నారు.

హెచ్‌ఆర్‌ఏ పెంచాలని విజ్ఞప్తి



కర్నూలులో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ పెంచాలని వైఎస్సార్‌సీపీ సభ్యుడు సంజీవ్‌కుమార్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కర్నూలు జనాభా ఐదు లక్షలు దాటిందని, నూతన నిబంధనలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ 8 శాతం నుంచి 16 శాతానికి పెంచాలని కోరారు.

ఆ రెండు గ్రంథాలయాలకు నిధులివ్వలేదు



గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్‌లో భాగంగా ఏపీలో ఎంపిక చేసిన రెండు గ్రంథాలయాలకు నిధులు విడుదల చేయలేదని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు అవినాష్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. గుంటూరు, తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయాలకు రూ.50లక్షలు, రూ.30 లక్షల చొప్పున అనుమతించినప్పటికీ విడుదల చేయలేదన్నారు.

ఆధ్యాత్మిక పర్యాటకం పెరిగింది




మిథున్‌రెడ్డి



బీవీ సత్యవతి,

కరోనా అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ఆధ్యాత్మిక పర్యాటకం పెరిగిందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు మిథున్‌రెడ్డి, బీవీ సత్యవతి, ఎన్.రెడ్డెప్ప అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. 2018లో రూ.19.47 కోట్లు దేశీయ, 2.81 లక్షల విదేశీ పర్యాటకులు, 2019లో 23.70 కోట్లు దేశీయ, 2.80 లక్షల విదేశీ, 2020లో 7.08 కోట్లు దేశీయ, 0.68 లక్షల విదేశీ, 2021లో 9.32 కోట్ల దేశీయ, 0.28 లక్షల విదేశీ, 2022లో 19.27 కోట్ల దేశీయ, 1.66 లక్షల విదేశీ పర్యాటకులు ఏపీలో ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించారని వివరించారు.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు



నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా ప్రత్యామ్నాయాలను ప్రోత్సహిస్తున్నామని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి అశ్వినికుమార్ చౌబే తెలిపారు. కొబ్బరి, చెరకు, వరి, గోధుమ, మొక్కజొన్న తదితర వ్యవసాయ అవశేషాలు.. అరటి, అరటి ఆకులు, జనపనార, వస్త్రాలతో రూపొందించిన వస్తువుల వినియోగం ప్రోత్సహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే స్వాధీనం చేసుకోవడంతోపాటు జరిమానా విధిస్తున్నామన్నారు.

స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయలేదు



ఆంధ్రప్రదేశ్‌లో ఇండియా ఇంటర్నేషనల్ స్కిల్ సెంటర్ (ఐఐఎస్‌సీ) ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయలేదని కేంద్ర ఎంఎస్‌ఎంఈ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు మద్దిళ్ల గురుమూర్తి, మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నకు ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

వనబంధు నిధులు విడుదల చేయలేదు



ప్రధానమంత్రి వనబంధు కల్యాణ యోజన (పీఎం వీకేవై)లో భాగంగా ఏపీకి 2023–24లో ఇంకా నిధులు విడుదల చేయలేదని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రేణుక సింగ్ సరూతా తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. బలహీన గిరిజన గ్రూపుల అభివృద్ధి , గిరిజన పరిశోధన సంస్థలు, ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల్లో భాగంగా ఏపీకి నిధులు విడుదల చేశామని తెలిపారు.

ఏపీలో 35 కేవీలు

ఏపీలో 35 కేంద్రీయ విద్యాలయాలు పనిచేస్తున్నాయని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణదేవి తెలిపారు. ఎంపీలు సంజీవ్‌కుమార్, పీవీ మిథున్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎన్.రెడ్డెప్ప ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. కేవీల ఏర్పాటు నిరంతర ప్రక్రియ అని, నిబంధనల మేరకు అవసరాలకు అనుగుణంగా సంబంధిత అథారిటీ అనుమతితో ఏర్పాటు చేస్తామన్నారు.

కృష్ణా జిల్లా కంకిపాడులో వానలోనూ బస్తాలను లారీలోకి ఎత్తుతున్న కూలీలు



'14 ఎకరాల పంట. ఈసారి బాగా పండటంతో 30 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. యంత్రంపై కోయడంతో ధాన్యం పచ్చిగా ఉందని కల్లాల్లో ఆరబెట్టాను. చివరికొచ్చే సరికి తుపాను భయం పట్టుకుంది. వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వర్షం పడితే ఎలా అనుకుంటున్న దశలో అధికారులు వచ్చారు. కంప్యూటర్‌లో ఎక్కించాల్సిన అవసరంలేదని, లోడును వెంటనే పక్కనున్న మిల్లులకు పంపించేద్దామని చెప్పారు. కూలీలను పిలిపించారు. గోతాల్లోకి నింపి.. నా ట్రాక్టర్‌లోనే ఆదివారం రాత్రి పంటను తీసుకెళ్లి మిల్లులో అప్పజెప్పాను. లేకుంటే సోమవారం కురిసిన చినుకులకు చేతికొచ్చిన లాభం తడిసిపోయేది' అంటూ పశ్చిమ గోదావరి జిల్లా ఉప్పులూరుకు చెందిన కౌలు రైతు శీర్ల వెంకట కేశవరావు సంతోషం వ్యక్తం చేశారు.



అన్నదాతకు అండగా ప్రభుత్వం

వరి కోతల సమయంలో విరుచుకుపడ్డ తుపాను • వర్షాలతో వణికిన రైతాంగం

వెంటనే ప్రభుత్వ యంత్రాంగాన్ని రంగంలోకి దింపిన సీఎం జగన్

- ఎక్కడికక్కడ ధాన్యం కొనాలని ఆదేశాలు..
- తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొంటున్న ప్రభుత్వం
- గత 48 గంటల్లో సుమారు 1.07లక్షల టన్నుల సేకరణ
- నిబంధనలు సడలించి ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు
- అత్యవసర నిధి కింద జిల్లాకు రూ.కోటి చొప్పున కేటాయించిన సర్కారు
- కృష్ణాలో కొన్న ధాన్యం ప్రత్యేక వాహనాల్లో పక్క జిల్లాల్లోని డ్రయర్ మిల్లులకు తరలింపు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం తరలింపు
- పశ్చిమ గోదావరి జిల్లాలో 24 వేల టన్నులు..
- వర్షాలు కురుస్తుండటంతో పంట కోతలు చేపట్టొద్దని రైతులకు అధికారుల విజ్ఞప్తి
- మంచి రేటు రావడంతో బహిరంగ మార్కెట్‌కు 6.48 లక్షల టన్నుల ధాన్యం

సాక్షి, అమరావతి: వరి పంట కోతల సమయమిది. రాష్ట్రంలోని రైతులు పంట కోసం, కల్లాల్లో, రోడ్ల పైన ఆరబెట్టారు. ఇదే సమయంలో రెండు రోజుల క్రితం మిచాంగ్ తుపాను ప్రభావం మొదలవడంతో రైతాంగం వణికిపోయింది. ఆపత్కాలంలో ఉన్న అన్నదాతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచింది. సీఎం జగన్ అధికారులతో సమీక్షించి, పలు ఆదేశాలు జారీ చేశారు. ఒక్క రైతుకు కూడా నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. దీంతో క్షేత్ర స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అధికార యంత్రాంగం హుటాహుటిన రంగంలోకి దిగింది. గ్రామాల్లో రైతులు కల్లాలు, రోడ్ల మీద ఆరబెట్టిన ధాన్యాన్ని ఎక్కడికక్కడ ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. నిబంధనలను సైతం సడలించి ధాన్యాన్ని సంపూర్ణ మద్దతు ధరకే కొంటోంది. వెనువెంటనే మిల్లులకు తరలిస్తోంది. కేశవరావు లాంటి వేలాది రైతులను ఆదుకుంటోంది. గడిచిన 48 గంటల్లో ఏకంగా 1.07 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా క్షేత్ర స్థాయిలో యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి యుద్ధ ప్రాతిపదికన ధాన్యాన్ని తరలిస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రికార్డు స్థాయిలో కల్లాల్లోని ధాన్యాన్ని మిల్లులకు చేర్చింది. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో 75 వేల మంది రైతుల నుంచి రూ.1,211.49 కోట్ల విలువైన 5.30 లక్షల టన్నుల ధాన్యం సేకరించింది. ఇందులో 55 వేల మంది రైతులకు సుమారు రూ.750 కోట్ల వరకు నిర్ణీత కాల వ్యవధిలో వారి ఖాతాల్లో జమ చేసింది.

అత్యవసర నిధి కింద జిల్లాకు రూ.కోటి

తుపాను నేపథ్యంలో కల్లాల్లోని ధాన్యం తడిసిపోకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆన్‌లైన్ ద్వారా సాంకేతికంగా వివరాల నమోదులో కొంత జాప్యం జరుగుతుంది. ఈలోగా వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోకుండా ఆఫ్‌లైన్‌లో కొనేలా నిబంధనలను సడలించింది. దీనిని మరింత వేగంగా చేపట్టేందుకు అత్యవసర నిధుల కింద అవసరమైన జిల్లాలకు రూ.కోటి చొప్పున కేటాయించింది. ఈ నిధులతో కలెక్టర్లు మిల్లర్లు పంపించే వాహనాలకు తోడు ఎక్కడికక్కడ ప్రైవేట్ వాహనాలను బుక్ చేసి ధాన్యం బస్తాలను శరవేగంగా తరలిస్తున్నారు. ఇప్పటివరకు కృష్ణా, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాలకు రూ.కోటి చొప్పున నిధులు విడుదల చేశారు.

కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షణ

విపత్కర పరిస్థితుల్లో ఉన్న రైతుల నుంచి ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సమష్టిగా పని చేస్తోంది. రాష్ట్ర స్థాయిలో పౌర సరఫరాల సంస్థ ఎండీ, జిల్లా కలెక్టర్లు, జేసీలు, డీఎంలు, తహసీల్దార్లు కంట్రోల్ రూమ్‌ల ద్వారా కొనుగోళ్లను పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గ, మండల, ఆర్బీకేల్లో ప్రత్యేక అధికారులను సైతం నియమించి రోడ్లపై ఉన్న ధాన్యాన్ని తక్షణం మిల్లులకు తరలిస్తున్నారు. తుపాను సమయంలో రైతులు పంట రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. మిల్లుల సామర్థ్యం తక్కువగా ఉన్న చోట ధాన్యాన్ని మార్కెట్ యార్డుల్లో భద్రపరుస్తున్నారు.

అంబేడ్కర్ కోనసీమలో అత్యధికంగా..

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పటి వరకు ఆర్బీకేల ద్వారా ఆన్‌లైన్‌లో 96,965 టన్నులు, ఆఫ్‌లైన్‌లో 48వేల టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఆదివారం ఒక్కరోజే 40 వేల టన్నులకుపైగా కొనడం విశేషం. మాన్యువల్‌గా పుస్తకంలో రైతుల ధాన్యం వివరాలను నమోదు చేసుకుని మిల్లులకు తరలిస్తున్నారు. తేమ 18 శాతం ఉన్నప్పటికీ మిల్లర్లు సహకరిస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో 2.40 లక్షల టన్నులు వస్తుందని అంచనా వేయగా ఇప్పటికే 1.43 లక్షల టన్నులు కొనుగోలు చేశారు. అమలాపురం, కొత్తపేట డివిజన్లలో పంట కోతలకు సమయం ఉంది. ఆలమూరు, మండపేట, రాయవరం ప్రాంతాల్లో మొత్తం ధాన్యాన్ని తుపాను ప్రభావం కంటే ముందే సేకరించారు. ఇప్పుడు మద్దతు ధర ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో రైతుల వివరాలను వేగంగా ఆన్‌లైన్ చేస్తూ ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీవో)లు జనరేట్ చేస్తున్నట్టు పౌర సరఫరాల సంస్థ డీఎం ఎస్. సుధా సాగర్ చెప్పారు. ఇప్పటివరకు రైతులకు మద్దతు ధరకు సుమారు 15 వేల టన్నులకుపైగా ఎఫ్‌టీవోలు ఇచ్చామన్నారు.

ఎమ్మెస్పీకి మించి ధర..

ఖరీఫ్‌లో నాణ్యతతో పాటు అధిక దిగుబడులు వచ్చాయి. ప్రభుత్వం పారదర్శకంగా సంపూర్ణ మద్దతు ధర అందిస్తుండటంతో వ్యాపారులు ఎమ్మెస్పీ, అంతకంటే ఎక్కువకే ధాన్యాన్ని కొనుగోలు చేశారు. తొమ్మిది జిల్లాల్లో సుమారు 6.48 లక్షల టన్నుల ధాన్యం మార్కెట్‌కు వెళ్లింది. పశ్చిమ గోదావరిలో పీఆర్ 126 రకానికి వ్యాపారులు పోటీపడ్డారు. ఇక్కడ 46 వేల టన్నులకుపైగా బహిరంగ మార్కెట్‌కు వెళ్తే 15 వేల టన్నుల వరకు పీఆర్ 126 రకమే. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో అత్యధికంగా ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు.

జిల్లాల వారీగా బహిరంగ మార్కెట్‌కు ధాన్యం ఇలా..(టన్నుల్లో..)

పశ్చిమ గోదావరి	46,437
ఏలూరు	80,320
కాకినాడ	2,21,981
తూర్పుగోదావరి	1,71,422
కోనసీమ	72,320
కృష్ణా	32,000
ఎన్టీఆర్	12,993
శ్రీకాకుళం	11,000

- కృష్ణా జిల్లాలో కల్లాల్లోని ధాన్యం తడిసిపోకుండా, రవాణా వాహనాలపై కప్పేందుకు వీలుగా 700కుపైగా టార్పాలిన్లు ప్రభుత్వం కొనుగోలు చేసింది. తేమ శాతం నిబంధనలను సైతం పక్కనబెట్టి 20 వేల టన్నులకుపైగా ధాన్యాన్ని సేకరించింది. వీటిని ఎక్కువ కాలం నిల్వ చేస్తే చెడిపోయే ప్రమాదం ఉండటంతో వెంటనే గుంటూరు, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లోని డ్రయర్ సౌకర్యం ఉన్న మిల్లులకు తరలిస్తోంది.
- ఏలూరు జిల్లాలో ఆదివారం ఒక్కరోజే 10 వేల టన్నులు తరలించగా సోమవారం వర్షంలోనూ ధాన్యం సేకరణ కొనసాగింది. అయితే తుపాను భయంతో కొంత మంది రైతులు కోతలు చేపడుతున్నారు. మరికొందరు కోసిన ధాన్యాన్ని ఇళ్లలో, షెడ్లలో నిల్వ చేసుకుంటున్నారు. వర్షాలు తగ్గిన తర్వాత ఆరబోసుకుని విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నట్టు జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎం భార్గవి తెలిపారు. వర్షాల్లో కోత మంచిది కాదని, తమ సిబ్బంది సహాయంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో లక్ష టన్నులకు పైగా ధాన్యం సేకరించామన్నారు.

ప్రత్యేక ఏర్పాట్లతో వర్షంలోనూ తరలింపు

- పశ్చిమ గోదావరి జిల్లాలో కోతలు కోసి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని దాదాపు మొత్తం సేకరించారు. ఆదివారం రాత్రి 12 గంటల వరకూ వాహనాల్లో తరలించారు. ఆ ఒక్కరోజే సుమారు 24,000 టన్నులు ప్రభుత్వం కొనుగోలు చేసింది. అక్కడక్కడా మిగిలిన స్వల్ప మొత్తం ధాన్యాన్ని కూడా సేకరిస్తున్నారు. ఇప్పటివరకు 90 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తవగా 1.80 లక్షల టన్నుల ధాన్యం దిగుబడిని అంచనా వేస్తున్నట్టు జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం శివరామ్ చెప్పారు. ఇందులో 1.30 టన్నులు ఆర్బీకేల్లో కొనుగోలు చేశామన్నారు.
- తూర్పు గోదావరి జిల్లాలో 6,367 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు జేసీ తేజ్‌భరత్ తెలిపారు. ఇక్కడ అత్యధికంగా బహిరంగ మార్కెట్‌కు తరలిపోగా ఆర్బీకేల ద్వారా 15,272 మంది రైతుల నుంచి 1,04,917 టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు.
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో తుపాను ప్రభావం పెద్దగా లేదు. విజయనగరం జిల్లాలో నూర్పిడి చేసిన ధాన్యం 1,242 టన్నుల వరకు ఉంది. దీనిలో 440 మెట్రిక్ టన్నులు సోమవారం ఆఫ్‌లైన్‌లో కొన్నారు. మంగళవారం మరో వెయ్యి టన్నులు కొనుగోలు చేయనున్నారు. శ్రీకాకుళంలో 700, పార్వతీపురం మన్యంలో 500 టన్నులు కొనుగోలు చేశారు.
- కాకినాడ జిల్లాలో కల్లాల్లో, రోడ్లపై ఉన్న 23 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అల్లూరి సీతారామ రాజు జిల్లాలోనూ దేవీపట్నం, గంగవరం ప్రాంతాల్లో 300 టన్నులు కొన్నారు.



అత్తిలి మండలం మంచిలిలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



పార్వతీపురం మన్యం జిల్లాలో ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న పాలకొండ ఆర్డీవో లావణ్య

ఆఫ్‌లైన్‌లో ఆదుకున్నారు..



నేను సొంతంగా, కౌలుకు కలిపి 70 ఎకరాల్లో వరి సాగు చేశాను. ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు వచ్చింది. ఆఫ్‌లైన్‌లో ఆదివారం 240 బస్తాలు ఆర్బీకేలో విక్రయించాను. ఇప్పుడు వర్షాలకు ధాన్యం తడిసే అవకాశమున్నందున తేమ శాతం ఉండాలనే నిబంధనను ప్రభుత్వం సవరించి కొనుగోలు చేయడం హర్షణీయం.

– సేవా సత్యనారాయణ, లొల్ల గ్రామం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

కోతలు వాయిదా వేయండి



రైతులు వరికోతలను నాలుగు రోజులు వాయిదా వేస్తే మంచిది. వర్షాల సమయంలో పంట కోస్తే తడి ఆరక తేమ పెరిగిపోతుంది. త్వరగా మొలకలు వచ్చి ధాన్యం దెబ్బతింటుంది. కోసిన ధాన్యంలో తేమ ఎక్కువగా ఉంటే వాటిని డ్రయర్ సౌకర్యం ఉన్న మిల్లులకు వర్షంలోనూ ప్రత్యేక జాగ్రత్తల నడుమ తరలిస్తున్నాం. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా ఆర్బీకేల్లో తీసుకునేలా అవకాశం కల్పిస్తాం.

– హెచ్.అరుణ్ కుమార్, కమిషనర్, పౌరసరఫరాల శాఖ

ప్రభుత్వ చొరవ కాపాడింది



ఐదు ఎకరాలు కౌలుకు సాగు చేశాను. పంటను మిషన్‌తో కోయించి, ధాన్యం రోడ్డుపై రాశి పోశాను. తుపాను కారణంగా వర్షం పడుతుందని బరకాలతో కప్పి ఉంచాను. లేదంటే వర్షానికి ధాన్యం తడిసిపోయేది. జేసీగారు వచ్చి మా ధాన్యాన్ని వెంటనే మిల్లుకు పంపించారు. తేమ ఎక్కువ ఉంటే మిల్లరు ధాన్యంలో కోత వేస్తారు. కానీ, ధాన్యంలో ఎటువంటి కోతా పెట్టలేదు. ప్రభుత్వం తీసుకున్న చొరవే నన్ను కాపాడింది

– వాసంశెట్టి అర్జునరావు, గొడ్డటిపాలెం, కాకినాడ జిల్లా

తేమతో సంబంధం లేకుండా..



ఒక్క రోజు ఆలస్యమైనా పంట మొత్తం వర్షార్పణమయ్యేది. చాలా ఇబ్బందులు పడేవాడిని. సకాలంలో అధికారుల సాయంతో నాలుగు ఎకరాల ధాన్యాన్ని తేమతో సంబంధం లేకుండా నేరుగా మిల్లుకే చేర్చాను. ఫలితంగా 10 టన్నుల ధాన్యాన్ని నష్టపోకుండా ఒబ్బి చేసుకోగలిగా.

– చిటికెన పెద సత్యనారాయణ, వడలి, పశ్చిమగోదావరి జిల్లా

కల్లాల్లో స్వల్పంగానే..



తుపాను హెచ్చరికలతో వర్షం రాక ముందే ధాన్యాన్ని మిల్లులకు తరలించేశాం. ఇంకా అక్కడక్కడా కొద్దిగా ఉంది. దానిని కూడా తరలిస్తాం. కొందరు రైతులు ఆదివారం కూడా యంత్రంపై కోతలు ఎక్కువగా చేశారు. వాటిల్లో చాలా వరకు కొనుగోలు చేశాం. తేమ శాతం ఎక్కువ ఉంటే రైతులకు నష్టం జరగకుండా మిల్లర్లతో మాట్లాడుతున్నాం. అప్పటికప్పుడు ప్రైవేటు వాహనాల్లో ధాన్యం లోడును తరలించాలని కలెక్టర్లకు చెప్పాం.

– జి.వీరపాండియన్, ఎండీ, పౌర సరఫరాల సంస్థ

మద్దతు ధర నష్టపోకుండా..

ఎకరాకు 30 బస్తాల పైనే దిగుబడి వచ్చింది. ఈ లోగా తుపాను భయపెట్టింది. ప్రైవేటుగా అమ్మేందుకు ప్రయత్నించా. మద్దతు ధర కంటే రూ.400 తక్కువకు అడిగారు. ఇంతలోనే వానలు మొదలయ్యాయి. ధాన్యం నిల్వ చేయడానికి సరైన గిడ్డంగులు లేవు. తక్కువకు అమ్మితే బాగా ఆదాయం పోతుందని బాధ పడ్డాను. ఆర్బీకేలో చెబితే ఆఫ్‌లైన్‌లో నా 220 బస్తాల ధాన్యం కొని, మిల్లుకు తరలించారు. పూర్తిగా మద్దతు ధర వస్తుందని వీఏఏ చెప్పారు. ఆపత్కాలంలో ఆదుకున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– పంచిరెడ్డి రమణ, గండువల్లిపేట, నరసన్నపేట

నిబంధనలు సడలించి ఆదుకున్నారు



తుపాను హెచ్చరికలతో పంట కోత కోయించాను. ఆర్బీకే వాళ్లు తేమ 22 శాతం ఉందన్నారు. మద్దతు రేటు రాదేమో అనుకున్నా. కానీ ప్రభుత్వం నిబంధనలు మార్చి మేలు చేసింది. తేమ శాతం ఎక్కువ వచ్చినా మద్దతు ధర దక్కేలా చేసింది. కోత చేసిన 495 సారలు (40 కిలోల బస్తాలు) ఆదివారం ముసురులోనే ధాన్యం కాటా వేయించి లారీల్లో పంపించారు.

– సాగి కోటేశ్వరరావు, కౌలురైతు, పునాదిపాడు, కృష్ణాజిల్లా

సర్వత్రా అప్రమత్తం

- యుద్ధ ప్రాతిపదికన తుపాను సహాయక చర్యలు
- తక్షణమే స్పందించి ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం
- అత్యవసర సహాయక చర్యల కోసం రూ.11 కోట్లు విడుదల
- శిబిరాల నుంచి వెళ్లే బాధితులకు రూ.1,000 నుంచి రూ.2,500 ఆర్థిక సాయం
- ఇళ్లు కూలినా, దెబ్బతిన్నా పరిహారం రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పెంపు
- 8 జిల్లాలకు ప్రత్యేక అధికారుల నియామకం.. ఐదు జీఓల ద్వారా రెవెన్యూ శాఖ ఉత్తర్వులు



ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో మాట్లాడుతున్న బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్



ఎస్పీఎస్సార్ నెల్లూరు జిల్లా మైపాడు పునరావాస కేంద్రంలో బాధితులకు అల్పాహారం అందజేస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాలపై స్పందించి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. మూడు రోజుల ముందు నుంచే జిల్లా కలెక్టర్లు, ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ వచ్చింది. సోమవారం సీఎం వైఎస్ జగన్ జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి తుపాను వల్ల ఎక్కడా ఇబ్బందికర పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సహాయ, పునరావాస కార్యక్రమాలకు సంబంధించి రెవెన్యూ శాఖ ఐదు జీఓలు, ఒక మెమో విడుదల చేసింది. సీఎం ఆదేశాలతో 10 జిల్లాల్లో తుపాను అత్యవసర సహాయక చర్యల కోసం ఆయా జిల్లాల కలెక్టర్లు రూ.11 కోట్లను అత్యవసరంగా డ్రా చేసుకునేందుకు అనుమతి ఇస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ జీఓ నంబరు 72 జారీ చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు రూ.2 కోట్లు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు రూ.కోటి చొప్పున వినియోగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నిధులను వర్ష ప్రభావిత ప్రాంతాల నుంచి బాధితులను సహాయక శిబిరాలకు తరలించడం, ఆయా ప్రాంతాల్లో సురక్షితమైన తాగునీరు, ఆహారం, పాలు అందించడంతోపాటు వారికి అవసరమైన ఆరోగ్య శిబిరాలు, పారిశుధ్య నిర్వహణ, పశువులకు ఆహారం, కూలిపోయిన లేక దెబ్బతిన్న ఇళ్లకు తక్షణ పరిహారం ఇచ్చేందుకు వినియోగించాలని ఆదేశించింది.

సహాయక చర్యలు ముమ్మరం

- తుపాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లకు పంపుతున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. అత్యవసర సహాయక చర్యల కోసం నెల్లూరులో 4, బాపట్లలో 3, కృష్ణాలో 2, తిరుపతి, ప్రకాశంలో ఒక్కొక్క బృందం చొప్పున మొత్తం 5 ఎన్డీఆర్ఎఫ్, 6 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయని తెలిపారు. కృష్ణా, బాపట్ల, ప్రకాశం, ఎస్పీఎస్సార్ నెల్లూరు, తిరుపతి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 192 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, సోమవారం సాయంత్రం వరకు 7,361 మందిని తరలించామన్నారు. ప్రభావిత జిల్లాల్లోని 2.38 కోట్ల మందికి తుపాను హెచ్చరిక సందేశాలు (సెల్ ఫోన్‌కు) పంపినట్లు తెలిపారు.
- ముందస్తు చర్యల్లో భాగంగా నెల్లూరు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ లోతట్టు ప్రాంతాలను గుర్తించి సమీపంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, 1,900 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి లోతట్టు ప్రాంతాలలోని పేదలకు ఆహారం అందజేశారు. రెస్క్యూ టీంలు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ముత్తుకూరు, నెలటూరు ప్రాంతాల్లో లోతట్టు ప్రాంత వాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు.
- తిరుపతి జిల్లాలోని 162 మంది గర్భిణీలను ప్రసూతి ఆస్పత్రులకు తరలించారు. జిల్లా వ్యాప్తంగా 31 గ్రామాలలో 2,620 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రకాశం జిల్లాలో కొత్తపట్నం, సింగరాయకొండ, టంగుటూరు, ఒంగోలు, నాగులుప్పలపాడు మండలాల్లోని తీర ప్రాంతాల్లో పూరిళ్లు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పాత ఇళ్లలో ఉంటున్న వారిని 47 పునరావాస శిబిరాలకు తరలించారు. ప్రతి శిబిరానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించారు.
- బాపట్ల జిల్లాలో 14 పునరావాస కేంద్రాలు, 43 తుపాను షెల్టర్లు సిద్ధం చేసి, లోతట్టు ప్రాంత ప్రజలను తరలిస్తున్నారు. 18 మంది గర్భిణీలను వైద్యశాలలకు తరలించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్(నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్), ఎస్‌డిఆర్‌ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్) బృందాలను, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. సూర్యలంకలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి సోమవారం పరిశీలించారు.

రూ.1,000 నుంచి రూ.2,500 ఆర్థిక సాయం

సహాయక శిబిరాల నుంచి బాధిత కుటుంబాలను ఇంటికి పంపే ముందు ఆర్థిక ఆసరా కోసం రూ.1,000 నుంచి రూ.2,500 ఇవ్వాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశిస్తూ జీఓ నెంబరు 73 విడుదల చేసింది. ఆయా కుటుంబాలకు 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, ఒక లీటర్ పామాయిల్, కేజీ చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలను ఉచితంగా పంపిణీ చేయాలని మరో జీఓ ఇచ్చింది. తుపాను వల్ల దెబ్బతిన్న, కూలిపోయిన ఇళ్లు, గుడిసెలకు ఇచ్చే పరిహారాన్ని రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పెంచి ఇవ్వాలని ఆదేశించింది. సీఎం జగన్ సమీక్షలో ఈ విషయంపై ఆదేశాలు ఇవ్వడంతో అందుకనుగుణంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. పశు వైద్య శిబిరాల ఏర్పాటు, పశువులకు గడ్డి సరఫరా వంటి అవసరాలకు నిధులు వినియోగించుకునేందుకు కలెక్టర్లకు అనుమతి ఇచ్చారు. తుపాను సహాయ, పునరావాస చర్యల్లో సహకరించేందుకు 8 జిల్లాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. బాపట్ల జిల్లాకు కాటంనేని భాస్కర్, అంబేడ్కర్ కోనసీమకు జి జయలక్ష్మి, తూర్పుగోదావరికి వివేక్ యాదవ్, ప్రకాశంకు పీఎస్ ప్రద్యుమ్న, కాకినాడకు ఎస్ యువరాజ్, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుకు సీహెచ్ హరికిరణ్, తిరుపతికి జే శ్యామలరావు, పశ్చిమగోదావరికి కే కన్నబాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి జీఓ జారీ చేశారు. కాగా, భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించారు.



కృష్ణా జిల్లా బసవానిపాలెం నుంచి కోడూరుకు ప్రత్యేక బస్సులో గ్రామస్తుల తరలింపు

- కృష్ణా జిల్లాలో 64 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మచిలీపట్నం, అవనిగడ్డ ప్రాంతాలకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, గజ ఈతగాళ్ల బృందాలు చేరుకున్నాయి. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ పి.జాషువా నేతృత్వంలో శిబిరాల్లో తాగునీరు, ఆహారంతో పాటు వైద్య సహాయం కోసం వైద్య సిబ్బంది, మరుగుదొడ్లను, వైర్‌లెస్ సెట్లను ఏర్పాటు చేశారు. 40 వేల టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. మరో 20 వేల టన్నుల ధాన్యాన్ని గోడౌన్‌కు తరలించారు. ఇంకో 10 వేల టన్నుల ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు తీర ప్రాంత మండలాల్లో 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. పీఎం లంక నుంచి 150 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. ఆరుగురు గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, ఈతగాళ్లు, మెకనైజ్డ్ బోట్లను సిద్ధం చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.
- అనకాపల్లి జిల్లాలో 52 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. వీటిలో 60 వేల మందికి పైగా వసతి కల్పించేలా ఏర్పాట్లు చేశారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఏలూరులో విద్యుత్ శాఖ 9440902926 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం ; 5 ; డిసెంబర్ ; 2023



వెలవెల
నిత్యం రద్దీగా ఉండే బెంగళూరు విధానసౌధ బోసిపోయిన దృశ్యం. అందరూ బెళగావి అసెంబ్లీకి వెళ్లడమే కారణం

న్యూస్‌రీల్

భవాని ఉగ్రరూపం

- బైకిస్టుకు కొడుకు, భర్త క్షమాపణలు



బైకిస్టుతో వాదిస్తున్న భవాని

యశవంతపుర: మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ కోడలు భవాని రేవణ్ణ ప్రయాణిస్తున్న కారు బైకును ఢీకొంది. రౌద్రరూపం దాల్చిన భవాని బైకిస్టును దూషించారు. వివరాలు.. ఆదివారం మైసూరులో భవాని చాలా ఖరీదైన కారులో వెళ్తుండగా ఒక బైకిస్టును ఢీకొంది. కారు దెబ్బతింటే ఎవడు మరమ్మతులు చేయిస్తాడని ఆమె మండిపడ్డారు. ఆ వీడియో వైరల్ అయ్యింది. నెటిజన్లు భవాని తీరుపై మండిపడ్డారు.

మా అమ్మది తప్పే: సూరజ్

మా అమ్మ బైకిస్టును తిట్టడం తప్పేనని ఆమె కుమారుడు, ఎమ్మెల్సీ సూరజ్ స్పందించారు. బైకిస్టు మద్యం తాగి నడపడం వల్ల ప్రమాదం జరిగింది. మా అమ్మ అసభ్య పదాలతో తిట్టడం తప్పే. నేను క్షమాపణలు కోరుతున్నట్లు తెలిపారు. గాయాలైన బైకిస్టును ఆస్పత్రిలో చేర్చామన్నారు. భవాని భర్త రేవణ్ణ మాట్లాడుతూ తాము బాధపెట్టి ఉంటే క్షమించాలని కోరారు.

కాంగ్రెస్‌కు ఓటమి శోకం: అశోక్

శివాజీనగర: ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలనలో దేశం, మతం భద్రంగా ఉంటుంది. అభివృద్ధి పథంలో సాగుతామని బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ అన్నారు. సోమవారం బెళగావి సువర్ణసౌధలో మాట్లాడిన ఆయన, మూడు రాష్ట్రాల్లో ఓటమిపై కాంగ్రెస్‌వారు మాట్లాడటం లేదు. తెలంగాణలో గెలిచామని చెప్పుకుంటూ రిసార్టు రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దేశానికి మోదీ అనివార్యమని ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఈ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ శోకంలో ఉంది. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపు సాధించి మోదీ మరోసారి ప్రధాని అవుతారన్నారు.

కుమారపై లోకాయుక్తకు ఫిర్యాదు

యశవంతపుర: విధానసభ ఎన్నికల అఫిడవిట్‌లో సంపూర్ణ సమాచారం ఇవ్వలేదని జేడీఎస్ నేత, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామిపై లోకాయుక్తలో ఫిర్యాదు నమోదైంది. సామాజిక కార్యకర్త సీఎస్ సిద్దరాజు ఆయనపై ఫిర్యాదు చేశారు. 2004 విధానసభ ఎన్నికల అఫిడవిట్‌లో కేతగానహళ్లిలోని 24 ఎకరాల భూమి ఉన్నట్లు చూపించారు. ఆ భూమిని పిన్నమ్మ దానంగా ఇచ్చినట్లు తెలిపారు, ఆమెకు అంత భూమి ఎలా వచ్చిందో తెలియజేయాలని సిద్దరాజు డిమాండ్ చేశారు. అలాగే బెంగళూరు జేపీనగరలో ఇంటిని కొనుగోలు చేసినట్లు అఫిడవిట్‌లో తెలిపారని, పార్టీ నేత కుపేంద్రరెడ్డి నుంచి రూ.9.50 కోట్లు అప్పు తీసుకున్నట్లు తెలిపారని, వీటన్నింటిపై అనుమానాలు ఉన్నాయన్నారు.

మరో నర్సు అరెస్టు



నర్సు ఉషారాణి

యశవంతపుర: రాష్ట్రంలో సంచలనం కలిగించిన భ్రూణ హత్యల కుంభకోణంలో మరో నర్సును బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. మైసూరులో ఉషారాణిని అరెస్ట్ చేయడంతో ఇప్పటివరకు అరెస్టయిన నిందితుల సంఖ్య 11కు చేరింది. మూడురోజుల క్రితం పట్టుబడిన నర్సు మంజుళ ఇచ్చిన సమాచారంలో ఉషారాణిని అదుపులోకి తీసుకున్నారు. తాము మైసూరులో ఆయుర్వేద ఆస్పత్రి ముసుగులో అబార్షన్ల దందా నిర్వహించేవారమని తెలిపారు.

బెళగావిలో అసెంబ్లీ షురూ

- తొలిరోజు దివంగత ప్రముఖులకు సంతాపం
- పలు అంశాలపై చర్చలు



అసెంబ్లీలో సీఎం సిద్దరామయ్య



సోమవారం బెళగావి అసెంబ్లీలో.. విధానసభలో చర్చ దృశ్యం

శివాజీనగర: శీతాకాల అసెంబ్లీ సమావేశాలు బెళగావి నగర శివార్లలోని సువర్ణసౌధ భవనంలో సోమవారం ప్రారంభమయ్యాయి. నెలరోజులుగా ఇక్కడ సమావేశాల కోసం ముమ్మర ఏర్పాట్లు జరిగాయి. ఉభయ సభాపతులు, సీఎం సిద్దరామయ్య, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అన్ని శాఖల ఉన్నతాధికారులతో పాలనా యంత్రాంగం సరిహద్దు నగరికి చేరుకొంది. మరాఠా సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు ముట్టడించకుండా అసెంబ్లీ పరిసరాల్లో వేలాది పోలీసులను మోహరించారు. ఉదయం సజావుగా అసెంబ్లీ ప్రారంభమైంది. ఇటీవల పరమపదించిన మాజీ ఎమ్మెల్యేలకు బెళగావి విధానసభలో శ్రద్ధాంజలి ఘటించారు. ఆరంభంలో స్పీకర్ యూటీ ఖాదర్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. శ్రీరంగదేవరాయులు, సీ.వెంకటేశప్ప, శ్రీకాంత్ శెట్టప్ప, పీబీ ఆచార్య తదితరుల సేవలను కొనియాడుతూ అంజలి ఘటించారు. డీబీ చంద్రేగౌడ చిక్కమగళూరు జిల్లా నుంచి వచ్చిన న్యాయవాది, రాజకీయ నేత, నటుడు అని కొనియాడారు. సీఎం సిద్దరామయ్య, మంత్రులు, బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ తదితరులు నిమిషం పాటు మౌనం పాటించారు. ఆపై పలు అంశాలపై స్వల్పకాల చర్చలు మొదలయ్యాయి.

మాతృభాష బిల్లుకు కేంద్రం తిరస్కృతి

రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో ఒకటి నుండి ఐదో తరగతి వరకు విద్యార్థులకు మాతృభాషను, రాష్ట్ర భాషను విద్యా మాధ్యమంగా తప్పనిసరి చేసే బిల్లును కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది, 2015లో రాష్ట్ర అసెంబ్లీలో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు మాతృభాష, లేదా రాష్ట్ర భాషను విద్యా మాధ్యమంగా తప్పనిసరి చేసి పంపించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. మాతృభాషను తప్పనిసరి చేయడమనేది విద్య మూలభూత హక్కుల ఉల్లంఘన అవుతుందని తిప్పిపంపిందని పాఠశాల విద్య, సాక్షరతా మంత్రి మధు బంగారప్ప తెలిపారు. సోమవారం విధాన పరిషత్‌లో ప్రశ్నోత్తరాల సమయంలో యూ.బీ.వెంకటేశ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన మంత్రి, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా రాష్ట్ర ఈ ముసాయిదాని మౌలిక హక్కుల ఉల్లంఘన అంటూ కేంద్ర విద్యాశాఖ తిరస్కరించిందని తెలిపారు.

భాషను కాపాడుకోకపోతే ఎలా?



1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న పాఠశాల పిల్లలకు కన్నడను ఒక భాషగా, లేదా మాతృభాషగా తప్పనిసరి చేయడం ఈ బిల్లు లక్ష్యమని వెంకటేశ్ అన్నారు, పిల్లలకు కన్నడ నేర్పేందుకు ప్రాధాన్యత ఇవ్వకపోతే ఎలా? రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాన్ని వెతుక్కోవాలని సలహా నిచ్చారు. గత ఎనిమిది సంవత్సరాల నుండి ఈ ముసాయిదాకు అనుమతి లభించలేదు. రాష్ట్రంలోని ఎంపీలు, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. భాషను కాపాడుకోవటం చాలా ముఖ్యమని అన్నారు. బలవంతంగా హిందీని రుద్దితే ఆమోదించబోమని మంత్రి ఒక ప్రశ్నకు స్పష్టం చేశారు.

మంత్రుల గైర్హాజరుపై ఆగ్రహం

అసెంబ్లీ సమావేశాల్లో మొదటిరోజునే ఆరు మంత్రులు ముఖం చాటేశారు. దీంతో విధాన పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావించిన ఆయన, ఆరు మంత్రి మంత్రులు గైర్హాజరయ్యారు. ముందే నిర్ణయించిన కార్యక్రమాలు ఉన్నందున రావడానికి సాధ్యపడదని లేఖను కూడా పంపారు. ఇది మంచి పద్ధతి కాదు. సభా నాయకుడు బోసురాజు వివరణ ఇవ్వాలని సభాపతి ఆదేశించారు. ఈ సమయంలో ప్రతిపక్ష సభ్యులు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల కంటే ఇతర కార్యక్రమాలు ముఖ్యమా? మంత్రులు లేకపోతే ఆయా సమస్యలకు సమాధానం ఎవరిస్తారు? అన్నింటికీ సభా నాయకుడే స్పందించడం మంచిది కాదని మండిపడ్డారు.

క.క.లో ఉద్యోగాల భర్తీకి హామీ

శివాజీనగర: కళ్యాణ కర్ణాటక ప్రాంతంలో విద్యాశాఖ లో ఉన్న ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేస్తామని పాఠశాల విద్యా, సాక్షరతా మంత్రి మధు బంగారప్ప బెళగావి విధానపరిషత్‌లో తెలిపారు. ఇక్కడి ప్రాథమిక పాఠశాలల్లో 45,535 ప్రాథమిక ఉపాధ్యాయులు, 11,724 ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, 1369 గ్రూప్ డీ ఉద్యోగాలు, 3,323 బోధకేతర సిబ్బందితో పాటుగా 61,891 మంది సిబ్బంది పని చేస్తున్నారు. 16 వేల మంది ఉపాధ్యాయులను పర్మినెంట్ చేశామన్నారు. సభ్యుడు శశిల్ నమోశి మాట్లాడుతూ మండ్య, మైసూరు భాగాల్లో ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారని, ఉత్తర కర్ణాటకలోనూ ఎక్కువమంది అవసరం కదా? అని ప్రశ్నించారు.

తొలిరోజే నిరసన జ్వాలలు

- బెళగావిలో ధర్నాల జోరు



సోమవారం బెళగావిలోని చెన్నమ్మ కూడలిలో రైతుల నిరసన


శివాజీనగర: బెళగావిలో ప్రశాంత వాతావరణంలో అసెంబ్లీ సమావేశాలను జరపాలని సభాపతులు గట్టి ప్రయత్నాలు చేయడం తెలిసిందే. అయితే తొలిరోజే రైతులు భారీఎత్తున ధర్నా నిర్వహించి చురుకు ముట్టించారు. కరువు నియంత్రణలో విఫలం, వ్యవసాయ చట్టం రద్దు, చెరుకు రైతుల డిమాండ్లు తదితరాలతో రాష్ట్ర రైతు సంఘం నేత కోడిహళ్లి చంద్రశేఖర్ నేతృత్వంలో పెద్దసంఖ్యలో రైతులు బెళగావికి వచ్చారు. రాణి చెన్నమ్మ సర్కిల్ నుంచి ర్యాలీ చేపట్టి సువర్ణసౌధను ముట్టడించాలని ర్యాలీగా బయల్దేరారు. అంతలోనే పోలీసులు వారిని అడ్డుకొన్నారు.

పలు సంఘాల ధర్నాలు

వివిధ సంఘాలు కూడా తమ కోర్కెలతో ధర్నాలు జరిపాయి. ముండ్రగి తాలూకా ప్రజా పోరాట వేదిక నేతలు గదగ- హరపనహళ్లి రైలు మార్గం మంజూరు, గదగ జిల్లాలో బగర్ హుకుం హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. సఫాయి కర్మచారి సమితి సభ్యులు తమ సమస్యలను పరిష్కరించాలని ఆందోళనకు దిగారు. దివ్యాంగుల పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సేవా భద్రత కల్పించాలని ధర్నాలు చేయడంతో అసెంబ్లీ వద్ద సందడి నెలకొంది.









కెప్టెన్ అర్జున వీరమరణం

- హాసన్ జిల్లాలో అడవి ఏనుగు దాడిలో మృతి
- 22 సార్లు మైసూరు దసరా వేడుకల్లో హాజరు
- 8 సార్లు బంగారు అంబారీ మోసిన గజం



దసరా ఉత్సవాలలో కెప్టెన్ అర్జున (ఫైల్)



ఘటనాస్థలిలో అర్జున కళేబరం

మైసూరు: ప్రపంచ ప్రసిద్ధి చెందిన మైసూరు దసరా వేడుకల్లో సుమారు 8 సార్లు చాముండేశ్వరి అమ్మవారి అంబారీని మోసి, జంబూసవారిని ముందుండి నడిపించిన కెప్టెన్ అర్జున అనే గజరాజు కథ విషాదాంతమైంది. సోమవారం అడవి ఏనుగు జరిపిన దాడిలో అర్జున తీవ్ర గాయాలతో వీరమరణం పొందింది. హాసన్ జిల్లాలోని సకలేశపుర తాలూకాలోని ఎసళూరు దగ్గర అడవి ఏనుగులు అల్లర్లకు పాల్పడుతున్నాయి. దీంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అటవీ సిబ్బంది వాటిని తరిమికొట్టే ప్రయత్నాల్లో ఉన్నారు. సోమవారం వాటిని నియంత్రించడానికి అర్జునను తీసుకెళ్లి గాలింపు జరుపుతుండగా ఓ అడవి ఏనుగు అర్జునపై దాడి చేసింది. పోరాటంలో తీవ్ర గాయాలైన అర్జున తుదిశ్వాస విడిచింది.

అర్జున ఘన చరిత

- సుమారు 64 సంవత్సరాల వయసు ఉన్న అర్జున మైసూరు జిల్లాలోని నాగరహొళె అరణ్యంలోని బళ్లె శిబిరంలో ఉంటుంది.
- సుమారు 22 సంవత్సరాల పాటు మైసూరు దసరా వేడుకల్లో పాల్గొన్న అర్జున ఏనుగు 8 సార్లు బంగారు అంబారీని మోసి ఉత్సవాల్లో ప్రముఖ పాత్ర పోషించింది.
- యుక్తవయసులో ఉన్నప్పుడు అర్జున అటవీ సిబ్బందికి పట్టుబడిన కట్టెపుర దగ్గర యసళూరులోనే కన్నుమూయడం విశేషం.
- ప్రస్తుతం అంబారి మోయకున్నా కూడా మైసురు దసరా వేడుకల్లో పాల్గొనేది. అనేక పులులు, అడవి ఏనుగులను పట్టుకోవడంతో శ్రమించింది. అర్జున మృతితో బళ్లె శిబిరంలోను, అటవీ సిబ్బందిలో ఆవేదన నెలకొంది. పోస్టుమార్టం అనంతరం లాంఛనాలతో ఖననం చేశారు.

మూడు యాక్సిడెంట్లలో..ముగ్గురు మృతి

బనశంకరి: బెంగళూరు నగరంలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

- ఎలక్ట్రానిక్‌సిటీ ఫస్ట్ స్టేజ్‌లో వెంకటేశ్ (29) అనే యువకుడు స్నేహితులతో కలిసి లగ్గెరెకు వేగంగా వెళుతుండగా డివైడర్‌కు ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడి చనిపోయాడు.
- తలఘట్టపుర ట్రాఫిక్ పీఎస్ పరిధిలో.. అంజనాపుర రోడ్డు వద్ద బసవరాజ్ బస్సు డ్రైవింగ్ చేస్తూ నియంత్రణ తప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతనిని రాజరాజేశ్వరినగర ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి నిమ్హాన్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో అభిషేక్ అనే యువకుడు మరణించాడు. ఇతడు ఓలా క్యాబ్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం కెంపేగౌడ విమానాశ్రయానికి బైకులో వెళుతున్న అభిషేక్‌ను బళ్లారి రోడ్డులో లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాధితుడు అక్కడే మృత్యువాత పడ్డాడు. దేవనహళ్లి ట్రాఫిక్‌పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతులకు మంచి వార్త రావాలి: విజయేంద్ర

శివాజీనగర: బెళగావి అసెంబ్లీ సమావేశాల్లో రైతులకు ప్రభుత్వం నుంచి తీపి వార్త వస్తుందని ఆశిస్తున్నట్లు బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర అన్నారు. రాష్ట్రంలో కరువు నెలకొంది, ప్రజలు కరువు కష్టాల్లో ఉన్నారు. అందుచేత రైతులు, ఉత్తర కర్ణాటక ప్రజలు అందరూ ప్రభుత్వం నుంచి సహాయం కోసం వేచి ఉన్నారన్నారు. కాంగ్రెస్ సర్కారు ఎంతో చేస్తుందని ప్రజలు నిరీక్షిస్తున్నారన్నారు. కరువు గురించి తాము అసెంబ్లీలో లేవనెత్తుతామన్నారు. కాగా, బెళగావిలో విజయేంద్రకు బీజేపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

మాజీ ఎంపీపై సీబీఐ కేసు

యశవంతపుర: నకిలీ దాఖలాలు సృష్టించి రూ.12.48 కోట్ల రుణం తీసుకుని చెల్లించని కేసులో మాజీ ఎంపీ ఎల్‌ఆర్ శివరామేగౌడతో పాటు ఆయన కుటుంబానికి చెందిన ఏడుమందిపై సీబీఐ కేసు నమోదు చేసింది. బెంగళూరు ఎంజీ రోడ్డులోని పీఎన్‌బీ బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గౌడ, ఆయన భార్య, కొడుకు, కోడలు మరికొందరిపై కేసు నమోదైంది. నిందితులు నకిలీ పత్రాలు చూపి రుణం తీసుకోవడంతో పాటు చెల్లించలేదని తెలిపారు.

మహిళా పీడీఓ కన్నుమూత

- సమావేశం తరువాత కుప్పకూలిన వైనం



మృతదేహానికి ఉద్యోగుల నివాళి (ఇన్‌సెట్) పీడీఓ భారతి (ఫైల్)

మండ్య: విధుల్లో ఉన్న మహిళా పీడీఓ విధుల్లోనే కన్నుమూశారు. మండ్య జిల్లాలోని పాండవపుర పట్టణంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. వివరాలు.. మైసూరుకు చెందిన భారతి (54) గుమ్మనహళ్లిలో పంచాయతీ కార్యదర్శిగా ఉంటూ ఇటీవలే పీడీఓగా పదోన్నతి పొంది పాండవపురకు వచ్చారు. రమేష్ అనే ఆర్‌టీఐ కార్యకర్త గుమ్మనహళ్లితో పాటు తాలూకాలోని పలు జీపీలలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దీనిపై చర్చించడానికి ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య, తాలూకా ఈఓ లోకేష్‌మూర్తి, పీడీఓ భారతి, ఆర్‌టీఐ కార్యకర్తను సోమవారం తన కార్యాలయానికి రప్పించి చర్చించారు. సమావేశం ముగిసిన తరువాత భారతి బయటకు వస్తూ ఎదనొప్పి అని కుప్పకూలిపోయింది. వెంటనే పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి, ఆపై మైసూరులోని ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించారు. ఆమెకు భర్త ప్రకాశ్, ఒక కుమార్తె ఉన్నారు. ప్రకాశ్ కూడా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఉద్యోగులు, ప్రజలు తరలివచ్చి నివాళులర్పించారు.

సిటీ బస్సును ఢీకొని కారు దగ్ధం





కాలిపోతున్న కారు దృశ్యాలు

- బెంగళూరులో దుర్ఘటన
- ముగ్గురికి స్వల్ప గాయాలు

బనశంకరి: బస్టాప్‌లో నిలిచి ఉన్న బీఎంటీసీ బస్సును వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టి మంటల్లో చిక్కుకుంది. ఈ ఘటన నగరంలో బ్యాటరాయనపుర ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంటల్లో కారు బుగ్గి కాగా, బస్సు వెనుక భాగం కూడా స్వల్పంగా దగ్ధమైంది. కారులో ఉన్న లోకేశ్, అతని భార్య, కుమార్తె స్వల్పగాయాలతో బయటపడ్డారు.

కాపాడిన స్థానికులు

వివరాలు.. సోమవారం ఉదయం 9 గంటకు యశవంతపుర నుంచి బీఎంటీసీ బస్సు నాయండహళ్లికి బయలుదేరింది. రింగ్‌రోడ్డులోని సువర్ణ లేఔట్, నాగరబావి జంక్షన్‌లో ప్రయాణికులను దింపడానికి బీఎంటీసీ బస్సును నిలిచింది. ఇంతలో వెనుకనుంచి వేగంగా వచ్చిన కారు బస్సు వెనుక భాగాన్ని ఢీకొట్టింది. ఆ ధాటికి కారు ఇంజిన్‌లో మంటలు లేచి కారును చుట్టుముట్టాయి. వెంటనే స్థానికులు కారులో ఉన్న దంపతులు, కుమార్తెను బయటికి తీసి కాపాడారు. ప్రజలు, బస్ కండక్టర్లు, డ్రైవరు మంటలను అదుపు చేసేందుకు యత్నించినా కారు మిగల్లేదు. ఒకవేళ ఆ మంటలు బస్సు ఇంజిన్ వరకు వ్యాపించి ఉంటే అది కూడా కాలిపోయేది. ప్రమాదం జరగగానే డ్రైవరు, కండక్టరు బస్సులో ఉన్న ప్రయాణికులను గబగబా కిందికి దింపేశారు. కొంతసేపటికి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేసేటప్పటికి కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో కొంతసేపు ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడింది. బ్యాటరాయనపుర పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నరేగపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించరూ..



వినతిపత్రాన్ని అందిస్తున్న కొట్రమ్మ తదితరులు

కంప్లి: నరేగ పథకంలో వివిధ డిమాండ్లపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ఒత్తిడి చేస్తూ సోమవారం ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్‌కు గ్రామీణ కూలీ కార్మిక సంఘం పదాధికారులు వినతిపత్రం అందించారు. అనంతరం తాలూకా సంచాలకురాలు ఎంబీ.కొట్రమ్మ మాట్లాడుతూ ఇప్పటికే కరువు తాలూకాగా ప్రకటించి ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా తలా 50 మానవ రోజుల చొప్పున ప్రతి ఏటా తప్పనిసరిగా పని దినాలను పెంచుతూ ఆదేశాలు జారీ చేయాలని ఒత్తిడి చేశారు.

ఒరిగిన స్తంభాలతో పొంచి ఉన్న ముప్పు



ఒరిగిన విద్యుత్ స్తంభం

కంప్లి: కుడితిని పట్టణంలో జాతీయ రహదారి, బళ్లారి బైపాస్ ద్విపథ రోడ్డు నిర్మాణ పనులకు రోడ్డు తొలగించే పనులు జరపడం వల్ల అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి నేలను తాకే ప్రమాదంలో ఉన్నాయని, తక్షణమే వాటిని సరిచేయాలని స్థానికులు ఒత్తిడి చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వాటిని తొలగించే పనులు సాగించాలని కోరుతున్నారు.

కరువు జిల్లాపై సవతి ప్రేమ తగదు



వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో నెలకొన్న కరువుపై సవతి తల్లి ప్రేమను ఒలకబోస్తున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లాధ్యక్షుడు వీరేష్ ఆరోపించారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర కరువు బృందం జిల్లాలో పర్యటించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. వానలు లేక రైతుల పంటలు ఎండిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రూ.17 వేల కోట్ల నష్టం అంచనా ప్రతిపాదనలపై కేంద్రం ఇంకా స్పందించలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి ఎన్నికైన లోక్‌సభ సభ్యులు కూడా ప్రధానమంత్రి వద్ద ఈ విషయంపై చర్చించక పోవడం సరికాదన్నారు. కరువు సహాయక పనులు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో కృష్ణ, ఇషాక్, షెక్షావలిలున్నారు.

సబ్సిడీ ధరతో రైతులకు విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కంప్లి: ప్రతి ఒక్క రైతు పంట బీమా చేయించుకోవడంతో పాటు ఎఫ్ఐడీ తప్పనిసరిగా చేయించుకోవాలని, తద్వారా ప్రభుత్వ పరంగా లభించే సౌకర్యాలను పొందవచ్చని కురుగోడు వ్యవసాయ శాఖ అధికారి దేవరాజ్ తెలిపారు. ఆయన సోమవారం తాలూకా రైతు కేంద్రంలో సబ్సిడీ ధరతో రైతులకు శెనగ విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. విత్తన నాట్లకు ముందుగా ట్రైకోడర్మా పౌడిని విత్తనాలతో కలిపి నాటాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా రైతు కేంద్రం అధికారితో చర్చించి సలహా పొందాలన్నారు.

పత్తి రైతులకు నిండా మోసం



మాట్లాడుతున్న లక్ష్మణగౌడ

రాయచూరు రూరల్: జిల్లాలో పత్తి రైతులను ఏపీఎంసీలో అధికారులు, వ్యాపారులు, మధ్యవర్తులు నిండా మోసం చేస్తున్నారని రాష్ట్ర రైతు సంఘం జిల్లాధ్యక్షుడు లక్ష్మణగౌడ ఆరోపించారు. ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్తకులు మార్కెట్‌లో ధర నిర్ణయించిన అనంతరం మిల్లుకు వెళ్లి అన్‌లోడ్ చేసిన తర్వాత రూ.300 తగ్గించి ఇస్తున్నారన్నారు. కందులు, పొద్దు తిరుగుడు విత్తనాల విషయంలో కూడా ఇదే బాటలో వర్తకులు వ్యవహరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మల్బరీ సాగులో అసమాన సాధన



వెంకటరామయ్య పొలంలోని మల్బరీ పంటను పరిశీలిస్తున్న వివిధ ప్రాంతాల విద్యార్థులు(ఫైల్)



కరువు సమయంలో మొక్కలకు నీటిని సైకిల్‌పై బిందెల్లో తెస్తున్న రైతు వెంకటరామయ్య(ఫైల్)

- వినూత్నంగా చెట్టు పద్ధతి ఆవిష్కర్తకు ప్రోత్సాహం కరువు
- విశిష్ట రైతుకు ప్రభుత్వాల నుంచి లభించని తగిన గుర్తింపు

కోలారు: మల్బరీ వ్యవసాయంలో శాస్త్రవేత్తలను తలదన్నేలా కొత్త విషయాలను ఆవిష్కరించడంలో తాము ముందంజలో ఉన్నామని జిల్లా రైతులు నిరూపిస్తున్నారు. ఇందుకు తాలూకాలోని హొన్నేనహళ్లి రైతు వెంకటరామయ్యే చక్కటి నిదర్శనం. మల్బరీ వ్యవసాయంలో వినూత్న పద్ధతిని ఆవిష్కరించిన రైతుకు గత పదేళ్లలో ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం, గుర్తింపు లభించక తెరమరుగునే ఉండి పోవాల్సి వచ్చింది. రైతు వెంకటరామయ్య వినూత్నంగా ఆవిష్కరించిన మల్బరీ మొక్కల పెంపకంలో చెట్టు పద్ధతి దేశవిదేశాల దృష్టిని ఆకర్షించింది. శాస్త్రవేత్తల బృందం చేయాల్సిన పరిశోధనలు రైతు వెంకటరామయ్య చేసి చూపించడం విశేషం. వెంకటరామయ్య చేసిన సాధనకు చిక్కిన ప్రతిఫలం పట్టు పరిశ్రమ శాఖ నుంచి లభించిన రూ.10 వేల ప్రోత్సాహధనం మాత్రమే. వెంకటరామయ్య సాధనపై మైసూరు సీఎస్ఆర్‌టీఐ ప్రకటించిన పట్టు వ్యవసాయం విజయగాథల ఆంగ్ల లేఖనం ఎంతో మంది విదేశీయుల దృష్టిని కూడా ఆకర్షించింది.

అవసరమే అన్వేషణకు మూలం

వెంకటరామయ్య ఆవిష్కరణ వెనుక ఆయన అవసరం దాగి ఉంది. నీటి మూలాలు తక్కువగా ఉన్న కోలారు జిల్లాలో ఎంతోమంది రైతులు పట్టు వ్యవసాయానికి దూరమైనా పట్టు వ్యవసాయాన్నే కొనసాగించాలనే పట్టుదల పట్టులో చెట్టు పద్ధతి ఆవిష్కరణకు కారణమైంది. హొన్నేనహళ్లి వద్ద వెంకటరామయ్యకు 4 ఎకరాల పొలం ఉంది. బోరుబావిని తవ్వించి కూరగాయలు తదితర వాణిజ్య పంటలను పండించేవారు. 2011–12లో జిల్లాలో కరువు ఆవరించింది. ఆ సమయంలో రైతులు నీటికి తీవ్ర ఇబ్బంది పడ్డారు. పలువురు రైతులు పట్టు వ్యవసాయం చేయడాన్ని మానుకున్నారు. ఇలాంటి సమయంలో వెంకటరామయ్య మెదడులో పుట్టిన ఆలోచనే చెట్టు పద్ధతి ద్వారా మల్బరీ తోటను పెంచడం.

తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి

గతంలో మొక్కగా పెంచే మల్బరీని చెట్టులాగా పెంచాలని నిర్ణయించాడు. ఈ పద్ధతిలో మల్బరీ చెట్టుకు నీరు తక్కువ అవసరం ఉండేది. తన ఆలోచనను అమలు చేసి కరువు సమయంలో నీరు లేక సైకిల్‌పై బిందెలతో నీరు పోసి చెట్టు పద్ధతిలో మల్బరీ ఆకులను పెంచి సఫలమయ్యాడు. ఆరంభంలో కేవలం 10 గుంట్ల స్థలంలో 144 చెట్లను నాటి చెరువు నుంచి సైకిల్‌పై బిందెలతో నీరు తీసుకు వచ్చి పోసి పెంచాడు. చెట్టుకింద బాటిల్ ఉంచి అందులో పోసి డ్రిప్ ఇరిగేషన్ తరహాలో చేసి తక్కువ నీటితో చెట్టు పెరిగేలా చూశాడు. గతంలో కంటే మల్బరీ ఎక్కువ దిగుబడి రావడంతో వెంకటరామయ్య ఇక వెనుదిరిగి చూడలేదు,. ప్రస్తుతం 900 మల్బరీ చెట్లను పెంచి మల్బరీ ఆకులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు.

చెట్టు పద్ధతిలో ఉత్పత్తి పెంపు

సాధారణంగా మొక్క పద్దద్ధలో పెంచే మల్బరీ పంటతో 100 పట్టు గుడ్లకు 60 నుంచి 70 కిలోల పట్టు గూళ్ల ఉత్పత్తి అయ్యేవి. చెట్టు పద్ధతిలో ఉత్పత్తి చేయడం వల్ల 100 పట్టుగుడ్లకు 90 నుంచి 100 కిలోల వరకు ఉత్పత్తి అవుతోంది. చెట్టు పద్ధతిలో మల్బరీ సాగు వల్ల ఉత్పత్తి పెరుగుతోంది. పూర్తిగా సేంద్రీయ పద్ధతిలోనే పెరిగిన చెట్లు కావడం వల్ల పట్టు ఆకుల్లో ఉన్న తేమ , పోషకాంశాలే దిగుబడి పెరగడానికి కారణమని వెంకటరామయ్య అంటున్నారు. ఆరంభంలో 8–8 అడుగుల దూరంలో నాటుతున్న మల్బరీని తరువాత 10–10 అడుగుల దూరానికి పెంచాడు. దీని వల్ల ప్రయోజనం మధ్యలో అలసందలు, ఉలవలు, రాగులు పండించవచ్చని అంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ సంస్థలు, విశ్వవిద్యాలయాలు రైతులను ఏ విధంగా నిర్లక్ష్యం చేస్తున్నాయనేందుకు వెంకటరామయ్యే నిదర్శనం అని చెప్పవచ్చు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

హుబ్లీ: వివిధ కారణాలతో అవయవాలను కోల్పోయిన దివ్యాంగులకు కృత్రిమ చేతులు, కాళ్లు పంపిణీ చేస్తున్న మజీతియ ఫౌండేషన్ సేవలు ఆదర్శప్రాయం అని జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఆర్ఎస్ చిన్నన్నవర్ తెలిపారు. నగరంలోని మూరు సావిర మఠం సభామందిరంలో సోమవారం సదరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 103 మంది లబ్ధిదారులకు ఉచితంగా చేతులు, కాళ్ల జోడింపు శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు కృత్రిమ చేతులు, కాళ్లు పంపిణీ చేయడం వల్ల వారు ఆత్మాభిమానంతో జీవించవచ్చన్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వ సదుపాయాలు కూడా ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగరాభివృద్ధి ప్రాధికార కమిషనర్ డాక్టర్ సంతోష్ బిరాదార్ మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాల ద్వారా మజీతియ ఫౌండేషన్ సమాజంలో ఆదరణకు పాత్రమైందన్నారు. దివ్యాంగులు స్వయంగా తమ పనులు చేసుకోవడమే కాకుండా శ్రమించి ఉపాధిని పొందేలా ప్రోత్సహిస్తున్న ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం అన్నారు. ఫౌండేషన్ చెర్మన్ జితేంద్ర మజీతియ మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని చోట్ల రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని, ఫలితంగా చేతులు, కాళ్లు కోల్పోవడం ఆందోళనకరం అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, సమాజం సరైన దిశలో ఆలోచించి రోడ్డు భద్రతా చర్యలపై ప్రజల్లో జాగృతి కల్పించాలన్నారు. 1400 మందికి కృత్రిమ కాళ్లు, చేతులను జోడించామని శిబిరం ముఖ్యస్తులు డాక్టర్ మంజునాథ్ భట్ తెలిపారు.

అతిథి అధ్యాపకుల పర్మినెంట్‌కు డిమాండ్



మాట్లాడుతున్న శ్రీనివాస్

రాయచూరు రూరల్: ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల అతిథి అధ్యాపకుల సంఘం జిల్లాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయంపై బెళగావిలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలని కోరుతూ 7న బెళగావిలో ఆందోళన చేపడుతామన్నారు. గత 9 ఏళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్న అధ్యాపకులకు మౌఖిక ఆదేశాలతో విధుల్లో సమయం కేటాయించడం లేదన్నారు. బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. పీఎఫ్, జీపీఎఫ్, సేవా భద్రత లేదని, గత మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించలేదన్నారు. విలేకరుల సమావేశంలో శరణ బసవ, వినోద్, ఈరణ్ణ, సురేష్‌లున్నారు.

బీజేపీ విజయోత్సవం



సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

కంప్లి: నాలుగు రాష్ట్రాలకు ఆదివారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 3 రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో పాటు తెలంగాణలో బీజేపీ అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో ఖాతా తెరవడం బీజేపీపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని తేటతెల్లం చేస్తోందని బీజేపీ మండల అధ్యక్షులు అళ్లళ్లి వీరేష్ తెలిపారు. ఆదివారం సాయంత్రం అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరి బాణాసంచా వెలిగించి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. అనంతరం ప్రముఖులు బ్రహ్మయ్య మాట్లాడుతూ తెలంగాణలో కూడా బీజేపీ ఖాతా తెరిచిందన్నారు. ఏప్రిల్, మే నెలలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల తర్వాత తిరిగి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీనే కొనసాగుతారన్నారు. ఈసందర్భంగా ఎస్.పురుషోత్తం, జీ.సుధాకర్, శ్రీధర్ శెట్టి, సుదర్శన్‌రెడ్డి, హులుగార్ రమేష్, అంజిని, భాస్కరెడ్డి, బీ.సిద్ధప్ప, కొడిదల రాజు, ఎస్.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపరులను సస్పెండ్ చేయాలి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ కూలీకార్మికులకు ఉపాధి కల్పించకుండా నిధులు దిగమింగిన పీడీఓలను సస్పెండ్ చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. సోమవారం జెడ్పీ అధికారికి బసవ హులుగార్, నాగరాజ్ పాటిల్ విన్నవించారు. దేవదుర్గ టీపీ ఏడీ, ఈఓలు రూ.11 కోట్లు, 95 మంది పీడీఓలు, 6,623 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు కలిసి రూ.200 కోట్ల మేర నిధుల దుర్వినియోగంపై విచారణ చేసి బాధ్యులను సస్పెండ్ చేయాలని కోరారు.

పాఠశాలలను సందర్శించిన జిల్లాధికారి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లాధికారి

హొసపేటే: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను విజయనగర జిల్లాధికారి దివాకర్ సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలను ఆలకించారు. తాలూకాలోని సీతారామ తాండాలోని ప్రభుత్వ సీనియర్ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వంట సిబ్బంది, ఉపాధ్యాయుల గోడును విన్నారు. అనంతరం బైలువద్దిగేరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గదులు లేని విద్యార్థులు కలప కోసం పాఠాలు అడుగుతుండగా ఆమె వద్దకు వెళ్లి సమాచారం అందుకున్నారు. అనంతరం ధర్మసాగర ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. సీతారామ తాండా, బైలువద్దిగేరి, ధర్మసాగర ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాల ముఖ్యోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం



పూజ చేస్తున్న రాచోటి శివాచార్య స్వామీజీ



దీపాలు వెలిగిస్తున్న బాలికలు

రాయచూరు రూరల్: కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం ఎంతో పుణ్యప్రదమని అభినవ రాచోటి శివాచార్య పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కార్తీక మాసం సందర్భంగా సోమవారపేట మఠంలో ఆయన పూజలు జరిపి మాట్లాడారు. కార్తీకంలో మహిళలు శివపార్వతిలను అధికంగా కొలుస్తారన్నారు. నగరంలో వివిధ ఆలయాల వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో అంతరగంగ వీరభద్రప్ప, గిరిజా శంకర్, శివయ్య, పాటిల్, రాచయ్య, ఉదయ్ కుమార్, పంచాక్షరయ్య, మల్లికార్జున, షణ్ముకప్ప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అధికారుల బృందం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రం వద్ద అధికారుల బృందంతో సిబ్బంది

హొసపేటే: మేఘాలయ మహిళా శిశు అభివృద్ధి శాఖ, ప్రజా విద్యా, సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల బృందం సోమవారం హొసపేటె శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ పరిధిలోని గాదిగనూరులోని 4వ అంగన్‌వాడీ కేంద్రం, బైలువద్దిగేరిలోని 3వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేసింది. అంగన్‌వాడీలో పాఠాలు బోధించే గది, పిల్లల అనుబంధ అభ్యాస సామగ్రి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల కోసం సహాయకులు నిర్వహిస్తున్న కార్యకలాపాలను సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. తమ రాష్ట్రంలో పిల్లలకు ఇలాంటి విద్యావిధానం లేదన్నారు. కర్ణాటకలో 3 నుంచి 6 ఏళ్ల పిల్లలకు ప్రాథమిక విద్య చాలా బాగా అందిస్తున్నారన్నారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.శ్వేత, జిల్లా వ్యాఖ్యాత సుభద్రాదేవి, సీనియర్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డాక్టర్ చిట్కా లాంబ, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారిణి సింధు, సీనియర్ సూపర్వైజర్ అంబుజ, మండల పర్యవేక్షకులు లక్ష్మీదేవి, ఎల్‌డీ నదాఫ్, నసీమాబేగం, సుజాత, జిల్లా ప్రోగామ్ మేనేజర్ ఏవై కొట్రేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మేఘాలయకు చెందిన అధికారులు జిల్లాధికారి కార్యాలయాన్ని సందర్శించి జిల్లాలో చిన్నారులకు అందిస్తున్న ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలను అభినందించారు. జిల్లాలో అందిస్తున్న ప్రీ స్కూల్ విద్య దేశంలోనే అగ్రగామిగా నిలవడంపై జిల్లాధికారి దివాకర్ హర్షం వ్యక్తం చేశారు.

భక్తులతో శివాలయాలు కిటకిట



సోమేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

కోలారు: కార్తీక సోమవారం నాడు నగరంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలో చోళుల కాలపు ప్రసన్న సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుంచే భక్తులు తరలి వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. దేవాలయాన్నింటినీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ప్రసన్న సోమేశ్వరస్వామి ముందు ఉన్న నంది విగ్రహం వద్ద దీపాలను వెలిగించారు. అర్చకులు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అదేవిధంగా అంతరగంగ కాశీ విశ్వనాథ స్వామి, బయలు బసవేశ్వర స్వామి, కాళి కాంబ కమటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలను నెరవేర్చారు.

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపాలని ఇన్‌చార్జ్ బీఈఓ ఉమా పిలుపు నిచ్చారు. సోమవారం బీఈఓ కార్యాలయంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో శ్రవణ దోష విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో దాత ధర్మేష్ అందించిన శ్రవణ పరికరాలను అందించి మాట్లాడారు. దివ్యాంగ పిల్లలను సమాజ ప్రధాన వాహినిలోకి తేవడానికి ప్రయత్నించాలన్నారు. దివ్యాంగ విద్యార్థులకు విద్యా శాఖ నుంచి యేటా ఉచిత ఆరోగ్య పరీక్షలు, వివిధ సౌకర్యాలను అందిస్తున్నట్లు తెలిపారు. క్షేత్ర సమన్వయ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో దాత ధర్మేష్, ఆర్పీ శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ఎలక్ట్రిక్ వాహనం ఆవిష్కారం

- ఐటీఐ విద్యార్థుల సత్తా



సోలార్ ఎలక్ట్రిక్ వాహనంతో విద్యార్థులు, సిబ్బంది

రాయచూరు రూరల్: నేటి ఆధునిక కాలంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కారాలు చేయడానికి నేటి యువత ముందంజలో ఉన్నారు. అదే కోవకు చెందిన జిల్లాలోని మాన్వికి చెందిన బసవ ప్రైవేట్ ఐటీఐ విద్యార్థులు సోలార్ ఎలక్ట్రిక్ వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ వాహనం తయారు చేయడానికి ఐదు నూతనంగా మోడల్స్‌ను రూపొందించుకొని రూ.5 లక్షల రివార్డుకు ఎంపిక కావడం విశేషం. పరిసర స్నేహి నాలుగు ఆసనాలు కల సోలార్ ఎలక్ట్రిక్ వాహనం, స్మార్ట్ డస్ట్‌బిన్, చెత్తతో విద్యుత్ ఉత్పత్తి, సోలార్ పవర్‌తో వాటర్ పంప్, ఇంటికి విద్యుత్ షాక్ తగలకుండా నూతన ఆవిష్కారాలను తయారు చేసిన ఐటీఐ విద్యార్థులు తమ సత్తా చాటారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిప్పణ్ణ హొసమని, అధ్యాపకులు వీరేష్, శివపుత్రులు ఎల్రక్టానిక్స్ మెకానికల్ విభాగంలోని ఐదు మంది విద్యార్థులతో పథకాన్ని రూపొందించారు. యువ కౌశల్య అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని యుఎన్‌డీపీ సంస్థ, ఎస్ఏపీ ల్యాబ్ ఇండియా, సెవంత్ సైన్స్ టాలెంట్ సొల్యూషన్ సంస్థల నుంచి రాయచూరు జిల్లా అస్పిరేషన్ కావడంతో రాయచూరు, దక్షిణ కన్నడ, బెంగళూరు గ్రామీణ జిల్లాల్లోని విద్యార్థులతో పోటీ పడిన మాన్వి విద్యార్థులు విజేతగా నిలిచి రివార్డుకు ఎంపిక కావడం అభినందనీయం అని చెప్పవచ్చు.

గ్రామాభివృద్ధికి పెద్ద పీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్టీ శ్రీనివాస్

కంప్లి: తాలూకా కేంద్రం నుంచి మారుమూలన ఉన్న సరిహద్దు గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తానని కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ ఎస్టీ శ్రీనివాస్ తెలిపారు. హుడేం గ్రామంలో గ్రంథాలయం, సమాచార కేంద్రం నూతన భవనాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తన నియోజకవర్గంలోని సరిహద్దు ప్రాంత గ్రామాల్లో అభివృద్ధిపై నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందని, విద్య, తాగునీరు, మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైలు ప్రారంభం



రైలుకు స్వాగతం పలుకుతున్న అయ్యప్ప స్వాములు

హుబ్లీ: హుబ్లీ నుంచి శబరిమలకు ప్రత్యేక రైలు సౌకర్యాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో శనివారం అయ్యప్పస్వామి మాలధారులు హుబ్లీ స్టేషన్‌లో హుబ్లీ–కొట్టాయం–హుబ్లీ రైలు(07305/07306)కు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా రైలు బోగీలను అరటి గెలలు, పూలమాలలతో అలంకరించారు.

స్వయం ఉపాధి కుటుంబానికి దిక్సూచి



మాట్లాడుతున్న ధర్మశెట్టి

కంప్లి: మహిళలు స్వయం ఉపాధి సాధిస్తే కుటుంబ నిర్వహణ చేయవచ్చని జ్ఞాన వికాస్ కేంద్రం ఒక దిక్సూచి అని ధర్మశెట్టి సూచించారు. మరియమ్మనహళ్లిలోని శివాని జ్ఞాన వికాస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి మహిళా ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వకీల్ మల్లికార్జున, జీపీ సభ్యులు సోమణ్ణ, నేత్రావతి పాల్గొన్నారు.

సదాశివ నివేదిక ఆమోదించండి

రాయచూరు రూరల్: బెళగావిలో జరుగుతున్న శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో జస్టిస్ సదాశివ కమిషన్ నివేదికను ఆమోదించాలని మాదిగ దండోరా సమితి అధ్యక్షుడు హన్మంతు డిమాండ్ చేశారు. సోమవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2011 నుంచి ఇంతవరకు ప్రభుత్వానికి న్యాయమూర్తి సదాశివ కమిషన్, కాంతరాజ్, నాగమోహన్‌దాస్ నివేదికలను సమర్పించినా వాటిని ఇంతవరకు ఆమోదించలేదన్నారు. ఈవిషయంపై బెళగావిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించాలని కోరుతూ ఈనెల 11న పెద్ద ఎత్తున సమావేశం చేపడుతున్నట్లు తెలిపారు.

ఏయ్ బిడ్డ .. ఇది నా అడ్డ.!

- విరుపాక్షేశ్వరుని సన్నిధిలో కోతుల సందడి



హంపీ విరుపాక్షేశ్వరుని ఆలయ ప్రాంగణంలో తిష్ట వేసిన కోతులు

బళ్లారిఅర్బన్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హంపీ విరుపాక్షేశ్వర దేవస్థానంలో సోమవారం కార్తీక మాసం సందర్భంగా భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు రాగా ఆ ప్రాంతంలోని కోతులు ఏయ్... బిడ్డ, ఇది నా అడ్డ.! అంటూ విరుపాక్షేశ్వరుని దేవస్థానం ముందు ఉన్న బసవన్న, ధ్వజ స్తంభం ముందు కూర్చొనడంతో భక్తులు ఆశ్చర్యంగా తిలకించారు.

వ్యక్తి దారుణ హత్య

హుబ్లీ: ఓ వ్యక్తిని నడిరోడ్డుపైనే దారుణంగా హత్య చేసిన ఘటన ధార్వాడ మరాఠ కాలనీలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. తాలూకాలోని హెబ్బళ్లి గ్రామానికి చెందిన నింగప్ప హడపద హతుడు. ఇతను ధార్వాడలో ఒక గదిని తీసుకొని ఉండేవాడు. ధార్వాడ ఉపనగర పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ హత్య ఆస్తి వివాదం వల్ల జరినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. నింగప్పపై ముగ్గురు నిందితులు మారణాయుధాలతో కొట్టి చంపారు. ఈ హత్య దృశ్యాలను స్థానికులు మొబైల్‌లో రికార్డు చేశారు. పోలీస్ కమిషనర్ రేణుకా సుమార కేసు విషయమై మాట్లాడుతూ ముగ్గురు హత్య చేశారని, వీరంతా బంధువులేనని నిందితుల గురించి సమాచారం తెలిసిందన్నారు. కుటుంబ ఆస్తి వివాదాల నేపథ్యంలో హత్య జరిగిందని అనుమానిస్తున్నామన్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.